# నేలవిడిచి సాముచేయడం తగునా?

వడ్డే శోభనాద్రీశ్వరరావు



# నేలవిడిచి సాముచేయడం తగునా?

వడ్డే శోభనాద్రీశ్వరరావు

# నేలవిడిచి సాముచేయడం తగునా?


రచన :

**వడ్డే శోభనాద్రీశ్వరరావు**

సెల్: 9392959999, 8919427484

ఇ–మెయిల్: vaddesrao@yahoo.co.in



ముద్రణ : జులై, 2018

వెల : రూ. 50/–

ప్రచురణ:

**వడ్డే వెంకట అంకినీడు ప్రసాద్**

ఉయ్యూరు – 521165.

ఫోన్: 9959391111

ముద్రణ:

**సాయిలిఖిత ప్రింటర్స్**

ఖైరతాబాద్, హైదరాబాద్ – 500 004.

ఫోన్: 7207045979

# అంకితం





నా సుదీర్ఘ ప్రజాసేవ ప్రస్థానంలో
ఎలాంటి జోక్యం చేసుకోకుండా, నానుంచి ఏమీ ఆశించని
నా కుమార్తె **కొడాలి వెంకట లక్ష్మి అన్నపూర్ణ,**
కుమారుడు **వడ్డే వెంకట అంకినీడు ప్రసాద్**లకు
ప్రేమతో...

**- వడ్డే శోభనాద్రీశ్వరరావు**

# విషయ సూచిక


1. ముందుమాట ........................................................ 7
1. ఆంధ్రప్రదేశ్ విభజన – ప్రత్యేక హోదా ................................... 13
2. అవినీతి రహిత సుపరిపాలన ............................................. 20
3. ప్రభుత్వ ప్రాధాన్యతా క్రమములు ఎలా ఉండాలి? ........................ 26
4. భూసంబంధ సమస్యల పరిష్కారం ఎప్పటికి పూర్తయ్యేను? ............ 32
5. ఎన్నికల వాగ్దానాలు అమలు చెయ్యనవసరం లేదా? ..................... 41
6. ఎ.పి.లో గాడితప్పిన ఆర్థిక క్రమశిక్షణ .................................. 48
7. నత్తనడకన సాగు నీటి ప్రాజెక్టులు........................................ 55
8. సమీప భవిష్యత్తులో అవసరం లేని ప్రతిపాదనలు........................ 68
9. ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా కార్పోరేట్లకు కట్టబెట్టడం తగునా? ... 77
10. అంచనాలను మించిన ఎయిర్‌పోర్టులు.................................... 83
11. ముందుకు అడుగు పడని నూతన నౌకాశ్రయాలు ........................ 86
12. విజయవాడ, విశాఖపట్నం నగరాలలో మెట్రో రైళ్ళు..................... 92
13. విద్య–వైద్య రంగాలపట్ల ప్రభుత్వ ఉదాసీన వైఖరి సమంజసమా?..... 94
14. ఐ.టి. – పారిశ్రామిక ప్రగతి ............................................... 99
15. అమరావతి ప్రజా రాజధాని అవుతుందా?............................. 104
16. ఇకనైనా పాలన తీరులో మార్పు వచ్చేనా ............................. 117

# ముందుమాట

ముల్కీ నిబంధనలు చెల్లుతాయని అక్టోబరు 3, 1972న సుప్రీంకోర్టు తీర్పు యిచ్చిన దరిమిలా చోటుచేసుకున్న పరిణామాలతో ఆంధ్ర ప్రాంతంలో ఉవ్వెత్తున ఎగసిన "ప్రత్యేక ఆంధ్ర–జై ఆంధ్ర" ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాను. ఆంధ్రులకు, ఆంధ్రోద్యోగులకు తీర్పు వల్ల జరుగనున్న నష్టం గురించి "ముల్కీ నిబంధనలు – ఆంధ్రులకు అన్యాయం" చిరు పుస్తకాన్ని ప్రచురించడం జరిగింది. నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ రాష్ట్ర విభజనకు సుముఖంగా లేనప్పటికీ, ప్రజా నాయకుడు కాకాని వెంకటరత్నంగారు ఉద్యమ సమయంలో చనిపోకుండా వుండివుంటే ప్రత్యేకాంధ్ర రాష్ట్రం సాకారమై వుండేదని భావించేవారిలో నేనొకడిని. అప్పట్లోనే ప్రత్యేకాంధ్ర రాష్ట్రం ఏర్పడి వుంటే, ఈపాటికి భారతదేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మొదటి స్థానంలో నిలిచి వుండేది.

అనంతరం నాలుగు దశాబ్దాల కాలంలో రాష్ట్రాన్ని పాలించిన అన్ని ప్రభుత్వాలు కూడా అభివృద్ధిని హైదరాబాద్, పరిసర ప్రాంతాలకే పరిమితం చేశాయి. కేవలం కొన్ని రాజకీయ పార్టీలు / కొందరు రాజకీయ నాయకుల స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కొరకు మరుగున పడిపోయిన రాష్ట్ర విభజన అంశాన్ని మళ్ళీ తెరపైకి తెచ్చారు. రాష్ట్ర విభజన అంశంపైన ఏర్పాటు చేయబడిన జస్టిస్ శ్రీకృష్ణ కమీషన్ మొత్తం 23 జిల్లాలు పర్యటించి, అన్ని వర్గాల ప్రజలతో చర్చించి, సమగ్రంగా సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి రాష్ట్రాన్ని సమైక్యంగానే కొనసాగించడం ఉత్తమమని, తెలంగాణాకు ప్రాంతీయ కమిటీని ఏర్పాటుచేసి, ఆ కమిటీకి చట్టబద్ధతను, అధికారాలను కల్పించి, అవసరమైన నిధులను అందచేస్తే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని సూచించింది. విభజన గురించి అనేకానేక పర్యాయాలు టి.వి. ఛానల్స్‌లో డిబేట్స్ జరిగాయి తప్ప శ్రీకృష్ణ కమీషన్ రిపోర్టు గురించి డిబేట్స్ నిర్వహించకపోవడం అత్యంత దురదృష్టకరం.

2004 ఎన్నికల ముందు సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో తెలుగుదేశం పార్టీ

నిర్వహించిన "విజయభేరి" భారీ బహిరంగ సభ సందర్భంగా రూపొందించబడిన పాటలు యిప్పటికీ నా కారులో ప్రయాణం చేసినప్పుడల్లా పెన్‌డ్రైవ్ ద్వారా వింటూ వుంటే బాధ కలుగుతూ వుంటుంది. మధ్య మధ్యలో హైదరాబాద్ వెళ్ళినప్పుడు గచ్చిబౌలి, మాదాపూర్, ఫైనాన్షియల్ సిటీ ప్రాంతంలో ప్రయాణిస్తూ వుంటే, యింత అభివృద్ధి చెందిన రాజధానిని వదులుకొని కట్టుబట్టలతో వెళ్ళిపోయామే అన్న విచారంతో దుఃఖం కలుగుతూ వుంటుంది.

2004లో రాష్ట్ర విభజనను తీవ్రంగా వ్యతిరేకించిన చంద్రబాబు నాయుడు గారు 2009 ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడం కొరకు టి.ఆర్.ఎస్. పార్టీతో పొత్తు కుదుర్చుకునే వ్యూహంలో భాగంగా ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే తెలుగుదేశం పార్టీకి అభ్యంతరం లేదని 2008లో పొలిట్‌బ్యూరోలో తీర్మానం చేసి ప్రణబ్ ముఖర్జీ కమిటీకి పంపడం చారిత్రక తప్పిదం. జస్టిస్ శ్రీకృష్ణ కమీషన్ రిపోర్టు వచ్చిన దరిమిలానైనా తెలుగుదేశం పార్టీకి చెందిన యావన్మంది ఎం.పి.లు, ఎమ్.ఎల్.ఎ.లు, పొలిట్‌బ్యూరో సభ్యులు, యితర ముఖ్యులతో శ్రీకృష్ణ కమీషన్ రిపోర్టును అధ్యయనం చేసి, చర్చించి వుంటే రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచడమే మేలనే భావనకు ఎక్కువ మద్దతు లభించి వుండేది. కానీ అందుకు భిన్నంగా రెండవ పర్యాయం కూడా పొలిట్‌బ్యూరోలో మళ్ళీ తీర్మానం చేసి, కేంద్రానికి పంపారు. ఒక్క సి.పి.యం. పార్టీ మినహాగా కాంగ్రెస్, టి.డి.పి. వై.ఎస్.ఆర్.సి.పి., సి.పి.ఐ. పార్టీలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అభ్యంతరం లేదని కేంద్ర హోంమంత్రి షిండే 5-12-2012న ఏర్పాటు చేసిన సమావేశంలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశాయి.

ఇప్పుడు 5 కోట్ల మంది ఆంధ్రుల మనోభీష్టానికి విరుద్ధంగా కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించిందని చంద్రబాబు నాయుడుగారు పదేపదే వాపోవడం ఆత్మవంచనే అవుతుంది. విభజన అనివార్యం అని తెలిసిన తరువాతనైనా విభజన జరిగితే ఆంధ్ర ప్రాంతానికి ఏవిధంగా న్యాయం జరగాలో సూచించకుండా యిప్పుడు అన్యాయం అయిపోయిందని విచారపడితే ప్రయోజనం ఏముంటుంది. సమైక్య ఆంధ్ర ఉద్యమ సమయంలో విభజనకు ముందు, సంపూర్ణమైన సమాచారంతో "సమైక్యతతోనే తెలుగుజాతి ప్రగతి" అనే పుస్తకాన్ని ప్రచురించాను.

2004 ఎన్నికలు అయిపోయిన కొద్దిరోజుల తర్వాత టి.డి.పి. అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు గారిని కలిసి కొన్ని కారణాల వల్ల క్రియాశీలక రాజకీయాల నుంచి విరమించాలనే నా సంకల్పాన్ని తెలియపర్చి, కొద్దికాలం వ్యవసాయ శాఖా మంత్రిగా నాకు ప్రీతిపాత్రమైన వ్యవసాయ రంగానికి, రైతాంగానికి సేవచేసే అవకాశాన్ని కల్పించినందుకు ధన్యవాదాలు తెలియచేసి, కరచాలనం చేసి సెలవు తీసుకున్నాను. అప్పటి నుండి వ్యవసాయం, సమకాలీన అంశాల గురించి పత్రికలకు వ్యాసాలు రాయడం, పార్టీలకు అతీతంగా రైతుల సమావేశాలలో పాల్గొనడం, రైతాంగ

ప్రయోజనాలకు భంగం వాటిల్లుతూ వుందని భావించినపుడు, ఎత్తిచూపడం, పాలనలోను – విధానపర నిర్ణయాలలోను లోపాలను గమనించినప్పుడు ముఖ్యమంత్రికి, అధికారులకు వాటిని పునఃపరిశీలించవలసినదని ఈ మెయిల్స్, లేఖలు రాస్తూ వుంటాను. పత్రికలలో వ్యాసాల రూపంలోనూ, ప్రెస్‌మీట్‌ల ద్వారాను నా అభిప్రాయాలను తెలియచెబుతూ ఉన్నాను. ప్రతిస్పందన ఏమాత్రమూ ఉండటం లేదు.

మొదటి పర్యాయం గౌతు లచ్చన్న – సుంకర సత్యన్నారాయణ గార్ల ఆశీస్సులతో జనతా పార్టీ తరుపున ఎమ్మెల్యేగా శాసనసభలో రైతాంగ సమస్యలపైన నా వాణిని వినిపించాను. కృష్ణా జిల్లా కలెక్టరుగా వున్న ఎ.వి.యస్. రెడ్డి మున్నగు అధికారుల తోడ్పాటుతో కృష్ణా ఎడమ కరకట్టను యనమల కుదురు నుండి పులిగడ్డ వరకు అభివృద్ధి చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టించడం, కె.ఇ.బి. కెనాల్ పైన మద్దూరు, కళ్ళంవారి పాలెం వద్ద వంతెనలు, ఉయ్యూరు తాలూకా ఏర్పాటు, ఉయ్యూరులో ఫైర్ స్టేషన్ ఏర్పాటు, టెలిఫోన్ ఎక్సేంజి ఏర్పాటు మున్నగు వాటితో సహా పలు గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేయించగలిగాను.

అన్నగారు ఎన్టీ రామారావు గారి ఆశీస్సులతో విజయవాడ నుండి పార్లమెంటు సభ్యునిగా 8వ లోకసభలోను 10వ లోక్ సభలోనూ అనేక ప్రజా సమస్యలపైన ప్రజల వాణిని బలంగా వినిపించాననే సంతృప్తి నాకు ఉన్నది. 1997–1999 మధ్య ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న పలు ప్రాజెక్టు ప్రతిపాదనలను నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి తోడ్పాటుతో రాష్ట్రానికి క్లియరెన్స్‌లు సాధించుటకు కృషి సల్పాను.

1999–2004 మధ్య మైలవరం శాసనసభ్యునిగా, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా విత్తన అవగాహన ఒప్పందం, "రైతు బజార్లు", థిమేటిక్ సాయిల్ మ్యాప్స్ మండల స్థాయి వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికలు, మొదటిసారి ప్రభుత్వ పరంగా తేజ టీవీలో "రైతుమిత్ర" కార్యక్రమాన్ని ప్రారంభించడం, ఎన్.జి. రంగ వ్యవసాయ యూనివర్శిటీలో స్టూడియో ఏర్పాటు మున్నగు అనేక కార్యక్రమాల ద్వారా రైతాంగానికి సేవ చేయగలిగాననే సంతృప్తి ఉంది. దీర్ఘ కాలంగా ప్రజలు కోరుకుంటూ ఉన్న 'తారకరామా ఎత్తిపోతల పథకం', ఇబ్రహీంపట్నం వద్ద నుండి కృష్ణా జలాలను శుద్ధి చేసి దాదాపు 60 గ్రామాలకు తాగునీటి సదుపాయాన్ని కల్పించటం, ఇబ్రహీంపట్నం వద్ద ట్రక్కు టెర్మినల్, కంభంపాడు వద్ద 132 కె.వి. సబ్ స్టేషన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు నూతన వ్యవసాయ గిడ్డంగులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ళు, షాదీఖానాలు మున్నగు వాటికి పక్కా భవనములతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయించగలిగాను.

ఇన్ని పదవులను నిర్వహించి యిప్పుడు చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వాన్ని విమర్శించటం తగదని అనేక మంది మిత్రులు, శ్రేయోభిలాషులు, తెలుగుదేశం పార్టీ

నాయకులు, కార్యకర్తలు భావిస్తూ ఉంటారు. అయితే, వారికి నేను చెప్పగలిగినది ఒక్కటే. నా బొందిలో చివర శ్వాస ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీ అభిమానిగానే కొనసాగుతాను. చంద్రబాబు నాయుడు గారి పట్ల నాకు ఎలాంటి వ్యక్తిగత ద్వేషభావమూ లేదు. సమకాలీన రాజకీయాలలో ఆయనే సమర్థవంతమైన నాయకుడని నా భావన.

అంతమాత్రం చేత చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం రైతాంగ ప్రయోజనాలకు భంగం కలిగేలా తీసుకుంటూ ఉన్న తప్పుడు నిర్ణయాలను, నవ్యాంధ్ర ప్రదేశ్‌లో అన్ని జిల్లాలలో వికేంద్రీకరణతో జరగవలసిన అభివృద్ధికి అవరోధం కలిగించే విధంగా ప్రభుత్వం అనుసరిస్తూ ఉన్న లోపభూయిష్ట విధానాలు, అందులో అంతర్లీనంగా ఇమిడి వున్న అవినీతిని ఎత్తిచూపుతూ ఆ పద్ధతులను మార్చుకోవాలని హితవు పలుకుతున్నాను తప్ప మరేమీ కాదు. మూగ ప్రజలు, చెవిటి ప్రభుత్వంతో ప్రజాస్వామ్యం విజయవంతం కాదనేది జగమెరిగిన సత్యం.

2014 ఎన్నికలలో తెలుగు ప్రజలు చంద్రబాబు నాయుడు గారికి పట్టం కట్టారు. కాంగ్రెస్ పాలనలో కొనసాగిన అవినీతి, ఆశ్రిత పక్షపాతాలను అరికడతారని, సమర్ధపాలనతో నవ్యాంధ్రను "స్వర్ణాంధ్ర ప్రదేశ్"గా తీర్చిదిద్దుతారని, 13 జిల్లాలలోను వికేంద్రీకరణతో, అన్ని వర్గాల ప్రజలకు ప్రగతి ఫలాలను చంద్రబాబు నాయుడు అందచేయగలడనే నమ్మకంతో ప్రజలు మద్దతు నిచ్చారు. చంద్రబాబు నాయుడు గారు లోగడ తాను ముఖ్యమంత్రిగా వుండగా హైదరాబాద్, పరిసర ప్రాంత అభివృద్ధి పైనే దృష్టిని కేంద్రీకరించి పొరపాటు చేశానని, ఈ పర్యాయం ఆ పొరపాటును పునరుక్తి చేయనని, వికేంద్రీకరణతో అన్ని జిల్లాల సత్వర, సమగ్ర అభివృద్ధికి పాటుపడతానని శాసనసభ సాక్షిగా రాష్ట్ర ప్రజానీకానికి హామీ యిచ్చారు. జిల్లాల వారీగా, ఆయా జిల్లాలలో ఏయే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలనుకొంటున్నారో కూడ సవివరంగా తెలిపారు. అన్ని జిల్లాల లోని అన్ని వర్గాల ప్రజలు సంతోషించడం జరిగింది.

అయితే ఆయన ధోరణి మళ్ళీ పాతబాటలోకే మళ్లింది. శివరామకృష్ణన్ కమిటీ రిపోర్టును ప్రక్కనపెట్టి, అమరావతి రాజధాని ప్రాంతంలో సంవత్సరం పొడుగునా మూడు పంటలు పండే వేలాది ఎకరాల జరీబు భూముల్లో నదీముఖ అభివృద్ధి పేరుతో 'కాంక్రీట్ జంగిల్'గా మారుస్తున్నారు. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం అంటూ దాదాపు రూ.50 వేల కోట్లకు పైగా రాజధాని నగరంలో ప్రభుత్వ భవనాలు, రహదారులు, మౌలిక వసతుల కొరకు ఖర్చు చేస్తున్నారు. ప్రత్యామ్నాయాలను పరిశీలించ కుండానే దాదాపు 20 సం.ల తర్వాత గానీ అవసరం కానటువంటి అమరావతి ఔటర్ రింగ్‌రోడ్, ఇన్నర్ రింగ్‌రోడ్, అమరావతి–అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే, మెట్రో రైలు / లైట్ మెట్రో రైల్ / హైపర్‌లూప్ రైలు వ్యవస్థ, కృష్ణా నదిపై బ్యారేజికి ఎగువన రెండు ఐకానిక్ బ్రిడ్జిలు, దిగువన రెండు బ్రిడ్జిలు, అమరావతిలోనూ, ఇబ్రహీంపట్నం వద్ద, విజయవాడ నగరంలోనూ భారీ కన్వెన్షన్ సెంటర్లు మున్నగు ప్రతిపాదనలను గురించి తీసుకుంటున్న నిర్ణయాలు యిందుకు తార్కాణాలు.

ఇప్పటికే అమరావతి రాజధానిలో ప్రభుత్వ కార్యాలయాల కాంప్లెక్స్‌తోపాటు రహదారులు, ఇతర మౌలిక వసతుల కొరకు వేలకు వేల కోట్ల రూ။లు ఖర్చు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాను గ్యారంటీ వుండి రూ. 42,000 కోట్లను అమరావతి బాండ్ల రూపంలో సేకరించాలనే ప్రయత్నం చేస్తూ వుండటం ఎంతమాత్రమూ తగదు. గత 4 ఏండ్లలోనే రాష్ట్ర ప్రభుత్వంపై రూ. 1,26,000 కోట్ల రుణ భారం అదనంగా పడింది. ఇటువంటి నిర్ణయాల వలన యితర జిల్లాలు, ముఖ్యంగా వెనుకబడిన జిల్లాలలో అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత ఏర్పడుతుంది.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కొరకు పట్టిన పట్టును బిగించవలసినదిపోయి, సడలించి, హోదాకు బదులు ప్రత్యేక ప్యాకేజీని ఆమోదించి, యిప్పుడు తిరిగి ప్రత్యేక హోదా గురించి మాట్లాడటం ఏ విధంగా సమర్ధనీయం? 8, సెప్టెంబరు, 2016న కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీలో పేర్కొన్న అంశాలను ఆమోదించడమేకాక, శాసనసభలో ధన్యవాద తీర్మానాన్ని ఆమోదించి, యిప్పుడు కేంద్రప్రభుత్వం తగినంత నిధులు యివ్వడం లేదని ఆరోపించడం సరికాదు.

**లోగడకు ఇప్పటికీ చాలా వ్యత్యాసం :**

లోగడ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా వుండగా శ్రమదానం, ప్రజలవద్దకు పాలన, జన్మభూమి, నీరు–మీరు సాగునీటి సంఘాలు, డ్వాక్రా మహిళా సంఘాలు రైతు మిత్ర గ్రూపులు, రైతు బజారులు మున్నగు కార్యక్రమాల ద్వారా అభివృద్ధి ప్రక్రియలో ప్రజలను భాగస్వాములను చేశారు. ఆర్థిక సంస్కరణలను అమలుచేసి, ఆర్థిక క్రమశిక్షణను పాటించడం జరిగింది. కానీ, ఈ పర్యాయం ప్రభుత్వపరంగా ఆర్థిక క్రమశిక్షణ పూర్తిగా లోపించింది. పాలనా యంత్రాంగం పైన పట్టు సడలింది. గత ప్రభుత్వంలో కన్నా అన్ని స్థాయిల్లో అవినీతి పెరిగిపోయిందని ప్రజలు భావిస్తున్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి, పాలనలో సామర్థ్యాన్ని పెంచడానికి ఉపయోగపడటం లేదు. పేద రైతుల నుండి అభివృద్ధి పేరుతో తీసుకొంటున్న వేలాది ఎకరాల భూములను బడా బాబులకు కారుచౌకగా కట్టబెడుతున్నారు. ఇరిగేషన్ పనులలో, రహదారుల నిర్మాణాలలో, పట్టణ పేదల గృహనిర్మాణాలలో ఎస్టిమేట్లను భారీగా పెంచి, కొద్దిమంది అస్మదీయ కాంట్రాక్టర్లకు కట్టబెడుతూ భారీ స్థాయిలో ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో వివిధ వర్గాలకు చెందిన ప్రజానీకంలో అసంతృప్తి పెరిగి, ఆగ్రహంగా మారి ప్రజా విశ్వాసాన్ని టి.డి.పి. కోల్పోయే పరిస్థితి రాకూడదన్నదే నా ఆవేదన.

**ప్రజాభిమానాన్ని చూరగొనాలి :**

1999–2004 కాలంలో మంత్రిగా పనిచేస్తూ చంద్రబాబు నాయుడిగారిలో

విజన్‌తో, కష్టపడి పనిచేసే తత్వాన్ని గమనించాను. ఇప్పుడు కూడా చాలా కష్టపడుతున్నాడు కాని ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సామాన్య ప్రజానీకం ఎదుర్కొంటూ వున్న సమస్యలను పరిష్కరించే దానికన్నా, ఆర్థికంగా ఖర్చుతో చాలా కాలం తరువాత కాని అవసరం లేని పథకాల పైన తన దృష్టిని కేంద్రీకరిస్తూ ఉండటం సరికాదని నా అభిప్రాయం. ఇప్పటికైనా నేను ఈ చిరు పుస్తకంలో పేర్కొన్న విషయాలను, సమాచారాన్ని పరిశీలించి, జరుగుతూ వున్న లోపాలను సవరించుకుని, రైతాంగానికి సంబంధించిన భూ సమస్యలను పరిష్కరిస్తూ, కౌలు రైతులతో సహా, యావన్మంది రైతులకు పంట రుణాలు అందేటట్లుగా బ్యాంకులపై ఒత్తిడి తెచ్చి, పేదలపై భారం మోపకుండా పక్కా గృహాలు అందించి, విద్యా – వైద్య రంగాలకు కేటాయింపులను పెంచి, ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని నియంత్రిస్తూ, ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసిన మేరకు నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతిని అందిస్తూ, సామాన్య ప్రజానీకానికి మెరుగైన వైద్య సేవలు అందేటట్లు ప్రభుత్వాన్ని నడుపుతూ ప్రజా విశ్వాసాన్ని చూరగొనాలనే ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నాను.

తెలుగు ప్రజల మనసుల్లో చిరంజీవిగా సుస్థిర స్థానాన్ని పొందిన నందమూరి తారకరామారావు గారి ఆశయ సాధనలో నవ్యాంధ్ర నిర్మాణానికి నడుం బిగించి, ప్రతి ఒక్క ఆంధ్రుడూ "భవిష్య పథ నిర్దేశకుడు చంద్రబాబు" అని కీర్తించేలా, ప్రజారంజక – అవినీతి రహిత పరిపాలనను అందించి, ఆ రామారావు గారి నిజమైన పరిపాలనా వారసుడుగా వెలుగొందాలని నా ఆకాంక్ష.

ఆంధ్రప్రదేశ్‌లో న్యాయవాదిగా, అడ్వకేట్ జనరల్‌గా, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా, అస్సాం, కేరళ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నిజాయితీగా, నిర్భీతితో మచ్చలేని జీవితాన్ని గడిపి భారతీయ న్యాయవ్యవస్థలో దీపస్తంభంగా (లైట్ హౌస్) నిలిచిన మిత్రులు జస్టిస్ జాస్తి చలమేశ్వరరావుగారు ఈ గ్రంథాన్ని ఆవిష్కరించడానికి అంగీకరించినందుకు నా కృతజ్ఞతలు.

ఈ చిరు పుస్తకం వ్రాత ప్రతిని తయారు చేయటంలో నాకు సహకరించిన ఎ.ఎస్.ఎస్.ఎన్.వి. ప్రసాద్, కోగంటి కోటయ్యలకు, శ్రద్ధతో డి.టి.పి. చేసిన దేవిశివ టైప్ ఇన్‌స్టిట్యూట్ ఘంటా శివయ్యకు ధన్యవాదములు. ఈ పుస్తకాన్ని ముద్రించిన సాయిలిఖిత ప్రింటర్స్ వారికి మరియు మిత్రులు 'రైతునేస్తం' వేంకటేశ్వరరావు గారికి కృతజ్ఞతలు.

ఉయ్యూరు,
తేది: 21-06-2018

**వడ్డే శోభనాద్రీశ్వరరావు**

# ఆంధ్రప్రదేశ్ విభజన - ప్రత్యేక హోదా

**ఆంధ్రప్రదేశ్ విభజన సహేతుకమా?**

భారతదేశంలో మొట్టమొదటి భాషాప్రయుక్త రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 5 కోట్ల మంది సీమాంధ్ర తెలుగు ప్రజల అభీష్టమునకు భిన్నముగా విభజించబడింది. విభజన అవసరమా? సమైక్య రాష్ట్రంగా కొనసాగాలా? అను కీలక అంశంపైన నియమించబడిన జస్టిస్ శ్రీకృష్ణ కమిటి రిపోర్టును ప్రధాన రాజకీయ పక్షాలుగాని, బాధ్యతాయుత స్థానములలో ఉన్న ప్రజా ప్రతినిధులలో అత్యధికులు చదువకుండానే రాష్ట్రవిభజనకు అంగీకరించారు. ఆంధ్ర మరియు తెలంగాణా రాష్ట్రములను కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము ఏర్పాటు చేసిన తరువాతనే హైద్రాబాద్, పరిసర ప్రాంతాలలోనేకాక తెలంగాణా ప్రాంతం అన్ని రంగాలలో గణనీయమైన ప్రగతి సాధించినదనియు, రాష్ట్రాన్ని విభజించవలసిన అవసరము లేదనియూ, తెలంగాణా ప్రాంత అభివృద్ధికి రీజనల్ కమిటీని ఏర్పాటు చేసి, చట్టబద్ధతను, అధికారాలను కల్పిస్తూ ఆ ప్రాంత అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించటము ద్వారా ఆ ప్రాంత ప్రజలలో విశ్వాసాన్ని పాదుకొల్పవచ్చునని సూచించింది. రాష్ట్రములోని అన్ని ప్రాంతముల ప్రజలందరూ అభివృద్ధిని సాధించాలంటే రాష్ట్రాన్ని సమైక్యముగా ఉంచడమే మేలు అని రికమండ్ చేసినది. శ్రీకృష్ణ కమీషన్ పేర్కొన్న అంశాలపై కేంద్రప్రభుత్వ స్థాయిలోకాని, రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో కాని ఏనాడు చర్చలు జరుపలేదు.

**రాష్ట్ర విభజన – రాజకీయ క్రీడ:**

అడ్డగోలుగా యు.పి.ఎ. ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించిందని, నూతన నవ్యాంధ్ర రాష్ట్రానికి అనేక సమస్యలను తెచ్చిపెట్టిందని పదేపదే చెబుతూఉండే చంద్రబాబు నాయుడు గారు విభజనకు ముందు ఏనాడూ కనీసం టి.డి.పి. పొలిట్ బ్యూరోలో కూడా జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ రిపోర్టుపైన చర్చించనే లేదు.

కేంద్రప్రభుత్వం ఆహ్వానించినపుడు తాను వెళ్ళకుండా, నిర్దుష్టంగా విభజనవలన ఎదురుకాగల సమస్యలు, వాటికి పరిష్కారాలను సూచించకుండా టి.డి.పి. తరపున తెలంగాణ నుండి ఒకరిని, ఆంధ్రప్రాంతం నుండి ఒకరిని పంపారు. రాష్ట్రాన్ని విభజించి ప్రత్యేక తెలంగాణను ఏర్పాటుచేస్తే తెలుగుదేశం పార్టీకి అభ్యంతరం లేదని రెండు పర్యాయములు ఉత్తరములు ఇచ్చారు. అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీని దెబ్బతీసేందుకు ప్రతిపక్షనాయకుడిగా ఉన్న డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు ప్రత్యేక తెలంగాణ కాంగ్రెస్ కమిటి ఏర్పాటుకు, మరుగున పడిపోయిన ప్రత్యేక తెలంగాణ నినాదమునకు తిరిగి అంకురార్పణ చేయించారు. కానీ దరిమిలా రాష్ట్ర విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. వై.ఎస్. బ్రతికివుంటే రాష్ట్రవిభజన జరిగిఉండేదికాదని పలువురి అభిప్రాయం. రాష్ట్ర విభజన ప్రజాస్వామ్య సూత్రాలను, పవిత్ర రాజ్యాంగ నిబంధనలను ప్రక్కనబెట్టి, అడ్డగోలుగా, పార్లమెంట్‌లో హడావిడిగా ఆమోదించబడింది. ఈ అంశం పైన ఉండవల్లి అరుణకుమార్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటీషన్ యిప్పటికీ విచారణకు నోచుకోకపోవడం ఆంధ్రుల దౌర్భాగ్యం. విభజన చట్టంలో పేర్కొనబడిన పలు అంశములు ఈనాటికి అపరిష్కృతం గానే ఉన్నాయి.

## ప్రత్యేక హోదా – పిల్లి మొగ్గలు:

పార్లమెంట్ సాక్షిగా నవ్యాంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ఐదేండ్లపాటు ప్రత్యేక హోదాను, వెనుకబడిన ప్రాంతాల సత్వర అభివృద్ధికి బుందేల్‌ఖండ్, కోరాపుట్, బోలంగీర్, కలహండి జిల్లాలలో ఇచ్చిన మాదిరిగా ప్రోత్సాహకాలను అందించుతామన్న హామీలు అమలుకు నోచుకోవటం లేదు. 14వ ఫైనాన్స్ కమీషన్ యికపైన ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా యివ్వరాదని చెప్పిందన్న కేంద్రప్రభుత్వ మాటలను నమ్మి, అందుకు సమానమైన ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చగల ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు సెప్టెంబరు 8, 2016న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గారి అర్ధరాత్రి ప్రకటన దరిమిలా ప్రకటించారు. ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించినందుకు కేంద్రప్రభుత్వాన్ని అభినందిస్తూ రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేసి, ఢిల్లీలో ప్రభుత్వ పెద్దలను సత్కరించారు. రాష్ట్ర విభజన చట్టంలో యిచ్చిన హామీలకే నగదుపరంగా వందలు – వేల, కోట్ల రూపాయల విలువతో జాబితాను కేంద్రం ప్రకటించిందే తప్ప అదనంగా ఒరిగిందేమీ లేదు. విభజన చట్టంలో పేర్కొన్న కొన్ని అంశములను పదేండ్ల వ్యవధిలో అమలు చేయవలసి వుంటుంది. 2018 – 2019 కేంద్ర బడ్జెట్ దరిమిలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ప్రకటించిన ప్యాకేజీని సరిగా అమలు చేయడం లేదని, ప్రత్యేక హోదా యివ్వకపోవడం అన్యాయమని వాదనను ఇటీవల ముందుకు తెచ్చింది. శాసనసభ స్థానాల పెంపు రాజ్యాంగ సవరణతో తప్ప సాధ్యం

కాదని కేంద్రప్రభుత్వం చెప్పటం చంద్రబాబు నాయుడు గారికి తీవ్ర ఆశాభంగం కల్గించింది.

## షెడ్యూలు-9, 10ల లోని సంస్థల ఆస్తుల పంపకాల్లో న్యాయం జరిగేనా?

ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పర్చబడిన కార్పోరేషన్‌లు, కంపెనీలు, సంస్థల ఆస్తులను ఇరు రాష్ట్రాలకు పంచవలసిన విధివిధానాలు విభజన చట్టంలో సెక్షన్ 47 నుండి 68 వరకు స్పష్టంగా పేర్కొనబడ్డాయి. సెక్షన్ 75 (1)లో షెడ్యూలు-10లో పేర్కొనబడిన ఎ.పి. స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్, డా॥ యం.సి.ఆర్. మానవవనరుల అభివృద్ధి సంస్థ, తెలుగు అకాడమీ మున్నగు 142 సంస్థలు కొత్త రాష్ట్రములుగా ఏర్పడిన 2, జూన్, 2014 తరువాత ఒక సంవత్సరం వ్యవధి లోపల ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించే విధివిధానాలతో భవిష్యత్‌లో కూడా అంతకుముందు ఏవిధంగా సేవలను ప్రజలకు అందించాయో అదేవిధంగా సేవలను కొనసాగించవలసి ఉంటుందని పేర్కొనబడింది. ఒకవేళ ఉభయ రాష్ట్రప్రభుత్వాల మధ్య అంగీకారం కుదరకపోతే కేంద్రప్రభుత్వం ఇచ్చే ఉత్తర్వుల ప్రకారం వ్యవహరించవలసి ఉంటుందని కూడా పేర్కొనబడింది.

## అవసరం మనది కావున ఎ.పి. రాష్ట్రప్రభుత్వమే చొరవ చూపాలి:

ఈ సంస్థల కేంద్ర కార్యాలయాలు అత్యధిక భాగం హైదరాబాద్ లోనే ఏర్పాటై ఉన్నాయి. కావున పరిష్కారం కుదరకపోతే తెలంగాణకు నష్టం ఏమీ ఉండదు. నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రానికే నష్టం చేకూరుతుంది. కావున ఎ.పి. ప్రభుత్వం చొరవ తీసుకుని తెలంగాణ ప్రభుత్వంతో చర్చించాలి. ఆ దిశగా ఎ.పి. ప్రభుత్వం సకాలంలో తగు చర్యలు చేపట్టనందున ఉన్నత విద్యామండలి, తెలుగు యూనివర్సిటి మున్నగు సంస్థల నిర్వహణలో యిబ్బందులు ఎదురయ్యాయి. ఉన్నత విద్యామండలికి సంబంధించిన వ్యవహారంలో హైకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పును యిచ్చింది. సుప్రీంకోర్టు ఆ తీర్పు సరికాదని, హైదరాబాద్ నగరం తెలంగాణ రాష్ట్రంలో ఉన్నంతమాత్రాన మొత్తం ఈ సంస్థల ఆస్తులు (భూములు, భవనములు) మొత్తం తెలంగాణాకే చెందాలనడం సరికాదని, ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ వ్యయంతో ఏర్పాటైనందున సెక్షన్ 53 ప్రకారం 58:42 జనాభా ప్రాతిపదికన ఆస్తులను ఎ.పి., తెలంగాణాల మధ్యన పంచాలని సుప్రీంకోర్టులో జస్టిస్ గోపాల గౌడ గారు తీర్పు యిచ్చారు. దీనినే డివిజన్ బెంచ్ కూడా సమర్థించింది. అయితే కేంద్ర హోంశాఖ నియమించిన కమిటీ యిందుకు భిన్నంగా ఎ.పి. ఉన్నత విద్యామండలి ఆస్తి తెలంగాణాకే చెందాలని తీర్పు యివ్వడం అన్యాయం. రాష్ట్రప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టులో పిటీషన్

దాఖలు చేసి రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించాల్సిన బాధ్యత ఉండగా కొన్ని నెలల తర్వాతనే సుప్రీంకోర్టును రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రయించింది. చంద్రబాబు నాయుడు గారు ముందునుండి అమరావతి ప్రపంచస్థాయి రాజధాని, మెట్రో రైలు, విదేశీ పర్యటనలు మున్నగు అంశములపైన చూపిన శ్రద్ధాసక్తులను ఈ అంశంపైన చూపకపోవడం దురదృష్టకరం.

## షెడ్యూలు 19 ఆస్తుల పంపకం యిప్పటికీ పూర్తికాలేదు!

పార్ట్-vii, సెక్షన్ 68 (1) & (2) ఎ.పి. జెన్‌కో, ఎ.పి. ట్రాన్స్‌కో, ఎ.పి. ఆగ్రో ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్, ఎ.పి. స్టేట్ పోలీసు హౌసింగ్ కార్పోరేషన్, ఎ.పి. హౌసింగ్ బోర్డు మున్నగు 89 సంస్థలు ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేయబడ్డాయి. వీటిల్లో జిల్లా స్థాయి యూనిట్లు అక్కడే ఉండేలా, కేంద్ర కార్యాలయాములను మాత్రం జనాభా నిష్పత్తిలో (52:48) పంచుకోవాలని, అలా పంచుకునే సందర్భంలో భూములు, భవనముల మార్పిడి సాధ్యం కాకపోతే కేంద్రకార్యాలయాలకు విలువ కట్టి నగదు రూపంలో ఎ.పి. వాటాకు రావలసిన నగదును ఎ.పి. ప్రభుత్వానికి ఇవ్వవలసి ఉంటుంది. ఇప్పటివరకు ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశంపైన ఏకాభిప్రాయానికి రాలేకపోయాయి. సెక్షన్ 66 ప్రకారం రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఏకాభిప్రాయానికి రాలేకపోతే 3 సం.ల లోపు రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థిస్తే కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు యిస్తుంది. కేంద్రప్రభుత్వం షీలా బిడే నేతృత్వంలో వేసిన కమిటి 30-5-2014న ఏర్పాటై పలు పర్యాయములు కమిటీ వ్యవధిని పొడగించినా యిప్పటికీ వీటిల్లో పనిచేసే ఉద్యోగస్తుల పంపిణీ పైన కొంతమేరకు నిర్ణయాలు తీసుకోబడినా ఆస్తుల విలువను లెక్కకట్టి ఎ.పి. వాటాకు రావాల్సిన మొత్తముపైన యింతవరకు నిర్ణయం తీసుకోబడలేదు. సాటి తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల పట్ల న్యాయబద్ధంగా వ్యవహరించని తెలంగాణ ముఖ్యమంత్రి దేశస్థాయిలో "ఫెడరల్ ఫ్రంట్" గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది.

## ఈ అంశములపట్ల శ్రద్ధ ఏదీ?

విభజన చట్టంలో పేర్కొనబడిన అంశముల అమలులో ఏమైనా యిబ్బందులు ఎదురైనప్పుడు తగు ఉత్తర్వులు యిచ్చేందుకు భారత రాష్ట్రపతికి సెక్షన్ 108 (i) ప్రకారం అధికారం యివ్వబడింది. అయితే 2-6-2014 నుండి 3 సం.ల లోపు మాత్రమే అట్టి ఉత్తర్వులు యిచ్చే వీలుందని తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆ గడువు లోపల తగు చర్యలు తీసుకొని యుండలేదు. ఫలితంగా దాదాపు రూ.50,000/- కోట్లు విలువైన షెడ్యూలు 9 ఆస్తులలో మరియు దాదాపు రూ.25,000/-కోట్ల విలువైన

షెడ్యూలు 10 సంస్థల విలువలో న్యాయమైన 58% వాటాను సాధించి రాష్ట్రప్రయోజనాలను కాపాడవలసిన కర్తవ్య నిర్వహణలో రాష్ట్రప్రభుత్వం వైఫల్యం చెందింది. ఇందుకు యిప్పుడు కేంద్రాన్ని తప్పుపడుతూ వుంది.

ది 2-6-2017 లోపల పరిష్కారం కాకపోతే తిరిగి పార్లమెంట్‌లో చట్టమును చేయవలసి ఉంటుంది. యిప్పటికైనా కేంద్రం పైన ఒత్తిడి తీసుకువచ్చి సమస్యకు పరిష్కారాన్ని సాధించేందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేయవలసి వుంది.

## రెవిన్యూ లోటు భర్తీ హామీ నీళ్ళపాలు:

2014-2015లో ఏర్పడిన రెవిన్యూ లోటును భర్తీ చేస్తామని రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరచి కేంద్రప్రభుత్వం హామీ యిచ్చింది. 2014 జూన్ 2 నుండి 2015 మార్చి 31వ తేదీన వరకు రూ.16,078 కోట్లు రెవిన్యూ లోటు ఏర్పడినట్లు కంప్ట్రోలర్ ఆడిట్ జనరల్ (కాగ్) తేల్చారు. ఈ మొత్తాన్ని రాష్ట్రప్రభుత్వానికి యివ్వవలసిన బాధ్యత కేంద్రప్రభుత్వం పైన ఉంది. కానీ 2014-15లో రూ.2,303 కోట్లు, 2015-16లో రూ.500కోట్లు, 2016-17లో రూ.1,176.50 కోట్లు మాత్రమే కేంద్రం నుండి విడుదల అయ్యాయి. తాజాగా కేంద్రప్రభుత్వ అంచనాల ప్రకారం 2014-15 రెవిన్యూ లోటు రూ.4117.89 కోట్లు మాత్రమేనని యిప్పటికి యిచ్చినది కాకుండా యిక ఇవ్వవలసినది రూ.138.39 కోట్లేనని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ యిటీవల రాష్ట్రప్రభుత్వానికి లేఖ వ్రాశారు. అనేక పర్యాయములు జైట్లీ, వెంకయ్యనాయుడు మరియు సుజనా చౌదరి గార్లు రెవిన్యూ లోటు భర్తీ త్వరలో కాబోతూ ఉందని ప్రకటనలు చేసినా చివరకు ఆ హామీలన్నీ నీళ్ళపాలయ్యాయి.

## రాయితీలతో కూడిన ప్రత్యేక హోదా లేనిదే పారిశ్రామిక ప్రగతి ఎలా?

వేలాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక, వ్యాపార సంస్థలను వదులుకొన్న నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర సత్వర పారిశ్రామిక అభివృద్ధి కొరకు అవసరమైన ఆర్థిక ప్రోత్సాహకాలైన ఆదాయపు పన్ను, ఎక్సైజ్ డ్యూటీలలో 100% పన్నుల మినహాయింపు, 90% ట్రాన్స్‌పోర్ట్ రాయితీ, స్థిర క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ పైన 30% రాయితి, వర్కింగ్ క్యాపిటల్ ఋణం పైన వడ్డీ రాయితి, ఇన్సూరెన్సు ప్రీమియం రీఇంబర్స్‌మెంట్ మున్నగు సౌకర్యాలు లభించితే పెద్దఎత్తున పరిశ్రమలు స్థాపించేందుకు ఔత్సాహికులు ముందుకు వచ్చే అవకాశము ఉంటుంది. ఇవి ఉండుటవలననే చిన్న రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో ఫార్మాసూటికల్ యూనిట్లతో సహా వేలాది పారిశ్రామిక సంస్థలు వేలకోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టాయి. లక్షలాదిమందికి ఉపాధి అవకాశములు లభించాయి. మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారు పెట్టుబడిదారుల సదస్సులు

ఎన్నింటిని నిర్వహించినా, విదేశీ పర్యటనలు చేసినా, కొద్ది సంఖ్యలో మాత్రమే పారిశ్రామిక సంస్థలు మన రాష్ట్రమునకు వస్తాయే తప్ప రాష్ట్ర ప్రభుత్వము ఆశించిన మేర పెద్దఎత్తున తరలివచ్చే అవకాశము ఉండదు. 1997 నుండి 2004 వరకు కొన్ని ప్రత్యేక కారణాల వలన ఐ.టి. సంస్థలు వచ్చాయే తప్ప, ఇతర పరిశ్రమలు పెద్దగా రాలేదన్న వాస్తవాన్ని మర్చిపోరాదు. వై2కె సమస్య కారణాన అమెరికా, యూరప్, మున్నగు అభివృద్ధి చెందిన దేశాల అకౌంటింగ్ అవసరాలను తీర్చేందుకు లక్షలాదిమంది భారత్ ఐ.టి. నిపుణులకు అవకాశాలు లభించాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పైపెచ్చు ఇప్పుడు అమెరికాలో ట్రంప్ ప్రభుత్వము అమలు చేస్తున్న విధానములు, నానాటికి విస్తరిస్తూ ఉన్న ఆటోమేషన్ వలన ఉన్న ఉద్యోగాలలో కూడా గణనీయముగా కోతపడే పరిస్థితి కనిపించుతూ ఉంది. నిరుద్యోగ నిర్మూలనకు పేదరికాన్ని పారద్రోలుటకు పారిశ్రామిక రంగం మరియూ సేవా రంగములు అభివృద్ధి చెందవలసిన అవసరము ఉంటుంది.

2014 ఎన్నికల ప్రణాళికలో భావనపాడు, నిజాంపట్నం, వాడరేవు, మచిలీపట్నం మరియు రామయ్యపట్నంలలో పోర్టులను ఏర్పాటు చేస్తామని హామీ యివ్వబడింది. దుగరాజపట్నంలో మేజర్ పోర్టును ఏర్పాటు చేయటం సాధ్యం కాదని నీతి అయోగ్ అభిప్రాయ పడటంతో వేరే ప్రాంతాన్ని సూచించమని కేంద్ర నౌకాయాన శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. "విభజన చట్టంలో యిబ్బందులున్నా, నిబంధనలను సవరించి, తగిన చర్యలు తీసుకుని దుగరాజపట్నంలో కాలపరిమితితో కోర్టును ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరుతూ వున్నట్లు యిటీవల సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొనబడింది. రామయ్యపట్నంలో మేజర్ పోర్టును ఏర్పాటు చేయమని రాష్ట్రప్రభుత్వం కోరి, భూమిని సమకూరిస్తే కేంద్ర ప్రభుత్వం ఈ పాటికి రామయ్యపట్నంలో పోర్టు పనులు ప్రారంభించి వుండేది.

విభజన చట్టంలో పేర్కొనబడిన కొన్ని సంస్థలకు భూములు కేటాయించబడినా అధికారికంగా కేంద్ర ప్రభుత్వానికి అందచేయబడలేదు. ఉదాహరణకు విశాఖపట్నం సమీపంలో ఏర్పాటు కానున్న "ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ" సంస్థకు 202 ఎకరాలు భూమి కేటాయించబడినా అందులో కొంత ప్రభుత్వ భూమి ఆక్రమణలలో ఉండుట వలన ఆలస్యం జరుగుతూ యింతవరకు మొత్తం భూమిని స్వాధీనపర్చుడం జరిగి యుండలేదు. అలాగే విశాఖపట్నం లోనే ఏర్పాటు చేయబడిన "ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యానేజ్‌మెంట్" (ఐ.ఐ.ఎం)నకు 242 ఎకరాల భూమి కేటాయించబడింది. 2015-16 నుండి తాత్కాలిక భవనాలలో కొనసాగుతూ వుంది.

ఇటీవలనే మార్చి 2018లో ఈ భూమిని అధికారికంగా కేంద్రప్రభుత్వానికి స్వాధీనపర్చడ మైనది.

విభజన చట్టంలో శాసనసభ స్థానాలను 175 నుండి 225కు పెంచాలని ఎ.పి. పునర్ వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 26లో పేర్కొనబడినప్పటికీ రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 (3) ప్రకారం 2026లో జనాభా లెక్కల ప్రచురణ అయ్యే వరకు రాష్ట్రాల లోని అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంపుదల సాధ్యంకాదని, ఆర్టికల్ 170ని సవరిస్తే తప్ప సీట్లను పెంచటం సాధ్యం కాదని పార్లమెంట్‌లో కేంద్రప్రభుత్వం ఒక ప్రశ్నకు సమాధానంగా తెలియపర్చింది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ బలపడకూడదు అన్న భావనతోనే కేంద్ర ప్రభుత్వం అసెంబ్లీ సీట్ల పెంపుకు చర్యలు తీసుకోవడం లేదని ముఖ్యమంత్రిగారు యిటీవల మాట్లాడటం ప్రజలను తప్పుదోవ పట్టించడానికే.

★★★

# అవినీతి రహిత సుపరిపాలన

2004 నుండి 2014 వరకు కాంగ్రెస్  ప్రభుత్వ పరిపాలనలో, ఆశ్రిత పక్షపాతము ఎక్కువగా పెరిగిందని, అవినీతి చాలా హెచ్చుస్థాయికి చేరిందని ప్రజలు భావించారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉండగా అవినీతి కొంత తక్కువ స్థాయిలో ఉంటూ, సైబరాబాద్‌లో ఐ.టి. రంగ అభివృద్ధికి, ఉపాధి అవకాశముల కల్పనకు, సమర్ధ పాలనకు కృషి జరిగింది. శ్రమదానం, ప్రజల వద్దకు పాలన, జన్మభూమి, నీరు–మీరు, రైతుబజార్ మున్నగు కార్యక్రమాలు/పథకాల ద్వారా తెలుగుదేశం ప్రభుత్వం ప్రజాభిమానాన్ని చూరగొనటం జరిగింది.  అయితే ఎన్.టి. రామారావు గారు వాగ్దానం చేసిన రూ.2/–లు కిలోబియ్యం పథకాన్ని మార్చి రూ.3–50లకు పెంచటం, హార్స్‌పవర్‌కు రూ.50/–ల వ్యవసాయ విద్యుత్ టారిఫ్‌ను పెంచడం, 9 సం.లు అధికారంలో కొనసాగడం వలన సహజంగా సంభవించే ప్రజావ్యతిరేకత మున్నగు అంశములు వలన తెలుగుదేశం అధికారాన్ని కోల్పోవటం జరిగింది.  ఇప్పుడు చంద్రబాబు నాయుడు గారికి, ముఖ్యమంత్రిగా, నవ్యాంధ్రప్రదేశ్ ప్రగతి పగ్గాలను అందించితే నూతన రాష్ట్రము శరవేగముగా అభివృద్ధి చెందగలదని, సుపరిపాలనతో ప్రజా సమస్యలు చాలా మేరకు పరిష్కరించబడతాయని ప్రజలు ఆశించారు.  కాని ఎందువలననో, ఏ కారణముల వలననో, రెండున్నర సం.లు దాటిపోతున్నా, పరిపాలనా యంత్రాంగము పైన ప్రభుత్వం పట్టును సాధించలేకపోతూ వుంది. రెవిన్యూ, ఇరిగేషన్, పోలీసు శాఖలతో సహా, దాదాపు అన్ని శాఖలలో అవినీతి లోగడకన్నా పెరిగిందని ప్రజలు భావించుతూ వున్నారు. 2004లో తెలుగుదేశం ప్రభుత్వం గద్దె దిగటానికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కారణమనే భావన ముఖ్యమంత్రిగారిలో వుండి యంత్రాంగాన్ని సమర్ధవంతంగా పనిచేయించడంలో విఫలమౌతున్నారు.

పాలనా యంత్రాంగంలో అవినీతి సర్వాంతర్యామి అయ్యింది.  ఆర్.పి.ఠాకూర్ డిజిపీ, ఏసీబీ ఆధ్వర్యంలో అందిన ఫిర్యాదులను విచారణ జరిపినప్పుడు నమ్మశక్యం

కాని వాస్తవాలు బయటపడ్డాయి. నవంబరు 2016 నుండి డిశంబరు 2017 వరకు జరిపిన దాడులలో పబ్లిక్ హెల్త్ మరియు మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖలో ఇ.ఎన్.సి.గా పనిచేసిన పాము పాండు రంగారావు, పరిశ్రమల శాఖలో అదనపు సంచాలకునిగా పనిచేసిన డి. సురేష్‌బాబు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో జూనియర్ టెక్నికల్ ఆఫీసరుగా పనిచేసిన వల్లూరి వెంకట శివప్రసాద్, టౌన్-కంట్రీ ప్లానింగ్ విజయవాడలో డైరెక్టరుగా పనిచేసిన జి.వి. రఘు, ఎండోమెంట్ శాఖలో అసిస్టెంట్ కమీషనరుగా పనిచేసి న ఎం. విజయరాజు మరియు విజయనగరంలో సర్వేశాఖలో ఇన్స్‌పెక్టర్‌గా పనిచేసిన గేదెల లక్ష్మీ గణేశ్వరరావు మున్నగు వారు చాలా పెద్ద ఎత్తున అక్రమ ఆస్తులు కూడబెట్టినట్టు గుర్తించారు. వారిలో కొందరికి అంత్యంత విలాసవంతమైన భవనములు, డైమండ్స్, గోల్డ్ జ్యువలరీ, రూ. 2 లక్షల ఖరీదు చేసే సిల్కు చీరలు, వందల ఎకరాల భూములు, ప్రామిసరీ నోట్లు, నగదు లభ్యమయ్యాయని ఏసీబీ అధికారులు తెలిపారు. రెవెన్యూ శాఖలో చిరు ఉద్యోగి అయిన లక్ష్మీగణేశ్వరరావు వద్ద గుర్తించిన ఆస్తుల విలువలు రూ. 10 కోట్ల నుండి 150 కోట్ల వరకు ఉంటుందని ఏసీబీ వర్గాల సమాచారం. ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖలో జాయింట్ డైరెక్టరుగా పనిచేస్తూ ఉన్న జి. ముని వెంకట నారాయణ వద్ద రూ. 60 కోట్ల ఆస్తులను ఏసీబీ గుర్తించింది. రాష్ట్ర రోడ్లు, భవనాల ఇంజనీరు ఇన్ చీఫ్ గంగాధరంకు లెక్కచూపని, రూ. 80 కోట్ల ఆస్తులు ఉన్నాయని గుర్తించారు. ఇవన్నీ రాష్ట్రంలో పాలనా యంత్రాంగంలో కొనసాగుతూ ఉన్న అవినీతికి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

## అవినీతిని కప్పిపుచ్చటం సబబా?

రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి నిర్ణయాలను ఎ.సి.బి. మరియు విజిలెన్సు విభాగాల విచారణ పరిధి నుండి మినహాయింపు యిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ వుంటుంది. పరిశ్రమలతోపాటు వాణిజ్య యూనిట్లకు అనుమతి యివ్వడానికి ఈ కమిటీ వద్దకు ఫైళ్ళు వెళతాయి. ఇక్కడి నుండి ముఖ్యమంత్రి నేతృత్వంలోని ఎస్.ఐ.పి.బి.కి వెళ్తుంది. భవిష్యత్తులో ఈ సంస్థ తీసుకున్న నిర్ణయాల లోని లోపాలను, రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం వాటిల్లే సందర్భాలను విచారణ పరిధి నుంచి తప్పించేందుకు జి.ఒ. యివ్వబడింది.

## సమాచార కమీషనర్లను నియమించటంలో జాప్యం ఏల?

సమాచార హక్కు చట్టంను అనుసరించి మన రాష్ట్రంలో ప్రధాన సమాచార

కమీషనర్ మరియు ముగ్గురు సమాచార కమీషనర్లను నియమించాల్సి వుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమాచార కమీషన్‌లో మే, 2017 దరిమిలా ఒక్క కమీషనర్ కూడా లేరు. 2017 ఆగష్టులో హైకోర్టు 6 వారాల లోపు ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ సమాచార కమీషన్‌లను ఏర్పాటు చేయాలని తీర్పు యిచ్చిన నేపథ్యంలో ది 11-8-2017న ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫర్‌మేషన్ కమీషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జి.ఒ.యం.ఎస్.నెం.111ను జారీచేసింది ఇప్పటి వరకు సమాచార కమీషనర్‌లను నియమించకపోవుట వలన సమాచారమును పౌరులు పొందటంలో యిబ్బందులు ఎదురవుతున్నాయి. యిప్పటికైనా వెంటనే ప్రభుత్వం సమాచార కమీషనర్‌లను నియమించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## లోకాయుక్తను ఎందుకు నియమించరు?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లోకాయుక్తగా పనిచేసిన జస్టిస్ సుభాషణ్ రెడ్డి పదవీకాల అనంతరం నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రానికి యింతవరకు లోకాయుక్తను నియమించకపోవటం దురదృష్టకరం. అవినీతిని అరికట్టేదానికి, ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రంలో లోకాయుక్త వ్యవస్థలను ఏర్పాటు చేయవలసి వుంది. రాష్ట్రంలో అవినీతి సర్వాంతర్యామి అయిన నేపథ్యంలో ఇప్పటికైనా వెంటనే రాష్ట్ర ప్రభుత్వం లోకాయుక్తను నియమించాల్సి ఉంది.

## ఫ్యూచర్ రిటైల్‌లో విలీనం ద్వారా అపరిమితమైన లాభం పొందిన హెరిటేజ్ రిటైల్:

ఫ్యూచర్ రిటైల్‌లో హెరిటేజ్ వ్యాపారం విలీనం చేసినప్పుడు ఫ్యూచర్ రిటైల్‌లో హెరిటేజ్ 3.56 శాతానికి సమానమైన 1.78 కోట్ల షేర్లు హెరిటేజ్ ఫుడ్స్‌కు దక్కాయి. అప్పట్లో ఈ ఒప్పందము వలన హెరిటేజ్‌కు సుమారు రూ.295 కోట్లు లాభం చేకూరిందని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. ఆ సమయంలో ఫ్యూచర్ రిటైల్ షేర్ రూ.154 ఉండగా యిప్పుడు అది రూ.575కు పెరిగింది. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారము ఫ్యూచర్ రిటైల్‌లో హెరిటేజ్ వాటా రూ.1,040 కోట్లకు పెరిగింది? రాష్ట్రములోని 2995 రేషన్ షాపులను చంద్రన్న మాల్స్‌గా మార్పుచేసి కార్పోరేట్ కంపెనీలకు అప్పగించేందుకు ప్రభుత్వము నిర్ణయించింది. ఉభయ గోదావరి జిల్లాలు, నెల్లూరు జిల్లాలను ఫ్యూచర్ రిటైల్‌కు, మిగిలిన జిల్లాలను రిలయన్స్ రిటైల్‌నకు కేటాయిస్తూ ప్రభుత్వం యిటీవలన ఉత్తర్వులు యిచ్చింది.

ఆర్ & బి. శాఖలో ఇకపై 5%కు మించి కమీషన్ ఇవ్వరాదని ఆర్ & బి. కాంట్రాక్టర్లు సమావేశమై నిర్ణయం తీసుకున్నారని రూ.5 కోట్ల నుండి 15 కోట్ల

వర్కులకు 4%, అంతకుమించితే 5% యివ్వాలని నిర్ణయించినట్లుగా పత్రికల సమాచారం. ఏ స్థాయిలో ఎవరికి ఎంత ముట్టచెప్పాలో కూడా నిర్ణయించినట్లుగా పత్రికల సమాచారం.

## ఎల్ & టి, షాపూర్‌జి-పల్లోంజి, ఎన్.సి.సి., మేఘా, బి.ఎస్.ఆర్., కంపెనీలకు భారీగా లాభాలు:

రాజధానిలో రహదారుల నిర్మాణంలో అంచనాలు ఊహలకు అందడం లేదు. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో నిర్మించబడుతూ వున్న 19 రహదారులకు రూ.7,808 కోట్లు ఖర్చవుతున్నాయి. ఒక కి.మీ.కు రూ.12.6 కోట్ల నుండి రూ.35.5 కోట్ల వరకు ఖర్చు చేయబడుతూ వుంది. రెండవ దశ ప్రాధాన్య రోడ్లు క్రింద 71.53 కి.మీ.ల పొడవైన 11 రోడ్లకు రూ.1,245 కోట్లు ఖర్చు చేయబోతున్నారు. అప్పులు తీసుకువచ్చి ఖర్చు చేస్తున్న ప్రజాధనాన్ని రాజకీయ నాయకులు, అధికారులు, కాంట్రాక్టర్లు పంచదార లాగా, పటికబెల్లం లాగా, జుంటు తేనె లాగా జుర్రుకుంటూ వున్న పరిస్థితి కన్పించుతూ వుంది. తాత్కాలిక సెక్రటేరియట్ భవన కాంప్లెక్స్‌కు భూమి లెవిలింగ్, రహదార్లు, చెట్లు కొరకు రూ.1,500 కోట్లు ఖర్చయ్యాయంటే అవినీతి ఏ స్థాయిలో వుందో అర్ధమవుతూ వుంది.

రాజధానిలో నిర్మించబోయే శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాలకు భూమిని ఉచితంగా యిచ్చి మౌలిక వసతులు కల్పించి నిర్మాణాల కొరకు చాలా హెచ్చు మొత్తాలను సి.ఆర్.డి.ఎ. ఖర్చు చేయబోతూవుంది. 38 లక్షల చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించబోయే సచివాలయానికి రూ.2,728 కోట్లు అంచనా వేయబడింది. అంటే చ.అ.కు రూ.7,177/-లు అవుతుంది. అలాగే అసెంబ్లీ భవనాన్ని 11 లక్షల చ.అ.లు, హైకోర్టు భవనాన్ని 25 లక్షల చ.అ.ల కార్పెట్ ఏరియాతో అనగా మొత్తం 36,చ.అ.లకు రూ.2,229 కోట్లు అంచనా చ.అ.నకు రూ.4,192 అవుతుంది. అలాగే 9.6 లక్షల చ.అ.లతో నిర్మించబోయే మంత్రుల బంగళాలకు రూ.760 కోట్లు అంచనా. అనగా చ.అ.కు రూ.7,916 అవుతుంది.

యం.ఎల్.ఎ.లు 288 మంది మరియు ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్., ఐ.ఎఫ్.ఎస్., ఆఫీసర్లు 144 మందికి 3,500 చ.అ. కార్పెట్ ఏరియాతో ప్లాట్ల కొరకు 636 కోట్ల ఖర్చుతో నిర్మించుటకు ఎన్.సి.సి. లిమిటెడ్ కంపెనీకి కాంట్రాక్టు యివ్వడం జరిగింది. అంటే చ.అ.కు రూ.4,206. అలాగే 720 మంది గజిటెడ్ ఆఫీసర్లకు 720 మంది క్లాస్ డి ఉద్యోగుల కొరకు చ.అ.. 3835 చొప్పున రూ.707 కోట్లతో నిర్మించడానికి ఎస్.పి.సి.ఎల్. సంస్థకు యిచ్చారు. 1968 మంది నాన్ గజిటెడ్ ఉద్యోగుల కొరకు 1200 చ.అ. కార్పెట్ ఏరియాతో నిర్మించుటకు రూ.866 కోట్లకు ఎల్ & టి. కంపెనీకి కాంట్రాక్టు యిచ్చారు.

ఈ విధంగా రాజధానిలో రహదారులను ప్రభుత్వ కార్యాలయాలను నివాస భవన సదుపాయాలను ఎల్ & టి షాపూర్జీ పల్లోంజి., ఎన్.సి.సి., బి.ఎస్.ఆర్., మేఘా మున్నగు కొద్ది సంస్థలకు వేలకు వేల కోట్ల రూపాయల నిర్మాణాలను అప్పజెప్పటం వెనుక రహస్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అలాగే ఇరిగేషన్ శాఖలో పనులను మేఘా, సి.యం. రమేష్‌కు చెందిన రిత్విక్, సుధాకర్ యాదవ్ హెచ్.ఇ.ఎస్. సంస్థలకే కట్టబెట్టడంలోని ఆంతర్యం తెలియడం లేదు.

వై.యస్. రాజశేఖర్‌రెడ్డి గారి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భారీగా లబ్ధిపొందిన ప్రముఖ కాంట్రాక్టు సంస్థలు మరియు పారిశ్రామిక - వ్యాపారవేత్తలలో పలువురు ఈనాడు చంద్రబాబు నాయుడు గారి తెలుగుదేశం ప్రభుత్వం ద్వారా కూడా భారీగా లబ్ధిపొందుతూ ఉన్నారని ప్రజలు భావిస్తున్నారు.

గోదావరి - పెన్నా అనుసంధానంలో భాగంగా గోదావరి జలాలను నాగార్జున సాగర్ కుడి కాలువకు చేర్చేందుకు వైకుంఠపురం వద్ద బ్యారేజి నిర్మించి ఐదు చోట్ల పంప్ హౌస్‌లు, పది కి.మీ. పొడవు ప్రెషర్ మెయిన్, 56 కి.మీ. పొడవున కాలువ త్రవ్వకం మున్నగు పనులకు రూ.4,617 కోట్లు వ్యయం కాగల ప్రతిపాదనను ఫిబ్రవరి 5, 2018న ముఖ్యమంత్రి గారు నిర్వహించిన సమావేశంలో ఇరిగేషన్ శాఖ ప్రతిపాదించింది. ఇప్పుడు ఈ వ్యయాన్ని రూ.6,020 కోట్లకు పెంచి టెండర్లు పిలవబోతున్నారు. కేవలం 4 నెలల వ్యవధిలో రూ.1,400 కోట్లు అంచనా వ్యయం పెరగటం ఇరిగేషన్ శాఖలో మితిమీరిన అవినీతి ఒక దృష్టాంతం.

దేశంలో గ్రామీణ ప్రాంతాలలో హైస్పీడ్ ఇంటర్‌నెట్ సేవలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం "భారత్ నెట్" కార్యక్రమాన్ని రూపొందించింది. హైస్పీడ్ బ్రాడ్ బ్యాండ్‌తో పాటు ఫోన్, కేబుల్ టి.వి. సేవలను అందించాలనేది ఆ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. ఫైబర్ గ్రిడ్ మొదటి దశలో ప్రయోగాత్మకంగా జిల్లా, మండల కేంద్రాలను అనుసంధానిస్తూ ఫైబర్ గ్రిడ్ కేబుల్ వేసేందుకు టెండర్లు పిలిచారు, పని జరుగుతూ వుంది. ఇప్పుడు రెండవ దశ క్రింద రాష్ట్ర వ్యాప్తంగా ఆప్టికల్ ఫైబర్ కేబుళ్ళు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం 12,281 గ్రామ పంచాయితీలలో ఆప్టికల్ ఫైబర్ కేబుళ్ళు వేయాలని నిర్ణయం. ఈ పనుల కోసం ఈ ఏడాది ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో భారీ అవినీతి చోటుచేసుకుంటూ వుంది. పొరుగునే ఉన్న మహారాష్ట్రలో ఫైబర్ గ్రిడ్ పనులకు యిస్తూ వున్న రేట్ల కన్నా చాలా అధికంగా మన రాష్ట్రంలో యిచ్చేదానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం వల్ల దాదాపుగా రూ.700 కోట్ల పైన ప్రజాధనం దుర్వినియోగం అయ్యే అవకాశం వుంది.

"జలయజ్ఞం ప్రాజెక్టులలో జరిగిన అవకతవకలను "స్పెషల్ టెక్నికల్ ఆడిట్" ద్వారా గుర్తించి, అక్రమాలకు బాధ్యులైన వారిని శిక్షిస్తామని, దుర్వినియోగమైన నిధులను రికవరీ చేస్తామని తెలుగుదేశం 2014 ఎన్నికల ప్రణాళికలో హామీ యివ్వబడింది. నాలుగేళ్ళు గడచిపోతున్నా యిప్పటి వరకు 'స్పెషల్ టెక్నికల్ ఆడిట్' వ్యవస్థను ఏర్పాటు చేయడం గానీ, అవకతవకలపైన పరిశీలన కానీ, రికవరీ కానీ జరిగి వుండలేదు. ఈ నాలుగేళ్ళలో వంశధార, హంద్రీనీవా, గాలేరు–నగరి మున్నగు అనేక ఇరిగేషన్ ప్రాజెక్టులలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయడానికి ఎస్టిమేట్లను భారీగా పెంచివేస్తూ ఉండటం వలన వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతూ వుంది. గతంలో వలనే జలయజ్ఞం ధనయజ్ఞంగా కొనసాగుతూ వుంది. గత ప్రభుత్వ హయాములో అమితంగా లబ్ధి పొందిన కాంట్రాక్టు సంస్థలకు యిప్పుడు కూడా వేలకు వేల కోట్ల రూపాయల పనులను అప్పగించడంలో ఆంతర్యం బోధపడటం లేదు!

# ప్రభుత్వ ప్రాధాన్యత క్రమములు ఎలా ఉండాలి?

మనదేశ జనాభాలో 55% మందికి జీవన ఆధారమైన వ్యవసాయ రంగం, అనుబంధ వ్యాపకాలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి సన్నకారు, చిన్న రైతులు, కౌలురైతులు ఎదుర్కొంటూ ఉన్న ఋణపరపతి, పంటల భీమా, ఇన్‌పుట్ సబ్సిడి, సరియైన ధర, మార్కెటింగ్, మున్నగు సమస్యలను పరిష్కరిస్తూ, కుటీర, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు అధిక ప్రాధాన్యతను, మద్దతును యిస్తూ విద్యావంతులలో నైపుణ్యాభివృద్ధిని మెరుగుపర్చి మాన్యుఫాక్చరింగ్ మరియు సేవారంగాలకు అందుబాటు లోనికి తెచ్చినప్పుడే అభివృద్ధి ఫలాలు ఎక్కువమంది ప్రజలకు అందే అవకాశము ఉంటుంది.

## రైతుల - గ్రామీణ ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రథమ ప్రాధాన్యతనివ్వాలి - కొనసాగుతున్న రైతుల ఆత్మహత్యలు

గత దశాబ్దంన్నర కాలంలో దేశవ్యాప్తంగా దాదాపు 2,75,000మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. వీరిలో అత్యధికులు గిరిజనులు, షెడ్యూల్ కులాలు, వెనుకబడిన తరగతులకు చెందిన సన్నకారు, చిన్నరైతులు, కౌలురైతులు. అధిక వడ్డీలతో కూడిన ప్రైవేటు ఋణాలు, కరువు, తుఫాన్లు అధిక వర్షాలు, నాసిరకం విత్తనాలు, రైతు అనుకూల పంటల బీమా పథకం లేకపోవడం, అతి తక్కువ స్థాయిలో ఇన్‌పుట్ సబ్సిడీ, మార్కెట్లో ధరల తీవ్రమైన ఒడుదుడుకులు ఆత్మహత్యలకు కారణాలని పరిశీలనలో తేలింది. 2004లో అధికారంలోకి వచ్చిన యు.పి.ఎ. ప్రభుత్వం రైతుల ఆత్మహత్యల నివారణకు, వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుండి గట్టెక్కించటానికి అనుసరించవలసిన వ్యూహాన్ని నిర్దిష్ట కార్యాచరణను సూచించవలసినదిగా ప్రపంచ ప్రసిద్ధ వ్యవసాయ, ఆర్థికవేత్త డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ గారి నేతృత్వంలో జాతీయ రైతు కమీషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కమీషన్ దేశవ్యాప్తంగా పర్యటించి అన్ని వర్గాల వారితో సమాలోచనలు జరిపి చక్కని రిపోర్టును 2006లో కేంద్ర ప్రభుత్వానికి అందచేసింది. యు.పి.ఎ. ప్రభుత్వం ఆ రిపోర్టును పార్లమెంటులో చర్చించలేదు.

కమీషన్ రిపోర్టులో అత్యంత కీలకమైన సిఫార్సులను ఆమోదించకుండా మినహాయించి కొన్నింటిని మాత్రమే ఆమోదించి "జాతీయ రైతు విధానాన్ని" ప్రకటించింది.

## స్వామినాథన్ కమీషన్ సిఫార్సులు:

పంటల ఉత్పత్తి వ్యయాన్ని లెక్కించే విధానంలో, వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘం అనుసరిస్తున్న పద్ధతిలో లోపాలున్నాయని, పరిగణనలోనికి తీసుకోవాల్సిన 12 అంశాలలో ఎక్కువ అంశాలు రైతాంగ ప్రయోజనాలకు భంగం కలిగించేవిగా వున్నాయని, వాటిని పునః సమీక్షించవలసిన అవసరం ఉందని, ఈ సంఘానికి స్వయంప్రతిపత్తిని ఇవ్వాలని కమీషన్ సూచించింది. రైతులు తీసుకునే పంట ఋణాలలో 65%ను వ్యవసాయంలో ఖర్చుల నిమిత్తం వాడుతూవుండగా, మిగిలిన 35% రైతు కుటుంబం యొక్క పోషణ కొరకు, విద్యా, వైద్య ఖర్చుల నిమిత్తం, సామాజిక అవసరాల కొరకు ఖర్చు అగుతున్నదని గమనించి రైతు కుటుంబం గౌరవప్రదంగా జీవించాలంటే సమగ్ర పంట ఉత్పత్తి వ్యయానికి (సి 2) 50% కలిపి మద్దతు ధరగా నిర్ణయించాలని సిఫార్సు చేసింది. 2014 వరకు అధికారంలో వున్న యు.పి.ఎ. ప్రభుత్వం కీలకమైన ఈ సిపార్సును అమలుచేయలేదు. దరిమిలా స్వామినాథన్ కమీషన్ సిఫార్సు చేసిన విధంగా సమగ్ర ఉత్పత్తి వ్యయానికి 50% కలిపి ధరలను నిర్ణయిస్తామని వాగ్దానం చేసి ఎన్నికల ప్రణాళికలలో పేర్కొని కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీగారి ప్రభుత్వం కానీ, మన రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కానీ ఈ సిఫార్సును అమలు చేయటం లేదు. పైపెచ్చు స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయవలసిన ఆవశ్యకత గురించి సుప్రీంకోర్టులో దాఖలు అయిన కేసు విచారణ సందర్భముగా "వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘం (సి.ఎ.సి.పి) రైతులకు ఆదాయమును సమకూర్చే సంస్థ కాదని, అయిన పంట ఉత్పత్తి వ్యయం పైన అదనముగా కొంత మొత్తమును యివ్వాలన్న విధానం లేదని, ఉత్పత్తి వ్యయానికి 50% కలిపి ధరను ఇస్తే మార్కెట్లు తల్లక్రిందులైపోతాయని, అందువలన స్వామినాథన్ కమీషన్ సిఫార్సును ఆమోదించడం సాధ్యపడదని" కేంద్రప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొంది. యిప్పుడు ఈ రెండు ప్రభుత్వముల ధోరణి గతంలో యు.పి.ఎ. ప్రభుత్వం అనుసరించిన రైతు వ్యతిరేక ధోరణిలోనే కొనసాగుతూ వుంది. ఇటీవల పార్లమెంట్‌లో పంటల ఉత్పత్తి వ్యయం (ఎ2+ఎఫ్.ఎల్) నకు 50% కలిపి మద్దతు ధరలను ప్రకటిస్తున్నామని ప్రధానమంత్రి ప్రకటించి రైతాంగాన్ని మభ్యపర్చడానికి ప్రయత్నించారు. వాస్తవానికి ఈ ప్రకారం చూస్తే యు.పి.ఎ. 2 ప్రభుత్వ కాలం లోనే పలు పంటల ధరలు ఎక్కువగా ఉన్నాయి.

### మద్దతు ధరకన్నా తగ్గినప్పుడు కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలి:

కేంద్రప్రభుత్వం ప్రకటించే మద్దతు ధరలు వాస్తవంగా రైతులకు అయ్యే పంట ఖర్చులకన్నా 38% తక్కువగా ఉండటం వలన రైతులు వేలాది కోట్ల రూపాయల నష్టానికి గురౌతున్నారని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ నిర్ధారించింది. ప్రకటించిన ఈ మద్దతు ధరలకన్నా కూడా మార్కెట్లలో తక్కువ ధరలకు రైతులు అమ్ముకోవలసి రావడం వలన వేలాది కోట్ల రూపాయలు నష్టపోతున్నారు. గత సంవత్సరం కొన్ని పంటల మార్కెటింగ్ పరిస్థితిని బేరీజు వేసినపుడు రైతులు దాదాపు రూ.32000 కోట్లు నష్టపోయారని అంచనా వేయబడింది. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీము (యం.ఐ.ఎస్) ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధరలకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. మోడి ప్రభుత్వం ఈ పథకానికి కేటాయింపును అంతకు ముందు సంవత్సరం రూ.950 కోట్లు ఉండగా 2018-19 బడ్జెట్‌లో రూ.250 కోట్లకు తగ్గించింది. తెలుగుదేశం ఎన్నికల ప్రణాళికలో రూ.5000 కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పరుస్తామన్న వాగ్దానం నేటికీ కార్యరూపం ధరించలేదు. ధాన్యం, అపరాలు, మొక్కజొన్నలు, కూరగాయలు, సుబాబుల్, జామాయిల్‌లతో సహా అనేక పంటలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలు లభించడం లేదు. కావున ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్రానికి వ్రాసి అమలు చేయించాలి.

### సన్నకారు - చిన్న రైతులు, కౌలు రైతులకు విధిగా ఋణపరపతి అందచేయాలి

వ్యవసాయదారులలో నూటికి ఎనబై ఐదు మంది సన్నకారు, చిన్న రైతులు, 41% సాగుభూమిని సాగుచేస్తూ ఉంటారు. పేదలకు, బలహీన వర్గాలకు, సామాన్యులకు ఋణపరపతిని కల్పించాలన్న సదవకాశంతో 1970లో బ్యాంకుల జాతీయకరణ జరిగినా, నాలుగున్నర దశాబ్దములు దాటినా నేటికీ సన్నకారు, చిన్న రైతులు, కౌలురైతులలో అత్యధికశాతం మంది హెచ్చు వడ్డీలతో కూడిన ప్రైవేటు ఋణముల పైనే ఆధారపడవలసిన దయనీయ స్థితి వుంది. బ్యాంకులు తాము అందించవలసిన మొత్తము ఋణములో 18%ను వ్యవసాయ అనుబంధ వ్యాపకాలకు అందచేయాలని, అందులో 13.5%ను పంట రుణాలుగా వ్యవసాయం, అనుబంధ వ్యాపకాలకు కలిపి ప్రత్యక్ష ఋణముగా ఇవ్వాలని వ్యవసాయ ఆధార పరిశ్రమలు వంటివాటికి ఇచ్చు పరోక్ష ఋణాలు 4.5%కు మించరాదని ఆర్.బి.ఐ. ఆదేశము వుంది. 2015 ఏప్రియల్‌లో నాయర్ కమిటి సిఫార్సును అనుసరించి, ప్రత్యక్ష మరియు పరోక్ష ఋణముల మధ్య విభజన రేఖను పాటించాల్సిన అవసరం లేదని ఆర్.బి.ఐ. సర్క్యులర్ పంపింది. ఇప్పటికే వ్యవసాయ రంగ అవసరములకు తగిన రీతిలో ఋణాలు అందని పరిస్థితి ఉండగా రానున్నకాలంలో మరింతగా దిగజారిపోయే ప్రమాదము కనిపిస్తూ వుంది.

రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం బ్యాంకులు యిచ్చే రుణ మొత్తం 18 శాతంలో 8 శాతం సన్నకారు, చిన్న రైతులకు వెళ్ళాలి. 2017లో వ్యవసాయ రుణాల్లో 33.45 శాతం గ్రామాల్లో వున్న రైతులకు వెళ్ళగా మిగిలినది పట్టణాలు, నగరాల్లో వుంటూ వ్యవసాయం స్వయంగా చేయని రైతులకు వెళ్ళింది. దేశంలో వున్న 23 ప్రైవేటు బ్యాంకులో 12 బ్యాంకులు వ్యవసాయ రంగానికి 18 శాతం రుణం యివ్వడం లేదు.

## ప్రకటనలు ఘనం - ఆచరణలో శూన్యం:

మొత్తము వ్యవసాయ ఋణాల ఖాతాలలో రూ.2లక్షలకు లోపు ప్రత్యక్ష పంట ఋణ ఖాతాలు 68% నుండి, 2013 నాటికి 44%కు తగ్గిపోయాయి. 2004-05లో వ్యవసాయ రంగానికి ఋణము రూ.96వేల కోట్ల నుండి 2010-11 నాటికి రూ.4.6 లక్షల కోట్లకు, 2018-19 నాటికి రూ.10 లక్షల కోట్లుకు, పంపిణీ చేయాలని లక్ష్యం ప్రకటించబడినా వాస్తవముగా రైతాంగానికి చేరింది స్వల్పము. ఉదా 2013లో వ్యవసాయ రంగానికి రూ.6.7 లక్షల కోట్లు ఋణం అందించవలసి వున్నా రైతులకు అందింది రూ.3లక్షల కోట్లు మాత్రమే, మిగిలిన రూ.3.5 లక్షల కోట్లు వ్యవసాయ అనుబంధ రంగ వ్యాపకాల పేరుతో చక్కెర మిల్లులు, ఆయిల్ ఫ్యాక్టరీలు, స్పిన్నింగ్ మిల్లులు, మున్నగు వ్యాపారాలకు, పారిశ్రామికవేత్తలకు వెళ్ళింది. భారతదేశములో పంపిణీ కాబడిన, వ్యవసాయ ఋణములో రైతులకు నేరుగా వెళ్ళవలసిన ప్రత్యక్ష ఋణములో 22శాతము, పట్టణాలలో, నగరాలలో ఉన్న బ్యాంకు బ్రాంచీల ద్వారా వెళ్ళింది. 2007 నుండి 2013 వరకు రూ.1కోటి రూపాయల వరకు వ్యవసాయము పేరుతో ఇచ్చిన ఋణాలు కూడా ప్రత్యక్ష ఋణముగా పరిగణించబడింది. పర్యవసానముగా, మన నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రములో 93% వ్యవసాయదారులు అప్పుల భారముతో వున్నారని తాజాగా కేంద్రప్రభుత్వం నిర్వహించిన సర్వేలో తేలింది. అంతేకాక రైతులలో 43.7% మందికి మాత్రమే సంస్థాగత ఋణములు అందుతున్నాయని, మిగిలిన వారు ప్రైవేటు ఋణములపైనే ఆధారపడి వున్నారని తెలియపర్చింది.

## కౌలు రైతులు వ్యవసాయం చేసేదెలా?

నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 16.25లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని అంచనా, రూ.1లక్ష వరకు హామీ లేకుండానే వ్యవసాయ ఋణమును మంజూరు చేయవచ్చునని రిజర్వు బ్యాంకు నుండి ఆదేశములు ఉన్నప్పటికి, బ్యాంకులు మాత్రము సహకరించటము లేదు. వ్యవసాయము కొరకు ఋణం ఇవ్వడం రిస్కుతో కూడుకున్నదని బ్యాంకు మేనేజర్లు సాధారణంగా భావించుతూ ఉండటం, ఇచ్చిన ఋణం తిరిగి రాకపోతే

తమ ప్రమోషన్ అవకాశాలకు కొంతమేరకు భంగం కలగవచ్చని బ్యాంకు మేనేజర్లు భావిస్తూ ఉండటం యిందుకు కారణం.

2015-16లో 5,00,275 రుణ అర్హత కార్డులను అందచేయగా, వీరిలో 1,00,431 మందికి రూ. 243 కోట్లు రుణము అందించబడినది. 2016-17లో కొత్తగా 1,80,847 మందికి, రెన్యువల్ చేసి 4,09,861 మందికి కార్డులను ఇవ్వగా, వీరిలో 71,940 మందికి రూ. 182 కోట్లు రుణము మంజూరు చేయబడినది.

2017-18 పంట కాలంలో ఖరీఫ్, రబీ సీజన్లలో రాష్ట్రవ్యాప్తంగా 6,01,657 మంది కౌలు రైతులకు రూ. 1775.44 కోట్ల పంట ఋణాలుగా అందింది. కౌలు ధృవీకరణ పత్రం ద్వారా 1,98,795 మందికి రూ. 573.23 కోట్లు, సాగు ధృవీకరణ పత్రం ద్వారా 98,076 మందికి రూ. 347.9 కోట్లు, రైతు మిత్ర గ్రూపు ద్వారా 2,19,798 మందికి రూ. 631.7 కోట్లు, జాయింటు లైబిలిటీ గ్రూపుల ద్వారా 84,221 మందికి రూ. 222.5 కోట్లు పంట రుణాలు అందాయి.

### కార్పోరేట్ సంస్థలకు అడ్డగోలుగా వేలాది కోట్ల రూపాయల ఋణ వితరణ!

వందల కోట్ల రూపాయలు ఋణాలను వ్యాపార, పారిశ్రామిక సంస్థలకు మంజూరు చేయడానికి బ్యాంకులలో అత్యున్నత స్థాయి అధికారులు, కమిటీలు నిర్ణయం తీసుకుంటూ ఉంటారు. ఆ సంస్థలు తిరిగి చెల్లించకపోయినా, తీసుకున్న ఋణాన్ని డైవర్షన్ చేసినా, బ్యాంకులో ఉన్నతాధికారుల పైనగానీ, కమిటీసభ్యులపైనగానీ ఎటువంటి చర్యలు ఉండవు. సన్నకారు, చిన్నరైతుల నుండి రావలసిన కొద్దివేల రూపాయల బకాయిలు, బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టి తీసుకున్న ఋణాలు చెల్లించకలేకపోయిన సందర్భాలలో బ్యాంకులు పత్రికలలో బహిరంగ ప్రకటనలు ఇచ్చి రైతుల ఆస్తులను వేలంవేసే ప్రక్రియను కూడా చేపట్టుతూ ఉంటాయి. అదే బడాబాబుల బకాయిల వివరాలను పార్లమెంటుకు కూడా తెలియపర్చకుండా రహస్యంగా ఉంచుతాయి. 2015 మార్చి నాటికి ముకేష్ అంబానీ రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ. 1,80,000 కోట్లు, అనిల్ అంబాని గ్రూపు రూ. 1,25,000 కోట్లు, వేదాంత గ్రూపు రూ. 1,03,000 కోట్లు, ఎస్.ఆర్. గ్రూపు రూ. 1,00,000 కోట్లు, అదాని గ్రూపు రూ. 96,031 కోట్లు, జె.పి. గ్రూపు రూ. 75,163 కోట్లు, జె.ఎస్.డబ్ల్యు. గ్రూపు రూ. 58,171 కోట్లు, జి.యం.ఆర్. గ్రూపు రూ. 47,976 కోట్లు, ల్యాంకో గ్రూపు రూ. 47,102 కోట్లు, వీడియోకాన్ గ్రూపు రూ. 45,405 కోట్లు, జి.వి.కె. గ్రూపు రూ. 33,933 కోట్లు బ్యాంకులకు చెల్లించవలసి ఉన్నది. ఆయా సంస్థల మార్కెట్ విలువలతో పోలిస్తే ఈ ఋణాలు 2 నుండి 4 రెట్లు దాకా ఉన్నాయి. నవంబరు

2016 నాటికి ప్రభుత్వరంగ బ్యాంకుల వద్ద స్థూల నిరర్ధక ఆస్తుల విలువ రూ. 6,00,000 కోట్లకు చేరింది. ఈ మొత్తం బ్యాంకులకు వసూలు కావటం దుర్లభం.

భారతదేశంలో ప్రభుత్వరంగ బ్యాంకులు 2012-13లో రూ. 27,231 కోట్లు, 2013-14లో రూ. 34,409 కోట్లు, 2014-15లో రూ. 49,018కోట్లు, 2015-16లో రూ. 57,585 కోట్లు, 2016-17లో రూ. 81,683కోట్లు, 2017-18 డిసెంబరు నాటికి రూ. 53,625 కోట్లు పెద్దపెద్ద పారిశ్రామిక వ్యాపారవేత్తల రుణబాకీలను మాఫీ చేశాయి. మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండేళ్ళలో దేశంలోని 10మంది పారిశ్రామికవేత్తలకు చెందిన రూ. 1,25,000 కోట్లు రుణాలు మాఫీ అయ్యాయి.

## రాష్ట్ర ప్రభుత్వం విత్తన చట్టాన్ని తీసుకురావాలి:

వ్యవసాయములో విత్తనానికి అత్యంత ప్రాధాన్యత వుంది. లోగడ 2001లో నేను వ్యవసాయ మంత్రిగా, అజయ్ కల్లాం వ్యవసాయ కమీషనర్‌గా ఉన్న సమయంలో "విత్తన కంపెనీలతో అవగాహన ఒప్పందం" రూపొందించబడి, నాణ్యమైన విత్తనములు అందించబడక రైతులు నష్టపోయిన సందర్భములలో, ఈ ఒప్పందమును అనుసరించి నష్టపరిహారము అందించటం జరిగింది. ఎక్స్.ఎల్. విత్తన కంపెనీ లోపభూయిష్ట ప్రత్తి విత్తనాలను సరఫరా చేసిన సందర్భములో, వరంగల్ మరియు కరీంనగర్ జిల్లాలలో ప్రత్తి రైతులకు ఎక్స్.ఎల్. కంపెనీ నుండి రూ. 2కోట్లు నష్టపరిహారమును ఇప్పించటము జరిగింది. అనంతరము వై.యస్. ప్రభుత్వము ఆ ఒప్పందం స్థానంలో విత్తన చట్టము తీసుకొని రావలయునని ప్రయత్నించింది. "విత్తన చట్టము 2004"ను కేంద్రమే తీసుకొని రాబోతున్నదని, కావున రాష్ట్ర విత్తన చట్టము ఆవశ్యకత లేదని చెప్పిన కేంద్ర వ్యవసాయ మంత్రి శరద్‌పవార్, 2014 వరకు కూడా పార్లమెంట్‌లో ఆ బిల్లును ఆమోదం పొందనియ్యలేదు. మల్టీ నేషనల్ సీడ్ కంపెనీల ప్రాబల్యం వలన దాదాపు 4 సం.లు కావస్తున్నా యిప్పటికి మోడీ ప్రభుత్వము కూడా, "2004 విత్తన బిల్లు"ను పార్లమెంట్‌లో చర్చించి ఆమోదించేందుకు చర్యలు తీసుకొనలేదు. పర్యవసానముగా నాసి రకము విత్తనముల వలన ప్రత్తి, మిర్చి మున్నగు పంటలు సాగుచేస్తూ వున్న రైతులు నష్టపోతూ వున్నారు. కావున విత్తన చట్టమును గురించి కేంద్రం పైన ఒత్తిడి తీసుకొని రావడము కాని లేక రైతాంగ ప్రయోజనాలను కాపాడేవిధంగా మన రాష్ట్ర ప్రభుత్వము నూతన విత్తన చట్టమును తీసుకొని రావలసిన ఆవశ్యకత ఎంతో వుంది.

★★★

## భూసంబంధ సమస్యల పరిష్కారం ఎప్పటికి పూర్తయ్యేను?

ఏనాటినుండో పూర్వీకుల నుండి సంక్రమించిన భూములకు, ప్రభుత్వమే పేదలకు ఇచ్చిన పట్టా భూములకు, అడంగల్‌లో సక్రమముగా నమోదు కాలేదని - సవరించవలెనని, లక్షలాదిమంది రైతులు “మీ భూమి–మీ గ్రామము” కార్యక్రమములో అర్జీలు దాఖలు చేసినా ఇప్పటికి ఇంకా మూడవ వంతు పైగా అర్జీలు పరిష్కారమునకు నోచుకోలేదు. పరిశ్రమల దారులకు, వ్యాపారవేత్తలకు 21 రోజులలో ఆన్‌లైన్‌లో వివిధ అనుమతులను మంజూరు చేస్తున్న ప్రభుత్వము, రైతాంగము పట్ల శ్రద్ధాసక్తులను చూపకపోవడము బాధాకరం. భూముల అమ్మకాలు కొనుగోళ్ళు జరిగే సందర్భములలో జరుగవలసిన మ్యుటేషన్ ప్రక్రియలో కూడా లోపాలు జరుగుతూ ఉన్నాయని పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు ఉన్నాయి. ఎన్నో దశాబ్దముల క్రిందట భూముల రీసర్వే జరిగినది. ఇప్పుడు మళ్ళీ రీసర్వే జరిపి వాస్తవంగా అనుభవములో ఉన్న రైతుల పేరుమీదుగా సబ్ డివిజన్ చేయవలసిన అవసరము వుంది. భూములకు సంబంధించి, రికార్డులను కంప్యూటరీకరించటముతోపాటు రెవిన్యూ కార్యాలయములలో రికార్డులను కూడా భద్రపరచవలసిన అవసరము వుంది. కేంద్రప్రభుత్వము అందించు నిధులతోపాటు రాష్ట్రప్రభుత్వం కూడా అవసరమైన నిధులను జోడించి, ఈ కార్యక్రమాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయవలసిన అవసరము ఎంతోవుంది.

### నానాటికి పెరిగిపోతూ వున్న భూసమస్యలు:

రాష్ట్రవ్యాప్తంగా భూవివాదాలు పెరిగిపోతున్నాయి. తహసిల్దారు కోర్టుల్లోనే 23,886 కేసులు పెండింగ్‌లో వున్నాయి. ఆర్.డి.ఒ. జాయింట్ కలెక్టర్ కోర్టుల్లో వున్న వాటితో కలిపితే పెండింగ్ కేసుల సంఖ్య 33 వేల పైనే వున్నాయి. జ్యుడీషియల్ కోర్టుల్లో లక్షల సంఖ్యలో దాఖలైన కేసులు వీటికి అదనం. తహసిల్దారు కార్యాలయం లోని అడంగల్ (భూ అనుభవ రికార్డు) ఐ.బి (భూ యాజమాన్య రికార్డు) రీ సర్వే రికార్డు (ఆర్.ఎస్.ఆర్) పేదలకు పంపిణీ చేసిన డి.కె.టి. పట్టాలకు సంబంధించి అసైన్‌మెంట్

రికార్డులే ఆధారాలుగా మిగిలాయి.  తహసిల్దారు కార్యాలయాల్లో రికార్డులు పోతే, కొన్ని రకాల భూములు ఎవరివో నిర్ధారించడానికి ఆధారాలు లేని పరిస్థితి నెలకొంటుంది. ఫలితంగా భూవివాదాలు పెరిగిపోతూ వున్నాయి. వంశపారంపర్యంగా సంక్రమించిన ఆస్తులు తమవేనని చెప్పడానికి చాలామంది వద్ద సరైన ఆధారాలు లేవు.  యాజమాన్య హక్కులు పొందినట్లు, రాతకోతలు లేకపోవడంతో రికార్డుల్లోకి ఎక్కడం లేదు. సహేతుకమైన కారణాలు చట్టబద్ధమైన అంశాలను చూపించకుండానే మ్యుటేషన్, పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులను పలువురు తహసిల్దార్లు భారీగా తిరస్కరిస్తున్నారు.  అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 26 లక్షల దరఖాస్తులు రాగా 9లక్షల దరఖాస్తులు తిరస్కరణకు గురైనాయి.

నిషేధిత భూముల జాబితా 22 ఎ లో ఉన్న  భూములను తొలగించమని సామాన్యులు కాళ్ళు అరిగేలా తిరుగుతున్నా పట్టించుకోని రెవిన్యూ యంత్రాంగం ప్రభుత్వ రంగ భూముల విషయంలో మాత్రం మినహాయింపులు యిస్తున్నారు. విజయవాడ నగరంలో పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌కు 27 ఎకరాల భూమిని, ఎ.పి.ఐ.ఐ.సి.కి చెందిన 30 ఎకరాల ఆటోనగర్ భూములను, మున్సిపల్ కార్పోరేషన్‌కు చెందిన, సి.ఆర్.డి.ఎ.కి చెందిన 50 ఎకరాల భూములను నిషేధిత భూముల జాబితా నుండి తొలగించారు.

రాష్ట్రంలో పట్టాదార్ పాస్ పుస్తకాలు లేక వెబ్ ల్యాండులో తమ పేర్లు నమోదుకాక, ఈ పట్టాదారు పాస్ పుస్తకాలు జారీచేయాలని లక్షలాదిమంది రైతులు, రెవిన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూ ఉన్నారు.  రాష్ట్రంలో 16 లక్షల తాత్కాలిక (నోషనల్) ఖాతాలున్న రైతులు, 2016 నుండి తమ భూములను అమ్ముకోవడానికి గాని, బ్యాంకు ఋణాలు పొందడానికి వీలుకాక యిబ్బంది పడుతూ ఉన్నారు.  2016 ఆగష్టున అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రిజిస్ట్రేషన్ శాఖ నోషనల్ ఖాతాల్లోని భూముల రిజిస్ట్రేషన్ చేయరాదని ఉత్తర్వులు యిచ్చింది. రెవిన్యూ శాఖలో ఎన్నో సంస్కరణలు తెచ్చామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి స్వంత జిల్లా చిత్తూరులోనే 2.4 లక్షల నోషనల్ ఖాతాలు ఉన్నాయి.

గత కొన్నేళ్ళుగా ప్రభుత్వ ప్రయోజనాలకు భిన్నంగా సర్వే కోర్టు నుంచి తీర్పులు వెలువడుతున్నట్లు ఆరోపణలున్నాయి. గతేడాది విశాఖపట్నం సమీపంలో పరదేశీపాలెం గ్రామంలో రూ.100 కోట్ల విలువైన భూమిని ప్రైవేటు వ్యక్తికి దఖలుపరిచారు. ఇటువంటివి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో సందర్భాలున్నాయి. నెల్లూరు జిల్లా, భోగారావులపాడు గ్రామ పరిధిలో 580 ఎకరాల బంజరు భూమి విషయంలో సర్వే సెటిల్‌మెంట్

కమీషనర్ ఇచ్చిన తీర్పు పైన ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. అందువల్ల భూవివాదాలకు సంబంధించి సర్వే సెటిల్‌మెంట్ కమీషనర్ స్థాయిలో తీసుకున్న నిర్ణయాలను సమీక్షించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. భూ పరిపాలన చీఫ్ కమీషనర్ కార్యాలయంలో కీలక పోష్టులను భర్తీ చేయకపోవటం వలన పెండింగ్‌లో ఉన్న అనేక ఫైళ్ళు క్లియర్ కావటం లేదు.

## రాష్ట్ర ప్రభుత్వ లోపభూయిష్ఠ ప్రతిపాదనలు:

రాష్ట్ర ప్రభుత్వం రెవిన్యూ రికార్డులను కంప్యూటర్లలో నిక్షిప్తం చేసి వాటిలో మార్పులు, చేర్పులు చేయడానికి వీలుకల్పించే కంప్యూట్ ప్రోగ్రాంకు రికార్డుల సమాచారాన్ని జతచేసింది. ఈ రికార్డును రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు, బ్యాంకులకు అనుసంధానం చేసింది. ఇంటర్‌నెట్ సౌలభ్యం ఉంటే ఈ రికార్డును ఎవరైనా, ఎక్కడ నుండైనా చూడవచ్చు, ప్రింటు తీసుకోవచ్చు. ఈ రికార్డులో మార్పులు చేయాలంటే ఆ భూమి ఏ మండల పరిధిలో ఉందో ఆ మండల తహసిల్దారు మాత్రమే చేయగలడు. ప్రతి తహసిల్దారుకూ ఒక డిజిటల్ తాళం చెవి (కీ) యిచ్చారు. దాన్ని ఉపయోగించి తహశిల్దారు ఎలక్ట్రానిక్ భూమి రికార్డుల్లో మార్పులు చేయగలరు.

"meebhoomi,ap.gov.in" వెబ్‌సైట్ లోకి వెళ్ళడం ద్వారా ఆంధ్రప్రదేశ్ లోని 13 జిల్లాలకు సంబంధించిన ఏ రెవిన్యూ గ్రామ భూమి రికార్డునైనా ఎక్కడ నుండైనా భూమి రికార్డులను ఆన్‌లైన్‌లో ఉంచడం ద్వారా "పారదర్శకత"కు పెద్దపీట వేశామని ప్రభుత్వం చెప్తూవుంది.

271 జి.ఓ. ప్రకారం జూలై 1 నుండి ఈ విధానం అమలు కాబడుతూ వుంది. వెబ్‌ల్యాండ్ మరియు మీ భూమి పోర్టల్‌లో నమోదైన భూమి రికార్డుల వివరాలు చాలావరకు తప్పులే, పూర్తి వివరాలు నమోదు కాలేదు. చాలావాటిల్లో తండ్రి లేక భర్త పేర్లు లేవు. శిస్తు వివరాలు కూడా సరిగాలేవు. ఒకరికి చెందిన భూమి మరొకరి పేరున నమోదై ఉన్నాయి. పట్టా భూమి, ప్రభుత్వ, దేవాదాయ శాఖ భూములు, పంట, మురుగు కాలువలను పుంతలుగా చూపారు. ప్రభుత్వం వారే నిర్వహించిన పైలెట్ సర్వేలో కూడా 30%కి మించి తప్పులు వున్నాయని తేల్చారు. ఇప్పటికే 1 బిలో మార్పులు కోసం భూమిపై హక్కులకోసం, మ్యుటేషన్ కొరకు అర్జీలు ఇచ్చి సంవత్సరాలు గడిచినా మార్పులు చేయటం లేదు. అధికారులు వేలాది రూపాయలు డిమాండ్ చేస్తున్నారు. రైతులను మానసిక సంక్షోభానికి గురిచేస్తున్నారు. ఎన్.టి. రామారావు గారు 1971 ఆర్.ఓ.ఆర్. యాక్టును సవరణ చేసి భూమిపై భరోసా కల్పించుటకు రైతులకు పట్టాదార్ పాస్‌బుక్, టైటిల్ డీడ్‌లు ఇచ్చారు. కొంతమంది

దొంగ పాస్ పుస్తకాలు సృష్టించి బ్యాంకులలో ఋణాలు పొందారనే నెపంతో చిన్న సన్నకారు మరియు చదువులేని రైతులను ఆన్‌లైన్‌లో మీయొక్క భూముల వివరాలను నమోదు చేసుకోమని చెప్పి మళ్ళీ అధికారుల చేతులలో పెట్టారు. ముందుగా భూమి రికార్డులను సరిచేసి, నిజమైన రైతులకు అన్యాయం జరగకుండా చూడాలి. టైటిల్‌డీడ్ ఆధారంగా వివరాలు సేకరించి, 1 బి అడంగల్‌లో మార్పులు చేయాలి. తహసిల్దార్ వద్ద వున్న మ్యుటేషన్ అర్జీల పరిష్కారం కొరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి. పాస్‌బుక్ మరియు టైటిల్ డీడ్‌లకు ఆర్.ఓ.ఆర్. చట్టప్రకారం చట్టబద్ధత కల్పించాలి. రిజిస్ట్రేషన్ సమయమందు పాస్‌బుక్, టైటిల్ డీడ్‌లను సమర్పించాలి.

## కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు:

మన రాష్ట్రములో ప్రాథమిక భూముల రికార్డులు తయారై, పలు దశాబ్దములు గడిచిపోయిన నేపథ్యములో, కీ రికార్డులలో సమాచారమునకు భూముల మీద వాస్తవ హక్కులు, అనుభవానికి మధ్య తేడా పెరిగిపోయిందని, ప్రభుత్వాల అలక్ష్యము వలన భూమి రికార్డుల నిర్వహణ, యాజమాన్యం దెబ్బతిన్నందున, వాస్తవ పరిస్థితికి అద్దంపట్టే విధముగా ఆధునీకరించాలి అని ఆ కమిటీ సూచనలు చేసింది. వాటిని రాష్ట్ర ప్రభుత్వము ఆమోదించింది కూడా. కాని భూమి రికార్డులలో లోపాలను సరిచేయకుండా వీటిలో వున్న సమాచారాన్ని తప్పుల తడకగా కంప్యూటర్ల లోనికి ఎక్కించడమేగాక వాటిని ఎలాపడితే అలా మార్చివేసే వెసులుబాటును, ప్రభుత్వము కల్పించింది. వెబ్‌ల్యాండ్‌లో వున్న సమాచారానికి చట్టబద్ధత, సాధికారికత కల్పించే ముందు వాటిని వాస్తవ భూమి రికార్డులతో సరిపోల్చి సరిచేసిన తరువాతే, వాటికి చట్టబద్దత, సాధికారికత కల్పింపచేయాలి. భూముల సమగ్ర రీ.సర్వే, సెటిల్‌మెంట్ నిర్వహించి వాస్తవ పరిస్థితులకు అనుగుణముగా భూమి రికార్డులను రూపొందించి, పంచాయతీ స్థాయిలో భూమి రికార్డుల నకళ్ళను ఉంచి, రైతులు వాటిని చూసుకొనే అవకాశము కల్పించాలి.

## రియల్‌టైమ్ గవర్‌నెన్స్ ఎక్కడ?

పాస్ పుస్తకాలు, మ్యుటేషన్‌లు, "పేరు మార్పులు" కొరకు దాదాపు 11.5 లక్షల అర్జీలు యిప్పటికి మీ భూమి సదస్సులలో సమర్పించబడ్డాయి. కేవలము 6లక్షల అర్జీలు మాత్రమే పరిష్కారము అయ్యాయి. ప్రభుత్వానికి పలు రైతుసంఘాలు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికి ఇప్పటికి ఇంకా ఇవ్వవలసిన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ, మ్యుటేషన్, పేరు మార్పులు అడంగల్‌లో సరైన వివరాల నమోదు కార్యక్రమము నత్తనడకగా కొనసాగుతూ వున్నది. అత్యంత ఆధునిక ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ ఉపయోగించుతున్నామని, రియల్ టైమ్ గవర్నెన్స్‌తో పాలన సాగిస్తూ ఉన్నామని పదేపదే

చెప్తూఉండే ప్రభుత్వము లక్షలాదిమంది రైతులకు సంబంధించిన ఈ సమస్యను పరిష్కరింప చేయలేకపోవడము రైతాంగము పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధాసక్తులను అర్థం చేసుకొనవచ్చును.

## విశాఖనగర పరిసరాలలో అదుపులేని భూకబ్జాలు:

నవ్యాంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికంగా, ఆర్థికంగా ముందున్న విశాఖపట్నం నగరం పరిసరాలలో భూముల రేట్లు హెచ్చుస్థాయిలో ఉంటూవున్నాయి. పలు పర్యాయములు పలు దినపత్రికలలో ఈ ప్రాంతంలో కొనసాగుతున్న అక్రమ భూలావాదేవీల గురించి ప్రముఖంగా వార్తలు వస్తూవున్నా ప్రభుత్వపక్షంగా సరైన చర్యలు లేనందువలన అదుపులేకుండా ఈ అక్రమ వ్యవహారాలు కొనసాగుతూ ఉన్నాయి. దాదాపు లక్ష ఎకరాలకు సంబంధించి ఎఫ్.యం.బి.లు మాయం అయ్యాయని, వెబ్ ల్యాండ్‌లోని రికార్డులను కొన్నిటిని మాయం చేయటం, కొన్నిటిని తహసిల్దార్లు అక్రమంగా దిద్దటం జరిగిందని జిల్లా కలెక్టరే స్వయంగా అంగీకరించటం జరిగింది. విశాఖ జిల్లా వ్యాప్తంగా "సెటిల్‌మెంట్ ఫెయిర్ అడంగల్‌లు (ఎస్.ఎఫ్.ఎలు) 2,95,044 ఎస్.ఎఫ్.ఎ. కాపీలు గల్లంతయ్యాయని అధికారికంగా తేల్చారు. విశాఖ గ్రామీణ మండలం పరిధిలో మధురవాడ, కొమ్మాది గ్రామాలలోనే దాదాపు రూ.2,000కోట్ల విలువచేసే ప్రభుత్వ, ప్రైవేట్ భూములకు సంబంధించిన దస్త్రాలు ట్యాంపరింగ్ అయ్యాయని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అంగీకరించారు. ఫలితంగా వేలకోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కుల పాలౌతూవుండగా, భూ యజమానులు లిటిగేషన్‌లతో కోర్టుల చుట్టూ తిరగవలసిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడింది. సి.యం. కమాండ్ కంట్రోల్, మరియు డాష్ బోర్డుల ద్వారా "రియల్ టైమ్ గవర్నెన్స్" యిస్తున్నామని పదేపదే చెబుతూవుండే ముఖ్యమంత్రిగారు యింత అడ్డగోలుగా విశాఖపట్నంలోనూ కొన్ని యితరచోట్ల కొనసాగుతూవున్న యిటువంటి అవినీతితో ముడిపడివున్న అక్రమ భూ కబ్జాలను/భాగోతాలను అరికట్టడంలో ఎందుకు వైఫల్యం చెందుతున్నారు?

## తగినంతమంది సర్వే సిబ్బంది ఉండవద్దా?

సర్వే శాఖ తీవ్రస్థాయిలో సర్వేయర్ల కొరతను ఎదుర్కొంటోంది. ఫలితంగా లక్షలాదిమంది ప్రజల దరఖాస్తులు పెండింగ్‌లో వుండిపోతున్నాయి. వెలుగు ప్రాజెక్టు క్రింద గ్రామీణ నిరుపేదల కోసం భూములు కొనుగోలు, అభివృద్ధిపరచే కార్యక్రమం కోసం 268 మంది కమ్యూనిటీ సర్వేయర్లను ప్రభుత్వం నియమించి వారికి శిక్షణ యిప్పించింది. రెవిన్యూ తరహాలోనే వారు చక్కగా దశాబ్దకాలంపాటు విధులు నిర్వహించారు. ఇటీవల కాలంలో ఎస్.ఇ.ఆర్.పి.లో భూమి కొనుగోలు విభాగాన్ని

ఎత్తివేయడం వల్ల వారికి పనిలేకుండా పోయింది. తమను రెవిన్యూ శాఖ పరిధిలోని సర్వే విభాగంలో విలీనం చేయాలని 2015లో డిప్యూటి సి.యం. కె.ఇ. కృష్ణమూర్తిని కలిసి విజ్ఞప్తి చేశారు. రెవిన్యూలో ప్రస్తుతం ప్రతి మండలానికి ఒక సర్వేయర్, ఒక డిప్యూటీ సర్వేయర్ మాత్రమే పనిచేస్తున్నారు. సగటున రాష్ట్రంలో 5వేల మంది సర్వేయర్లు పనిచేయాల్సి వుంది. అయితే సిబ్బంది పదవీవిరమణ, కొత్త నియామకాలు లేకపోవడంతో ఆ సంఖ్య 978కే పరిమితమయ్యింది. ప్రభుత్వ స్థాయిలో నిర్ణయాలు జరిగినా డిప్యుటేషన్ ప్రతిపాదన 'వెలుగు' విభాగం నుంచి ముందుకు కదలడం లేదు. ఉన్న కొద్దిమందిని అవసరం లేని పథకాలకు భూముల సర్వేకు వినియోగిస్తూ వుండటంతో రైతులు యిబ్బందుల పాలవుతున్నారు.

## భూసేకరణ - భూసమీకరణ - రైతులే సమిధలు

లోగడ బ్రిటీష్ కాలంలో చేయబడ్డ 1894 భూసేకరణ చట్టం ప్రకారం రైలుమార్గాలు, జాతీయ రహదారులు, యిరిగేషన్ ప్రాజెక్టులు, పరిశ్రమలు, గృహనిర్మాణం, మున్నగు అభివృద్ధి కార్యక్రమాల కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల నుండి భూములను సేకరిస్తూ వచ్చాయి. చాలా సందర్భాలలో ప్రాజెక్టులు పూర్తిఅయినా, భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందటంలో విపరీతమైన కాలయాపన జరుగుతూ వుండేది. న్యూఢిల్లీ నగరంలో రాష్ట్రపతి భవనం, ఇండియా గేట్, సుప్రీం కోర్టు, ఢిల్లీ హైకోర్టు, పార్లమెంటు భవనము, మున్నగునవి ఉన్న "రైసీనా హిల్స్" భూమిని 1912లో బ్రిటీష్ ప్రభుత్వ కాలంలో సేకరించగా యిప్పటికీ కూడా అప్పటి భూ యజమానుల వారసులకు సరైన నష్టపరిహారం అందనందున కోర్టులలో యిప్పటికీ వ్యాజ్యములు కొనసాగుతూ ఉన్నాయి. అలాగే శ్రీశైలం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారికి యిప్పటికీ యింకా నష్టపరిహారం అందని పరిస్థితి వుంది. వాస్తవ మార్కెట్ ధరకన్నా నష్టపరిహారంగా లభించు మొత్తం చాలా తక్కువగా వుండేది. "ప్రజోపయోగం కొరకు" అని జిల్లా కలెక్టరు భూసేకరణ నోటిఫికేషన్ యిస్తే రైతు తప్పనిసరిగా ప్రభుత్వానికి భూమి అప్పజెప్పవలసి వుండేది. మొదట్లో బహుళ ప్రజానీకానికి మేలు చేకూర్చే ప్రాజెక్టులు/పథకాల కొరకు భూములు తీసుకోబడుతూ వుండగా గత రెండు దశాబ్దములుగా ప్రైవేట్ పారిశ్రామిక సంస్థల కొరకు, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్షిప్ ప్రాజెక్టుల కొరకు అవసరమునకు మించి భూసేకరణ చాలా సందర్భాలలో కొనసాగుతూ వుంది.

## 2013 భూసేకరణ చట్టానికి తూట్లు పొడిచి రైతులకు ద్రోహం చేయుట తగునా?

దేశవ్యాప్తంగా కోట్లాది ఎకరాల భూమి సేకరించబడగా దాదాపు 5 కోట్లమంది

ప్రజలు నిర్వాసితులయ్యారు. వారిలో 40 శాతంమంది గిరిజనులే. కేవలం 35 శాతంమంది నిర్వాసితులకు మాత్రమే పునరావాసం చేకూరింది. మనదేశం నుండి విదేశాలకు యితోధికంగా మన ఉత్పత్తులను ఎగుమతి చేసి, విదేశీమారక ద్రవ్యాన్ని సమకూర్చుకోవాలనే లక్ష్యంతో అమలులోకి తీసుకురాబడ్డ "ప్రత్యేక ఆర్థిక మండళ్ళ చట్టం 2006" క్రింద లక్షలాది ఎకరాల భూమి రైతుల నుండి తీసుకోబడింది. ఇప్పటికి కూడా దాదాపు 50% విస్తీర్ణం ఖాళీగానే వుంది.

దేశవ్యాప్తంగా పలు రైతుసంఘాలు, రాజకీయ పక్షాల ప్రయత్నాల వలన "పారదర్శకతతో కూడిన భూసేకరణ, న్యాయమైన నష్టపరిహారం, పునరావాస పునః స్థాపిత చట్టం 2013' అమలులోకి వచ్చింది. ఈనాడు కేంద్రంలో అధికారంలో వున్న భారతీయ జనతాపార్టీ, కాంగ్రెస్ పార్టీలతో సహా దాదాపు అన్ని రాజకీయ పక్షాలు ఈ చట్టానికి మద్దతును యిచ్చాయి. సామాజిక ప్రభావ అంచనా మినహాయించడం ఎంత మాత్రము తగదు. 2014 సాధారణ ఎన్నికలు అయిన వెంటనే ప్రధానమంత్రి మోడీ ఈ చట్టంలోని నిబంధనలు పారిశ్రామిక ప్రగతికి, అభివృద్ధికి అవరోధంగా వున్నాయని ప్రకటించి ఆ చట్టంలోని పలు కీలక అంశాలను నీరుగార్చే విధంగా మూడు పర్యాయములు ఆర్డినెన్స్‌లను తెచ్చినా రాజ్యసభలో మెజారిటీ లేనందున ఉపసంహరించు కోవాల్సి వచ్చింది. పార్లమెంట్‌లో ఆమోదించబడిన 2013 భూసేకరణ చట్టంలో పేర్కొనబడిన నష్టపరిహారమునకన్నా రైతులకు మెరుగైన నష్టపరిహారం, నిర్వాసితులకు మెరుగైన పునరావసం - సహాయం అందించాలనుకుంటే ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలు సవరణలు చేసుకోవచ్చనే అవకాశాన్ని కల్పించింది. ఈ అవకాశాన్ని దుర్వినియోగపరుస్తూ గ్రామసభ ఆమోదం, నూటికి 70 నుండి 80శాతం మంది రైతుల ఆమోదం, సామాజిక ప్రభావ అంచనా, బహుళ పంటలు పండే వ్యవసాయ భూములను ఆహారభద్రత కారణాన తీసుకోరాదనే వంటి ముఖ్య అంశములను పరిగణనలోనికి తీసుకొనకుండా సత్వర అభివృద్ధి సాధన అన్న పేరుతో కొన్ని ప్రాజెక్టులకు మినహాయింపును యిచ్చి భూసేకరణను చేపట్టాలని తెలుగు రాష్ట్రాలు అడుగులు వేస్తున్నాయి. అందులో భాగంగానే యిటీవల ఆంధ్రప్రదేశ్ విధానసభలో భూసేకరణ చట్టం సవరణ బిల్లు ఆమోదించబడింది. లక్షలాది రైతాంగానికి జీవన్మరణ సమస్య అయిన యిటువంటి కీలక బిల్లు శాసనసభలో ఎట్టి చర్చ లేకుండానే ఆమోదించబడటం రైతాంగం యొక్క దురదృష్టం. ప్రధాన ప్రతిపక్షపార్టీ ఈ అంశంపైన చర్చకు పట్టుపట్టకుండా తక్కువ ప్రాముఖ్యత ఉన్న వేరే అంశం పైన రాద్ధాంతం చేస్తూ పరోక్షంగా బిల్లు పాస్ అయ్యేందుకు అవకాశం కల్పించటం రైతుల దౌర్భాగ్యం.

## పేద రైతుల భూములను బడాబాబులకు ధారాదత్తం చేయడంలో ఆంతర్యం ఏమిటి?

లోగడ 2006 నుండి 2011 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజోపయోగం పేరిట 88,000 ఎకరముల భూములు సేకరించబడ్డాయని కాగ్ నివేదిక తెలియపర్చింది. ఇప్పుడు చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వ హయంలో యిప్పటికే లక్ష ఎకరములపైన భూసేకరణ–భూసమీకరణ ప్రక్రియ కొనసాగుతూ వుంది. జిల్లాకు లక్ష ఎకరముల చొప్పున "భూబ్యాంక్"లను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రిగారు ముంబాయిలో ప్రముఖ పారిశ్రామికవేత్తల సదస్సులో ప్రకటించారు.

అభివృద్ధికి భూమి అత్యవసరం అన్న వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు. కాని ఆయా ప్రాజెక్టులకు వాస్తవంగా అవసరమైన భూమి ఎంత? సమీపంలో ప్రభుత్వ భూమి/ పడావుగా వున్న భూములు ఉన్నాయా, లేదా రెండు లేక మూడు పంటలు భూములను తీసుకోకుండా ఖాళీ భూములు లభించుతాయా అనే కోణంలో పరిశీలించి అందుకు అనుగుణమైన విధంగా భూమిని సేకరించాలితప్ప పారిశ్రామిక–వ్యాపార సంస్థ కోరినచోట, కోరినంత విస్తీర్ణం యివ్వాలనుకోవటం ఎంతమాత్రమూ సమర్ధనీయం కాదు. ఏనాటినుండో మోడు, మొద్దు తొలగించి కష్టపడి పేదలు సాగుచేసుకొంటూవున్న ఎసైన్డ్ భూములను, బలహీన వర్గాలకు చెందిన సన్నకారు, చిన్నరైతుల భూములతో సహా వేలాదిమంది నుండి వేలకువేలు ఎకరాలు గుంజుకొని బడాబాబులకు కట్టబెట్టడం వెనుక ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతూవున్న కొన్ని ప్రాజెక్టులను లోతుగా పరిశీలించినపుడు సమీపకాలంలో అవసరం లేనటువంటి, రాష్ట్ర ప్రభుత్వం పైన, ప్రజలపైన పెనుభారం మోపేటటువంటి, ప్రస్తుత క్లిష్ట ఆర్థిక పరిస్థితులలో చేపట్ట కూడనటువంటి ప్రాజెక్టుల కొరకు ముఖ్యమంత్రిగారు అత్యుత్సాహం చూపటం బాధాకరం.

## ప్రభుత్వ పెద్దల సహకారంతోనే భూకబ్జాలు:

విజయనగరం జిల్లా, కొత్తవలస మండల కేంద్రాన్ని ఆనుకొని బాలఘట్టమ్, రాళ్ళగుట్ట పోరంబోకు సర్వే నెంబరు 141లో 156 ఎకరముల చెర్వు భూమిని రియల్ ఎస్టేట్ వెంచర్ వేసేందుకు రియల్టర్ ప్రయత్నించగా జిల్లా కలెక్టర్ అడ్డుపెట్టినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో చక్రము తిప్పి, రియల్టర్ అనుమతిని సాధించారు. యిలాంటి ఉదంతాలు మరెన్నో ఉన్నాయి. క్రిందిస్థాయి ఉద్యోగులతో ప్రజలు తమ దైనందిక అవసరాలు, సమస్యల పరిష్కార ప్రక్రియలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే వీలున్నప్పటికీ అవినీతి కొనసాగుతూనే వుంది. కొన్నిచోట్ల రాజకీయ నాయకుల అండదండలతో పెద్దఎత్తున భూకుంభకోణాలు, ప్రభుత్వ

భూములు ఆక్రమణ జరుగుతూ వున్నప్పుడు జిల్లా కలెక్టరు అడ్డుపెట్టినా, ప్రభుత్వ స్థాయిలో అందుకు భిన్నముగా ఉత్తర్వులు రావడము అసమర్ధ పాలనకు నిలువెత్తు నిదర్శనము.  ఇటువంటి వ్యవహారాలు రాష్ట్రంలో పలు ప్రాంతాలలో కొనసాగుతూ ఉన్నాయి.

విశాఖ నగరం నడిబొడ్డులో ఉన్న "దసపల్లా హిల్స్ భూములు" అత్యంత విలువైనవి. ఈ భూములు ప్రభుత్వానివేనని ప్రభుత్వం జి.ఓ. నెం.657, తేది 10-10-2001న ఉత్తర్వులను జారీచేసింది. ఇటీవల ఆ 62 ఎకరముల భూములు అన్యాక్రాంతమవుతున్న పరిస్థితులలో విశాఖ జిల్లా కలెక్టర్ 23-12-2015న ఎక్స్ట్రార్డినరి  గజిట్‌లో ఆర్.సి. నెం.3795/2008/ఇ1 తో నోటిఫికేషన్ యిచ్చారు. అయినప్పటికీ పలుకుబడి కలిగిన రాజకీయ నాయకుల వత్తాసుతో బడాబాబులు ఈ భూములను స్వంతం చేసుకునే ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి.

★★★

# ఎన్నికల వాగ్దానాలు అమలు చెయ్యనవసరం లేదా?

2014 ఎన్నికల ప్రణాళిక ద్వారా తెలుగుదేశం పార్టీ నారా చంద్రబాబు నాయుడు గారు ప్రకటించిన హామీలు ప్రజలలో భవిష్యత్ పట్ల ఎన్నో ఆశలను కల్పించటము జరిగింది. ప్రభుత్వము ఏర్పడి దగ్గరదగ్గరగా నాలుగు సంవత్సరములు కావస్తూ ఉన్నాయి. అనేక హామీలు కాగితాలకే పరిమితము అయ్యాయి తప్ప ఆచరణకు నోచుకోవటం లేదు.

## 1. ఇంటికో ఉద్యోగం – నిరుద్యోగ భృతి:

ఇటీవల బడ్జెట్‌లో నిరుద్యోగ పట్టభద్రులకు కొన్ని షరతులతో కొంతమేరకు నిరుద్యోగభృతి యిచ్చేందుకు రూ. 500/–లు కోట్లు కేటాయించినా యిప్పటికీ విధివిధానాలు రూపొందించబడలేదు. ప్రతి ఇంటికి ఒక ఉద్యోగము వస్తుంది అని, "జాబ్ రావాలి అంటే బాబు రావాలి" అన్న నినాదము కాగితాలకే పరిమితము అయినది.

3 ఏళ్ళల్లో రాష్ట్రానికి 780 పరిశ్రమలు వచ్చాయని, ఇందులో రూ. 5,83,384 కోట్ల పెట్టుబడులు పెడతారని, తద్వారా 1,28,565 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి ఎన్. అమర్‌నాథ్‌రెడ్డి యిటీవల శాసనసభలో తెలిపారు.

ప్రతి నియోజకవర్గానికి యం.ఎన్.యం.ఇ. పార్క్ మంజూరు చేయబోతున్నామని, ఇప్పటి 96 చోట్ల యివి ఏర్పాటయ్యాయని, ఇందుకోసం రూ. 586 కోట్లు గత 3 ఎండ్లలో, విడుదల చేశామని తెలిపారు. కొరియా దేశానికి చెందిన 'కియో' సంస్థ రూ. 13,500 కోట్లు పెట్టుబడి పెడుతుందని, దీనిద్వారా 13,000 మందికి ఉపాధి దొరుకుతుందని చెప్పారు.

కోట్లాది ప్రజలకు మెరుగైన సేవలందించుటకు రెవెన్యూలో, సర్వే శాఖలో, వైద్య–ఆరోగ్య శాఖలో, వ్యవసాయ–పశుసంవర్ధక శాఖలో, ఉన్నత విద్య శాఖల్లో ఖాళీగా

ఉన్న వేలాది పోస్టులను భర్తీ చేస్తే ఆర్థిక భారం పెరుగుతుందని భావిస్తున్న ప్రభుత్వం అత్యంత భారీ స్థాయిలో రెండు దశాబ్దముల తరువాత కాని అవసరం కానటువంటి ప్రాజెక్టులపైన ఇప్పుడే వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయటం ఎలా సబబు? చాలా అధిక పారితోషికం ఇస్తూ కోట్లకు కోట్ల రూపాయలను కన్సల్టెంట్లపైన ప్రభుత్వం ఖర్చు చేస్తుండటం తగదు.

## నెలకు రూ. 1,000 వృద్ధాప్య పింఛన్ పెంపు :

1. చంద్రబాబు గారి ప్రభుత్వ అధికారంలోకి రాగానే, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నెలకు రూ. 200 గా నున్న వృద్ధాప్య పింఛన్‌ను రూ. 1,000 గా పెంచడం, వికలాంగుల పింఛను రూ. 1,500కు పెంచడం వలన లక్షలాది మంది పేదలకు మేలు చేకూరింది.
2. వ్యవసాయ రుణాలన్నిటిని మాఫీ చేసెదమని హామీ ఇచ్చినా రూ. 1.50 లక్షల మేరకు మాత్రమే రుణ మాఫీ చెయ్యడానికి నిర్ణయం తీసుకుని అమలు చేస్తోంది. రూ. 24,000 కోట్లు మేరకు రుణమాఫీ జరగాల్సి ఉన్నా ఇంకను నాలుగవ విడత, అయిదవ విడత, మొత్తాలను విడుదల చేయాల్సి ఉంది.
3. డ్వాక్రా మహిళా సంఘాల ఖాతాలో కొంత ధనాన్ని ప్రభుత్వం పెట్టుబడిగా జమ చేసిందేకానీ రుణమాఫీ అంటూ జరగలేదు.

## పేదల పాట్లను పట్టించుకోవాలి:

రాష్ట్రంలో వివిధ కేటగిరీలలో 40.84 లక్షల మందికి పైగా పేదలకు ప్రతినెల దాదాపు రూ.500 కోట్లు విలువైన రేషన్‌లను పంపిణీ చేస్తున్నారు. లబ్ధిదారుల వేలిముద్రల సేకరణల కోసం రాష్ట్రవ్యాప్తంగా 16,000పైగా బయోమెట్రిక్ పరికరాలు అందుబాటులో వున్నాయి. పేదవారు పలు దశాబ్దాలపాటు శారీరకంగా కాయకష్టం చేసి వుండటం వల్ల చేతివేలి ముద్రలు చాలామందిలో అరిగిపోయి వుంటాయి. వేలిముద్రలు సరిగా పడకపోవడంతో పంపిణీలో జాప్యం జరుగుతూంది. యం.ఆర్.ఓ. ఆఫీసులు, రేషన్ దుకాణాల వద్దకు పలు పర్యాయాలు తిరుగుతూ యిబ్బందులకు గురవుతున్నారు. అటువంటి సందర్భాలలో ఆథరైజేషన్ విధానంలో కొంత అవినీతికి ఆస్కారం కలుగుతూ వుంది. ఇటువంటి కేసుల విషయంలో 'ఐరిస్' విధానం చేపట్టితే వేలాదిమంది పేదలకు యీ ఇబ్బందిని తొలగించే వీలుంటుంది. కానీ ప్రభుత్వం ఈ అంశంపైన దృష్టిని కేంద్రీకరించడం జరగలేదు.

## 2. రూ.5,000 కోట్లతో "మార్కెట్ స్థిరీకరణ నిధి" ఏర్పాటు:

రూ.5,000 కోట్లతో "మార్కెట్ స్థిరీకరణ నిధి" ఏర్పాటు చేసి రైతులు పండించిన ఉత్పత్తులకు సరియైన ధరలు లభింపచేసి రైతులను ఆదుకొంటామన్న హామీ విస్మరించబడింది. టమాటా, ఉల్లి, మిర్చి మున్నగు పంటలు పండించిన రైతులు కోత, రవాణా ఖర్చులు గిట్టని పరిస్థితులలో పశువులకు మేతగా వదలవలసిన వచ్చిన దుస్థితి బాధాకరం. దాదాపు 90 రైతుబజార్లు ఉన్నందున, టమాటా, ఉల్లి, మున్నగు ఉద్యాన ఉత్పత్తులను పండించే ప్రాంతాలలో రైతులకు గిట్టుబాటు ధరలను ఇచ్చి, రవాణా చేసి రైతు బజారుల ద్వారా వినియోగదారులకు సరసమైన ధరలకు అందించవచ్చు. అయినప్పటికీ ఆ దిశగా ప్రభుత్వము ఆలోచన చేయకపోవటము వలన రైతులు తీవ్రముగా నష్టపోయారు. రైతుబజార్లలో చిన్న గదిని నిర్మించి రైల్వే స్టేషన్లలో క్లాక్ రూమ్‌ల తరహాలో సొరుగులను, ఎ.సి. మిషన్‌ను ఏర్పాటు చేస్తే కూరగాయలు పాడవకుండా కాపాడేదానికి వీలుంటుంది.

ధాన్యం, అపరాలు, మిర్చి, పత్తి, సుబాబుల్ మున్నగు అనేక పంటలను విధిలేక కనీస మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవలసి రావటం వలన రైతాంగం వేలాదికోట్ల రూపాయల నష్టాలపాలయ్యింది. ఫ్యూచర్ రిటైల్ మరియు రిలయన్స్ రిటైల్ సంస్థల చేత కనీస మద్దతు ధరలకు మినుములు, కందులు, శనగలు, మిర్చి, మున్నగు పంటలను కొనిపించి చౌక దుకాణాల ద్వారా ప్రజలకు అమ్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం వున్నా ఉపయోగించడం లేదు.

## 3. రూ.2/-లకు 20 లీటర్ల స్వచ్ఛమైన నీటిని ప్రజలందరకి అందచేయటం:

దాతలు ముందుకు వచ్చినచోట్ల, కొద్ది గ్రామ పంచాయతీలు ముందుకు వచ్చినచోట్ల తప్ప, ప్రభుత్వమే చొరవ తీసుకొని, అన్ని గ్రామాలలో నీటి శుద్ధి యంత్ర వ్యవస్థను అమలు చేసేదానికి చర్యలు తీసుకోవటము లేదు. ఫలితముగా ఇప్పటికి వందలాది గ్రామాలలో ప్రజలు స్వచ్ఛమైన త్రాగునీరు లభించక అనారోగ్యము పాలవుతున్నారు. శ్రీకాకుళం జిల్లా ఉద్దానము ప్రాంతములో, ప్రకాశం జిల్లా, కనిగిరి, మార్కాపురం, దర్శి, పొదిలి, మున్నగు ప్రాంతాలేకాక, రాయలసీమలో అనేక మండలాలలో లక్షలాదిమంది ప్రజలు త్రాగునీటి కొరకు ఎన్నో దురవస్థల పాలవుతున్నారు. కోస్తా తీరప్రాంత గ్రామాలలో రొయ్యల చెరువులు, చేపల చెరువులు పెద్ద ఎత్తున ఏర్పాటై మత్స్య ఉత్పత్తుల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. వేలకోట్ల రూపాయల మత్స్య ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతులు అవుతూ ఉన్నాయి. కానీ అదే సమయంలో భూగర్భజలాలు కలుషితమౌతున్నాయి. ఫలితంగా ఆ గ్రామాలలో నివసించే ప్రజల

ఆరోగ్యం పైన తీవ్రమైన దుష్పరిణామం సంభవించే అవకాశాలు స్పష్టంగా కనిపించుతూ ఉన్నాయి. ముఖ్యంగా పేద ప్రజలు దారుణంగా అనారోగ్యాలపాలౌతూ ఉన్నారు. కావున తప్పనిసరిగా మంచినీటిని ఆ గ్రామాలకు అందచేసే బాధ్యతను ప్రభుత్వం చేపట్టాలి.

## డీశాలినేషన్ ప్లాంట్లను ఏర్పాటు చెయ్యాలి:

సముద్ర తీర గ్రామాలలో ఎక్కడైనా ఉపరితల జలవనరుల నుండి మంచినీటిని ఆ ప్రాంతాలకు సరఫరా చేయటానికి వీలుకాని పరిస్థితులలో తమిళనాడు రాష్ట్రంలో వలే సముద్రపు నీటి నుండి మంచినీటిని తయారుచేసే యంత్రపరికరాల వ్యవస్థను ఏర్పరచాలి. తెలుగుదేశం ఎన్నికల ప్రణాళికలో కూడా సముద్రపు నీటి నుండి తాగునీటిని అవసరమైన చోట్ల ఏర్పాటు చేస్తామని పేర్కొనబడినా, అటువంటి ప్రయత్నమే యిప్పటికీ ఒక చోట కూడా ప్రారంభం కాలేదు. అందుకు అవసరమైన నిధులలో కొంతభాగాన్ని వ్యవస్థీకృత మత్స్యరంగ సంస్థల నుండి సేకరించవచ్చు. నిర్వహణ నిమిత్తం ఆ చెరువుల పైన కొద్దిమేరకు సెస్ విధించవచ్చు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రజల సహకారము, పంచాయతీ నిధులు, ఉపాధి హామీ నిధులను కలిపి త్రాగునీటిని శుద్ధి చేయుటకు అవసరమైన యంత్ర సామాగ్రిని, భవనములను ఏర్పాటు చేసి వాటిని సక్రమంగా నిర్వహించవలసిన బాధ్యతను గ్రామ పంచాయతీల సారధ్యంలో ప్రజా కమిటీలకు అప్పజెప్పినప్పుడే ప్రజలందరికీ స్వచ్ఛమైన త్రాగునీరు లభిస్తుంది. వర్షాధార కరువు ప్రాంతములలో పెద్దఎత్తున చెక్‌డ్యామ్‌లను నిర్మించి, చెరువులలో పూడికలను తొలగించి, నీటి నిల్వ సామర్ధ్యమును పెంచి, కరువు రక్కసి బారి నుండి ప్రజలను రక్షించే బాధ్యతను ప్రభుత్వం చేపట్టాలి.

## 4. భూకేటాయింపు విధానం:

అవసరానికి మించి భూములు పొందిన సంస్థల నుండి తిరిగి స్వాధీనం చేసుకుంటాం. పేదలకు చెందిన భూముల స్వాధీనంపై గత ప్రభుత్వం యిచ్చిన జి.ఓ.లను నిలిపివేసి, పేదలకు యిచ్చిన భూములు ప్రైవేట్ సంస్థలకు బదిలీచేసే విధానాన్ని రద్దు చేస్తామని ఎన్నికల ప్రణాళికలో పేదలకు వాగ్దానం చేశారు.

భూమిలేని పేదలకు 2 ఎకరముల భూమిని ఇస్తామని, అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇవ్వబడింది. సాగుకు యోగ్యం కాని, వేలకు వేల ఎకరముల భూములు ఖాళీగా ఉన్నప్పటికీ, సెజ్‌ల పేరుతో ప్రభుత్వము సేకరించిన వేలాది ఎకరముల సాగు భూములలో సగము పైన ఖాళీగా ఉన్నప్పటికీ, ఎ.పి.ఐ.ఐ.సి. సంస్థ వద్ద వేలాది ఎకరముల భూములు యిప్పటికీ ఖాళీగా ఉన్నప్పటికీ, పోర్టులు,

ఎయిర్‌పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, పరిశ్రమల పేరుతో, అభివృద్ధి పేరుతో, రైతుల నుండి, చాలాకాలంగా బలహీన వర్గాలకు చెందిన పేదలు సాగుచేసుకొనుచూ ఉన్న పోరంబోకు భూములను, ఎసైన్డ్ భూములను, రాష్ట్ర ప్రభుత్వం నిర్ధాక్షిణ్యముగా గుంజుకుంటూ ఎన్నికల ప్రణాళికలోని వాగ్దానానికి భిన్నంగా వ్యవహరించుతూ ఉంది.

## లక్షలాది అర్జీలు బుట్టదాఖలు!

రాష్ట్రంలో ఇళ్ళస్థలాలు, రేషన్ కార్డులు, ఇళ్ళు, పించన్లు, జాబుకార్డుల మంజూరుల కోసం సుమారు 36 లక్షల దరఖాస్తులు ప్రభుత్వ ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాయి. ప్రభుత్వానికి సమస్యలు తెలిపేందుకు ఏర్పాటు చేసిన 'మీ కోసం' వెబ్‌సైట్‌కు మొత్తంగా 76 లక్షల దరఖాస్తులందాయి. ఇందులో 26 లక్షల దరఖాస్తులను పరిష్కరించకుండానే మూసివేశారు. మరో 36,27,278 దరఖాస్తులను మంజూరు కోసం ప్రభుత్వానికి ఆయా శాఖలు పంపించాయి. ఇళ్ళ మంజూరు కోసం గృహనిర్మాణ శాఖకు 19.61 లక్షల మంది దరఖాస్తు చేసుకొన్నారు. 8.57 లక్షల దరఖాస్తులను పరిష్కరించకుండానే మూసేశారు. 9.86 లక్షల దరఖాస్తులను ప్రభుత్వ ఆమోదం కోసం గృహనిర్మాణ శాఖ పంపించింది. రేషన్ కార్డుల కోసం 16.62 లక్షల మంది దరఖాస్తుచేసుకోగా 5.36 లక్షల మంది దరఖాస్తులను పరిష్కరించగా 6.19 లక్షల దరఖాస్తులను పరిష్కరించకుండానే మూసివేశారు. మరో 4.26 లక్షల దరఖాస్తులను ప్రభుత్వం ఆమోదం కోసం పంపారు. పించన్ల కోసం 7.87 లక్షల దరఖాస్తులు రాగా 1.46 లక్షల దరఖాస్తులను పరిష్కరించగా 2.46 లక్షల దరఖాస్తులను పరిష్కరించకుండానే మూసివేశారు. మిగతా 2లక్షల దరఖాస్తులను ప్రభుత్వ ఆమోదం కోసం పంపారు.

## పేదలకు పక్కా గృహాలు దక్కేదెన్నడు?

ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఎన్.టి.ఆర్. నగర్ గృహనిర్మాణ ప్రాజెక్టు క్రింద రూ. 11,520 కోట్ల ఖర్చుతో 1,97,000 ఇళ్ళ నిర్మాణాల కోసం ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఎఫర్డబుల్ హౌసింగ్ పార్టనర్‌షిప్ (ఎ.హెచ్.పి) కేంద్ర ప్రభుత్వం 2015-16లో 1,20,106 ఇళ్ళను, 2016-17లో 2,43,162 ఇళ్ళను కేటాయించింది. ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షలు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం షియర్‌వాల్ టెక్నాలజి విధానంలో విట్రిఫైడ్ టైల్ ఫ్లోరింగ్, గోడలకు పుట్టీ, ఎన్.సి.ఎల్. కిటికీలు స్నానపు గదులతో కలిపిన ఈ ఇళ్ళ నిర్మాణం 300 చ.అ., 365 చ.అ.లు, 430 చ.అ.ల నిర్మాణాల కొరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2.56, రూ.2.29, రూ.2.25 లక్షల సహాయాన్ని అందిస్తుండగా, బ్యాంకు రుణంతో కలిపి లబ్ధిదారులు రూ.2.65 లక్షలు, రూ.3.65లక్షలు, రూ.4.65లక్షలు మేరకు భరించాల్సి వుంటుంది. అంటే మొత్తంగా 300 చ.అ.ల సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌కు, రూ.6.71 లక్షలు, 365

చ.అ.ల సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌కు  రూ.7.44లక్షలు, 430 చ.అ.ల డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌కు రూ.8.40 లక్షల వ్యయం అవుతుంది. తెలంగాణలో రూ.5లక్షల వ్యయంతో నిర్మిస్తున్న 500 చ.అ.డబుల్ బెడ్‌రూమ్ ప్లాట్లకు  పేద లబ్ధిదారులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా యింటిని పొందుతూ ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో అవసరం లేని "షీర్వాల్ టెక్నాలజి" వలన లబ్ధిదారులపై  పెనుభారం మోపబడుతూ వుంది. తెలంగాణలో స్థానిక బిల్డర్లకు అవకాశం లభిస్తుండగా మన రాష్ట్రంలో ఎల్&టి, షాపూర్‌జి పల్లొంజి, ఎన్.సి.సి. సంస్థలతో సహా 5 సంస్థలకు మాత్రమే ఈ గృహ నిర్మాణ కార్యక్రమం అప్పజెప్పబడింది!

## నత్తనడకన పేదలకు పక్కా గృహాలు:

రాష్ట్రంలో 2019 నాటికి 10 లక్షల మంది నిరుపేదలకు పక్కా ఇళ్ళు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం చెబుతూ వుంది కానీ ఆచరణలో ప్రభుత్వ పక్షంగా నిధులు విడుదల చేయకపోవటం వలన, అధికారుల అలసత్వం వలన పేదలకు స్వంత ఇల్లు అందని ద్రాక్షగానే మిగిలిపోయే పరిస్థితి కన్పించుతూ వుంది. ఎన్‌టిఆర్ గ్రామీణ గృహ నిర్మాణం క్రింద ఒక్కో ఇంటి నిర్మాణానికి వ్యయం రూ.3 లక్షలు. ఇందులో లబ్దిదారుల వాటా 1.5 లక్షలు. రాష్ట్ర ప్రభుత్వం వాటా 1.5 లక్షలు. ఇందులో రూ.55,000 లు ఉపాధి హామీ పథకం నిధులు. ఉపాధి హామీ పథకం అమలులో అక్రమాలు జరుగుతూ వుండటంతో కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల కావడం లేదు.  ఫలితంగా రూ.500 కోట్ల బిల్లులు పెండింగ్‌లో వున్నాయి. సకాలంలో ప్రభుత్వం నుండి నిధులు విడుదల కాకపోవడంతో రాష్ట్రంలో 2.35 లక్షల ఇళ్ళు వివిధ దశల్లో నిలిచిపోయాయి.

పట్టణ పేదలు స్వంత స్థలాల్లో తామే నిర్మించుకునే విధానంలో (బి.ఎల్.సి) 1,02,977 ఇళ్ళకు లోగడ అనుమతి ఇవ్వగా మరో 23,962 ఇళ్ళను ప్రభుత్వం కేటాయించింది. ఒక్కొక్క ఇంటి నిర్మాణం రూ.3.5 లక్షలు.  ఇందులో కేంద్ర ప్రభుత్వ సహాయం 1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ఒక లక్ష, లబ్దిదారుల వాటా 25,000, బ్యాంకు రుణం రూ.75,000.

2013-14 నుండి 2015-16 మధ్య మూడేండ్లలో అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు కేటాయించిన ఇళ్ళలో 3లక్షల ఇళ్ళు నిర్మాణం వివిధ దశలలో నిలిచిపోయింది.

**రైతు రుణ మాఫీ - డ్వాక్రా రుణ మాఫీ :**

వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని 2014 ఎన్నికల ప్రణాళికలో పేర్కొనబడింది. ఎన్నికల తరువాత రూ. 24,000 కోట్ల పంట రుణాలను మాఫీ చేయుటకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు సుమారు రూ. 13,000 కోట్లు పంపిణీ కాగా మూడవ, నాలుగవ విడతల పంపిణీ ఇంకనూ కావల్సి వుంది. అలాగే డ్వాక్రా మహిళ సంఘాలకు కొంత మేరకు పెట్టుబడి సమకూర్చబడిందే తప్ప రుణమాఫీ జరిగి ఉండలేదు. ఇప్పుడైనా వెంటనే ఈ వాగ్దానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ప్రతి గ్రామంలోను సిమెంట్ రోడ్లు వేస్తామని యిచ్చిన వాగ్దానాన్ని అమలు చేస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించవలసి వుంటుంది. 1999-2004లో గ్రామాలలో, పట్టణాలలో సిమెంటు రోడ్లు, వాటితోపాటే ప్రక్కనే ఇరువైపులా బెర్మ్ మరియు సైడ్ కాలువలను కట్టడం జరిగింది. 10% నుండి 30% వ్యయాన్ని ప్రజా విరాళంగా, మిగిలిన దానిని పనికి ఆహారం మరియు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మించడం జరిగింది. ప్రజల భాగస్వామ్యం - పర్యవేక్షణ వుండుట వలన 15 సం.లు గడచినా యిప్పటికీ ఆ రోడ్లు చెక్కు చెదరలేదు. ఈ పర్యాయం ప్రజల భాగస్వామ్యం లోపించింది.

గ్రామాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ఇటీవల పంచాయతీ రాజ్ శాఖామంత్రి ప్రకటించారు. ఇది సరియైన ఆలోచన కాదు. చాలా అధిక వ్యయ భారంతోపాటు నిర్వహణా పరమైన పలు చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. కావున గ్రామాల వరకు వేసిన సిమెంటు రోడ్లుకు ప్రక్కన బెర్మ్, సైడ్ ఓపెన్ డ్రెయిన్‌లను కడితే సరిపోతుంది.

"పాఠశాల దశ నుండి 10వ తరగతి వరకు తెలుగు / ఉర్దూను తప్పనిసరి చేస్తాం. తెలుగు భాషకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను, తెలుగు విశ్వవిద్యాలయంను ఏర్పాటు చేస్తామని" తెలుగుదేశం ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నప్పటికీ యిప్పటికీ నవ్యాంధ్ర ప్రదేశ్‌లో తెలుగు విశ్వవిద్యాలయంను ఏర్పాటు చేయకపోవటం బాధాకరం.

★★★

# ఎ.పి.లో గాడితప్పిన ఆర్థిక క్రమశిక్షణ

1994 నుండి 2004 మధ్య చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా వుండగా ఆర్థిక సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేసిన వారిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఆర్థిక వ్యయ నియంత్రణ పాటించడంలో, అవసరం లేకుండా కొన్ని శాఖల్లో అధికంగా ఉన్న ఉద్యోగుల సంఖ్యను తగ్గించి, విద్య వైద్య శాఖలలో అవసరాన్నిబట్టి పెంచారు. కిలో బియ్యం ధరను రూ. 2 నుండి 3.5 ల వరకు పెంచారు. నూతనంగా వందలాది ప్రాథమిక పాఠశాల భవనాలను నిర్మించారు. పాఠశాల కమిటీలను విద్య వలంటీర్లను ఏర్పాటు చేసి నిరక్షరాస్యతను తగ్గించుటకు కృషి చేశారు. ఎ.పి. స్టేట్ వైడ్ ఏరియా నెట్‌వర్క్, ఇ-సేవ, కార్డ్ మున్నగు వ్యవస్థలను ఏర్పాటుచేసి ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషిసల్పారు. దుబారా ఖర్చులకు ఆస్కారం యివ్వకుండా, ఆర్థిక క్రమశిక్షణను పాటించుతూ వచ్చారు. విద్యుత్ రంగంలో, ఆర్థిక రంగంలో సంస్కరణలు తెచ్చారు. ప్రభుత్వ భూముల కేటాయింపులలో పారదర్శకతతో, పటిష్టమైన విధివిధానాలతో ఎ.పి.ఐ.డి.ఇ. యాక్టు 2001ను తెచ్చారు.

ఇప్పుడు ఆయనే సింగపూర్ సంస్థలకు స్విస్ ఛాలెంజ్ విధానంలో అత్యంత విలువైన 1691 ఎకరాల కృష్ణానది అభిముఖ స్టార్టప్ ఏరియాను కట్టబెట్టటం కొరకు, తమకు నచ్చిన పారిశ్రామిక-వ్యాపార సంస్థలకు అత్యంత విలువైన ప్రభుత్వ భూములను, ఎ.పి.ఐ.ఐ.సి. భూములను కట్టబెట్టేందుకు ఎ.పి.ఐ.డి.ఇ. యాక్టు 2001నకు సవరణ చట్టాన్ని చేయటం ఆశ్చర్యకరం!

యిప్పటికే రాష్ట్రప్రభుత్వ ఆర్థిక పరిస్థితి గడ్డుగా వుంది. విభజన చట్టంలో హామీ యివ్వబడిన రెవిన్యూ లోటు యిప్పటికీ భర్తీకాలేదు. 2014-15లో రాష్ట్ర విభజన నాటికి రాష్ట్ర ప్రభుత్వం పైన వున్న ఋణభారం రూ. 1,15,266కోట్లు. ప్రస్తుతం ఋణభారం రూ. 2,36,000కోట్లుకు పెరిగింది. యిందులో హెచ్చు వడ్డీతో కూడిన ఓపెన్ మార్కెట్ ఋణాలు రూ. 1,00,000 కోట్లకు పైగానే వున్నాయి. ఇట్టి పరిస్థితులలో

రాష్ట్రప్రభుత్వం రాష్ట్ర విభజన జరిగినప్పటినుండి హైదరాబాద్‌లో సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి కార్యాలయ ఆధునీకరణకు, లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్‌లో సి.యం. క్యాంపు కార్యాలయం కొరకు రూ.45 కోట్లు, అమరావతిలో లింగమనేని గ్రూపునకు చెందిన కృష్ణా నది పక్కన వున్న భవనంలో సి.యం. రెస్టు హౌస్‌గా అభివృద్ధి కొరకు, ఇరిగేషన్ కాంపౌండు ఆవరణలో సి.యం. క్యాంపు కార్యాలయం కొరకు రూ.21.3 కోట్లు, 2016 స్వాతంత్ర్య దినోత్సవమునకు రూ.10కోట్లు, నవనిర్మాణదీక్ష కొరకు రూ.3.47 కోట్లు, రిపబ్లిక్ దినోత్సవమునకు రూ.3కోట్లు ఖర్చు చేయబడుతూ రాష్ట్రప్రభుత్వ ఖజానాపై పెనుభారం పడుతూ వుంది. దీనికితోడు అనేక పర్యాయములు లక్షలకు లక్షలు వెచ్చించి ప్రైవేట్ స్టార్ హోటళ్ళలో, కన్వెన్షన్ సెంటర్‌లలో ఈవెంట్ మేనేజర్ల సలహా, సంప్రదింపులతో ప్రతి పర్యాయము అనేక లక్షల రూపాయల ఖర్చు చేస్తూ కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉన్నారు. ఎప్పటికప్పుడు డ్వాక్రా మహిళలను, స్కూలు పిల్లలను పెద్ద సంఖ్యలో వాహనాలలో తరలించడం సాధారణమై పోయింది.

గత 4 ఏండ్లలో ప్రత్యేక విమానాల పైన ప్రయాణాలకు రూ.100 కోట్లు, హైదరాబాద్ సెక్రటేరియట్‌లో సి.యం. కార్యాలయ ఏర్పాటుకు రూ.30 కోట్లు, లేక్ వ్యూ గెస్ట్ హౌస్ నకు రూ.9 కోట్లు, విజయవాడలో ఇరిగేషన్ గెస్ట్‌హౌస్ – సి.యం. క్యాంప్ ఆఫీసుకు రూ.42 కోట్లు, ప్రధానమంత్రి పాల్గొన్న రాజధాని శంకుస్థాపన కార్యక్రమానికి రూ.250 కోట్లు, అనంతరం జరిగిన 3 శంకుస్తాపనలకు రూ.100 కోట్లు, కన్సల్‌టెంట్ల పైన మొత్తంగా రూ.300 కోట్లు, తాత్కాలిక సచివాలయం యితర మరమ్మతులకు రూ.1,100 కోట్లు, నవనిర్మాణ దీక్షలకు రూ.80 కోట్లు, సి.యం. మరియు అధికారుల విదేశీ పర్యటనలు, రోడ్ షోలకు మొత్తంగా రూ.120 కోట్లు, భాగస్వామ్య సదస్సులకు రూ.150 కోట్లు, హ్యాపి సిటి సదస్సునకు రూ.60 కోట్లు ఖర్చు చేయబడ్డాయని కొందరు ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. అత్యంత పేదవానితో సహా కట్టే పరోక్ష పన్నుల రూపంలో సమకూరే ప్రజాధనాన్ని పొదుపుగా వినియోగించవలసి ఉంటుంది. కావున వాస్తవాలను శ్వేతపత్రం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు తెలియపర్చవలసిన బాధ్యత ఉంది. గతంలో పాటించిన ఆర్థిక క్రమశిక్షణకు పూర్తి విరుద్ధంగా ఈనాడు ప్రజాధనం దుబారా చేయబడుతూ ఉంది.

**కేంద్రం నుండి నిధులు రాబట్టడంలో వైఫల్యం :**

వివిధ పథకాల క్రింద కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రాబట్టడంతో పలు విభాగాలు చొరవ చూపలేకపోతున్నాయి. 47 భారీ పథకాల క్రింద ఏప్రిల్ 1 నుండి అక్టోబర్ 15 వరకు అన్ని రాష్ట్రాల్లో కలిపి కేంద్ర ప్రభుత్వం రూ. 1,44,304 కోట్లు విడుదల

చేయగా రాష్ట్రానికి లభించినది రూ. 5.82 కోట్లు మాత్రమే. తమిళనాడు రాష్ట్రం రూ. 89 కోట్లు దక్కించుకోగా, మత్స్య రంగంలో చాలా అధిక వృద్ధిరేటు నమోదు చేస్తూన్నప్పటికీ మన రాష్ట్రానికి కేవలం రూ. 15 లక్షలు రావడం ఆశ్చర్యకరం. వైద్య ఆరోగ్య విద్యలో మానవవనరుల పథకం కొరకు కేంద్రం రూ. 2597 కోట్లు విడుదల చేస్తే, మన రాష్ట్రానికి కేవలం రూ. 5 కోట్లు మాత్రమే వచ్చాయి. పట్టణ ప్రాంతాలలో స్వచ్ఛ భారత్ పథకం క్రింద రూ. 1357 కోట్లు విడుదల చేస్తే, రూ. 9 కోట్లు వచ్చాయి. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన స్కీం క్రింద కేంద్రం రూ. 1056 కోట్లు విడుదల చేస్తే మనకు వచ్చింది రూ. 4 కోట్లు. వినియోగ పత్రాలు సకాలంలో అందించకపోవడం అధికారులు చొరవ చూపకపోవడం ఈ పరిస్థితికి కారణం. కాగ్ సంస్థ కూడా ఇవే లోపాలను ఎత్తి చూపింది.

## ప్రజాధనాన్ని పొదుపుగా వినియోగించవద్దా?

గతంలో భారతదేశంలో ఏ నగరానికి వెళ్ళాలన్నా, విదేశీ పర్యటనలకు కమర్షియల్ విమానములలో సి.యం. ప్రయాణం చేస్తూ వుండేవారు. యిప్పుడు విదేశీ పర్యటనలతో సహా అన్ని చోట్లకు ప్రైవేట్ విమానములలోనే కోట్లకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ ప్రయాణిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయంలో వృద్ధి 10%గా ఉంటుంటే ఖర్చు పెరుగుదల 25% పైన ఉంటూంది. రాష్ట్రంలో తలసరి అప్పు రూ.38,000. సామాన్య పౌరుడు, బిక్షగానితో సహా పరోక్షపు పన్నుల రూపంలో ప్రభుత్వానికి చెల్లించే డబ్బులకు రాష్ట్రప్రభుత్వం ధర్మకర్తగా వ్యవహరించాలేతప్ప, తనకు యిష్టం వచ్చినట్లు మంచినీళ్ళ ప్రాయంగా ప్రభుత్వ ధనాన్ని ఖర్చుచేయటం ఎంతమాత్రమూ తగదు.

లోగడ ఎన్.టి. రామారావుగారు ముఖ్యమంత్రిగా వుండగా ఆయన ప్రయాణించు కారు పాతదైనందున డిపార్టుమెంట్ వారు కొత్తకారు కొనుగోలుకు ప్రతిపాదించగా రామారావుగారు అందుకు అంగీకరించక రిపేరు చేస్తే సరిపోతుందనే నిర్ణయం తీసుకున్నారని ఆయన వద్ద కార్యదర్శిగా చేసిన ఎన్. జయప్రకాష్ నారాయణ్ తెలియపర్చారు. నాటికీ, నేటికీ పరిస్థితులలో ఎంత తేడా?

కేంద్రప్రభుత్వం నుండి వచ్చిన నిధులను వినియోగించుకోవడం లోనూ, వినియోగ పత్రాలను సకాలంలో కేంద్రానికి పంపి యింకనూ రావలసిన నిధులను రాబట్టు కోవడంలో రాష్ట్ర ప్రభుత్వం శాఖలు విఫలమవు తున్నాయి. ఈ విధంగా రాష్ట్రం దాదాపు రూ.4,369 కోట్లను 2016-17లో కోల్పోవటం జరిగింది. ప్రభుత్వం ఈ విషయంలో తగు శ్రద్ధను చూపకపోవడమే యిందుకు కారణం.

## ఎస్టిమేట్లకు రెక్కలు వస్తున్నాయి!

విజయవాడ నగరంలో వరదలనుంచి రక్షించేందుకు కృష్ణ కరకట్టను నిర్మాణం చేసేందుకు 10 ఏళ్ళ క్రిందట ప్రయత్నం మొదలయ్యింది. అప్పటి అంచనా రూ. 6.10 కోట్లు. రామలింగేశ్వర నగర్ నుంచి 2.7 కి.మీ. దూరం కరకట్ట నిర్మించాలి. ఆక్రమణలను తొలగించడంలో వైఫల్యంతో ఆలస్యమైంది. 3-10-2013న రూ. 104 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి యిచ్చింది. ఎస్.ఇ.డబ్ల్యు.పి.యం.పిల్. అనే కంపెనీలు 5.4 శాతం తక్కువకు టెండర్ వేసి రూ. 93.22 కోట్లకు టెండరు దక్కించు కున్నాయి. 2.6.2015న ఒప్పందం జరిగింది. 2.6.2017 నాటికి పూర్తి కావాలి కానీ ప్రస్తుతం సగం కూడా పూర్తి కాలేదు. గిట్టుబాటు కావడం లేదని, అదనంగా ధర యివ్వాలని గుత్తేదారు సంస్థ చేసిన విజ్ఞప్తి పైన నిపుణుల కమిటీలో మమ అనిపించి రూ. 138.78 కోట్లుకు అనుమతి యిస్తే ఇరిగేషన్ శాఖ జి.ఒ. యిచ్చింది. ఒకేసారి గుత్తేదారు సంస్థకు రూ. 45 కోట్లు అదనపు లాభం చేకూరింది. దీని వెనుక సూత్రధారులెవరు, పాత్రధారులెవరు?

ప్రైవేట్ సంస్థలు చదరపు మీటరు జెట్టీని రూ. 11 వేలకు కొనుగోలు చేస్తూ వుంటే, అదే ప్రమాణాలతో కూడిన జెట్టీని భవాని ఐలాండ్ టూరిజమ్ కార్పోరేషన్ రూ. 48 వేలతో కొనుగోలు చేయడం ఆశ్చర్యకరం. కోట్ల రూపాయల ప్రజల సొమ్ము దుర్వినియోగం అయ్యింది.

## తాత్కాలిక సెక్రటేరియట్, శాసనసభ - మండలి కాంప్లెక్స్‌పై రూ. 1,100 కోట్లు ఖర్చు సబబా?

సింగపూర్ సంస్థలు రాజధాని నగర మాస్టర్ ప్లాన్‌ను ఎప్పుడో సమర్పించాయి. రాయపూడి నుండి లింగాయపాలెం కృష్ణా నది వరకు ఉత్తర దక్షిణాలుగా సుమారు 900 ఎకరముల విస్తీర్ణంలో రాజ్‌భవన్, సెక్రటేరియట్, విభాగ అధిపతుల కాంప్లెక్స్, శాసనసభ, శాసనమండలి భవనములు, ముఖ్యమంత్రి, మంత్రుల, ఉద్యోగుల భవనములు, మున్నగు వాటికి సంబంధించి ప్రణాళికను అందచేసింది. విభజన చట్టం ప్రకారం హైదరాబాద్‌లో శాసనసభ, శాసనమండలి, సెక్రటేరియట్, హెచ్.ఒ.డీ.ల భవనములను 10 సంవత్సరములపాటు మన రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకొనే హక్కు వుంది. శాసనసభ మరియు శాసనమండలి సమావేశములు సంవత్సరము మొత్తంమీద 40 రోజులపాటు కూడా జరగటం లేదు. దాదాపు రూ. 180 కోట్ల ఖర్చుతో 6 లక్షల చ.అ.ల కార్పెట్ ఏరియాతో తాత్కాలిక సెక్రటేరియట్, శాసనసభ, శాసనమండలి భవనముల నిర్మాణాలను చేపట్టనున్నట్టు రాష్ట్ర మున్సిపల్ మంత్రి నారాయణ ఫిబ్రవరి 12, 2016న ప్రకటించారు. సి.ఆర్.డి.ఎ. వీటికి రూ. 515

కోట్లు ఖర్చు కాగలదని అంచనా వేసింది. బిల్డింగుల నిర్మాణం, చుట్టూతా భరంతు, మొక్కలు పెట్టడం, రహదారుల నిర్మాణం మున్నగు మౌలిక వసతులతో సహా మొత్తంగా రూ. 1,540 కోట్లు ఖర్చు అయ్యాయని ప్రభుత్వ పెద్దలు ప్రకటించడం రాష్ట్రప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి పరాకాష్ట. సెక్రటేరియట్ భవన సముదాయాన్ని సింగపూర్ మాస్టర్ ప్లాన్‌లో సూచించిన ప్రదేశంలో శాశ్వత ప్రాతిపదికన నిర్మించితే సరిపోయేది. అంతర్జాతీయ స్థాయి ఆర్కిటెక్ట్‌లతో, ముఖ్యమంత్రిగారి అభిలాష మేరకు శాసనసభ–శాసన మండలి, హైకోర్టులకు ఐకానిక్ భవనముల ఆకృతులు వుండాలని భావించినందున, అందుకనుగుణంగా తుదినిర్ణయం తీసుకొన్న దరిమిలానే శాశ్వత శాసనసభ–శాసనమండలి భవనములను నిర్మించితే ప్రజాధనం వృధా అయ్యుండేదికాదు.

## పుష్కరాలకు వేలకోట్ల రూపాయలు ఖర్చు సబబా?

పుష్కరాలు ప్రతి 12 ఏండ్లకు ఒకసారి వస్తూ ఉంటాయి. గతంలో చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం వుండగా గోదావరి పుష్కరాలు, అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కృష్ణా పుష్కరాలు చాలా తక్కువ ఖర్చుతోనే నిర్వహించబడ్డాయి. కానీ ఈ పర్యాయం గోదావరి పుష్కరాలకు రూ.1000కోట్లు పైన ఖర్చు అయ్యింది. కృష్ణా పుష్కరాలకు బడ్జెట్‌లో కేటాయింపు రూ.238 కోట్లు కాగా దాదాపు రూ.1400 కోట్లు ఖర్చు అయ్యాయని తెలుస్తూ వుంది. యింతవరకు ప్రభుత్వం ఈ రెండు పుష్కరాలకు ఎంతెంత ఖర్చు అయ్యిందో వివరాలను ప్రజలకు తెలియపర్చలేదు.

అనంతపురం జిల్లాలో పెనుకొండ సమీపంలో కియా మోటార్స్ కంపెనీకి రూ.62 కోట్ల వ్యయంతో 600 ఎకరముల భూమిని సేకరించటం జరిగింది. పంటలు పండించబడుతూ వున్న ఈ భూమిని చదును చేయుట కొరకు రూ.178 కోట్లతో టెండర్లు పిలవడం ఆశ్చర్యకరం. ఈ విధంగా అనేక సందర్భాలలో ప్రజాధనం దుర్వినియోగం అవుతూ అవినీతి కొనసాగుతూంది.

ఒరిస్సాలో మహానది కోల్ ఫీల్డ్ నుండి కృష్ణపట్నం వద్ద ఉన్న దామోదరం సంజీవయ్య కృష్ణపట్నం థర్మల్ స్టేషన్‌కు బొగ్గు రవాణా చేయు సందర్భంలో పారాదీప్ పోర్టు నుండి కృష్ణపట్నం పోర్టువరకు చేర్చుటకు టన్నుకు రూ.910లు ఎ.పి. జెన్‌కో యిస్తూవుంది. పారాదీప్ పోర్టు నుండి యింకా ఎక్కువ దూరంలో ఉన్న తమిళనాడులోని ఎన్నూరు పోర్టుకు బొగ్గు రవాణాకు తమిళనాడు విద్యుత్ సంస్థ టన్నుకు రూ.347 లు మాత్రమే చెల్లించుతూంది. అధికారుల అలసత్వం వలన ఎ.పి. జన్‌కో పైన ఏటా రూ.250 కోట్ల రూపాయల అధనపు భారం పడుతూ వుందని కంట్రోలర్ & ఆడిటర్

జనరల్ (కాగ్) సంస్థ ఏడాది క్రితమే చెప్పినా, కేంద్రం 2016 ప్రారంభంలోనే ఈ విషయమై హెచ్చరించినా ఎ.పి. జెన్ కో తీరు మారకపోవటం అభ్యంతరకరం. అనేక సంవత్సరాలుగా ఎ.పి. జెన్‌కో ఎం.డి.గా కె. విజయానంద్, ఐ.ఏ.ఎస్. కొనసాగుతుండటంలో మర్మం ఏమిటి?

## కన్సల్టెంట్‌ల పేరు మీద వందల కోట్ల దుబారా!

రాష్ట్ర రాజధాని నగర నిర్మాణమునకు అవసరమైన ఆర్థిక వనరులను దేశ విదేశీ ఆర్థిక సంస్థల నుండి రాబట్టడం కొరకు అవసరమైన సలహాలనందించేందుకు సంవత్సరానికి రూ. 22.75కోట్లు చొప్పున మెకెన్సీ సంస్థకు యిచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతి నగరంలో ప్రాజెక్టుల గురించి విదేశాలలో పబ్లిసిటీ యిచ్చేందుకు రూ. 68 కోట్లు కేటాయించబడింది. దాదాపు అన్ని డిపార్టుమెంట్ల లోనూ చేపడుతూ ఉన్న పథకాల రూపకల్పనకు కోట్లకుకోట్ల రూపాయలు వెచ్చించుతూ కన్సల్టెంట్‌లను ప్రభుత్వం నియమించుతూ ఉంది. ఇటీవల వ్యవసాయ అనుబంధ శాఖల మధ్య సమన్వయ కొరకు కె.పి.ఎం.జి. సంస్థను కన్సల్టెంట్‌గా ఎడాదికి రూ. 3 కోట్లు ఫీజుతో నియమించారు. రాజధానిలో చేపట్టే కార్యక్రమాలు / పనులకు సలహాలనిచ్చుటకు 11 కన్సల్టెంట్ సంస్థలను సి.ఆర్.డి.ఏ. నియమించింది.

## రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని రద్దు చేయటం ఎలా సబబు?

రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సమీక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి సలహా సూచనలు యిచ్చేందుకు రాష్ట్ర ఆర్థిక సంఘం వుంటూ వచ్చింది. 14వ కేంద్ర ఆర్థిక సంఘం హయాం పూర్తయ్యే వరకు అంటే 2015-2020 వరకు మన రాష్ట్రంలో ఆర్థిక సంఘం కొనసాగుతూ వుండాలి. రాష్ట్రప్రభుత్వం నియమించిన ఆర్థికరంగం నిపుణులు యమ్.ఎల్. కాంతారావు మృతిచెందిన దరిమిలా మరొక నిపుణిడిని అధ్యక్షునిగా నియమించి రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని కొనసాగించ వలసిందిపోయి, ఏకంగా రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని మూసివేయటాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియటం లేదు. రాజ్యాంగం ప్రకారం ప్రతి సంవత్సరము రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో బడ్జెట్‌ను ప్రతిపాదించి ఆమోదించవలసి వుంటుంది కాబట్టి ఆ విధానం కొనసాగుతూ ఉంది తప్ప లేకపోతే బడ్జెట్‌తో నిమిత్తం లేకుండానే రాష్ట్రప్రభుత్వం నేరుగా ప్రభుత్వ ధనాన్ని తన యిష్టం వచ్చినరీతిలో ఖర్చు పెట్టే పరిస్థితి కనిపిస్తూ వుంది!

బందరు రోడ్డులో జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ స్థలం 5,131 చ.అ. విస్తీర్ణాన్ని ప్రభుత్వ ఒత్తిడితో జిల్లా పరిషత్ ఎ.పి. టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌కి ఇవ్వడానికి నిర్ణయించింది. కానీ పంచాయతీరాజ్ శాఖ ఏకంగా 33 ఏళ్ళ లీజుకు యిస్తూ జారీ

చేసింది. స్థలం మార్కెట్ విలువలో 2% లీజు చెల్లించాల్సి వుంటుంది. మార్కెట్ విలువ ప్రకారం అక్కడ గజం 2లక్షల నుంచి 5 లక్షల దాకా వుంటుంది. లీజు విషయంలో స్పష్టత లేదు.

**కేంద్రం నుండి వచ్చిన నిధులను వినియోగించుకోవడంలో వైఫల్యం:**

నగరాలలో, పట్టణాలలో మౌలిక సదుపాయాల కల్పనకు జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ కార్యక్రమాన్ని (జె.ఎన్.ఎన్.యు.ఆర్.యం) అమలు చేయుటకు వేలకోట్ల రూపాయలు కేంద్రం నుండి మంజూరయ్యాయి. రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి నగర పాలక సంస్థలతోపాటు మరో 57 పట్టణాల్లో జె.ఎన్.ఎన్.యు.ఆర్.యం.లో భాగంగా తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల, రవాణా వ్యవస్థలను మెరుగుపర్చడానికి, గృహ నిర్మాణాలకు పనులను చేపట్టారు. 2017 మార్చి లోగా మిగులు నిధులతో పనులు పూర్తిచేసి వినియోగ ధృవీకరణ పత్రాలను పంపాలని కేంద్రపట్టణాభివృద్ధి శాఖ రాష్ట్రప్రభుత్వానికి సూచించింది. మార్చి తరువాత ఈ కార్యక్రమం ముగిసినట్లేనని అందులో కేంద్రం స్పష్టం చేసింది. అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా వినియోగించబడకుండా మిగిలియున్న రూ.2000 కోట్లు కేంద్రానికి పంపవలసి రావటమేకాక అసంపూర్తిగా ఉన్న పనులను రాష్ట్రప్రభుత్వ నిధులతో పూర్తిచేయవలసిన పరిస్థితి ఏర్పడింది.

★★★

# నత్తనడకన సాగు నీటి ప్రాజెక్టులు

## కొనసాగుతున్న జలయజ్ఞం - ధనయజ్ఞం:

కాంగ్రెస్ హయాములో జరిగిన "జలయజ్ఞం-ధన యజ్ఞం"లో పాలుపంచుకున్న అధికారులు, కాంట్రాక్టర్లు, వివిధ స్థాయిలలోని రాజకీయ నాయకులు నేటికీ అదే ధనయజ్ఞాన్ని కొనసాగిస్తూ ఉన్నారు. అడ్డగోలుగా అంచనాలను పెంచివేస్తూ వున్నారు. చాలాకాలముగా నిర్మాణంలో ఉండి పూర్తికాని ప్రాజెక్టులను పూర్తి చేసే దానికి బదులు, నూతన ప్రాజెక్టులను చేపట్టి వేలకోట్ల రూపాయలు ఖర్చు చేస్తూనే వున్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు డ్యామ్ నిర్మాణము పూర్తయినప్పటికీ ఆయకట్టు భూములకు నీరు అందించుటకు డిస్ట్రిబ్యూటరీ కాల్వల వ్యవస్థ పనులను ఇప్పటికి పూర్తి చేయలేదు. అదేవిధముగా శ్రీకాకుళము జిల్లాలో తోటపల్లి బ్యారేజి ఆయుకట్టునకు కాల్వల వ్యవస్థను చేపట్టనందువలన, రైతులకు ప్రయోజనము చేకూరలేదు.

పలు ప్రాజెక్టుల క్రింద భూసేకరణ చేపట్టిన సందర్భములో రైతులకు అందించవలసిన నష్టపరిహారము, చేపట్టవలసిన పునరావాస మరియు పునఃస్థాపిత కార్యక్రమాలకు, నిధులను కేటాయించి, ఖర్చు చేయుటములో తీవ్రమైన జాప్యము జరుగుతూ ఉంది. చంద్రబాబునాయుడు గారు లోగడ ముఖ్యమంత్రిగా ఉండగా రాష్ట్రములో మొట్టమొదటిసారి ప్రవేశపెట్టబడిన "ఇ.పి.సి-ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్" నిబంధనలు, మార్గదర్శక సూత్రాలకు వై.ఎస్. ప్రభుత్వము రోశయ్య, కిరణ్‌కుమార్ ప్రభుత్వ కాలములలో చాలా మార్పులు జరిగి ప్రభుత్వ ఖజానాపైన పెనుభారము పడింది. ఈ విధానాలే నేటికి కొనసాగుతూ ఇరిగేషన్ రంగములో అవినీతికి దోహదం చేస్తూవున్నాయి. ఇప్పటికైనా ఇ.పి.సి. విధానమును పునఃసమీక్షించి, ప్రజాధనము దుర్వినియోగము కాకుండా అరికట్టవలసిన బాధ్యత ప్రభుత్వము పైన వుంది. ఆరు నెలలు / 12 నెలల లోపు పనిపూర్తి కావాలనే నిబంధన పెట్టి అడ్డగోలుగా అంచనా వ్యయాన్ని చాలా హెచ్చు స్థాయికి పెంచడం వలన,

ప్రజాధనం పెద్దఎత్తున దుర్వినియోగం అవుతూ మెగా ఇంజనీరింగ్, రిత్విక్, సుధాకర్ యాదవ్‌కు చెందిన హెచ్.ఇ.ఎస్. ఇన్ఫ్రా సంస్థలకు కాసుల వర్షాన్ని కురిపిస్తున్నాయి.

వేసవిలో నీటి ఎద్దడి ఎదురైనపుడు వ్యవసాయ రంగాన్ని ఆదుకొనేందుకు సమకూర్చిన రూ.121 కోట్ల విలువైన జల ఫిరంగులు, తుంపర పరికరాలు, డీజిల్ ఇంజన్లు అధికారుల నిర్లక్ష్యంతో తుప్పు పట్టి నిరుపయోగంగా మారుతున్నాయి. రైతులకు కొద్దిపాటి అద్దెతో యిచ్చిన రెయిన్ గన్‌లు, ఇంజన్లు చాలావరకు వెనక్కు రాలేదు. గోడౌన్లలో భద్రపర్చినవి తుప్పుపడుతున్నాయి. అనంతపురం జిల్లాలో పెద్ద సంఖ్యలో రెయిన్‌గన్స్ తుప్పుపట్టిపోతూ వుండగా వందల కొలదీ డీజిల్ ఇంజన్లు పెట్టెల్లోనే మూలుగు తున్నాయి.

## నీరు-చెట్టులో మితిమీరిన అవినీతి :

గత 3 సం.ల్లో 71 కోట్ల క్యూబిక్ మీటర్ల మేరకు చెరువుల్లో మట్టి పూడికను తీసినట్లు ప్రభుత్వం అంచనా వేసింది. నిబంధనల ప్రకారం పూడికతీసిన మట్టి, ఇసుకను రైతులు స్వంత ఖర్చుతో తమ పొలాలకు తీసికెళ్ళవచ్చు. కానీ అమ్ముకోకూడదు. నిబంధనలకు విరుద్ధంగా అనేక చోట్ల మట్టిని విక్రయించి, ప్రజాప్రతినిధులు, అధికారులు భారీగా లబ్ధిపొందారు. ఇప్పటి వరకు నీరు, చెట్టు పథకం క్రింద రూ.12,800 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. ఈ కార్యక్రమం వల్ల 65 టి.ఎమ్.సి.ల నిల్వ సామర్థ్యం పెరిగిందని అంచనా. తాజాగా స్వంత ఖర్చుతో పూడిక తీస్తామని ముందుకొచ్చినవారికి చెరువు మట్టిని త్రవ్వు కునేందుకు అవకాశం యిచ్చేలా యిటీవల ప్రభుత్వం ఉత్తర్వులను ఇచ్చింది.

## అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి :

ఆంధ్రప్రదేశ్‌లో లోగడ నుంచి కొనసాగుతూ వున్న ప్రాజెక్టులు కాక కొత్తగా రూ.13,640 కోట్ల వ్యయంతో 11 ప్రాజెక్టులకు కార్యాచరణ సిద్ధమవుతోంది. గోదావరి, పెన్నా తొలిదశ రూ.4,617 కోట్లు, వైకుంఠపురం వద్ద కృష్ణా నదిపై బ్యారేజి నిర్మాణం రూ.1985 కోట్లు మున్నగునవి వున్నాయి. వేదవతి ప్రాజెక్టుకు ఇప్పటికీ డి.పి.ఆర్. సిద్ధం కాలేదు. వీటికి మొబిలైజేషన్ అడ్వాన్సులు యిచ్చే వాటి నుండి వచ్చే 6% కమీషన్‌ల మీద ఉన్న శ్రద్ధాసక్తులు చాలాకాలం నుండి కొనసాగుతూ, అసంపూర్తిగా వున్న ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు నీళ్ళందించేందుకు చూపడం లేదు.

ఇరిగేషన్ ప్రాజెక్టు పనులలో తమకు భారీగా మిగులుకు అవకాశం ఉన్న పనులను మాత్రం చేసి తక్కువగా గిట్టుబాటు అయ్యే డిస్ట్రిబ్యూటరీల పనులను చేయలేమని,

జి.వో. 22 నుంచి వాటిని మినహాయించాలని కొందరు కాంట్రాక్టర్లు ప్రతిపాదిస్తున్నారు. ప్రాజెక్టుల్లో నీళ్ళు ఉన్నప్పటికీ ఆయ కట్టుకు ఆ నీటిని అందించలేని దుస్థితి ఏర్పడుతూంది. పై స్థాయి వత్తిడి వలన స్టేట్ లెవెల్ స్టాండింగ్ కమిటీ (ఎస్.ఎల్.ఎస్.సి) 60సి నిబంధన తొలగించడం జరిగింది. రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్టీల్, సిమెంట్, డిజీల్‌తోపాటు కార్మికులు, యంత్రాలు, మెటీరియల్‌కు ధరల సర్దుబాటును వర్తింపజేసి కాంట్రాక్టర్లకు అదనపు నిధులు లభించేలా ఫిబ్రవరి 23, 2015న జి.వో.ను జారీ చేసింది. తోటపల్లి ప్రాజెక్టులో నీళ్ళున్నప్పటికీ గజపతి నగరం బ్రాంచ్ కెనాల్ క్రింద డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి కానందున నీళ్ళు అందించలేని పరిస్థితి. హంద్రీ–నీవా సుజలస్రవంతి పథకం తొలిదశ పూర్తయ్యింది. ప్రధాన కాలువ త్రవ్వారు కాని డిస్ట్రిబ్యూటరి పనులను పూర్తి చేయకపోవడం వలన వేలాది ఎకరాలకు నీళ్ళు అందడం లేదు. డిస్ట్రిబ్యూటరి పనులను చేయకుండా కాంట్రాక్టర్లు తప్పుకుంటున్నారు. ఇప్పటికి చేసిన పని వలన రైతులకు లబ్ధి చేకూర్చకుండానే, రూ. 1098 కోట్లతో ప్రధాన కాలువ విస్తరణను ఏప్రిల్ 20న ప్రభుత్వం మంజూరు చేసింది!

## శంఖుస్థాపనలతో సరి !

1996 లోక్‌సభ మధ్యంతర ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడానికి ముందు అనంతపురం జిల్లా ఉరవకొండ వద్ద హంద్రీ–నీవా సుజలస్రవంతి ప్రాజెక్టు పనులకు చంద్రబాబు నాయుడు గారు శంఖుస్థాపన చేశారు కాని 2004 వరకు ఆ పనులను చేపట్టనేలేదు. అలాగే 1999 ఎన్నికల ముందు హంద్రీ–నీవా ప్రాజెక్టుకే 5 టి.ఎం.సి. సామర్థ్యంతో త్రాగునీటి ప్రాజెక్టుగా ఆత్మకూరు మండలం కాలువపల్లి వద్ద రెండోసారి పునాది రాయి వేశారు. 1996 లోక్‌సభ ఎన్నికల ముందు వామికొండ రిజర్వాయర్ వద్ద, 1999 ఎన్నికల సమయంలో గండికోట రిజర్వాయర్ వద్ద చంద్రబాబు శంఖుస్థాపన చేశారు. 9 ఏండ్ల పాటు అధికారంలో వున్నప్పటికి హంద్రీ–నీవాకు రూ. 13.77 కోట్లు గాలేరు–నగరికి రూ.17.63 కోట్లు మాత్రమే ఖర్చయింది. ఈ మొత్తం ఉద్యోగ జీతభత్యాలకే సరిపోయింది. హెచ్.ఎన్.ఎస్.ఎస్. అంచనా వ్యయం తొలిదశ రూ. 2774 కోట్లు, రెండవ దశ రూ. 4776 కోట్లు. వై.యస్. కాలంలో మొదటి దశ పనులు పూర్తయ్యాయి. రెండవ దశ పనులు ఒక కొలిక్కి వచ్చాయి. కాని తొలి దశ అంచనా వ్యయాన్ని రూ. 4049 కోట్లకు, రెండవ దశ అంచనా వ్యయాన్ని రూ. 7027 కోట్లకు పెంచుతూ ఫిబ్రవరి 25, 2016న రాష్ట్ర ప్రభుత్వం జి.వో. జారీ చేసింది. అంటే హంద్రీనీవా అంచనా వ్యయం రూ. 4,922 కోట్లకు అదనం పెరిగింది. అలాగే గాలేరు నగరి తొలి దశ అంచనా రూ. 2,155 కోట్లునుండి రూ. 3,228 కోట్లకు జీ.వో. ఇవ్వబడింది.

## గోదావరి - పెన్నా లింక్:

పోలవరం ప్రాజెక్టు ఎగువన చింతలపూడి కాలువకు, పోలవరము కుడి కాలువకు మధ్యలో 320 టి.యమ్.సి.ల గోదావరి నీటిని తీసుకొని వెళ్ళేలా క్రొత్త కాలువను తవ్వుతారు. అక్విడెట్ ద్వారా కృష్ణా నదిని దాటించి, బొల్లపల్లి జలాశయములో నిలువ చేసి, వెలుగొండ రిజర్వాయరు ద్వారా సోమశిల రిజర్వాయరుకు తీసుకొని వెళ్ళే ప్రతిపాదనపై వైడార్ సర్వే చేసి 60 రోజులలో సమగ్ర నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రిగారు వ్యాప్కోస్ సంస్థను ఆదేశించారు. ప్రస్తుత అంచనాల ప్రకారం దాదాపు రూ. 80వేల కోట్ల పైన వ్యయంకాగల ఈ ప్రాజెక్టు కొరకు 24 వేల ఎకరముల అటవీ భూమితోపాటు దాదాపు 44వేల ఎకరముల రైతువారి భూములను కూడా సేకరించవలసి వుంటుంది. ఒకచోట 3.5 కి.మీ. మేర, మరొకచోట 10 కి.మీ. మేర సొరంగములు త్రవ్వవలసి ఉంటుంది. కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టులో కొద్ది వేల ఎకరాల రిజర్వు ఫారెస్టు క్లియరెన్సుకు కేంద్ర అటవీ పర్యావరణ శాఖ ఆధ్వర్యంలోని "ఫారెస్టు అడ్వైజరీ కమిటీ" తీవ్రమైన అభ్యంతరములను వ్యక్తంచేసిన ఉదంతాన్ని మరువరాదు.

ఈ గోదావరి - పెన్నా అనుసంధాన పథకం చేపట్టే లోపల కుమ్మమూరు కాలువ ద్వారా బకింగ్హాం కాలువకు వచ్చే నీటిని గుండ్లకమ్మకు ఎత్తిపోసేలా, అక్కడ నుండి నెల్లూరు సంగం బ్యారేజి వరకు తీసుకువెళ్ళే ప్రాజెక్టు ప్రతిపాదనను ఇరిగేషన్ శాఖ పరిశీలిస్తూ ఉంది. దీనికి రూ. 4,000 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. ఈ ప్రాజెక్టులకు నిధులు ఎక్కడ నుండి లభ్యమౌతాయో స్పష్టత లేకుండానే, అవసరం లేకపోయినా ప్రతిపాదనలు తయారుచేయటం, కన్సల్టెంట్లకు భారీగా ఫీజులు చెల్లించడం, డి.పి.ఆర్.లు తయారు చేయడం రాష్ట్రప్రభుత్వానికి ఆనవాయితీ అయ్యింది.

## ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయవద్దా?

ఇప్పటికి నిర్మాణములో వున్న అనేక ఇరిగేషన్ ప్రాజెక్టులుపైన వేలకువేల కోట్ల రూపాయల ఖర్చు చేసినప్పటికి కొన్నిచోట్ల భూసేకరణ, కొన్నిచోట్ల పునరావాస సమస్యలు, కొన్నిచోట్ల అటవీశాఖ నుండి అనుమతులు రాకపోవడము, కొన్నిచోట్ల కాంట్రాక్టర్ల అలసత్వము మున్నగు కారణాల వలన లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే కార్యక్రమము చాలా నిదానముగా నడుస్తూ వుంది. క్రొత్త ప్రాజెక్టులను చేపట్టే బదులు, ముందు ఈ అంశము పైన దృష్టి పెట్టి, ఏఏ ప్రాజెక్టుకు ఏ సమస్య వున్నదో గుర్తించి, దానిని పరిష్కరిస్తూ, అవసరమైన నిధులను కేటాయించి త్వర త్వరగా పూర్తిచేసేదానికి చర్యలు తీసుకోవడానికి బదులు కొత్త పథకాలు చేపట్టబడుతూ ఉన్నాయి.

మన రాష్ట్రంలో గతంలో చేపట్టి నిర్మించబడుతూ ఉన్న పలు మైనర్ సాగునీటి ప్రాజెక్టులు ఇప్పటికి పూర్తికాని పరిస్థితి ఉంది. ఎ.ఐ.బి.పి. క్రింద రాష్ట్రంలో గుండ్లకమ్మ, తాడిపూడి, ఎత్తిపోతల పుష్కర లిఫ్ట్ స్కీమ్, ముసురుమిల్లి, ఎర్రకాలువ, మద్దువలస ప్రాజెక్టులను 2018 ఖరీఫ్ నాటికి వినియోగంలోకి తేవాలని కేంద్రం సూచించి మంజూరు చేసింది. ఇటీవల ఎ.ఐ.బి.పి. రద్దైన నేపథ్యంలో ఆ ప్రాజెక్టులకు "ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజనా" క్రింద నిధులు మంజూరు చేస్తామని కేంద్రం హామీ యిచ్చింది. గడువులోగా పూర్తిచేయకపోతే నిధులు ఇవ్వబోమని స్పష్టంగా చెప్పింది. ఐనా ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తూ ఉండటం వలన ఇప్పుడు ఈ మిగిలిపోయిన పనులను రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే పూర్తి చేయవలసిన పరిస్థితి కన్పించుతూ ఉంది. చేసిన పనులకు సకాలములో కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం వినియోగ పత్రాలు పంపక పోవడంతో కేంద్రం తన వాటా నిధులను విడుదల చేయటానికి నిరాకరించింది.

**జలయజ్ఞం - ధనయజ్ఞం కొనసాగుతూ వుంది:**

లోగడ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ, దరిమిలా రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాల కాలంలోనూ ఇరిగేషన్ శాఖలో భారీగా అవినీతి చోటుచేసుకుంది. జలయజ్ఞం ధనయజ్ఞం అయ్యింది. మొబిలైజేషన్ అడ్వాన్సుల నుండి భారీగా పాలకులకు కమీషన్లు అందాయి. అంతకుముందు నుండి కొనసాగుతూ వున్న ప్రాజెక్టులను పూర్తిచేయకుండానే కొత్తగా పలు ప్రాజెక్టుల పనులను ప్రారంభించారు. దాదాపు 86 ప్రాజెక్టులను రూ. 86,000 కోట్ల వ్యయంతో పనులను ప్రారంభించారు. రోశయ్య గారు ముఖ్యమంత్రిగా వుండగా ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టు సర్వే కొరకు రూ. 354 కోట్లు యివ్వడం విడ్డూరం.

ఇరిగేషన్ శాఖలో పనుల ప్రతిపాదన దశలోనే కాంట్రాక్టర్లతో కుమ్మక్కవ్వడం, అంచనా వ్యయాన్ని ఇబ్బడి ముబ్బడిగా పెంచేయడం, ముందే ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకు అవి దక్కేలా నిబంధనలు రూపొందించి, టెండర్ నోటిఫికేషన్ జారీచేయడం, అంచనా వ్యయంకన్నా అధిక ధరలకు కాంట్రాక్టర్లకు అప్పగించి కమీషన్లు తీసుకోవడం యధేచ్ఛగా గత 4 సం.లుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొనసాగుతోంది. ప్రభుత్వంలో అత్యున్నత స్థాయిలో వున్న పెద్దల ఎరుకతోనే ఈ దోపిడీ పర్వం కొనసాగుతూ వుంది. హంద్రీ-నీవా, సుజల స్రవంతిలో భాగంగా రూ. 430 కోట్లతో చేపట్టిన కుప్పం బ్రాంచి కెనాల్ పనులు, రూ. 485 కోట్లతో చేపట్టిన వంశధార ప్రాజెక్టు రెండో దశ పనులు టెండర్ల సమయంలో 3 సంస్థలే కుమ్మక్కై అదనపు

ధరలకు షెడ్యూల్స్ దాఖలు చేశాయని అప్పటి ప్రధాన కార్యదర్శి ఐ.వై.ఆర్. కృష్ణారావు అసంతృప్తి వ్యక్తం చేశారు.

గాలేరు నగరి తొలి దశలో 26వ ప్యాకేజీలో రూ.112 కోట్లతో చేపట్టిన పనులు, రూ.255 కోట్లతో చేపట్టిన కొండవీటి వాగు వరద మళ్ళింపు టెండర్ల సమయంలోను అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి. ఠక్కర్ కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజాగా ఏలేరు ఆధునికీకరణ 2వ దశ టెండర్లపై నిర్వహించిన హైపవర్ కమిటీ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ జరుగుతూ వున్న లాలూచీ పర్వంలో, తాను భాగస్వామిని కాలేనని స్పష్టం చేశారు. ఆర్థికమంత్రి వియ్యంకుడితో వ్యాపార సంబంధం వున్న హెచ్.ఇ.ఎస్. ఇన్ఫ్రాకు రూ.202.58 కోట్ల విలువైన పనులకు అప్పగించాలని హైపవర్ కమిటీపై ఒత్తిడి తేగా యిందులో తాను భాగస్వామిని కాలేనని, టెండర్లు ఖరారు చేసే బాధ్యత నుంచి తన నేతృత్వంలో హైపవర్ కమిటీ నుంచి తప్పించకచాలని దినేష్‌కుమార్ ప్రభుత్వానికి సూచించారు. దీంతో టెండర్ల ఖరారు చేసే బాధ్యత నుంచి హైపవర్ కమిటీని తప్పిస్తూ ప్రభుత్వం జి.ఒ. నెం.76ను జారీ చేసింది!

ఇటీవల వైకుంతపురం వద్ద కృష్ణానదిపై బ్యారేజి నిర్మించి నాగార్జున సాగర్‌కు కుడి కాలువకు అనుసంధానం చేసే పనిని నాలుగు నెలల వ్యవధిలో రూ. 4,600 కోట్ల నుండి రూ. 6000 కోట్లకు ఎస్టిమేట్లను పెంచడం విడ్డూరం.

**కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం చేసిన ఘనత ఎన్.టి. రామారావు గారిదే:**

పట్టిసీమ లిఫ్ట్ ద్వారా గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు అందించటము ద్వారా నదుల అనుసంధాన ప్రక్రియను తానే ప్రారంభించాను అని చంద్రబాబు నాయుడుగారు భావిస్తూ ఉంటారు. వాస్తవంగా శ్రీశైలము నుండి కృష్ణా నది జలాలను పెన్నా పరివాహకములోని సోమశిల రిజర్వాయరునకు తరలించడము ద్వారా కృష్ణా, పెన్నా నదుల అనుసంధానాన్ని యన్.టి. రామారావుగారు లోగడే సాధించారు.

**ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి నిచ్చెన వెయ్యడములా గోదావరి-పెన్న లింకు :**

ఇతర సాగు నీటి ప్రాజెక్టులతో పోలిస్తే సోమశిల రిజర్వాయరు వద్ద నీటి కొరత తక్కువస్థాయిలోనే ఉన్నది. ఇప్పటికిప్పుడే ప్రారంభములోనే రూ.80వేల కోట్ల ఖర్చుకాగల ఈ పథకము యిప్పటికి వున్న అనుభవాలతో చూస్తే, కనీసము రూ.1.50 లక్షల కోట్లకు చేరుతుంది కావున ఈ పథకాన్ని అత్యవసరంగా చేపట్టవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. ఇప్పటికే వేలాది కోట్ల రూపాయలు రెవిన్యూ లోటుతో, ఆర్థిక

లోటుతో సతమతమవుతూ వున్న రాష్ట్ర ప్రభుత్వము ఇప్పుడు రూ.80వేల కోట్లకు పైగా వ్యయం కాగల గోదావరి-పెన్నా లింకు పథకము కొరకు ఉవ్విళ్ళూరడము - ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి నిచ్చెన వెయ్యడములా ఉంటుంది. ఎక్కడికక్కడ నిర్మాణములో ఉన్న ప్రాజెక్టులవారీగా అడ్డంకులను అధిగమిస్తూ పూర్తిచేసిన దరిమిలా మాత్రమే భారీ వ్యయము కాగల గోదావరి-పెన్నా లింకు పథకాన్ని చేపట్టవచ్చు. గోదావరి నదిలో ఏటా వేలాది క్యూసెక్కుల నీరు వృధాగా పోతున్నమాట వాస్తవమే. ఆ నీటిని సద్వినియోగము చేసుకొనవలసిన ఆవశ్యకత కూడా ఉన్నది. అదే సమయములో కొన్ని సాంకేతిక పరమైన అంశాలను, ఆర్థికపరమైన అంశాలను, పొరుగు రాష్ట్రములతో సమస్యలను కూడా అధ్యయనము చేయవలసి ఉంటుంది.

## పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై అమిత ప్రేమ ఎందుకు?

1980-81 సం.లో నాటి ముఖ్యమంత్రి టి. అంజయ్య గారు పోలవరం ప్రాజెక్టునకు శంఖుస్థాపన చేశారు. ఆనాటి కేంద్రప్రభుత్వం సహకారం అందిస్తామన్నప్పటికీ 1996 నుండి 2004 వరకు అధికారంలో ఉన్న చంద్రబాబునాయుడు గారు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టలేదు. వై.ఎస్. ప్రభుత్వమే ప్రారంభించింది. కుడి, ఎడమ కాలువల పనులు దాదాపు 70% పూర్తయ్యాయి. డ్యామ్ నిర్మాణం పనులు మొదలవలేదు. లోగడ పోలవరము ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాకు 80 టి.యం.సి.ల గోదావరి నీటిని తరలించు పథకానికి, నాటి ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర ముఖ్యమంత్రుల మధ్య కుదిరిన ఒప్పందము ప్రకారము ఉమ్మడి ఎ.పి. వాటా 45 టి.యం.సి.లు, కర్నాటకకు 24 టి.యం.సి.లు, మహారాష్ట్రకు 11 టి.యం.సి.లు చెందాలని ఒప్పందము జరిగింది. అంటే 80 టి.యం.సి.లు గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తీసుకుంటే ఎగువన వున్న కర్నాటక, మహారాష్ట్రలకు శ్రీశైలమునకు ఎగువన వారి కేటాయింపులకు అదనముగా, 35 టి.యం.సి.ల కృష్ణా జలాలను వారు వాడుకునే వీలు కలుగుతుంది. ఇప్పుడు ఎ.పి.కు మిగిలే 45 టి.యం.సి.ల నీటిలో విభజన అనంతరము తెలంగాణ రాష్ట్రం కూడా వాటా కోరుతూ వుంది. లోగడ 3 రాష్ట్రముల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారము, 80 టి.యం.సి.లకు మించి గోదావరి నీటిని తీసుకుంటే 45:35 దామాషాలో ఎగువ రాష్ట్రాలకు కూడా ఆ నీటిలో వాటా ఇవ్వవలసి ఉంటుందా అనే అంశాన్ని పరిశీలించాల్సి ఉంది.

## గ్రావిటీలో 2018 నాటికి పోలవరం నీళ్ళు ఇవ్వడం సాధ్యమా?

పోలవరం డ్యామ్ నిర్మాణమును 2019 నాటికి పూర్తి చేయాలనే సంకల్పముతో నిర్మాణ కార్యక్రమాన్ని, ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన ఆదేశాలను ఇస్తూ

నిధులను సమకూరుస్తూ ఉన్నందుకు చంద్రబాబు నాయుడు గార్ని అభినందించవలసి ఉంటుంది. విభజన చట్టములో పేర్కొన్న హామీ ప్రకారము సహకారాన్ని కేంద్రప్రభుత్వం అందించటం ముదావహం. ఇప్పటివరకు పోలవరం డ్యామ్ నిర్మాణంలో ఇరిగేషన్ విభాగమునకు అగు ఖర్చును మాత్రమే కేంద్రప్రభుత్వం యిచ్చుటకు అంగీకరించింది. భూసేకరణ, పునరావాస, పునఃస్థాపిత కార్యక్రమాలను వేగవంతం చేయవలసిన అవసరం ఎంతైనా వుంది.

## పోలవరం ప్రాజెక్టు పునరావాస – పునఃస్థాపిత కార్యక్రమం పూర్తయ్యేదెన్నడు?

డ్యామ్ నిర్మాణము 150 అడుగుల ఎత్తు మేరకు పూర్తయినప్పుడు 1,10,567 ఎకరాలు ముంపునకు గురి అవుతుంది. 276 గ్రామాలలోని 44,574 కుటుంబములకు చెందిన 1,77,275 మంది ప్రజలు నిర్వాసితులు అవుతారు. వీరిలో ఖమ్మం జిల్లాలో 34,143 కుటుంబాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో 6,959 కుటుంబాలు, తూర్పు గోదావరి జిల్లాలో 2,472 కుటుంబాలు ఉన్నాయి. గిరిజన కుటుంబాలు ఖమ్మం జిల్లాలో 17,033, పశ్చిమ గోదావరి జిల్లాలో 2,223, తూర్పు గోదావరి జిల్లాలో 1,853 ఉన్నాయి. గిరిజనులు కోల్పోయే భూమికి భూమి ఇవ్వవలసి ఉంటుంది. నిర్వాసితులు అందరికి గృహాలను నిర్మించడంతోపాటు, రహదారులు, త్రాగునీరు, విద్యుత్, మున్నగు సౌకర్యాలన్నింటినీ కల్పించవలసి వుంటుంది. ఈ పునరావాస కార్యక్రమానికి వై.యస్. ప్రభుత్వము ప్రాజెక్టు శంకుస్థాపన చేసిన నాటికే సుమారు రూ.3,500 కోట్లు అవసరము అవుతాయని అంచనా వేసింది. ఇప్పుడు "పారదర్శకతతోకూడిన భూసేకరణ, న్యాయమైన పరిహారము, పునరావాస, పునః స్థాపిత చట్టము – 2013"ను అనుసరించి చేయవలసి ఉంటుంది కావున తాజాగా రూ.15,000 కోట్లకు పైకి పెరిగింది. ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయకుండా, 150 అడుగుల స్థాయి వరకు నీటిని నిలిపే ప్రసక్తే ఉండదు. గ్రావిటీలో, కుడి కాలువకు కాని, ఎడమ కాలువకు గాని, నీరు ప్రవహించదు.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ప్యాకేజి ప్రకారంగా కల్పించవలసిన సౌకర్యాలు, అందించవలసిన సహాయము అందించే కార్యక్రమాల్లో భాగంగా పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుంటూ ఉందని సమాచారం. కమీషన్‌లు తీసుకుంటూ అవినీతిపరులైన అధికారులు, రాజకీయ నాయకులు, పెద్ద ఎత్తున నిధులను స్వాహా చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టులో 1.63 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి పనులు చేయకున్నా, చేసినట్లు చూపి రూ.151 కోట్లు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారు.

## పురుషోత్తమపట్నం లిఫ్ట్ స్కీమ్ యిప్పుడు అవసరమా?

పట్టిసీమ పథకము వలన, కుడికాలువలో కొంతమేరకు బ్యాలెన్సు పనులను చేసి గోదావరి నీటిని కృష్ణా బ్యారేజి వద్దకు చేర్చి, కృష్ణా డెల్టాకు నీటి యిబ్బంది చాలావరకు లేకుండా చేయడం జరిగింది. ఏలేరు రిజర్వాయరు ద్వారా విశాఖపట్నం స్టీలుప్లాంటుకు నీరు అందుతూనే ఉంది. ఇప్పటికిప్పుడు వచ్చిన ఇబ్బందిలేదు. ఎటుతిరిగి 2018 చివరకు పోలవరం డ్యామ్ నిర్మాణము పూర్తి చేసేందుకు సమస్త చర్యలను చేపట్టుతూ, పోలవరం ఎడమ కాలువలో మిగిలిన పనిని పూర్తిచేయకుండా యిప్పుడు మళ్ళీ రూ. 1,690 కోట్ల ఖర్చుతో పురుషోత్తమపట్నం లిఫ్ట్ స్కీమును యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. ఇప్పటికీ ఇంకా పూర్తి కాలేదు. ప్రతి సోమవారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రగతిని సి.యం. సమీక్షిస్తూ ఉన్నారు. రాష్ట్రానికి పోలవరం జీవనాడని, తనకు అమరావతి రాజధాని మరియు పోలవరం రెండు కళ్ళని సి.యం. పదేపదే ప్రకటిస్తున్నారు. ప్రాజెక్టు పనుల అమలులో మితిమీరిన తొందర చేస్తే నాణ్యతలో లోపం జరిగే అవకాశాలు ఉంటాయి. గోదావరి నదిలో రూ. 50లక్షల క్యూసెక్కుల వరకు వరద ప్రవాహం ఉండవచ్చనే అంచనాలు ఉన్నాయి. ఒకవేళ డ్యామ్‌వద్ద ప్రమాదం జరిగితే పరిణామాలు ఊహించలేము. లోగడ శ్రీశైలం డ్యామ్ నిర్మాణం పటిష్టంగా ఉండటం వలననే 2009లో అంచనాలకు మించి కృష్ణానదికి వరద వచ్చినప్పటికీ డ్యామ్ నిలబడిందన్న వాస్తవం మరువరాదు.

## స్వల్పవ్యయంతో పులిచింతల - ఎన్.ఎస్.పి. కుడికాలువ లింకు:

నాగార్జునసాగర్ కుడికాలువకు కృష్ణా నది నికర జలాలలో 132 టి.యం.సి.లకు హక్కు ఉన్నప్పటికి ఇటీవల కాలములో పలు సంవత్సరములలో చాలా తక్కువ నీటి విడుదల జరుగుతూ వుంది. ఫలితముగా కుడికాలువ ఆయకట్టు రైతులు తీవ్రముగా నష్టపోతూ వున్నారు. కొన్ని సందర్భములలో త్రాగునీటికి కూడా యిబ్బందులు ఎదురవుతూ ఉన్నాయి.

పోలవరం కుడికాలువ ద్వారా 80 టి.యం.సి.ల నీటిని కృష్ణా డెల్టాకు తీసుకుంటే నాగార్జునసాగర్ డ్యామ్ నుండి కృష్ణా డెల్టా కొరకు దిగువకు నీటి విడుదలకు తెలంగాణ ప్రభుత్వము అభ్యంతరం పెట్టే అవకాశం ఉంది. మూసి, పాలేరు, మున్నేరు మరియు వైరాల పరీవాహక ప్రాంతముల నుండి కృష్ణా నదిలో కలిసే నీటిని కృష్ణా డెల్టా అవసరాలకు వినియోగించుకొన వచ్చును. కృష్ణా బ్యారేజి నిల్వ సామర్ధ్యము 3 టి.యం.సి.లే ఉన్నందున ఈ ఉప నదుల ద్వారా వచ్చు నీరు, యిప్పటి వరకు కొంత సముద్రములోనికి వృధాగా వెళ్ళిపోతూ ఉన్నాయి. కావున వైకుంఠపురము - దాములూరు / చెవిటికల్లును కలుపుతూ కృష్ణా నది పైన బ్రిడ్జి కమ్ బ్యారేజి నిర్మింప

చేస్తే అక్కడ నుండి దాదాపు పులిచింతల వరకు నీరు నిల్వ ఉంటుంది. ఆ నీటిని పులిచింతల డ్యామ్ వెనుక వైపునకు లిఫ్ట్ చేసుకుని, నిల్వ వుంచి కృష్ణా డెల్టా అవసరాలకు అనుగుణముగా వినియోగించుకొన వచ్చును. పులిచింతల నుండి తక్కువ దూరములో నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాలువ లోనికి ఎత్తిపోసేలా చర్యలు చేపడితే తక్కువ ఖర్చుతో కొంతమేరకు, సాగర్ కుడికాలువ ఆయకట్టుకు కొంతమేరకు నీటిని అందించే వీలు ఏర్పడుతుంది. ఈ ప్రతిపాదనను ఎ.పి. రైతాంగ సమాఖ్య అధ్యక్షులు యెర్నేని నాగేంద్రనాథ్ రాష్ట్రప్రభుత్వానికి అందచేసినా దీనిపైన ఎలాంటి చర్చా జరుగలేదు.

తెలంగాణ ప్రాంతంలో పులిచింతల ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాస వ్యయమును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వానికి సంపూర్ణంగా అందించనందున పులిచింతల ప్రాజెక్టులో పూర్తి స్థాయి నిల్వ చేసేందుకు గత సంవత్సరం వీలుకాక కొంత నీరు సముద్రం పాలయ్యింది. ఈ సంవత్సరమైనా ఆ పరిస్థితి పునరావృతం కాకుండా ఎ.పి. ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలి.

## హంద్రీ-నీవా సుజలస్రవంతి ప్రాజెక్టు పూర్తయ్యేదెన్నడు?

రాయలసీమలో త్రాగునీరు - సాగునీరు కష్టాలను అధిగమించడానికి ప్రముఖ ఇంజనీరు కె. శ్రీరామకృష్ణయ్య సలహా మేరకు ఎన్.టి. రామారావు గారు "హంద్రి-నీవా సుజలస్రవంతి" పథకానికి శ్రీకారం చుట్టారు. చంద్రబాబునాయుడు గారు అధికారంలో ఉన్న 9 సం.రాలలో ఈ పథకం కొరకు సుమారు రూ.190 కోట్లు కేటాయించబడగా సుమారు రూ.25 కోట్లు మాత్రమే ఖర్చు చేయబడింది. వై.ఎస్. ముఖ్యమంత్రిగా ఉండగా 6 సం.లలో రూ.3,400కోట్లు కేటాయించబడగా రూ.4,340కోట్లు ఖర్చు చేయబడింది. అనంతరం రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిల హయాములో రూ.2,807 కోట్లు కేటాయించబడగా రూ.2,143 కోట్లు ఖర్చు చేయబడింది. ప్రస్తుతం ప్రధాన కాలువ లోనికి సుమారు 28 టి.యం.సి.ల నీరు వెళ్ళే అవకాశం వుంది. కానీ లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించాలన్నా, చెరువులకు నీరు సప్లయ్ కావాలన్నా డిస్ట్రిబ్యూటరీ కాలువల పని పూర్తి కావలసి ఉంది. ఈ పని పూర్తి చేయకుండానే యిప్పుడు మరల ప్రధాన కాలువను రూ.1,030 కోట్లుతో వెడల్పు చేయుటకు ఆఘమేఘాల మీద టెండర్లు పిలిచి రాజకీయ ప్రాబల్యం గల కాంట్రాక్టు సంస్థకు కట్టబెట్టేందుకు ప్రయత్నం ముందుకు నడుస్తూ ఉంది. కొంతకాలముగా రాయలసీమ ప్రాంతములో ఇరిగేషన్ రంగంలో కాంట్రాక్టులను రాజ్యసభ సభ్యుడొకరు మరియు రాష్ట్ర ఆర్థిక మంత్రి సమీప బంధువు ప్రభావితం చేస్తున్నారనేది బహిరంగ సత్యం. లోగడ కాంగ్రెస్ ప్రభుత్వాల కాలంలో సాగిన

"జలయజ్ఞం - ధనయజ్ఞం" ప్రస్తుత ప్రభుత్వ హయాములో కూడా మరింత అధికస్థాయిలో కొనసాగుతూ ఉండటం విచారకరం. అంచనాలను పెంచివేస్తూ, నామినేషన్ మీద అస్మదీయులకు కట్టబెట్టుతూ వేలాదికోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ ఉండటం క్షమార్హం కాదు.

## వెలుగొండ ప్రాజెక్టుకు మోక్షం ఎప్పుడు?

ఎన్.టి. రామారావు గారు ముఖ్యమంత్రిగా ఉండగా ప్రకాశం, కడప జిల్లాలలో త్రాగునీటిలో ఫ్లోరైడ్ శాతం అధికముగా ఉండి లక్షలాదిమంది ప్రజలు యిబ్బందులు పడుతూవున్న పరిస్థితిని గమనించి 1989లో వెలుగొండ ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయించారు. 1996లో వెలుగొండ ప్రాజెక్టునకు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు శంకుస్థాపన చేసి ఐదేండ్లలో పూర్తిచేస్తామని ప్రకటించినప్పటికీ 2004 వరకు పనులు ప్రారంభమే కాలేదు. 15 లక్షల జనాభాకు త్రాగునీటిని మరియు 4.5 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించటానికి ఉద్దేశించిన ఈ పథకం టన్నెల్‌పని వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉండగా ప్రారంభమయ్యింది. కానీ ఒక టన్నెల్ పని పూర్తి కాకుండానే రెండవ టన్నెల్ పనిని చేపట్టడం సరికాదు. మొదట్లో రూ.1,550 కోట్లు అంచనాతో ప్రారంభమై రూ.5150 కోట్లకు అంచనా పెరిగింది. ఇప్పటికీ రూ3,550 కోట్లు ఖర్చుకాగా యింకా రూ1,600 కోట్లు అవుసరమవుతాయి. 9.2 మీటర్లు మరియు 7 మీటర్ల వ్యాసముతో 18.8 కి.మీ.ల నిడివిలో టన్నెల్స్ ఏర్పాటవ్వవలసి ఉంది. మే 2015 నాటికి మొదటి టన్నెల్ 12.6 కి.మీ. మరియు రెండవది 8.76 కి.మీ మేరకు త్రవ్వకం జరిగింది. 2సం.ల వ్యవధిలో మార్చి 2017 నాటికి 14 కి.మీ. మరియు 10.8 కి.మీల మేరకు మాత్రమే త్రవ్వకం జరిగింది. ఇంకా రెండు లేక మూడు సం.లకు గాని ఒక్క సొరంగం పని పూర్తి అయ్యే పరిస్థితి కనిపించడము లేదు.

## వెలుగొండ ప్రాజెక్టు పట్ల సవతి తల్లి ధోరణి సమంజసమా?

పోలవరం ప్రాజెక్టుపైన ముఖ్యమంత్రి వారంవారం సమీక్ష జరుపుతూ, త్వరగా పూర్తికావడానికి విదేశీ సంస్థలను ఆహ్వానించి, నిధులు విడుదల చేస్తున్న విధంగానే వెలుగొండ ప్రాజెక్టు విషయంలో కూడా శ్రద్ధాసక్తులు చూపివుంటే యిప్పటికి ఆ ప్రాజెక్టులో ఒక్క సొరంగం పని అయినా పూర్తయి ఉండేది. ప్రభుత్వం నుండి సకాలంలో నిధులు అందక, స్పేర్‌పార్ట్‌లను విదేశాల నుండి దిగుమతి చేసుకోవటంలో జాప్యం వలన ఈ ప్రాజెక్టు నత్తనడకగా సాగుతూవుంది. కరెంటు బిల్లులు కట్టలేదని కనెక్షన్‌ను పలు పర్యాయములు తొలగించటం వలన కూడా జాప్యం జరుగుతూ వుంది. పోలవరం

ప్రాజెక్టు విషయంలో వందల కోట్ల రూపాయలను అడ్వాన్సులుగా యిస్తూవున్న ప్రభుత్వం వెలుగొండ ప్రాజెక్టు విషయంలో సవతి తల్లి ధోరణిని అవలంబిస్తూ వుంది. వెలుగొండ ప్రాజెక్టులో కాంట్రాక్టరు కరెంటు బిల్లు కట్టలేదని విద్యుత్ సరఫరా నిలిపివేస్తూ వున్న విద్యుత్ పంపిణీ సంస్థలు అభిజిత్ పెట్రోటెక్ రూ. 54 కోట్లు, ఇంపెక్స్ మెటల్స్ & ఫెర్రో 23 కోట్లు, యూనా స్మెల్టర్స్ రూ. 17 కోట్లు,, సిరీస్ స్మెల్టర్స్ ఎనర్జీ 10 కోట్లు, జి.యం.ఆర్. వాసవి 7 కోట్లు కట్టవలసి వున్నా విద్యుత్ అధికార్లు పట్టించుకోరు. పోలవరం ప్రాజెక్టులో కొద్దికాలం క్రితం వరకు సిమెంట్, స్టీల్‌కు అయ్యే ఖర్చులను ముందుగా ప్రభుత్వమే భరించి, ఆ తరువాత బిల్లుల్లో మినహాయించుకునేలా వెసులుబాటు కల్పించారు. జలవనరుల శాఖ అధికారులు అభ్యంతరం తెలియ చేసినా నూతనంగా డీజిల్‌కు కూడా రాయితీ యివ్వాలని కాంట్రాక్టు సంస్థ కోరగా పై స్థాయిలో ప్రభుత్వం అంగీకరించింది. దాదాపు నెలకు 20 కోట్ల రూపాయలను ప్రభుత్వమే ముందస్తుగా డీజిల్ సరఫరా కొరకు ఖర్చు చేస్తుంది. ఇంత శ్రద్ధాశక్తులను వెలుగొండ ప్రాజెక్టు పట్ల చూపకపోవడం ప్రకాశం జిల్లా పట్ల వివక్షతకు ఒక తార్కాణం.

వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాలకు చెందిన నిర్వాసితులకు యిప్పటి వరకు ప్రత్యామ్నాయంగా కాలనీలు కాని, యితర సౌకర్యాలు కాని ఏర్పాటు చేయకపోవడం వలన దాదాపు 13 ఏళ్ళ నుండి, వారు తీవ్రమైన యిబ్బందులను ఎదుర్కొంటున్నారు.

వెలుగొండ ప్రాజెక్టు సొరంగం పనుల్లో పాత కాంట్రాక్టర్ల నుంచి 60 సి నిబంధనల క్రింద తొలగించిన రూ. 416 కోట్ల పనుల అంచనా వ్యయాన్ని రూ. 1,012 కోట్లకు పెంచుతూ రాష్ట్రప్రభుత్వం యిటీవల మార్చి 22, 2018న కొత్త జీ.వో. జారీ చేసింది. ఇ.పి.సి. పద్ధతితో కాకుండా 'లంప్సమ్ - ఓపెన్' విధానంలో ఈ పనులను అప్పగించడానికి అనుమతి యిచ్చింది. సొరంగాల తవ్వకం కోసం టన్నెల్ బోరింగ్ మిషన్లు కొనుగోలుకు గతంలో నిధులు ఇచ్చినా, యిప్పుడు వాటిని కొనుగోలు చేసేందుకు మొదటి సొరంగం కాంట్రాక్టరుకు 52 కోట్లు, 2వ సొరంగం కాంట్రాక్టరుకు 120 కోట్లు యివ్వాలన్న ప్రతిపాదనకు ఆర్థిక శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. మొదటి సొరంగంలో మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని రూ. 291 కోట్లు, 2వ సొరంగంలో మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని 720 కోట్లకు పెంచడం జరిగింది. ఈ పెంపుదలలో భారీగా అవినీతి చోటుకుందని ఆరోపణలు వినవస్తున్నాయి. వెలిగొండ ప్రాజెక్టులో పనిచేయకుండానే రూ. 11.67 కోట్లను కడప జిల్లా టి.డి.పి. అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి సంబంధించిన సంస్థకు చెల్లించడం జరిగిందని సమాచారం.

### కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీకి దిగువన రెండు కొత్తబ్యారేజీల నిర్మాణం:

అనేక సంవత్సరములుగా నిర్మాణంలో ఉండి పూర్తికాని మధ్యతరహా ప్రాజెక్టులు ఉన్నాయి. ఒరిస్సా ప్రభుత్వంతో చర్చించి ఒక అంగీకారానికి రాలేకపోయినందున వంశధార రెండవ దశ పనులు, నాగావళి నదిపైన పనులను పూర్తిస్థాయిలో చేపట్టడానికి ఆటంకం కలుగుతూ ఉంది. హీర మండలం రిజర్వాయర్ నుండి నారాయణ్‌పూర్ బ్యారేజి వద్దకు వంశధార, నాగావళి నదులను కలిపే లింక్ కెనాల్‌ను వెంటనే చేపట్టడం అవసరం. అందువలన 50వేల ఎకరముల ఆయకట్టుకు ప్రయోజనం చేకూరుతుంది. తాటిపూడి మున్నగు పలు ప్రాజెక్టులు భూసేకరణ పూర్తికానందున లక్ష్యం మేరకు సాగునీటిని అందించలేక పోతున్నాయి. వీటిపైన దృష్టి సారించి, ఆయా సమస్యలను పరిష్కరించి, వీలైనంత త్వరగా ఆ ప్రాజెక్టుల పనులను పూర్తిచేయవలసిన అవసరం వుంది. ఇవి ప్రక్కనపెట్టి యిప్పుడు కొత్తగా ప్రకాశం బ్యారేజీకి దిగువన యనమలకుదురు సమీపములో 1.2 కి.మీ.ల పొడవున బ్యారేజీ నిర్మించాలని, దానికి జాతీయ హోదా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తూ ఉంది. ఇదికాక యింకా కొంత దిగువన ఓలేరు వద్ద మరొక బ్యారేజీని 3 నుండి 4 కి.మీ.ల పొడవున నిర్మించాలని ఆలోచిస్తూ వుంది. ఇవి చేపట్టేందుకు నిధుల లభ్యత గురించి స్పష్టత లేదు. ఈ రెండు బ్యారేజీల నిర్మాణానికి రూ.9.93 కోట్ల ఖర్చుతో డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయించుటకు టెండర్లు పిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం బాధ్యతరాహిత్యం. సముద్రం వైపు నుండి సముద్ర జలాలు ఎగువకు వస్తున్నందున భూగర్భం లోనికి ఉప్పునీరు చేరుతూ ఉందని అధ్యయనాలు తెల్పుతూ ఉన్నాయి. దీనిని అరికట్టేందుకు శ్రీకాకుళం – గాజుల్లంక వద్ద కాజ్‌వే / బ్యారేజి నిర్మాణం చేస్తే ప్రయోజనం ఉంటుంది. సర్ ఆర్థర్ కాటన్ – కెప్టెన్ ఓ.ఆర్.ఆర్. లు రూపొందించిన సాంకేతికతతో చాలా తక్కువ ఖర్చుతో బ్యారేజీని నిర్మించే వీలుంటుంది.

2014లో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అప్పటికి అసంపూర్తిగా వున్న ఇరిగేషన్ ప్రాజెక్టు (పోలవరం కాక) లను రూ.17,000 కోట్లతో పూర్తి చేయవచ్చని ఇరిగేషన్ శాఖ ప్రకటించింది. ఈ 4 ఏండ్లలో ఈ ప్రాజెక్టులపైన (పోలవరం కాక) రూ.39,000 కోట్లు ఖర్చు చేయబడినా యింకా అనేక ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగుతూనే వుంది. ఇటీవల 10 మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను తనఖాపెట్టి రూ.10,000 కోట్ల నుండి రూ.20,000 కోట్ల వరకు బ్యాంకుల నుండి రుణాన్ని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించి, ఆ దిశగా ముందుకు నడుస్తూ వుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఇరిగేషన్ శాఖలో ఎస్టిమేట్లను అడ్డగోలుగా పెంచి వేస్తూ వున్న నేపథ్యంలో ఎన్ని వేల కోట్ల రూపాయిలైనా సరిపోయే పరిస్థితి కనిపించడం లేదు.

★★★

# సమీప భవిష్యత్తులో అవసరం లేని ప్రతిపాదనలు

## 1. అనంతపురం నుండి అమరావతికి తిన్నగా ఎక్స్‌ప్రెస్ హైవే:

అమరావతి రాజధాని నగరాన్ని ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యం తరువాత రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను యిస్తూ వున్న అంశం అనంతపురం నుండి అమరావతికి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ హైవేను 2019 లోపల పూర్తి చేయటం. ఎక్కడా వంపులు లేకుండా తిన్నగా 598 కి.మీ రహదారిని 4/6 వరుసలుగా గంటకు 120 నుండి 130 కి.మీ వేగంతో ప్రయాణించగలిగేలా అభివృద్ధి చేయాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తూవుంది. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డులో వరుసగా సంభవిస్తూవున్న ప్రమాదములను గమనించి తెలంగాణ ప్రభుత్వం యిటీవల 100 కి.మీ. వేగమునకు మించరాదని నిర్ణయం తీసుకున్న విషయాన్ని మరువరాదు. పలుచోట్ల చెరువులు, గ్రామములు, పట్టణములు ఉన్నచోట్ల ఫ్లై ఓవర్‌లను నిర్మించుతూ, కొండలున్న చోట్ల సొరంగమార్గములను ఏర్పాటు చేసి అనంతపురం నుండి అమరావతికి 6 గంటల సమయంలో చేరాలని ముఖ్యమంత్రిగారి సంకల్పం. యిందుకొరకు సుమారు 26,800 ఎకరముల భూమి కావల్సి ఉంటుందని అంచనా, 2013 భూసేకరణ చట్టం ద్వారా కాకుండా భూసమీకరణ విధానంలో 3 నెలల్లో తీసుకొని పనులు ప్రారంభింప చేయాలని ప్రభుత్వం భావించింది. రాష్ట్రప్రభుత్వం తన ఖర్చుతో భూమిని సమకూరిస్తే కేంద్రప్రభుత్వం రూ.27,600 కోట్లతో ఈ రహదారిని అభివృద్ధి చేయుటకు సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ ఎక్స్‌ప్రెస్ వే కొరకు 9,224 హెక్టార్ల అటవీ భూమి కూడా అవసరమౌతుంది. యిందుకు సుదీర్ఘ ప్రక్రియ / పరిశీలన అనంతరం కేంద్రప్రభుత్వం అనుమతించవలసి ఉంటుంది. యింతవరకు కేంద్రప్రభుత్వ అటవీ మరియు పర్యావరణ శాఖకు రాష్ట్రప్రభుత్వం నుండి ప్రతిపాదన వెళ్ళలేదు. రక్షిత పులుల అభయారణ్య అటవీ విస్తీర్ణంలో హెచ్చు భూమిని ఇవ్వడానికి వీలు పడదు. అయినా ఈ అసంబద్ధ ప్రతిపాదనను ఆఘమేఘాల మీద ముందుకు నడిపించాలని ప్రయత్నించడంలో ఆంతర్యం బోధపడటం లేదు.

ఈ ఎక్స్‌ప్రెస్ హైవేకి కొన్ని ప్రధాన రహదారులు కలియు కూడళ్ళలో 250 నుండి 300 ఎకరాలను రైతుల నుండి తీసుకోవాలని ప్రయత్నించడం ఎంతమాత్రమూ తగదు.

## ప్రత్యామ్నాయ ప్రతిపాదనను పరిశీలించవద్దా?

అనంతపురం నుండి అమరావతి రాజధానికి ప్రయాణ కాలం తగ్గించాలనే భావనకు ఎవరూ వ్యతిరేకం కాదు. అదే సమయంలో ఏ విధంగా, ఏ మేరకు రాష్ట్రప్రభుత్వం పైన తక్కువ వ్యయభారం పడుతుందో, రైతులకు నష్టం కలుగచేయనిరీతిలో చేపట్టవచ్చో ఆలోచించవలసిన అవసరం చాలావుంది. ఆ కోణంలో చూసినపుడు ఇప్పటికే అనంతపురం నుండి కర్నూలు వరకు 146 కి.మీ. జాతీయ రహదారి ఎన్.హెచ్. 44 ఉన్నది. 2 గం.15 ని.లలో అనంతపురం నుండి కర్నూలుకు చేరుకోవచ్చు. కర్నూలు నుండి గుంటూరుకు 283 కి.మీ. దూరం వుంది. కర్నూలు నుండి నందికొట్కూరు, ఆత్మకూరు, డోర్నాల, తోకపల్లి, నరసరావుపేట నుండి గుంటూరుకు ఉన్న స్టేట్ హైవే (ఎస్.హెచ్. 50) ను జాతీయ రహదారిగా నాలుగు లైన్ల వెడల్పున అభివృద్ధి చేయుటకు కేంద్రప్రభుత్వం అంగీకరించి వుంది. దీనివలన రాష్ట్రప్రభుత్వం పైన ఎంతమాత్రం భారం పడదు. జాతీయ రహదారిగా నాలుగు వరుసలుగా అభివృద్ధి చేసిన దరిమిలా కర్నూలు నుండి గుంటూరు 5 గం.లలో చేరుకోవచ్చు. మొత్తం మీద అనంతపురం నుంచి గం.7-15ని.లలో గుంటూరునకు చేరుకునే వీలుంటుంది. ఈ మార్గములో అవసరమైన చోట నుండి అమరావతి రాజధానిలోనికి మార్గమును అభివృద్ధి చేసుకొనవచ్చును.

గతంలో చంద్రబాబునాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న 9సం.ల కాలంలో హైద్రాబాద్ తర్వాత అత్యంత ప్రాముఖ్యత కలిగి, కోస్తాకు గుండెకాయ వంటి విజయవాడ నగరానికి లోగడ నుంచి వున్న జాతీయ రహదారిని 4 లైన్ల రహదారిగా కేంద్రప్రభుత్వం చేత అభివృద్ధి చేయించాలనే ప్రయత్నం చేయలేదు. అనేక సంవత్సరాలపాటు సమయం అవసరం అయ్యే యిటువంటి భారీ ప్రాజెక్టు 2019 నాటికి పూర్తయ్యే అవకాశం ఎట్టి పరిస్థితులలోనూ వుండదు. అటువంటి ఈ పథకం కొరకు భూసమీకరణ విధానంలో భూములను తీసుకొంటే రైతాంగం తీవ్రంగా నష్టపోతుంది. అసలే సర్వేయర్ల కొరతతో రైతాంగం అనేక అవస్థలపాలౌతూ వుంటే జిల్లా రెవిన్యూ యంత్రాంగాన్ని అనేక నెలలపాటు యీ అసందర్భ ప్రతిపాదనపై వినియోగించడం క్షమార్హంకాదు.

## అ - అ ఎక్స్‌ప్రెస్ హైవేకు 200 మీటర్ల వెడల్పు అవసరమా?

సాధారణంగా జాతీయ రహదారులు 60 మీటర్ల వెడల్పు (200')లో వుంటాయి. ఎక్స్‌ప్రెస్ హైవేలను కొన్నింటిని వందమీటర్ల వెడల్పులో అభివృద్ధి చేశారు. ఉదాహరణకు అత్యంత రద్దీగా ఉండే ఢిల్లీ ప్రక్కన నోయిడా నుండి ఆగ్రా వరకు 165 కి.మీ.ల "యమునా ఎక్స్‌ప్రెస్ హైవే"ను 2007-2012ల మధ్య జె.పి. అసోసియేట్స్ సంస్థ ఆరు లైన్లతో నిర్మించింది. దీనిని భవిష్యత్తులో ఎనిమిది లైన్లకు విస్తరించే అవకాశం వుంది. ఈ రహదారిపైన కార్లకు రూ.410/-, బస్సులు/ట్రక్కులకు రూ.1150/- టోల్ రుసుము వసూలు చేయబడుతూ వుంటుంది. కడప జిల్లా కోడూరు నుండి బత్తినపల్లి, తాడిపత్రి-కొడిమిగుంట్ల-బనగానపల్లి- గిద్దలూరు - కంభం - తోకపల్లి - వినుకొండ - నరసరావుపేట నుండి గుంటూరు వద్ద ఎన్.హెచ్-16ను కలుపు 516 కి.మీ.ల రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా అభివృద్ధి చేయుటకు కేంద్ర ఉపరితల రవాణాశాఖ అంగీకరించి ఉంది. అనంతపురం నుండి కోడూరు వరకు కూడా అభివృద్ధిపరిస్తే సరిపోతుంది. అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే వెడల్పును 200 మీ.ల నుండి 100 మీ.కి తగ్గించాలని, అందుకనుగుణంగా డి.పి.ఆర్.ను తయారుచేసి పంపాలని యిటీవల కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

## అ - అ ఎక్స్‌ప్రెస్ హైవేకు సమాంతర రైల్వే లైను సాధ్యమా?

ఈ ఎక్స్‌ప్రెస్ హైవేకు సమాంతరముగా రైల్వే లైను కూడా వేయాలని ముఖ్యమంత్రిగారి అభిలాష. అయితే గుంతకల్లు నుండి గుంటూరునకు 443 కి.మీ.ల రైలు మార్గమును డబ్లింగ్ చేయుటకు రైల్వే మంత్రిత్వశాఖ ఆమోదించి ప్రస్తుత బడ్జెట్‌లో రూ.124 కోట్లు కేటాయించి వుంది. ఈ లైన్‌ను విద్యుదీకరించడానికి కూడా చర్యలు చేపట్టబడ్డాయి. బెంగుళూరు నుండి గుంటూరు, హుబ్లి నుండి గుంటూరు మీదుగా అనేక ఎక్స్‌ప్రెస్ రైళ్ళతో సహా పలు రైళ్ళు నడుస్తూ ఉన్నాయి. అలాగే గుత్తి నుండి ధర్మవరం రైల్వే లైన్‌ను కూడా డబ్లింగ్ చేయుటకు రైల్వే శాఖ చర్యలను చేపట్టింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు నాయుడు గారి సమాంతర రైల్వే లైను కోర్కె ఎట్టి పరిస్థితుల్లోనూ సాఫల్యం అయ్యే అవకాశం లేదు.

## ముందు భూసేకరణ, తదుపరి భూసమీకరణ:

భారతదేశంలో అత్యంత పొడవైన, వంపులు లేని ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మించాలనే ముఖ్యమంత్రి గారి గొంతెమ్మ కోర్కె వలన గుంటూరు జిల్లాలో 92 కి.మీ.ల రోడ్డు నిడివిలో 8 మండలాలలోని 31 గ్రామాలలో 4,575 ఎకరముల భూమిని రైతులు కోల్పోవలసి వుంటుంది. ఈ భూమిని వీలైనంతవరకు భూసమీకరణ విధానంలో

తీసుకోవాలని ప్రభుత్వం ఆలోచించుతూ ఉండటం ఎంతమాత్రం సమర్ధనీయం కాదు. రైతుల భూములకు నష్టపరిహారం యివ్వకుండానే భూసమీకరణ విధానంలో భూములు తీసుకుని వారికి కూడళ్ళ కొరకు తీసుకునే 250 లేక 300 ఎకరాల భూములలో ఎకరాకు 20 లేక 25 సెంట్లు యిచ్చేలా ప్రయత్నం జరుగుతుంది. ప్రత్యామ్నాయములను గురించి ఆలోచన చేయకుండా ఏకపక్షంగా "లేడికి లేచిందే పరుగు" అన్నట్లుగా భారీమొత్తంలో ఫీజులు చెల్లించి, డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టులను ప్రైవేట్ కన్సల్టెంట్‌లచేత తయారు చేయించడం ఎంతమాత్రం సరికాదు.

## అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు:

తాజాగా అమరావతి ఔటర్ రింగురోడ్డును 197.5 కి.మీ. నిడివితో 150 మీటర్ల (500') వెడల్పుతో ప్రస్తుతం 6 వరుసలుగా నిర్మించి, భవిష్యత్తులో 8 వరుసల రహదారిగా, అదనంగా రెండు సర్వీసు రోడ్డులను ఏర్పాటు చెయ్యాలని ప్రభుత్వం నిర్ణయించింది. విజయవాడకు తూర్పు వైపున 4.5 కి.మీ. నిడివితో మరియు బ్యారేజీకు పడమర వైపున, 3.5 కి.మీ. నిడివితో కృష్ణా నది పైన రెండు బ్రిడ్జీలు రావలసి వుంటుంది. గుంటూరు జిల్లాలో అమరావతి, ధరణికోట, కంభంపాడు, పాములపాడు, వరగాని, సిరిపురం, మందపాడు, డోకిపర్రు, పేరేచర్ల, కొర్నిపాడు, గొడవర్రు, నారాకోడూరు, వేజెండ్ల, గుడివాడ, నందివెలుగు, చింతలపూడి, ఈమని, మున్నంగి, వల్లభాపురం మున్నగు 32 గ్రామాల మీదుగా, కృష్ణా జిల్లాలో వల్లూరుపాలెం, దావులూరు, నెప్పల్లి, మానికొండ, తరిగొప్పుల, పెదఅవుటపల్లి, ఆత్కూరు, పొట్టిపాడు, తేలప్రోలు, సూరవరం, నర్సింగపాలెం, సగ్గూరు, ఆగిరిపల్లి, కోడూరు, చిననందిగామ, గంగినేని, పొన్నవరం, కంచికచర్ల, మోగులూరు, మున్నలూరు మున్నగు 42 గ్రామాల మీదుగా ఈ అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు కొరకు 8వేల ఎకరముల భూమి కావాలి. ఈ ఔటర్ రింగు రోడ్డు కొరకు అవసరమైన భూమిని రాష్ట్రప్రభుత్వం 6 నెలల లోపు సేకరించి కేంద్రప్రభుత్వానికి అప్పచెప్పితే రూ.20వేల కోట్ల వ్యయంతో సుమారు 3 సం॥ల వ్యవధిలో పూర్తిచేయగలమని కేంద్రం చెబుతూ వుంది. కృష్ణా జిల్లాకు, మచిలీపట్నం ఓడరేవుకు అత్యంత అవసరమైన విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి 60 మీటర్ల వెడల్పుతో దాదాపు దశాబ్దకాలం గడిచిన దరిమిలా, ఇటీవలే ప్రారంభించబడింది. అనేక జాతీయ రహదారులు 60 మీటర్ల వెడల్పుతో ఉంటూ ఉండగా, అమరావతి ఔటర్ రింగు రోడ్డునకు 150 మీటర్లు (500') అవసరమని భావించడం ఎంతమాత్రమూ సరికాదు. ఈ ఔటర్ రింగురోడ్డు కొరకు రెవిన్యూ అధికారులు సర్వేరాళ్ళు పాతటం చట్టవిరుద్ధమే కాక, అసంబద్ధం కూడా. రైతుల

అనుమతి లేనిదే, నోటిఫికేషన్ ప్రకటించకుండానే రైతుల భూములలో సర్వే రాళ్ళు పాతటం ప్రభుత్వం యొక్క అహంకారానికి నిదర్శనం. మైలవరం ప్రాంతంలో సొరంగమార్గం పొడవు 4.5 కి.మీ. సొరంగ మార్గం కూడా 8 వరసలతో విశాలంగా వుండాలన్నారు. ఒ.ఆర్.ఆర్.ను ఆనుకొని రైల్వే లైను వేయాలని ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని రైల్వే అధికారులకు ఆయన సూచించారు. అటవీశాఖ అనుమతులు వచ్చేలాగ కేంద్రంతో మాట్లాడతానన్నారు. ఒ.ఆర్.ఆర్. మార్గంలో వచ్చే వారధులన్నీ ఐకానిక్ బ్రిడ్జిలుగా వుండాలన్నారు. విశాఖ నుంచి అటు తడ ఇటు కాకినాడ వరకు నిర్మించబోయే బీచ్ రోడ్డు - అమెరికాలోని లాస్ఏంజిల్స్ - శాండియాగో బీచ్‌రోడ్‌లా వుండాలని అధికారులకు సూచించారు.

## అమరావతి ఔటర్ రింగురోడ్డు సమీప కాలంలో అవసరమా?

అసలు అమరావతి ఔటర్ రింగురోడ్డు సమీప కాలంలో అవసరమా అని పరిశీలించవలసి వుంటుంది. గతంలో చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉండగా దేశంలోనే అత్యంత పొడవైన 158 కి.మీ.ల హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు ప్రణాళికను ఆమోదించటం జరిగింది. ఇప్పటికి ఇంకా అందులో దాదాపు 20 కి.మీ.ల మేర పూర్తి కావలసి ఉంది. ఆశించిన ట్రాఫిక్‌లో యిప్పటికి 15% స్థాయికి కూడా చేరలేదు. ఔటర్ రింగు రోడ్డు ఢిల్లీ నగరంలో 87 కి.మీ., అహ్మదాబాద్‌లో 76 కి.మీ., చెన్నైలో 62 కి.మీ., బెంగుళూరులో 60 కి.మీ. ఉండగా ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత పొడవైన 197.5 కి.మీ.ల అమరావతి ఔటర్‌రింగ్ రోడ్డు నిర్మించాలని ముఖ్యమంత్రిగారు భావించటం ఎంతమాత్రమూ తగదు. విజయవాడ-చెన్నై ఎన్.హెచ్.16, విజయవాడ-మచిలీపట్నం ఎన్.హెచ్.65, విజయవాడ- జగదల్‌పూర్ ఎన్.హెచ్. 221, విజయవాడ-విశాఖపట్నం ఎన్.హెచ్. 16, విజయవాడ-హైదరాబాద్ ఎన్.హెచ్-9 విజయవాడ మీదుగా వెళుతూ ఉన్నాయి. విజయవాడ-గుంటూరు ఎన్.హెచ్.5 కాజ వద్ద నుండి వెంకటపాలెం మీదుగా కృష్ణా నదిని దాటి గొల్లపూడి శివారు సూరాయపాలెం మీదుగా విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిని దాటి పెదఅవుటపల్లి వద్ద విజయవాడ-విశాఖపట్నం జాతీయ రహదారిని కలుపుటకు యిప్పటికే విజయవాడ బైపాస్ పనులు జరుగుతూ వున్నాయి. గుంటూరు -తెనాలి - రేపల్లె - పులిగడ్డ - చల్లపల్లి - పామర్రు - గుడివాడ - హనుమాన్ జంక్షన్ వరకు యిప్పుడు వున్న రాష్ట్ర రహదారులను 2.5 మీ. చొప్పున ఇరువైపులా షోల్డర్స్‌ను వెడల్పు చేసుకొంటూ వెళితే సరిపోతుంది. యిందుకొరకు భూసేకరణ చేయవలసిన అవసరమే ఉండదు.

## ముఖ్యమంత్రిగారి పగటి కల కొరకు వేలాది రైతులు శాశ్వతంగా నష్టపోవాలా?

ముందు భూసేకరణ నోటిఫికేషన్ యిచ్చి దరిమిలా భూసమీకరణ నోటిఫికేషన్ యివ్వడం రాష్ట్రప్రభుత్వానికి పరిపాటి అయ్యింది. హైదరాబాద్ ఔటర్ రింగురోడ్డు పరిసరాలలో దాదాపు భూములన్నీ రాళ్ళు, రప్పలు, తుప్పలతో ఉంటాయి. వ్యవసాయం పెద్దగా ఉండదు. కానీ కృష్ణా, గుంటూరు జిల్లాలలో ప్రతిపాదిత ఔటర్ రింగురోడ్డు అలైన్‌మెంట్‌లో కొండలు, అటవీభూమి మినహాగా ప్రతిఒక్క ఎకరం భూమిలోనూ పంటలు పండించబడుతూ ఉంటాయి. వాస్తవ అవసరం లేకపోయినా ప్రపంచంలో అత్యంత పొడవైన ఔటర్ రింగ్‌రోడ్డు వేయించాలనే ముఖ్యమంత్రిగారి పగటికల కొరకు వేలాదిమంది రైతులు శాశ్వతంగా నష్టపోతారు. కేంద్ర 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోవు రైతులకు 4 రెట్లు నష్ట పరిహారం ఇవ్వాల్సి ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం 2.5 రెట్లకు తగ్గించింది. యిప్పుడు కొత్తగా "జిల్లా కలెక్టర్లతో చర్చలు–ఆమోదం" సాకుతో దీనిని 0.5 రెట్లకు (50%) తగ్గించటం కంటే అన్యాయం మరొకటుండదు. కావున రైతుసోదరులు రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేయాలనుకున్నప్పుడు సామాజిక ప్రభావ అంచనా, రైతుల ఆమోదం, నాలుగురెట్ల నష్టపరిహారము ఉంటేనే తాము అంగీకరించు తామని స్పష్టంగా చెప్పవలసి ఉంటుంది. భూసమీకరణ విధానంలో తీసుకోవాలని ప్రభుత్వం భావించినప్పుడు అందుకు తాము సుతరామూ అంగీకరించబోమని స్పష్టంగా తెలియపర్చాలి.

## అమరావతి ఇన్నర్ రింగు రోడ్డు:

97.5 కి.మీ పొడవైన అమరావతి ఇన్నర్ రింగు రోడ్డును వైకుంఠపురం, పెదపరిమి, తాడికొండ, చినకాకాని, పెదవడ్లపూడి, నూతక్కి, పెనమలూరు, నిడమానూరు, నున్న, గొల్లపూడి, ఇబ్రహీంపట్నం గ్రామాల ప్రక్కగా నిర్మించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. 75 మీ. (250') వెడల్పుతో నిర్మించబోయే ఈ ఇన్నర్ రింగు రోడ్డు కొరకు 3,556 ఎకరముల భూమి అవసరం అవుతుంది. బ్యారేజీకి పడమర ప్రక్కన 2.5 కి.మీ. నిడివి, బ్యారేజీకి తూర్పు వైపున 2 కి.మీ. నిడివితో కృష్ణా నది పైన 2 బ్రిడ్జిలు రావలసి వుంటుంది. ఈ ఇన్నర్ రింగు రోడ్డు కొరకు అయ్యే రూ.7,624 కోట్లు ఖర్చు మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. బెంగుళూరు, చెన్నై, మున్నగు నగరాలలో 100 అడుగుల వెడల్పులో 4 లైన్లతో ఇన్నర్ రింగు రోడ్లు వున్నాయి.

ఈ ఇన్నర్ రింగ్ రోడ్డునకు ఇరువైపులా 500 మీటర్ల వెడల్పు చొప్పున కారిడార్‌లను ఏర్పాటు చేయాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తూ వుంది. అందువలన మొత్తంగా 16,556

ఎకరాల భూమిని భూసమీకరణ విధానంలో తీసుకోవాలని ప్రభుత్వం తలపోస్తూ వుండటం విడ్డూరం.

హైదరాబాద్ ఐ.ఆర్.ఆర్. 50 కి.మీ., చెన్నై ఐ.ఆర్.ఆర్. 25.2 కి.మీ., బెంగుళూరు ఐ.ఆర్.ఆర్. 10 కి.మీ., ఢిల్లీ ఐ.ఆర్.ఆర్. 55 కి.మీ., భువనేశ్వర్ ఐ.ఆర్.ఆర్. 65 కి.మీ. మాత్రమే ఉన్నాయి. చినకాకాని, పెదవడ్లపూడి నూతక్కి వద్ద కృష్ణా నదిని దాటి కాసరనేని వారిపాలెం, పెనమలూరు, నిడమానూరు మీదుగా గొల్లపూడి–పెదఅవుటపల్లి బైపాస్‌ను కలిపితే సరిపోతుంది.

## నవ్యాంధ్రప్రదేశ్‌లో 4 భారీ కన్వెన్షన్ సెంటర్లు:

విజయవాడ సమీపమున ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణానది ఒడ్డున 33 ఎకరముల ప్రభుత్వ భూమిలో రూ.263 కోట్ల ఖర్చుతో 4,000 మంది కూర్చునేలా కన్వెన్షన్ సెంటర్, 4స్టార్ హోటల్, 50వేల చ.అ. ఎగ్జిబిషన్ సెంటర్, కమర్షియల్ కాంప్లెక్స్/ప్లాజా నిర్మించుటకు టెండర్లును పిలిచింది ప్రభుత్వం.

అమరావతిలో దుబాయ్‌కి చెందిన బి.ఆర్. షెట్టి రూ.1200 కోట్ల ఖర్చుతో 10వేల మంది కూర్చుండుటకు వీలుగా అతి పెద్ద ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటరు, ఒక ఎగ్జిబిషన్ సెంటరు, ఒక 5స్టార్ హోటల్ మరియు ఎమ్యూజ్‌మెంట్ పార్కులను నిర్మించుటకు యిచ్చిన ప్రతిపాదనలను రాష్ట్రప్రభుత్వం ఆమోదించి ఎం.ఒ.యు. కుదుర్చుకున్నది.

విశాఖపట్నం నగరంలో 13.8 ఎకరముల విస్తీర్ణంలో రూ.700 కోట్ల రూపాయల ఖర్చుతో 10వేల మంది కూర్చుండుటకు వీలుగా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌ను, 5స్టార్ హోటల్, ఎగ్జిబిషన్ సెంటర్, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మింప చెయ్యాలని, లూలూ సంస్థతో అవగాహన ఏర్పాటయ్యింది. అలాగే తిరుపతిలో మరొక 10వేల మంది కూర్చునే ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చెయ్యాలని ప్రభుత్వం భావిస్తూవుంది. "బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్" (బి.ఒ.టి) ప్రాతిపదికపై ఇన్ క్యాప్ యిప్పటికే టెండర్లను కూడా పిలిచింది.

అమరావతిలో భారీ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ రాబోతూ వుండగా పవిత్ర సంగమం వద్ద మరొక ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ అవసరమా అని ప్రభుత్వం ఆలోచించాలి. దాదాపు 80 లక్షల జనాభా కలిగిన హైదరాబాద్ నగరంలో 15 ఎకరముల విస్తీర్ణంలో 6వేలమంది కూర్చుండుటకు వీలుగా, భారతదేశంలోనే అతిపెద్ద కన్వెన్షన్ సెంటరుగా పేరుపొందిన "హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్" తగినంత ఆక్యుపెన్సీ లేక లాభదాయకముగా నడవని పరిస్థితి కనిపించుతూ వుంది.

## కృష్ణా జిల్లా పరిటాల వద్ద 5,000 ఎకరములలో ఎకనామిక్ సిటి కొరకు భూసమీకరణ ప్రతిపాదన

అమరావతి రాజధానిలో ప్రతిపాదిత నవ నగరాలలో ఆర్థిక నగరానికి 5,168 ఎకరముల భూమి కేటాయించబడింది. అమరావతి రాజధాని ప్రాంతంలో శాశ్వత ప్రాతిపదికన ప్రభుత్వ భవనముల నిర్మాణ కార్యక్రమము యిటీవలే ప్రారంభం అయ్యింది. కొన్ని విద్యా సంస్థలు తమ శాఖలను ఏర్పాటు చేసేందుకు భవనాలను నిర్మించాయి. యిప్పటికి ఆర్థిక నగరంలో పెట్టుబడులు పెట్టేదానికి ఏ సంస్థలు, ఏ మేరకు పెట్టుబడులు పెడతాయో, వాస్తవంగా వాటికి ఎంతమేరకు భూములు అవసరమవుతాయో యింతవరకు స్పష్టమైన అవగాహనే లేదు. ఇటువంటి పరిస్థితులలో కృష్ణా జిల్లా, కంచికచర్ల మండలం, పరిటాల వద్ద "ఎకనామిక్ సిటీని" ఏర్పాటు చేయుటకు భూసమీకరణ విధానంలో 5వేల ఎకరాలను తీసుకోవాలని జిల్లా అధికార యంత్రాగాన్ని ముఖ్యమంత్రిగారు ఆదేశించినట్లు వార్తలు వచ్చాయి. లోగడ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వుండగా పరిటాల వద్ద 1,800 ఎకరాలలో టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన వచ్చినప్పుడు నాడు ప్రతిపక్షంలో వున్న తెలుగుదేశం తీవ్రంగా వ్యతిరేకించి ఆందోళన చేపట్టింది. స్థానిక ప్రజావ్యతిరేకతను గమనించిన రాజశేఖర రెడ్డి ప్రభుత్వం జి.ఒ.ను ఉపసంహరించుకుంది.

## కూచిపూడి నాట్యారామమునకు 24 ఎకరాల భూమి సరిపోదా?

కృష్ణా జిల్లా, మొవ్వ మండలం, కూచిపూడి గ్రామంలో య.8–00లలో సిద్దేంద్ర కళాక్షేత్రం తెలుగు యూనివర్శిటీలో అంతర్భాగంగా పనిచేస్తూ వుంది. ఇప్పటికే అందులో పలు భవనములు నిర్మించబడి ఉన్నాయి, యింకా చాలా ఖాళీ ప్రదేశం ఉంది. ఇటీవల రాష్ట్రప్రభుత్వం కూచిపూడి గ్రామంలో సుమారు 100 ఎకరముల భూమిని సేకరించి ఈ కళాక్షేత్రంనకు అనుసంధానం చేసి కూచిపూడి నృత్యమును అభివృద్ధి పర్చాలని నిర్ణయించింది. అమరావతి రాజధానిలో పెద్దఎత్తున కూచిపూడి నృత్య కళను ప్రపంచ స్థాయికి తీసుకువెళ్ళాలని, అందుకు అవసరమైన పథకాన్ని చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఉన్నందున కూచిపూడిలో ఏనాడో నైజాం నవాబు కాలములో ఈనాములుగా యివ్వబడిన భూములను తీసుకొనడం సరికాదని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఇటీవల 100 ఎకరాల బదులు య.56.11 సెంట్లు భూమిని సేకరించాలని జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించింది. వాస్తవానికి

యిప్పుడు ఉన్న 8 ఎకరాలకు ఆనుకుని దేవస్థానం భూమి 16 ఎకరాలు ఉంది. ప్రస్తుతం ఎకరాకు 11 బస్తాల చొప్పునే కౌలు దేవస్థానమునకు జమ అవుతూ ఉంది. ఈ భూమిని తీసుకుంటే ఎకరాకు రూ. 35 లక్షల చొప్పున మొత్తం నష్ట పరిహారం రూ. 3. 85 కోట్లు దేవస్థానమునకు జమపడుతుంది. మొత్తంగా 24 ఎకరాలు భూమి కూచిపూడి నాట్యారామంనకు అందుబాటులో ఉంటుంది. ఇంతకన్నా అధికంగా భూమి ఎంతమాత్రమూ అవసరం ఉండదు.

★★★

# ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా కార్పోరేట్లకు కట్టబెట్టడం తగునా?

## స్వరాజ్ మైదానమును విజయవాడ స్క్వేర్‌గా రూపొందించాలనే ప్రయత్నం

విజయవాడ నగరములో ఉన్న ఏకైక అతి పెద్ద ఖాళీ స్థలము స్వరాజ్యమైదాన్. స్వాతంత్ర్య పోరాట సమయములో కాంగ్రెస్ మహా సభలు ఇక్కడ జరగడము, పింగళి వెంకయ్య గారు జాతీయ పతాక నమూనాను రూపొందించి మహాత్మాగాంధి గారికి అందచేయడము జరిగినది. చారిత్రాత్మక అఖిల భారత రైతు మహాసభ కూడా యిక్కడే జరిగింది. పలువురు ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రఖ్యాత నాయకులు ఇక్కడ జరిగిన బహిరంగ సభలలో పాల్గొన్నారు. ఏటా బుక్ ఎగ్జిబిషన్ మరియు వ్యవసాయక పారిశ్రామిక ఎగ్జిబిషన్‌లు నిర్వహించబడుతూ వున్నాయి. వేలాదిమంది విద్యార్థులకు, అధ్యాపకులకు, విద్యాసంస్థలకు ఎంతో విలువైన నూతన పుస్తకములు, పరిశోధనా పత్రములు అందుతూ వుంటాయి. రైతులకు నూతన పనిముట్లు, యంత్రసామాగ్రిల పట్ల అవగాహన పెరుగుతుంది. పెద్ద స్థాయిలో ఆధ్యాత్మిక సమావేశములు జరుగుతూ వుంటాయి. ప్రతినిత్యము వందలాదిమంది విద్యార్థులు ఆడుకొంటూ ఉంటారు. ఇన్ని విధాలుగా విజయవాడ నగర పౌరులకేకాక పరిసర జిల్లాలలోని లక్షలాదిమంది ప్రజలకు అనేకవిధాలుగా ఉపయోగపడుతూ వున్న ఈ స్వరాజ్యమైదానమును చైనాకు చెందిన జి.ఐ.ఐ.సి సంస్థచేత షాపింగ్‌మాల్స్, పెద్దపెద్దవ్యాపార సంస్థలకు ఉపయోగపడేలా ఆఫీసు కాంప్లెక్స్, ఎమ్యూజ్‌మెంట్ పార్కులు, ఫైవ్ స్టార్ హోటల్, మున్నగునవి ఉండేలా "విజయవాడ స్క్వేర్" నిర్మించాలని ముఖ్యమంత్రి ఆలోచన చేయటము ఎంతమాత్రము తగదు. ఈ అంశంపైన నేను ఏపి హైకోర్టులో పిల్ దాఖలు చేసి ఉన్నాను. అమరావతి రాజధానిలో ప్రధానమంత్రి శంకుస్థాపన చేసిన ప్రదేశములో విశాలమైన స్థలములో "అమరావతి స్క్వేర్"ను నిర్మించే ప్రతిపాదన ఉండగా, విజయవాడలోని స్వరాజ్య మైదానమును విజయవాడ స్క్వేర్స్‌గా నిర్మించదలచిన ప్రతిపాదనను వెంటనే విరమించవలసిన అవసరము ఎంతైనా ఉంది.

## రూ. 1,000 కోట్ల విలువ చేయు స్థలాన్ని కారుచౌకగా చైనా కంపెనీకి కట్టబెట్టడంలో ఆంతర్యం ఏమి?

విజయవాడ ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయ ప్రాంగణంలో రాష్ట్ర విభజన అనంతరం ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ కార్యాలయం కొరకు నిర్మించబడిన నూతన భవనాన్ని తొలుత రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి, దరిమిలా ముఖ్యమంత్రి గారు క్యాంపు కార్యాలయంగా వాడుకుంటూ ఉండుట వలన కృష్ణా ఈస్ట్రన్ డివిజన్, సెంట్రల్ డివిజన్, మోడరనైజేషన్ మున్నగు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల కార్యాలయములు, నివాస భవనములు స్వరాజ్ మైదానం ఉత్తరం వైపున నూతనముగా నిర్మించబడ్డాయి.

విజయవాడ స్క్వేర్ ప్రతిపాదనలో భాగంగా వీటన్నిటినీ కూలగొట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తూ ఉండటం అత్యంత దురదృష్టకరం. అంతేకాక ప్రస్తుతం ఉన్న పాత, కొత్త స్టేట్ గెస్ట్‌హౌస్‌లతోపాటు మరికొన్ని ప్రభుత్వ కార్యాలయములను కూడా కూలగొట్టి మొత్తం దాదాపు రూ.1,000 కోట్లు విలువచేసే 25 ఎకరముల భూమిని రూ.135 కోట్ల పెట్టుబడి పెట్టే చైనాకు చెందిన జి.ఐ.ఐ.సి.కి ప్రభుత్వ - ప్రైవేట్ భాగస్వామ్యం (పి.పి.పి) పద్ధతిలో కట్టబెట్టడంలోని ఆంతర్యం చంద్రబాబునాయుడు గారికే ఎరుక.

## విద్యుత్ శాఖకు చెందిన య.4-80 సెంట్లు భూమిని ప్రైవేటుపరం చేయటం తగునా?

విజయవాడలో ఏలూరు రోడ్డుకు ఆనుకుని గుణదల వద్ద పలు దశాబ్దములుగా విద్యుత్ శాఖ క్రింద ఉన్న య.4-80 సెంట్లు భూమిని పర్యాటక రంగ ప్రోత్సాహము కొరకు అనే సాకుతో ఎ.పి.ఐ.ఐ.సి. సంస్థకు 99 సం.ల లీజు ప్రాతిపదికన ట్రాన్స్‌ఫర్ చేసి, దరిమిలా ప్రైవేటు ప్రముఖ కార్పోరేట్ సంస్థ చేత స్టార్ హోటల్ నిర్మింపచేయాలనే నిర్ణయంను ప్రభుత్వం తీసుకుంది. విద్యుత్ శాఖకు తెలుపకుండానే, వారి అంగీకారం లేకుండానే ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకువెళ్లేందుకు జిల్లా కలెక్టర్ ప్రయత్నించారు. హైదరాబాద్‌లో విద్యుత్ సౌధలో పనిచేస్తూవున్న ఎ.పి. ట్రాన్స్‌కో, ఎ.పి. జెన్‌కో, ఎ.పి. డిస్కమ్‌లు ఇప్పుడు విధిగా విజయవాడ వద్ద తమ కార్యాలయ భవనములను నిర్మించు కొనవలసిన ఆవశ్యకత ఉండగా రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ అవసరాలను పక్కనపెట్టి ప్రైవేటు వ్యక్తులకు దాదాపు రూ.200 కోట్ల విలువైన ఈ భూమిని ఇవ్వాలనుకోవటంలో తప్పనిసరిగా లోపాయికారీ వ్యవహారం ఉందనేదానికి అనుమానం లేదు. విద్యుత్ ఉద్యోగులు ప్రజా సంఘాల నిరసనల వలన తాత్కాలికంగా బ్రేక్‌పడింది.

విజయవాడలో బందరు రోడ్డులో అత్యంత విలువైన సుమారు 3 ఎకరముల కెనాల్ గెస్ట్‌హౌస్ స్థలమును పర్యాటక అభివృద్ధి పేరుతో ప్రముఖ పారిశ్రామికవేత్త

గోకరాజు గంగరాజు గారికి చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం 2003 సం.లో ఇచ్చింది. ఇప్పటికి ఆ భవనం అసంపూర్తిగానే ఉండిపోయింది. నిర్దేశిత లక్ష్యం నెరవేరలేదు. సదరు భవనం పైన గంగరాజుగారు పెట్టిన ఖర్చు ఇచ్చివేసి, ఆ భవనమును ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అనేక కార్యక్రమాలకు ఉపయోగించుకునే అవకాశం ఉంది. కానీ ఆ విషయంలో ముఖ్యమంత్రిగారు ఎందుకు చొరవ తీసుకోవడం లేదో అర్ధం కావడం లేదు.

విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ భవన సముదాయం ఉన్న స్థలం, రాజీవ్ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్, విద్యుత్ సబ్ స్టేషన్ మున్నగు వాటన్నిటినీ తొలగించి 7 స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్, మాల్ లను నిర్మించేందుకు ప్రైవేట్ సంస్థకు అప్పజెప్పాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శోచనీయం. వి.యం.సి. తన నిధులతో 7 అంతస్థుల భవనాన్ని నిర్మించే కార్యక్రమాన్ని చేపట్టి యిప్పటికే 2 అంతస్థులు నిర్మాణం జరిగి యుండగా, ముఖ్యమంత్రి యిట్టి నిర్ణయం తీసుకోవటం ఎంతమాత్రమూ తగదు.

## ఆర్.టి.సి. ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ స్థలాన్ని హెచ్.సి.ఎల్.కు యివ్వడం ధర్మమా?

గన్నవరం సమీపంలో కేసరపల్లి గ్రామం వద్ద య.17-86 సెంట్ల భూమిలో ఆర్.టి.సి. ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ నడుస్తూ వుంది. ఇప్పుడు ఈ భూమిని, దీనితోపాటు అమరావతి రాజధాని లోని ఐనవోలు గ్రామం వద్ద య.10-00ల భూమిని శివనాడార్ ఆధ్వర్యంలోని హెచ్.సి.ఎల్. కంపెనీకి యివ్వాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించడం తగదు. కేసరపల్లి సమీపంలో వీరపనేనిగూడెం వద్ద మరియు మల్లవల్లి వద్ద పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం యిప్పటికే చర్యలను ప్రారంభించింది. వీటిల్లో కాకుండా ఎయిర్‌పోర్టుకు ఎదురుగా అత్యంత విలువైన, వందల కోట్ల రూపాయల విలువచేసే ఆర్.టి.సి.కి చెందిన య.17-86 సెంట్లను హెచ్.సి.ఎల్.కు యివ్వడం ఎంతమాత్రమూ సమంజసం కాదు.

## అనిల్ అంబాని పట్ల అంత ప్రేమ ఏల?

2016 జనవరి 11న విశాఖపట్నంలో నిర్వహించబడిన పార్టనర్ షిప్ సమ్మిట్ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మరియు నిర్మలాసీతారామన్ సమక్షంలో అనిల్ అంబానీ రాంబిల్లి సమీపంలో ప్రపంచ స్థాయిలో ఓడలు నిర్మించు వ్యవస్థను రూ.5,000 కోట్లతో ఏర్పాటు చేయడానికి ఎమ్.ఒ.యు. కుదిరింది. సముద్రతీరం వెంట 3,000 ఎకరాలను ఎకరానికి ఒక్క రూపాయి చొప్పున 99 సం.ల పాటు లీజుకు యివ్వాలని అనిల్ అంబానీ ప్రతిపాదించగా రాష్ట్ర ప్రభుత్వం మొదటి దశలో

1,000 ఎకరాలను ఎకరం రూ. 17.5 లక్షల చొప్పున విక్రయించేందుకు ప్రతిపాదించింది. అయితే యింతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. "నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్" ముందు రిలయన్స్ నావల్ & ఇంజనీరింగ్ లిమిటెడ్ దాఖలు చేసిన, దివాలా ప్రతిపాదన పరిశీలనలో వుంది. అందువలన యిది ముందుకు వెళ్ళే అవకాశం ఎంత మాత్రం లేదు.

## ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ సంస్థ పట్ల ప్రత్యేక అభిమానం ఏల?

ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ సంస్థ ప్రధాన కార్యాలయం కాలిఫోర్నియాలో కేవలం 10 ఎకరాల్లో వుంది. హైదరాబాదులో ఈ సంస్థకు కేటాయించబడిన 15 ఎకరాల్లో మొదటి ఫేజులో 10 ఎకరాల్లో 3.8 లక్షల చ.అ. కార్పెట్ ఏరియాలో 1,800 మంది ఉద్యోగులు పనిచేసేలా ఏర్పాటు జరిగింది. రిజర్వుగా వుంచిన 5 ఎకరాల్లో 2వ ఫేజ్ పూర్తయిన దరిమిలా మరొక 1,000 మంది పనిచేయడానికి ఆస్కారం వుంటుంది. విశాఖనగరంలో అత్యంత ప్రాముఖ్యత మరియు భూమి విలువ కలిగిన ప్రాంతంలో 25 ఎకరాల భూమిని యివ్వవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. 2,500 మందికి హైఎండ్ ఉద్యోగాలు యిస్తామని కంపెనీ చెప్పే మాటలు ఎంతమాత్రం నమ్మశక్యం కానివి. జి.ఓ.యం.ఎస్. నెం.21, తేది 2-9-2016 ఎ.పి.వి.టి. పాలసి 2014-20లో ఐ.టి. సంస్థలకు కేటాయించబడిన భూమిలో 20శాతం భూమిని ఉద్యోగుల గృహ నిర్మాణానికి కానీ, రిక్రిషియేషన్‌కు కానీ అనుమతించవచ్చు అని వుండగా, యిప్పుడు ఫ్రాంక్లిన్ టెంపుట్లన్ సంస్థకు కేటాయించిన భూమిలో 30% భూమిని లేక నిర్మిత ఏరియాను వాణిజ్య అవసరంలకు కూడా వినియోగించుకో వచ్చనే వెసులుబాటును కల్పించడం వల్ల ఆ సంస్థకు అపరిమితమైన లాభం చేకూరుతుంది.

జి.ఓ.యం.ఎస్.నెం.21, తేది 22-9-2016లో 95 రోజుల లోపల ప్రాజెక్టు పనిని ప్రారంభించాలని, 180 రోజుల లోపల సంస్థ భవన నిర్మాణాలు ప్రారంభం కావాలని, మూడు సంవత్సరాలలో 30% మందికి, 5 సం.లో 70% మందికి, 6 సం.లో 100% మందికి ప్రతిపాదిత ఉద్యోగాలు కల్పించబడాలనే సమయ నిర్దేశకాలు (టైమ్ లైన్) ఉండగా ఈ సంస్థకు అందునుండి మినహాయింపు యిస్తూ 7 సం.లకు సమయమును పెంచటం ఎంత మాత్రమూ తగదు. ప్రతిపాదిత భూమి సమీపంలో భూముల విలువ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ప్రకారం ఎకరా రూ.2 కోట్లు ఉంది. మార్కెట్ విలువ ఎకరా రూ.10 కోట్లు ఉంది. సమీపంలో ఉడా లేఅవుట్‌లో స్థలాల విలువ చ॥గ॥మునకు రూ.9,000 నుండి రూ.12,000 ఉండగా ఎకరం రూ.32.50 లక్షల చొప్పున సదరు సంస్థకు కారుచౌకగా కట్టబెట్టడం వెనుక మతలబు ఏమిటని ప్రజలు

ఆలోచిస్తున్నారు. సుప్రీంకోర్టు 2జి కేసులో యిచ్చిన తీర్పులో ప్రభుత్వ భూములను ప్రైవేటు సంస్థలకు కారుచౌకగా కట్టబెట్టరాదని స్పష్టంగా చెప్పినా, యిలా చేయడం తెరవెనుక కొందరు పెద్దలకు కోట్ల రూపాయల లబ్ది చేకూరేందుకే అని ప్రజలు అనుమానిస్తున్నారు. వెంటనే ఈ జి.ఓ.లను రద్దుచేసి, సదరు సంస్థకు వాస్తవంగా ఎంతభూమి అవసరమో అన్నది అంచనా వేసి, అందుకు అనుగుణముగా ఎ.పి.ఐ.ఐ.సి. కేటాయించే భూముల విలువ దామాషా ప్రకారంగా నిర్ణయించ బడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## లేపాక్షి నాలెడ్జ్ హబ్ నిర్వాహకం:

వాస్తవ అవసరానికి మించి ప్రభుత్వము నుండి భూములను పొంది, ఆ భూములను హామీగా పెట్టి బ్యాంకుల నుండి వందల కోట్ల ఋణాలను పొంది వ్యాపారము చేసి లాభాలను పొందాలని, వీలుకుదిరితే ప్రభుత్వము నుండి పొందిన భూమిలో, కొంత భాగాన్ని రియల్ ఎస్టేట్‌గా రూపొందించి అమిత లబ్ధి పొందాలని, కొన్ని ప్రైవేట్ సంస్థలు తమ ప్రతిపాదనలను ఆకర్షణీయమైన రీతిలో ప్రభుత్వముల ముందు ఉంచడము జరుగుతూ ఉంది. సదరు సంస్థల శక్తిసామర్ధ్యములు, ఆర్థిక స్థోమత, వాస్తవముగా అవసరం. మున్నగు అంశాలను లోతుగా అద్యయనం చేయకుండానే, ప్రభుత్వములోని పెద్దలు, పేద రైతుల నుండి వందల ఎకరములు గుంజుకొంటూ, అభివృద్ధి పేరుతో, ఉద్యోగముల కల్పన సాకుతో బడా బాబులకు భూములు కట్టబెడుతూ వున్నారు. పలు సందర్భములలో సదరు ప్రతిపాదనలు, కార్యరూపం దాల్చకపోవడము, ప్రభుత్వము అందచేసిన భూములను హామీగా పెట్టి తీసుకున్న ఋణాన్ని నిర్దేశించినచోట కాకుండా వేరే ప్రదేశములలో, వేరే ప్రయోజనముల కొరకు మళ్ళించిన ఉదంతాలు ఉన్నాయి. రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వ హయములో బెంగుళూరు ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్టుకు దగ్గరలో, అనంతపురం జిల్లా చిలమత్తూరు మండలములో "లేపాక్షి నాలెడ్జి హబ్" కొరకు, మొదటి దశలో 8,844 ఎకరములు, రెండవ దశలో 3,356 ఎకరములు ఇచ్చుటకు రాష్ట్రప్రభుత్వము అంగీకరించింది. ఎకరానికి రూ. 1,75,000 చొప్పున నష్ట పరిహారమును రైతులకు చెల్లించి 4,731 ఎకరములను లేపాక్షి నాలెడ్జి హబ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు రిజిష్టరు చేసింది. మిగిలిన వారికి నష్టపరిహారం ఇవ్వవలసి వుంది. లేపాక్షి నాలెడ్జి హబ్ డెవలపర్ ప్రభుత్వం స్వాధీనపరచిన భూమిని హామీగా పెట్టి బ్యాంకుల నుండి రూ. 800 కోట్లు ఋణము తీసుకొని ఆ మొత్తాన్ని హైదరాబాద్ సమీపములో ఇందూ ప్రాజెక్టు కొరకు వినియోగించు కున్నారు. ప్రాజెక్టు పనులలో ఏ మాత్రము పురోగతి లేనందున రైతులు కోర్టులను ఆశ్రయించగా, లేపాక్షి

నాలెడ్జ్ హబ్ నకు రిజిష్టరు కాని భూములను రైతులు అమ్ముకోవడానికి కోర్టులు అనుమతించగా పలువురు రైతులు ఎకరం రూ.6లక్షల చొప్పున అమ్ముకోగల్గారు. అనంతర కాలములో వచ్చిన ప్రభుత్వాలు "లేపాక్షి నాలెడ్జ్ హబ్" నకు రిజిష్టరు చేసి స్వాధీనపరచిన భూములను వెనుకకు తీసుకోవాలని ప్రయత్నించినప్పటికి బ్యాంకులకు హామీగా పెట్టి ఉన్నందువలన అవరోధం ఏర్పడింది. 22-12-2008న లేపాక్షి నాలెడ్జ్ హబ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముతో ఏర్పాటు చేసుకొనిన ఒప్పందం ప్రకారం 5 సం.ల నుండి 10 సం.ల కాల వ్యవధిలో రూ.8,000 నుండి రూ.10,000వేల కోట్ల రూపాయలు తాము పెట్టుబడి పెట్టెదమని 1.5 లక్షలమందికి ఉపాధి కల్పించగలమని అందులో పేర్కొన్నారు. ఆచరణలో ఏమీ జరుగకపోగా ఇటు రైతులు, అటు బ్యాంకులు నష్టాలపాలు అయ్యాయి, అందువలన ప్రభుత్వం భూ కేటాయింపుల విషయములో చాలా లోతుగా ఆలోచించి, సరియైన నిర్ణయాలు తీసుకొనకపోతే, అనేక చిక్కులు ఎదురవుతాయి. భూ కేటాయింపులకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పులు, కేంద్రప్రభుత్వ మార్గదర్శక సూత్రాలు, రాష్ట్ర ప్రభుత్వము 1 సెప్టెంబరు, 2012 - ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీని అనుసరించి మాత్రమే జరగాలి.

**ఐ.యం.జి. భారత్ - అరచేతిలో వైకుంఠం:**

చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉండగా 2003లో ఐ.యం.జి. భారత్ అనే సంస్థకు క్రీడల అభివృద్ధి కొరకు హైదరాబాద్ లోని గచ్చిబౌలి సెంట్రల్ యూనివర్శిటి సమీపములో 400 ఎకరములను - ఎకరా రూ.50,000 లు చొప్పున ప్రభుత్వ భూమిని రిజిష్టరు చేయడం జరిగింది. శంషాబాద్ సమీపములో మరొక 450 ఎకరములను, ఎకరా రూ.25,000లు చొప్పున ఇవ్వాలి అనే ప్రయత్నము ముందుకు సాగలేదు. అమెరికాలో "ఐ.యం.జి. ఫ్లోరిడా" సంస్థ కేవలం 120 ఎకరముల విస్తీర్ణములోనే తన కార్యకలాపాలను కొనసాగిస్తూ వుంది. చిత్తూరు జిల్లా కుప్పం వద్ద ఇజ్రాయెల్ సహకారంతో చేపట్టిన "కుప్పం ప్రాజెక్టు" సూత్రధారులు అహోబలరావు (బిల్లీరావు) వారి సోదరుడు ప్రభాకరరావుల సంస్థ, ఐ.యం.జి. భారత్ కేవలం రూ.5లక్షల మూలధనముతో 5-8-2003న ప్రారంభమైంది. 9-8-2003న ఆ సంస్థ ప్రతిపాదనను ఆమోదించటమే కాక, అంత పెద్ద ఎత్తున భూములను సమకూర్చటమే కాక, హైదరాబాద్ నగరములో జి.యం.సి. బాలయోగి స్టేడియంతోపాటు 7 స్టేడియంల నిర్వహణా బాధ్యతలను కూడా ఈ సంస్థకు అప్పజెప్పడము జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్రీడారంగంలో అత్యున్నతమైన స్థాయిలో నిలుపుతామని, గొప్ప క్రీడాకారులను తయారు చేస్తామని, వేలకోట్ల రూపాయలు ఈ ప్రాజెక్టుపైన తాము పెట్టుబడి పెడతామని ఐ.యం.జి. భారత్ యిచ్చిన హామీ నీటిలో మూట అయ్యింది. ఆశించినరీతిలో ప్రాజెక్టు ముందుకు సాగని కారణాన అనంతర కాలములో వచ్చిన ప్రభుత్వములు ఐ.యం.జి. భారత్‌కు ఇచ్చిన భూములను వెనుకకు తీసుకోవాలి అనే ప్రయత్నానికి చాలా ఆటంకములు ఎదురయ్యాయి.

# అంచనాలను మించిన ఎయిర్‌పోర్టులు

## భోగాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అవసరమా?

విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుండి యిప్పటికే సింగపూర్, దుబాయ్, కౌలాలంపూర్ దేశములకు విమానాలు నడుస్తూ వున్నాయి. త్వరలో కొలంబోకు కూడా విమానాలు వెళ్ళనున్నాయి. పూర్వం నుండి పౌర విమానయాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహింపబడిన విశాఖపట్నం విమానాశ్రయమును 1986లో నేవి వారికి నిర్వహణా బాధ్యతలను అప్పగించడం జరిగింది. ప్రస్తుతం వున్న రన్‌వే పొడవును 10,030 అడుగుల నుండి 2,000 అడుగులు పెంచితే సరిపోతుంది. ఇటీవల నావీ వారు రన్‌వే పొడగింపు కొరకు 40 ఎకరాల భూమిని ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలుస్తూంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖనగరమునకు సమీపంలో రాంబిల్లి వద్ద 5 వేల ఎకరముల భూమిని నేవీ వారికి ఇచ్చింది. అందులో వారు చాలా పెద్ద నావల్ బేస్‌ను అభివృద్ధి చేసుకొంటూ వున్నారు. కొంతకాలం క్రితం జైరాం రమేష్ కేంద్రమంత్రిగా ఉండగా విశాఖపట్నం ఎయిర్‌పోర్టును నేవి వారి నుండి తప్పించి సివిల్ ఏవియేషన్ డిపార్టుమెంటు వారికి అప్పజెప్పాలని, నేవి వారు రాంబిల్లీ వద్ద నేవి ఎయిర్‌బేస్ అభివృద్ధి చేసుకొనవచ్చనీ, అప్పటి సివిల్ ఏవియేషన్ మంత్రిగారికి లేఖ వ్రాశారు. విజయనగరం జిల్లా బాడంగి వద్ద బ్రిటీష్ కాలం నాటి నుండి వున్న ఎయిర్ స్ట్రిప్‌ను కూడా నేవీకి చెందిన విమాన రాకపోకలకు అనుగుణంగా నేవీ వారు అభివృద్ధి పరచుకుంటూ వున్నారు.

విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలో 8 గ్రామాలలో దాదాపు 3,873 ఎకరాల భూమిని రైతుల నుండి సేకరించవలసి వుంటుంది. 9 గ్రామాలకు చెందిన 20 నివాస ప్రాంతాలు, 10241మంది ప్రజలు నిర్వాసితులౌతారు. వేలాదిమంది సన్నకారు, చిన్న రైతులు అనేక మాసములుగా తీవ్రంగా వ్యతిరేకిస్తూవున్నా హడ్కో నుండి ఋణం తీసుకొని విశాఖనగరం నుండి 40 కి.మీ.ల దూరంలో బోగాపురం

వద్ద "గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయమును" అభివృద్ధి చేసేందుకు రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. యిప్పటికే వున్న ఒక ఎయిర్‌పోర్టు నుండి 150 కి.మీ. దూరం లోపల మరొక ఎయిర్ పోర్టు నిర్మించుటకు వీలులేదని నిబంధనలు ఉన్నట్లుగా కేంద్ర పౌరవిమానయాన సహాయమంత్రి పార్లమెంట్‌లో తెలియపర్చిన విషయం స్పష్టమే. గతంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు సందర్భంగా జి.యం.ఆర్. గ్రూప్‌నకు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా వారికి మధ్య ఒప్పందం ప్రకారం బేగంపేట్ ఎయిర్‌పోర్టును మూయవలసి వచ్చింది. ఇప్పుడు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం తర్వాత విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయమును కూడా మూయవలసి ఉంటుంది. ఇప్పటికే మొదటి దశలో రూ. 271 కోట్లతో, రెండవ దశలో రూ. 798 కోట్లతో విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయమును అభివృద్ధి చేయుటకు కేంద్ర విమానయానశాఖ కృషి చేస్తూ వుంది కావున బేషజాలకు పోకుండా ఆ ప్రతిపాదనను వెంటనే విరమించి, ప్రక్కనే నేవీ క్రింద ఉన్న కొంత భూమిని ఎయిర్‌పోర్టుకు అందచేసే విధంగా కేంద్రప్రభుత్వంతో మాట్లాడి విశాఖపట్నం ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టునే మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చెయ్యటం సముచితంగా వుంటుంది.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ అభివృద్ధికి టెండర్లు పిలువగా 'ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా' గ్రాస్ రెవిన్యూలో 30.2% వాటా యివ్వడంతోపాటు ప్రాజెక్టులో 26% ఈక్విటీ భాగస్వామ్యం రాష్ట్రప్రభుత్వానికి యిచ్చేందుకు అంగీకరించింది. అలాగే ఏడాదికి ఎకరాకు రూ. 20,000 లు చొప్పున లీజుగా యివ్వడానికి కూడా అంగీకరించినా ఆ టెండర్‌ను రద్దుచేయడం జి.యం.ఆర్. లేక అనిల్ అంబాని లాంటి ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టేందుకేనని ప్రజలు భావిస్తున్నారు. ప్రతిపాదిత భోగాపురం ఎయిర్‌పోర్ట్ సమీపంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులకు సంబంధించి రియల్ ఎస్టేట్ ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయి.

## విజయవాడ ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు - ఏలూరు కెనాల్ డైవర్షన్:

విజయవాడ విమానాశ్రయమును ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో యిచ్చిన హామీ ప్రకారం సుమారు రూ. 900 కోట్లు వెచ్చించి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి పర్చేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంటూ వుంది. ఢిల్లీ, శంషాబాద్, బెంగుళూరు ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టుల వద్ద ఉన్నట్లుగా గన్నవరం వద్ద కూడా రన్‌వే 4,400మీటర్లు ఉండాలని ముఖ్యమంత్రిగారు సూచించిన నేపథ్యంలో ఏలూరు కాలువను డైవర్షన్ చేయాలని, ఆ సందర్భంగా జక్కులనెక్కలం, కేసరపల్లి, ఆత్కూరు,

మున్నగు 8 గ్రామాల మీదుగా 428 ఎకరముల భూమిని తీసుకోవాలని, భూసేకరణతో సహా కాలువ నిర్మాణం కొరకు రూ.1,000కోట్లు ఖర్చుకాగల పథకమును చేపట్టాలని భావించడం, దరిమిలా సదరు భూమిని భూసమీకరణ విధానంలో తీసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగానికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అంతేకాక ఏలూరు కెనాల్‌కు దక్షిణం వైపున కూడా సుమారు 100 ఎకరములు తీసుకోవాలని ప్రతిపాదించబడింది.

ప్రస్తుతం సంవత్సరమునకు ఆరులక్షల ప్రయాణీకులతో ఉన్న గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయమునకు భవిష్యత్ కాలములో కూడా 3,927 మీటర్లకు మించి రన్‌వే ఎట్టి పరిస్థితులలోనూ అవసరం లేదని కేంద్ర విమానయాన శాఖామాత్యులు శ్రీ పి.అశోక్‌గజపతి రాజు గారు విజయవాడకు పుష్కరాల సమయంలో వచ్చినపుడు ది 18-8-2016న గన్నవరం విమానాశ్రయంలో ఆయనను వడ్డే శోభనాద్రీశ్వరరావు కలిసి, విజ్ఞాపనపత్రం ఇచ్చి, చర్చించిన దరిమిలా ఏలూరు కాలువను డైవర్షన్ చేయాలనే ప్రతిపాదన ఉపసంహరించబడింది. సమస్యను అధికారులు అన్నికోణాలలో సక్రమంగా అధ్యయనం చేయని ఉదంతములలో ఇది ఒకటి. ఇంకనూ ఏలూరు కాలువ వరకు రన్‌వే పొడగించడం మొదలవ్వకుండానే ఎయిర్‌బస్ 321 గన్నవరంలో ల్యాండ్ అయ్యిందంటే ఏలూరు కాలువ వరకు మాత్రమే భూమి సరిపోతుందని స్పష్టంగా తెలుస్తూ ఉంది.

విజయవాడకు అతి సమీపంలో మంగళగిరి వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును 5,000 ఎకరములలో అభివృద్ధి చెయ్యాలని ముఖ్యమంత్రి గారు గాఢంగా కోరుకుంటూ వున్నారు. అమరావతి రాజధాని నుండి విజయవాడ విమానాశ్రయమునకు కేవలం 40 నిమిషాలలో చేరుకోవచ్చును. అందువలన మంగళగిరిలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవటం తప్పనిసరి. అమరావతిలో సి.యం. గారి కార్యాలయ టవర్ పైన హెలీప్యాడ్ ఏర్పాటు చేయబడుతుంది!

★★★

# ముందుకు అడుగు పడని నూతన నౌకాశ్రయాలు

## ప్రభుత్వ భూమిలోనే బందరు పోర్టును నిర్మించాలి

మన దేశములో మేజర్ పోర్టులు అయిన చెన్నయ్ పోర్టు 500 ఎకరములు, ఎన్నూరు పోర్టు షిప్‌యార్డుతో సహా 2,000 ఎకరములు, ట్యూటికోరిన్ పోర్టు 2,150 ఎకరములు, కొచ్చిన్ పోర్టు 2,000 ఎకరములు, న్యూ మంగుళూరు పోర్టు 1,908 ఎకరములు, మార్మగోవా 530 ఎకరముల విస్తీర్ణములతోనే తమ కార్యకలాపములను నిర్వహిస్తూ ఉన్నాయి. మన రాష్ట్రప్రభుత్వానికి అత్యంత ఆదర్శప్రాయమైన సింగపూర్‌లో పి.యస్.ఎ. సింగపూర్ రేవు 1,500 వందల ఎకరములలో 52 బెర్తులతో పనిచేస్తూ వుంది. అలాగే సింగపూర్ లోనే జురాంగ్ పోర్టు 400 ఎకరములలో 12 బెర్తులతో పనిచేస్తూ వుంది. మచిలీపట్నంలో సముద్రము లోతు (డ్రాఫ్టు) 13 మీటర్లు, 3 నుండి 5 బెర్తులు నిర్మించాలని పోర్టు డెవలపర్ ప్రతిపాదన. ఇందుకొరకు అసైన్డు భూమితో సహా ప్రభుత్వ భూమి 3,014 ఎకరములు ఉండగా రైతుల నుండి యింకా 2,282 ఎకరముల పట్టా భూములను భూసమీకరణ ద్వారా తీసుకొనవలయును అనే ప్రభుత్వ నిర్ణయం ఎంతమాత్రం సరికాదు.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు ప్రకారం భూసమీకరణ విధానంలో కాకుండా 2013 భూసేకరణ చట్టమును అనుసరించే రైతులకుగానీ, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు, యితర పేదలకు నష్టపరిహారము మరియు పునరావాస ప్రయోజనములు అన్నింటినీ కల్పించవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది. జి.ఓ.యం.ఎస్.నెం. 571, రెవిన్యూ (అసైన్‌మెంట్–I) డిపార్ట్‌మెంట్, తేది 14–09–2012 ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వ భూములను పోర్టులు, ఎయిర్‌పోర్టులు, థర్మల్ స్టేషన్స్ మున్నగు వాటికి కేటాయించే సందర్భంలో అనుసరించవలసిన విధివిధానాలు స్పష్టంగా రూపొందించబడ్డాయి. దానిప్రకారం

| వ.నెం. | ప్రమాణము | వివరము | |
|---|---|---|---|
| 1. | బెర్తు పొడవు (మీ) | 300 | 300 |
| 2. | సముద్రపు లోతు (మీ) | 15 వరకు | 16 పైన |
| 3. | అవసరమగు భూమి (ఎకరములు) | 150 | 200 |

కావున మచిలీపట్నం పోర్టు కొరకు డెవలపర్ నవయుగ సంస్థకు 1200 ఎకరములకు మించి ఇవ్వవలసిన అవసరం లేదు. ఈ 1200 ఎకరములలో రైతుల పట్టాభూములు కానీ, పేదల అసైన్డు భూములుగానీ ఉంటే వాటిని తీసుకుని ప్రభుత్వ భూమి నుండి "భూమికి భూమి" ఇవ్వడం సమంజసం. మచిలీపట్నం పోర్టు మరియు పోర్టు ఆధారిత పరిశ్రమల కొరకు దాదాపు 32,000 ఎకరములను సేకరించాలని ముందు భూసేకరణ చట్టం నోటిఫికేషన్ ఇవ్వబడింది. రైతులు ఎంత అవసరం ఉన్నప్పటికి, తమ భూములను అమ్ముకునేందుకు వీలులేకుండా ప్రభుత్వం చేసింది. భూసేకరణ కొరకు ఇవ్వవలసిన నష్టపరిహారము చెల్లించుటకు, పునరావాస కల్పనకు అవసరమైన నిధులు లేనందున భూసమీకరణ విధానంలో భూములను తీసుకునేందుకు పన్నాగాన్ని రూపొందించింది. భూ సమీకరణ క్రింద తమ భూమిని ప్రభుత్వానికి అప్పగించేందుకు అంగీకరించితే సదరు భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు రెవిన్యూ డివిజనల్ ఆఫీసరు అనుమతి ఇచ్చేలా ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తూ ఉంది. వాస్తవ అవసరానికి మించి, ఎక్కువ భూమిని ప్రభుత్వము నుండి తీసుకొని బ్యాంకులలో హామీగాపెట్టి, వందలు-వేల కోట్ల రూపాయలు ఋణము తీసుకొని వ్యాపారము చేయాలని, మచిలీపట్నం పోర్టు డెవలపర్ భావిస్తూ వుంది. కృష్ణపట్నం ఓడరేవు కొరకు ప్రభుత్వము ఇచ్చిన భూమిని హామీగా పెట్టి దాదాపు రూ. 5,000 కోట్లు పైనే బ్యాంకుల నుండి ఋణం తీసుకున్నది. అలాగే గంగవరం పోర్టు డెవలపర్ కూడా బ్యాంకుల నుండి దాదాపు రూ. 2,000 కోట్లు ఋణముగా పొందారు. కావున రాష్ట్రప్రభుత్వము మచిలీపట్నంలో 1,200 ఎకరములు ప్రభుత్వ భూమిలో పోర్టు పనిని ప్రారంభింపచేయాలి. ఒకవేళ నవయుగ సంస్థ అందుకు సుముఖత వ్యక్తం చేయకపోతే విశాఖపట్నం పోర్టు ట్రస్టుకు గానీ లేక తాజాగా టెండర్లను పిలిచి ముందుకు వచ్చినవారికి కానీ ఇవ్వడం సరియైన విధానము అవుతుంది.

**మచిలీపట్నం వద్ద పోర్టు ఆధారిత పరిశ్రమల కొరకు 28,000 ఎకరాలు ఎందుకు?**

మచిలీపట్నం వద్ద నిర్దుష్టంగా యింతవరకు ఏ సంస్థలు, ఏ పరిశ్రమలు, ఎంతెంత పెట్టుబడులు పెడుతాయో, ఎంత భూమి వాస్తవంగా అవసరమో, ఎంతమందికి ఉపాధి

అవకాశాల లభిస్తాయో, వంటి వివరాలను యింతవరకు ప్రభుత్వం ప్రజలకు తెలియపర్చలేదు. కేంద్రప్రభుత్వం ప్రతిపాదిస్తున్న సాగరమాల ప్రాజెక్టు, విశాఖపట్నం - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ప్రతిపాదనలలో మచిలీపట్నంనకు స్థానం కల్పించబడలేదు. కృష్ణపట్నం, వైజాగ్, కాకినాడల వద్ద పోర్టు ఆధారిత పారిశ్రామిక క్లస్టర్లు సాగరమాల ప్రాజెక్టు క్రింద రాబోతున్నాయని పార్లమెంట్‌లో కేంద్ర సహాయ మంత్రి మాండవీయ చెప్పారు. కృష్ణపట్నం వద్ద 1వ ఫేజ్‌లో ఎలక్ట్రానిక్స్ ఎగుమతి, దిగుమతుల కొరకు అభివృద్ధి, విశాఖపట్నం, కాకినాడల వద్ద ఫుడ్ ప్రాసెసింగ్, పెట్రోలియం, సిమెంట్, వస్త్రాల అభివృద్ధి కొరకు ఏర్పాటు చేయబోతున్నారు. కావున బందరు సమీపంలో అవసరం లేకుండానే రైతుల నుండి వేలాది ఎకరములు గుంజుకొని వారి జీవనాధారాన్ని ధ్వంసం చేయటం ఎంతమాత్రమూ తగదు.

## కృష్ణపట్నం పోర్టు కంపెనీ పైన ముఖ్యమంత్రిగారికి ప్రత్యేక అభిమానం ఎందువలన?

లోగడ కృష్ణపట్నం పోర్టు కంపెనీ లిమిటెడ్‌నకు పోర్టు కొరకు 4,553 ఎకరముల భూమిని యివ్వడం జరిగింది. ప్రస్తుతం 12 బెర్తులతో 40 మి.టన్నుల సరుకులను చేరుస్తూ, సంవత్సరానికి రూ.1,800 కోట్ల గ్రాస్ రెవిన్యూతో కృష్ణపట్నం పోర్టు ప్రగతిని సాధిస్తూ ఉంది. లోగడ కృష్ణపట్నం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌నకు స్పెషల్ ఎకనామిక్ జోన్ క్రింద 12,000 ఎకరాలను రాజశేఖర్ రెడ్డి గారి ప్రభుత్వం కేటాయించింది. యిప్పుడు చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం ఎ.పి. జెన్‌కో క్రింద ఉన్న భూమి నుండి 435 ఎకరముల భూమిని కృష్ణపట్నం పోర్టు కంపెనీకి స్వాధీనపర్చాలని నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రిగారు తరచుగా ప్రయాణించే చార్టర్డ్ విమానం నవయుగ సంస్థకు చెందినదే.

## రామయ్యపట్నం చేదా - దుగరాజపట్నం ముద్దా?

5 సం.ల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొదటి దశలో రూ.8,000కోట్లు అంతిమంగా మూడు దశలలో రూ.25,000/-కోట్ల ఖర్చుతో ఒక మేజర్ పోర్టును కేంద్ర ప్రభుత్వమే నిర్మించుటకు ప్రతిపాదించబడింది. కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వము ప్రకాశం జిల్లా రామయ్యపట్నం వద్ద మేజర్‌పోర్టును నిర్మించమని సిఫార్సు చేయగా, నాటి తిరుపతి యం.పి. చింతామోహన్ రాజకీయ లాబీయింగు వలన కేంద్రప్రభుత్వం దుగరాజపట్నం వద్ద మేజర్ పోర్టును ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. అత్యంత సమీపములో 10 కి.మీ.ల దూరంలో శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రము ఉండుట వలన భద్రతా కారణాల దృష్ట్యా మరియు దగ్గరలో పులికాట్ సరస్సు ఉండుట వలన పర్యావరణమునకు చేటు, వేలాది మత్స్యకారుల జీవనమునకు తీవ్రమైన భంగం

కలుగుతుందనే కారణాలవలన దుగరాజపట్నం వద్ద మేజర్ పోర్టు సరికాదని లోగడ "రైట్స్" సంస్థ రిపోర్టు యిచ్చివుంది. 25 కి.మీ.లలో కృష్ణపట్నం పోర్టు, తమిళనాడులో 60 కి.మీ.లలో కాటుపల్లి వద్ద కంటెయినర్ టెర్మినల్, ఆపైన ఎన్నూరు వద్ద మేజరు పోర్టు ఉన్నందున దుగరాజపట్నం వద్ద మేజర్‌పోర్టు సాంకేతికపరముగా సరికాదని, ఆర్థికముగా లాభదాయకం కాదని ఇటీవల విశాఖపట్నం పోర్టు ట్రస్టు నియమించిన నిపుణుల కమిటి కూడా స్పష్టముగా రిపోర్టును ఇచ్చింది. తాజాగా నీతిఅయోగ్ కూడా దుగరాజపట్నం ప్రతిపాదన సరికాదని స్పష్టంగా అభిప్రాయపడింది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం దుగరాజపట్నం వద్దే మేజర్ పోర్టు కావాలని అడుగుతూ వుండటంలో ఆంతర్యం ప్రజలకు అంతుపట్టడం లేదు. ఇప్పటికైనా ఎట్టి తాత్సారము చేయకుండా, రాష్ట్ర ప్రభుత్వము కేంద్రప్రభుత్వము చేత రామయ్యపట్నం వద్ద మేజరు పోర్టును నిర్మింపచేయుటకు చర్యలు చేపట్టాలి.

## ప్రకాశం జిల్లా పట్ల నిరాదరణ సబబా

రామయ్యపట్నం వద్ద పోర్టు వస్తే కనిగిరి ఏరియాలో పామూరు సమీపంలో ప్రతిపాదించబడిన "నేషనల్ ఇన్‌వెస్ట్‌మెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్"తోపాటు దొనకొండ వద్ద ప్రతిపాదించబడిన 'ఇండస్ట్రియల్ పార్కు'లకు ఉపయోగంగా ఉండటంతోపాటు ప్రకాశం జిల్లాయేకాక లోపల ఉన్న రాయలసీమ జిల్లాల సత్వర ప్రగతికి తోడ్పడుతుంది. కృష్ణపట్నం సమీపంలోనే కేంద్ర ప్రభుత్వం చేత కోస్టల్ ఎంప్లాయిమెంట్ జోన్ ఏర్పాటు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించటం సరికాదు. ఇప్పటికే నెల్లూరు - చిత్తూరు జిల్లాలో శ్రీసిటీ మరియు ఇతర భారి సంస్థలవలన ఉపాధి అవకాశాలు మెండుగా వున్నాయి. రాయలసీమ జిల్లాలతోపాటు ప్రకాశం జిల్లా కూడా అత్యంత వెనుకబాటుతనంతో ఉంది. అందువలన కోస్టల్ ఎంప్లాయిమెంట్ జోన్‌ను రామయ్యపట్నం సమీపంలో ఏర్పాటు చేయటమే సముచితంగా ఉంటుంది.

దుగరాజపట్నం నుండి రోడ్డు, రైలు మార్గాలు 42 కి.మీ. నుండి 45 కి.మీ. నిర్మించుటకు ఖర్చు రూ.720 నుండి రూ.780కోట్లు అవుతుంది. కానీ రామయ్యపట్నంనకు నేషనల్ హైవే 5 కి.మీ. మరియు విశాఖ-చెన్నై రైలు మార్గం కేవలం 7 కి.మీ. దూరంలోనే ఉండుట వలన చాలా తక్కువ ఖర్చు అవుతుంది. రాష్ట్ర అసెంబ్లీలో తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా దుగరాజపట్నం వద్ద మేజర్ పోర్టును నిర్మింపజేయాలనే రాష్ట్రప్రభుత్వ ఆలోచన చూస్తే ప్రకాశం జిల్లా పైన ముఖ్యమంత్రిగారు కక్షకట్టినట్లుగా కనిపిస్తూ ఉంది. మన ప్రక్కనే ఉన్న తమిళనాడు రాష్ట్రంలో యిప్పటికే మూడు మేజర్‌పోర్టులు వుండగా కొలాచల్ వద్ద రూ.25,000 కోట్లతో 4వ మేజరు పోర్టును అభివృద్ధి చేయుటకు కేంద్రం యిటీవలే నిర్ణయం తీసుకుంది!

## పోర్టుల నుండి రాష్ట్ర ప్రభుత్వానికి తగినంత ఆదాయము రావద్దా?

లోగడ చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉండగా కృష్ణపట్నం, గంగవరం పోర్టుల నుండి మొదటి 5 సం.లకు గ్రాస్ రెవెన్యూలో 5%, 5-10 సం.లలో 8%, 10-15 సం.లలో 10%, 15-20 సం.లు - ఆపైన 12% చొప్పున ప్రభుత్వానికి "కన్‌సెషనరి ఫీజు" చెల్లించేటట్లుగా అగ్రిమెంట్లు జరిగాయి. రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వ హయాములో కృష్ణపట్నం పోర్టునకు మొదటి 30సం.లలో 2.6%, 31-40 సం.లలో 5.2%, 41-50సం.లలో 10.4% గ్రాస్ రెవిన్యూలో రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించేలా మార్పు చేశారు. దీనివలన రాష్ట్ర ప్రభుత్వ ఖాజానాకు వేలాది కోట్ల రూపాయల నష్టం చేకూరుతుంది. రాష్ట్రప్రభుత్వానికి మొదటి 5సం.లలో రూ.197 కోట్లు రావలసినదానికి కేవలం రూ.102.8 కోట్లు మాత్రమే వచ్చింది. అలాగే 2014-15, 2015-16 సం.లలో రూ.285 కోట్లు రావలసినదానికి కేవలం రూ.92 కోట్లు మాత్రమే వచ్చింది. అలాగే గంగవరం పోర్టు విషయంలో కూడా రూ.123 కోట్లు రావలసిన దానికి కేవలం రూ.51.6 కోట్లు మాత్రమే వచ్చింది.

మనప్రక్కనే ఒరిస్సా రాష్ట్రములో 0-5 సం.లలో 5%, 6-10 సం.లలో 8%, 11-15 సం.లలో 10%, 16-20 సం.లు - ఆపైన 12% చొప్పున ప్రభుత్వానికి "కన్‌సెషనరి ఫీజు" చెల్లించేటట్లుగా అగ్రిమెంట్లు జరిగాయి. కావున రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు ఒరిజనల్‌గా చేసిన అగ్రిమెంట్ల ప్రకారం మార్పు చేయవలసిన అవసరం ఉంది. అలాగే లోగడ రాజశేఖర్‌రెడ్డి గారి ప్రభుత్వ హయాములో ప్రకాశం జిల్లా లోని "ఓడరేవు పోర్టు"నకు దక్షిణము వైపున 30 కి.మీ హద్దు వరకు కృష్ణపట్నం పోర్టు డెవలపర్‌కు కల్పించిన "ఎక్స్‌క్లూజివ్ హక్కు"ను, సవరించవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది. రామయ్యపట్నంలో పోర్టును అభివృద్ధి చేయాలంటే ఆ జి.ఓ.ను మార్చవలసిన అవసరం ఎంతైనా వుంది యిటీవల పార్లమెంటులో కేంద్రమంత్రి సమాధానంలో కృష్ణపట్నం నౌకాశ్రయానికి ప్రత్యేకంగా కట్టబెట్టిన ప్రాంతం పరిధిలోనే రామయ్యపట్నం ఉందని, రామయ్యపట్నంను ఎ.పి. ప్రభుత్వం యింకా నాన్ మేజర్ పోర్టుగా నోటిఫై చేయలేదని తెలియచేశారు. దీనినిబట్టి నూతన ప్రభుత్వం ఏర్పాటై దాదాపు 4 సం.లు కావస్తున్నా యిప్పటికీ రామయ్యపట్నం పోర్టు అభివృద్ధి పైన రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించలేదని స్పష్టంగా బోధపడుతూ వుంది.

## భావనపాడు పోర్టు అభివృద్ధి బాధ్యతను విశాఖపోర్టు ట్రస్టుకు ఎందుకు అప్పచెప్పరు?

మన రాష్ట్రములో పురాతన కాలము నుండి ఉన్న ఏకైక మేజర్ పోర్టు విశాఖపోర్టు సమర్ధవంతముగా నిర్వహించబడుతూ వుంది. ఆర్థికముగా, బలముగా ఉన్న విశాఖపోర్టు

ట్రస్టు, కొంతకాలము క్రితము భావనపాడు వద్ద కాని లేక మరొక చోటకాని, ఒక మైనర్ పోర్టును అభివృద్ధి చేసేందుకు సంసిద్ధతను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియపర్చినప్పటికీ, రాష్ట్రప్రభుత్వము స్పందించకపోవడంలో ఆంతర్యం బోధపడటం లేదు. ప్రభుత్వ రంగ సంస్థలకన్నా ప్రైవేటు సంస్థలపట్లే ముఖ్యమంత్రిగారు అభిమానం చూపుతున్నారు. యిప్పుడు భావనపాడు పోర్టును మొదటి దశలో 5 బెర్తులు, రెండవ, మూడవ దశలలో 9 బెర్తులను నిర్మించి సంవత్సరానికి 30 మిలియన్ మెట్రిక్ టన్నుల ఎగుమతులు, దిగుమతులను సాధించగలమని అదాని సంస్థ ముందుకు వచ్చింది. యిందుకు సుమారు రూ.3,725/–కోట్లు వ్యయం కాగలదని అంచనా. దీనికి సుమారు 5,700 ఎకరముల భూమి అవసరమౌతుందని ప్రాథమికంగా రాష్ట్రప్రభుత్వం భావించినా, రైతుల నుండి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం కావడంతో 2,030 ఎకరాల విస్తీర్ణంలోనే పోర్టును అభివృద్ధిని చేయుటకు గౌతమ్ అదాని సంస్థ గ్రాస్ రెవిన్యూలో 0.5% వాటా ప్రభుత్వానికి యిచ్చేలా ప్రతిపాదన సమర్పించింది. చర్చల అనంతరం గ్రాస్ రెవిన్యూలో 2.3% వాటాకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం ఎంతమాత్రం తగదు.

ప్రక్కనే ఒరిస్సా రాష్ట్రంలో ధమ్‌రా పోర్టును అదాని సంస్థ తీసుకుని, ఒరిస్సా ప్రభుత్వానికి మొదటి 5 సం.లకు గ్రాస్ రెవెన్యూలో 5%, 5–10 సం.లలో 8%, 10–15 సం.లలో 10%, 15–20 సం.లు – ఆపైన 12% చొప్పున "కన్‌సెషనరి ఫీజు" చెల్లిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లో యిప్పుడు 30 సం.లకు 2.3% చొప్పున యివ్వబోవడం వల్ల మన రాష్ట్రప్రభుత్వ ఖజానాకు వేలకోట్ల రూపాయల నష్టం జరుగుతుంది. కావున ఈ ప్రతిపాదనను రాష్ట్రప్రభుత్వం ఆమోదించడం కంటే విశాఖపోర్టు ట్రస్టు వారితో సంప్రదించటం మంచిది.

పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం వద్ద పోర్టు కొరకు 3,695 ఎకరముల భూమిని తీసుకునేందుకు రాష్ట్రప్రభుత్వం కృషిచేస్తూ వుంది. ఇట్టి పరిస్థితులలో విశాఖపోర్టు ట్రస్టు వారికి మచిలీపట్నం వద్ద గానీ, మన రాష్ట్రములో మరొక చోటగానీ ఒక మైనర్ పోర్టును అభివృద్ధి చేసేందుకు అవకాశము కల్పించటము తీర ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుంది.

★★★

# విజయవాడ, విశాఖపట్నం నగరాలలో మెట్రో రైళ్ళు

విజయవాడ నగరముకన్నా విశాఖపట్నం నగరం పెద్దది. వైజాగ్ పోర్టు, షిప్‌యార్డు, స్టీల్ ప్లాంట్, ఫార్మా సిటి, ఆంధ్రా యూనివర్శిటి, ఎయిర్‌పోర్టు, హెచ్.పి.సి.ఎల్., సినీ పరిశ్రమ, ఐ.టి.తో సహా పలు ఇతర పరిశ్రమలు, అనేక సంస్థలు ఉన్నాయి. నగరంలో ఒక వైపు నుండి మరొక వైపునకు అధిక సంఖ్యలో ప్రజలు ప్రయాణం చేయవలసి ఉంటుంది. మెట్రో రైలు వ్యవస్థను ఏర్పాటు చేయాలనుకుంటే ముందు విశాఖపట్నం నగరంలో ఏర్పరచాలి. కానీ ముఖ్యమంత్రిగారు విజయవాడలో మెట్రో రైలు ప్రాజెక్టునకు ప్రాధాన్యమిచ్చారు. మొదట్లోనే ఢిల్లీ మెట్రో రైల్ కార్పోరేషన్ యం.డి. శ్రీధరన్ విజయవాడలో మెట్రో రైలు 20 సం.లు తరువాతనే లాభదాయక మవ్వవచ్చని స్పష్టంగా చెప్పారు. అయినా ముఖ్యమంత్రిగారి పట్టుదల వలన పెనమలూరు నుండి పి.ఎన్.బి. స్టేషన్‌కు, నిడమానూరు నుండి పి.ఎన్.బి. స్టేషన్‌కు రెండు కారిడార్లలో 2019 నాటికి మెట్రో రైలు నడిపేందుకు ప్రణాళిక రూపొందించబడింది. కేంద్రప్రభుత్వం 20% వాటాగా రూ.1,720 కోట్లు, రాష్ట్రప్రభుత్వం 20% వాటాగా రూ.1,720 కోట్లు సమకూరిస్తే మిగిలిన 60% ప్రాజెక్టు వ్యయం రూ.4,200 కోట్లను విదేశీ సంస్థల నుండి ఋణంగా తీసుకోవలసి ఉంటుంది. నిడమానూరు వద్ద కోచ్ డిపో కొరకు 50 ఎకరముల భూములను, ఒక్కొక్క స్టేషన్‌కు 40 సెంట్లు చొప్పున 25 చోట్ల 10 ఎకరముల భూమిని రెండు కారిడార్ల వెంట సేకరించవలసి ఉంటుంది. నిడమానూరు రైతులు ఎట్టి పరిస్థితుల లోనూ అత్యంత విలువైన తమ భూములను యిచ్చేందుకు అంగీకరించ లేదు. సమీపంలో య.39 –16 సెంట్లు కొండపల్లి ఖాజీ మాన్యం వక్ఫ్ భూమి మరియు య.30–96 సెంట్లు రాజరాజేశ్వరి దేవస్థానం భూములను తీసుకోవచ్చని లేదా గన్నవరంలో ప్రభుత్వ భూమి ఉన్నందున ఎయిర్‌పోర్టు వరకు కారిడార్‌ను పొడిగించమని కోరారు. కానీ అధికార యంత్రాంగం ఈ ప్రత్యామ్నాయాన్ని పరిశీలించలేదు.

హైదరాబాద్ నగరంలో మెట్రో రైలు కారిడార్‌కు ప్రక్కనే వున్న స్థలములను తీసుకోకుండానే మెట్రో స్టేషన్‌లను ఏర్పరిచారు. విజయవాడ నగరంలో బందరు రోడ్డులో గజం స్థలం విలువ దాదాపు లక్ష రూపాయలుంది. అలాగే ఏలూరు రోడ్డులో కూడా గజం 75,000 కు పైగా చేస్తుంది. మొత్తంగా భూసేకరణకు రూ.500కోట్లకు పైనే ఖర్చవుతుంది.

**మెట్రో రైలుకే దిక్కు లేదు – హైపర్ లూప్ సాధ్యమా?**

విభజన చట్టంలో విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో మెట్రో రైలు ఏర్పాటు సాధాసాధ్యాలను 6 నెలల్లో పరిశీలించడం జరుగుతుందని పేర్కొనబడిందే తప్ప ఏర్పాటు చేస్తామన్న హామీ లేదు. నిడమానూరులో రైతులు ససేమిరా వ్యతిరేకించడం, కేంద్రం నూతనంగా మెట్రో రైల్ పాలసీని ప్రకటించిన దరిమిలా మెట్రో రైలు ఆలోచనను ప్రక్కనపెట్టి లైట్ మెట్రోరైల్ ఆలోచనను ముందుకు తేవడం జరిగింది.

తొలుత ప్రతిపాదించిన 27 కి.మీ.ల నిడివి – రెండు కారిడార్ల లైట్ మెట్రో ప్రాజెక్టును ఎలా ముందుకు తీసుకు వెళ్ళాలో తెలియని అయోమయ స్థితి వుండగా, యిప్పుడు తాజాగా అదనంగా 38 కి.మీ. చేర్చి, 65 కి.మీ లైట్ మెట్రో ప్రతిపాదనకు అయ్యే వ్యయాన్ని ఏవిధంగా సమకూర్చుకోవాలో స్పష్టత లేకుండానే డి.పి.ఆర్ తయారు చేయమని మున్సిపల్ మంత్రి నారాయణ గారు ఆదేశించడం ఆశ్చర్యకరం?

రాష్ట్రప్రభుత్వం ఎదుర్కొంటున్న గడ్డు ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా లైట్ మెట్రో రైలు ప్రతిపాదన కూడా ముందుకు వెళ్ళేందుకు అవకాశం లేదు. ఇదిట్లా వుండగా చాలా హెచ్చు వ్యయమయ్యే "హైపర్ లూప్" రైలు వ్యవస్థ గురించి ఆలోచన జరుగుతూ వుంది.గన్నవరం విమానాశ్రయం నుండి ఏలూరు రోడ్డు మీదుగా పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌కు, అక్కడి నుండి కృష్ణా నదిపైన బ్రిడ్జి నిర్మించి కృష్ణా కెనాల్ జంక్షన్ దాకా తీసుకువెళ్ళి అమరావతి కోర్ ఏరియాలో అండర్ గ్రౌండ్ విధానంలో "హైపర్ లూప్" వ్యవస్థ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయబడుతూ వుంది. ప్రపంచంలో అత్యంత ధనిక దేశమైన అమెరికాలోనే హైపర్‌లూప్ రైలు ప్రతిపాదన పరిశీలన దశలోనే వుండగా మన రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు చెల్లించి డి.పి.ఆర్. తయారు చేయించుతూ ఉండడం విడ్డూరం. "ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి నిచ్చెనలు వేస్తున్నట్లుగా సాధ్యాసాధ్యాలు అంచనావేసుకోకుండా ఇటువంటి ఆలోచన చేస్తూ వుండటం ఆశ్చర్యకరం.

★★★

## విద్య-వైద్య రంగాలపట్ల ప్రభుత్వ ఉదాసీన వైఖరి సమంజసమా?

### ప్రభుత్వ విశ్వవిద్యాలయముల పట్ల నిర్లక్ష్యధోరణి తగునా?

అమరావతి రాజధాని ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాల సమాహారము (హబ్) కావాలని ముఖ్యమంత్రిగారు పదేపదే తన ఆకాంక్షను వ్యక్తంచేస్తూ వుంటారు. కారుచౌకగా వందల ఎకరాల భూములను ప్రముఖ విద్యాసంస్థలకు కేటాయిస్తూ వున్నారు. కాని రాష్ట్రములో ఉన్న 14 విశ్వవిద్యాలయములలో అవసరమైన మౌలిక వసతులు, బోధనా సిబ్బంది, పరిశోధన, మున్నగు అంశములపట్ల శ్రద్ధాసక్తులను చూపించటము లేదు. ఉదాహరణకు ఆంధ్రా యూనివర్శిటీలో 1200 అధ్యాపక పోస్టులు వుండగా దాదాపు 550 పోస్టులు ఖాళీగా వున్నాయి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయములో 218 అధ్యాపక పోస్టులు వుండగా 113 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ విధముగా మన రాష్ట్రములో మొత్తం యూనివర్శిటీలలో 1500 అధ్యాపక పోస్టులు, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గెస్ట్ ఫ్యాకల్టీ, కాంట్రాక్ట్ ఫ్యాకల్టీలతో బోధన కొనసాగుతూ వుంది. ఇందువలన అర్హులైన ఫ్యాకల్టీ ప్రాతిపదికగా పరిశోధన ప్రాజెక్టులు మంజూరుచేసే యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్, ఐ.సి.సి.యస్.యస్.ఆర్., సి.యస్.ఐ.ఆర్. సంస్థలు కొత్త ప్రాజెక్టులు యిచ్చేందుకు విముఖత చూపుతూ వున్నాయి. ఇటీవల కొంతమేరకు ఈ కొరతను తీర్చేందుకు చర్యలు చేపట్టబడ్డాయి.

### ఆచార్య ఎన్.జి. రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ పట్ల నిర్లక్ష్యం తగునా?

గుంటూరు సమీపంలో లాం ఫారమ్ వద్ద దాదాపు 350 ఎకరముల ప్రభుత్వ భూములలో లాం వ్యవసాయ పరిశోధనా కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం, పశుసంరక్షణశాల, పశుసంవర్ధక యూనివర్సిటీకి సంబంధించిన కొన్ని విభాగములు ఉన్నాయి. రాష్ట్ర విభజన దరిమిలా ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంను అమరావతి రాజధానికి అత్యంత సమీపంలో ఉన్న లాం ఫారమ్‌లో

ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయ విశ్వవిద్యాలయ భవనముల నిర్మాణమునకు కేంద్రప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించింది. దాదాపు 3 సం.ల దరిమిలా యిటీవలే లాం లో ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం 110 ఎకరాలు కేటాయించింది. ఇదికాక వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం నుంచి 150 ఎకరాలు బదిలీ కావలసి వుంది. ఇక్కడ పశుసంవర్ధక యూనివర్శిటీ క్రింద ఉన్న భూమిని వ్యవసాయ యూనివర్శిటీకి ఇచ్చి, తిరుపతిలో యానిమల్ హస్‌బెండరీ విశ్వవిద్యాలయమునకు అక్కడ అదనంగా భూమిని ఇస్తే సరిపోతుంది. ఇట్టి పాలనాపరమైన నిర్ణయాన్ని తీసుకోలేకపోవటం రాష్ట్ర ముఖ్యమంత్రిగారికి ఈ అంశంపట్ల ఎంతమాత్రమూ ఆసక్తి లేదనేదానికి ప్రబలతార్కాణం. భూముల బదలాయింపు పూర్తి కాకుండా కేంద్రం నిధులను విడుదల చేయలేకపోతూంది. అంతేకాక కేంద్రం యిప్పటికి అందచేసిన నిధులకు సంబంధించి యుటిలైజేషన్ సర్టిఫికెట్ (యు.సి)ను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపియుండలేదు.

ఇటీవలే విశ్వవిద్యాలయం భవనాల బ్లూప్రింట్ (ప్లాన్) ఖరారు అయ్యింది. నిర్మించిన కొన్ని భవనాలను ప్రారంభించినా యిప్పటికీ యూనివర్శిటీ పాలనా కార్యాలయం గుంటూరులో అద్దె భవనంలోనే కొనసాగుతూ ఉండటం ఆశ్చర్యకరం. స్వదేశీ, విదేశీ, ప్రైవేట్ యూనివర్సిటీలపట్ల అమితమైన ఆసక్తిని చూపుతున్న మన ముఖ్యమంత్రిగారు వ్యవసాయ ప్రగతిలో కీలకపాత్ర నిర్వర్తించవలసిన ఎన్.జి.రంగా వ్యవసాయ యూనివర్శిటీ పట్ల చూపుతున్న ఉదాసీన వైఖరిని ఎలా అర్థం చేసుకోవాలి? వ్యవసాయం పట్ల, రైతులపట్ల, వ్యవసాయ యూనివర్శిటీ పట్ల ప్రభుత్వం యొక్క నిర్లక్ష్యానికి యిది ఒక ప్రబల తార్కాణం. దాదాపు 4 సం.లు కావస్తుంటే యిప్పుడు పరిపాలన భవనమునకు టెండర్లు పిలవడం జరుగుతూ వుంది.

## దయనీయంగా ఉన్న పాఠశాల విద్యారంగం:

పాఠశాల విద్యారంగము పరిస్థితి మన రాష్ట్రములో ఆశాజనకముగా లేదు. ప్రభుత్వ- స్థానిక సంస్థల ఆధ్వర్యములో నిర్వహించబడుతూ వున్న విద్యాసంస్థలలో విద్యార్థుల సంఖ్య గణనీయముగా పడిపోతూ వుంది. ఎక్కువమంది ప్రైవేట్ విద్యాసంస్థలపట్లనే మక్కువ చూపుతూ వున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు జి.ఓ. 41, 42ల ద్వారా 2013లో ఉత్తర్వులు యిచ్చినా, ఉన్నత స్థాయి కమిటీలు ఏర్పాటయినా, నియంత్రణ కొరవడినందున ఫీజులు దారుణంగా పెరిగిపోతున్నాయి. వాస్తవంగా ఉండవలసిన స్థాయికన్నా 2,3 రెట్లు ఎక్కువగా

ఉంటూ దిగువ మధ్యతరగతి, పేద కుటుంబాల పిల్లల విద్యపై ఖర్చు భరించలేని స్థాయికి చేరింది.

తాజాగా నిర్వహించబడిన నేషనల్ శాంపిల్ సర్వే సమాచారము ప్రకారము దేశములోని వివిధ రాష్ట్రములలో అత్యంత దిగువన బీహార్ కన్నా కొద్దిగా మెరుగుగా మనరాష్ట్రం 69%తో నిల్చింది. మధ్యలో పాఠశాల నుండి నిష్క్రమించిన విద్యార్థుల శాతము 59%, వీరిలో ఎక్కువ మంది వ్యవసాయముపై ఆధారపడ్డ కుటుంబములవారే. యిటీవల సర్వేలలో గిరిజన విద్యార్థులు డ్రాపౌట్ల రేటు 71% ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో 55,883 గ్రామాలలోని పాఠశాలల్లో 31,191 గ్రామాలలోని పాఠశాలల్లో మాత్రమే మంచినీటి సౌకర్యం ఉంది. అలాగే పట్టణాలలో ఉన్న 7245 పాఠశాలల్లో 5660 పాఠశాలలకు మాత్రమే మంచినీటి సౌకర్యము ఉన్నది. వేలాది పాఠశాలల్లో యూరినల్ / టాయిలెట్ సౌకర్యాలను కల్పించాల్సి ఉంది.

ప్రైమరీ స్కూల్స్ స్థాయిలో 71.7శాతం, హయ్యర్ సెకండరీ స్థాయిలో 10.62శాతం, కాలేజీ స్థాయిలో 33.8శాతం ఉపాధ్యాయులు ఇర్రెగ్యులర్‌గా ఉంటున్నారు. 43శాతం ఉపాధ్యాయులు టైమ్ ప్రకారం రెగ్యులర్‌గా క్లాస్‌లు నిర్వహించడం లేదు. ఈ అంశంపైన విద్యాశాఖ కేంద్రీకరించవలసి ఉంది.

## మాతృభాష తెలుగులో బోధనతోపాటు ఇంగ్లీషు కూడా ఉంటే మంచిదే:

పలు అధ్యయనాలు 10వ తరగతి వరకు మాతృభాషలో విద్యాబోధనే ఉత్తమమని, వారి మేధస్సు వికసించటానికి ఉపయోగంగా ఉంటుందని పేర్కొన్నాయి. తాజాగా ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ నివేదిక కూడా దీనిని బలపరుస్తూ వుంది. యిటీవల రెండు తెలుగు రాష్ట్రాలు 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియంలో బోధన జరగాలని నిర్ణయం తీసుకోవటం ఎంతమాత్రమూ సరికాదు. మాతృభాష (తెలుగు) లోనే విద్యాబోధనతోపాటు ఇంగ్లీషు సబ్జెక్టు కూడా ఉండేటట్లు చూడాలేతప్ప తెలుగుమీడియంను తొలగించటం సరికాదు. కృష్ణా, గుంటూరు జిల్లాలలో కొన్ని వందల స్కూళ్ళలో ఈ సంవత్సరం నుండి ఇంగ్లీష్ మీడియం ను ప్రవేశ పెట్టబోతున్నారు. ఇంగ్లీష్ మీడియంలో బోధన చేసే అనుభవం, సామర్థ్యం కలిగిన ఉపాధ్యాయులు సరిపడ సంఖ్యలో లేకపోయినా ప్రభుత్వ నిర్ణయం మారకపోవడం దురదృష్టకరం. ఈ నిర్ణయం తెలుగు భాషాభివృద్ధికి విఘాతం కలిగిస్తుంది. ఇప్పటికే తెలుగుభాషా సంఘం వుండగా యిటీవల ముఖ్యమంత్రిగారు తెలుగు భాషా ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు!

రాష్ట్ర జనాభాలో 33% మంది అనగా 1.35 కోట్ల మంది నిరక్షరాస్యులుగా ఉన్నారు. 3వ తరగతి నుండి 5వ తరగతి చదువుతూ వున్న విద్యార్థులలో 37%మంది

విద్యార్థులు 1వ తరగతి పుస్తకం కూడా చదవలేని పరిస్థితిలో ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వ నివేదికలో చెప్పబడింది. రాష్ట్రంలో 3022 ప్రభుత్వ స్కూళ్ళల్లో విద్యార్థులకు మంచినీటి సదుపాయం లేదని తెలుస్తూ వుంది. విద్యాశాఖ పరిధిలో ఉన్న 39,327 పాఠశాలల్లో దాదాపు అన్నింట్లో మరుగుదొడ్లను ఏర్పాటు చేసినప్పటికి నీటి లభ్యత లేనందున 3,381 మరుగుదొడ్లు పనిచేయటం లేదని విద్యాశాఖ సర్వేలో చెప్పబడింది. వాస్తవానికి ఈ సంఖ్య యింకా ఎక్కువ వుంటుందని సమాచారం. ఫలితంగా లక్షలాదిమంది విద్యార్థినీ విద్యార్థులకు యిబ్బందులు తప్పటం లేదు.

## నైపుణ్యాభివృద్ధి ఈనాటి తక్షణ అవసరం:

రోజురోజుకూ అభివృద్ధి చెందుతూ వున్న ఆటోమేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాల వలన 2021 నాటికి అంతర్జాతీయంగా ప్రతి పది ఉద్యోగాలలో నాలుగు పోతాయని, భారతదేశంలో ప్రతి నాలుగు ఉద్యోగాలలో ఒక ఉద్యోగం పోతుందని "పీపుల్స్ స్ట్రాంగ్ సంస్థ" ప్రకటించింది. వస్తువులు తయారు చేసే వరుస యంత్రాలు (అసెంబ్లింగ్ యూనిట్లు) వద్ద 5 సం. క్రితం 1,500 మంది పనిచేస్తూ వుంటే, యిప్పుడు 500 మంది సరిపోతున్నారు. ఈ నేపథ్యంలో పెద్దఎత్తున నైపుణ్య శిక్షణ కేంద్రాలు సక్రమంగా పనిచేసి, వాస్తవంగా నైపుణ్యం అభివృద్ధి పరిచేందుకు కృషి జరగాలి. బోగస్ సంస్థల ఆటకట్టించి నిరంతర పర్యవేక్షణ కొరకు తగు చర్యలు చేపట్టాలి.

రాష్ట్రాభివృద్ధికి అత్యంత ఆవశ్యకమైన విద్య-వైద్య రంగాలకు 2014-15 ఆర్థిక సం.లో రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 8.4%, మొత్తం వ్యయంలో 38.9% ఖర్చు చేయగా 2015-16 ఆర్థిక సం.లో స్థూల ఉత్పత్తిలో 7.51 శాతానికి, మొత్తం వ్యయంలో 31శాతానికి తగ్గించటం జరిగింది. రాష్ట్రంలో నిరుపేదలను అత్యవసర సమయములలో ప్రభుత్వ/ప్రైవేట్ ఆసుపత్రులకు చేర్చవలసిన 102/108 వాహనాల నిర్వహణకు ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవటంతో అవి సరిగా ఉపయోగ పడటం లేదు. కొత్తగా ప్రవేశపెట్టిన తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు కూడా యిదే పరిస్థితి ఎదురవుతూంది.

## ప్రజారోగ్యం పట్ల నిర్లక్ష్యం తగునా?

లోగడ చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉండగా వందలాది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు శాశ్వత భవనాలను నిర్మించి ఉపకరణాలతో సహా అభివృద్ధి చేశారు. రాష్ట్రంలో 1157 పి.హెచ్.సి.లు ఉండగా ప్రస్తుతం వాటిల్లో 204 సివిల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టులు ఖాళీగా వున్నాయి. ఫలితంగా రోగులు చాలా యిబ్బంది పడుతున్నారు.

మూత్రపిండాల వ్యాధులతో ఉద్దానం ప్రాంతంలోనే కాక ప్రకాశం జిల్లాలో కూడా

వేలాదిమంది రోగులు చాలా వ్యయ ప్రయాసలకు గురి అవుతున్నారు. ప్రకాశం జిల్లాలో అనేక మండలాలలో రక్షిత త్రాగునీరు లేకపోవటం భూగర్భజలాలలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండటం యిందుకు ప్రధాన కారణం. పవన్‌కళ్యాణ్ డిమాండ్‌తో ఉద్దానం ప్రాంతంలో డయాలసిస్ సౌకర్యాలను విస్తృతపరచాలని ప్రభుత్వం ఆలోచించడం ముదావహం. అక్కడే కాకుండా పొదిలి, కనిగిరి మున్నగు ప్రాంతాలలో కూడా డయాలసిస్ కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విజయవాడలో ఎన్.టి.ఆర్. హెల్త్ యూనివర్శిటీ ప్రాంగణంలో సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ కొరకు అధునాతన భవనమును నిర్మించినా అవసరమైన సంఖ్యలో డాక్టర్లను, స్టాఫ్ నర్సులను, యం.ఎన్.ఒ.లు, తోటీలు, స్ట్రెక్చర్ బాయ్‌లు, మున్నగు వారిని నియమించవలసిన అవసరం ఎంతోవుంది. కేంద్ర మంత్రి సురేష్ ప్రభు తన యం.పి. ల్యాడ్ నిధులతో అందచేసిన ప్రాణరక్షణ వ్యవస్థ ఉన్న 13 అంబులెన్స్‌లను ప్రతి జిల్లాలోనూ ఉపయోగించుకోవలసిన అవసరం ఎంతో వుంది.

ఇటీవల రాష్ట్రప్రభుత్వం దారిద్ర్యరేఖకు పైన వున్నవారికి కూడా మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడం కొరకు 'ఆరోగ్య రక్ష' పథాకాన్ని ప్రవేశపెట్టింది. ఒక వ్యక్తికి, ఒక సంవత్సరానికి రూ. 1200/- ప్రీమియం చెల్లించితే 2 లక్షల వరకు ప్రభుత్వ గుర్తింపుపొందిన ప్రైవేట్ ఆసుపత్రులలో లేక ప్రభుత్వ హాస్పిటల్స్‌లో వైద్యసౌకర్యం పొందే అవకాశం ఉంది. ఈ పథకం గురించి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళవలసిన అవసరం వుంది.

రాష్ట్రంలోని అంగన్‌వాడి కేంద్రాలలో చిన్నారుల్లో 32.5 శాతం పోషక ఆహారం లోపంతో బాధపడుతున్నారు. దాదాపు 6 లక్షల మంది చిన్నారులు తక్కువ బరువుతో ఉన్నట్లు నివేదికలో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 4870 ప్రధాన, 6830 మిని అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 6 ఏండ్ల లోపు చిన్నారులు 38.6 లక్షల మంది, గర్భిణీలు-బాలితలు 60 లక్షల మంది లబ్ధిపొందుతారు. రాష్ట్రంలో 51,545 మంది అంగన్‌వాడి వర్కర్లు, 42,219 మంది ఆశ వర్కర్లు ఉన్నారు. వీరందరితో సమర్థవంతంగా పనిచేయిస్తూ అంగన్‌వాడి కేంద్రాల ద్వారా నిరుపేద చిన్నారులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు మొదలగువారికి మెరుగైన సేవలు అందేలా కృషి జరగాలి.

★★★

# ఐ.టి. - పారిశ్రామిక ప్రగతి

## ఎం.ఓ.యు.లు బారెడు - ఆచరణ బెత్తెడు

రాష్ట్రంలో విశాఖపట్నం, అమరావతి, తిరుపతి నగరాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు కమ్యూనికేషన్ వ్యవస్థలను పెద్ద ఎత్తున నెలకొల్పాలని ప్రభుత్వం భావించింది. 2014లో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఐ.టి. బ్లూ ప్రింట్ ప్రకారం 2018 నాటికి రూ. 1,20,000 కోట్లు పెట్టుబడులు వస్తాయని 3 లక్షల ఉద్యోగాలు కల్పించబడతాయని అంచనా. ఇటీవల జిల్లా కలెక్టర్లతో 2 రోజుల సమావేశంలో అందచేసిన సమాచారం ప్రకారం గత 4 సం.రాలలో ఐ.టి. రంగంలో 26,475 మందికి మాత్రమే ఉపాధి కల్పించబడిందని పేర్కొనబడింది.

2017-18 సామాజిక, ఆర్థిక సర్వే రిపోర్టు ప్రకారం రూ. 8,921 కోట్లు పెట్టుబడితో 1,25,292 ఉద్యోగాలను కల్పించేలా 291 సంస్థలు ముందుకు వస్తాయని ఐ.టి. & సి శాఖ ఆశించగా వీటిలో 30 శాతం సంస్థలు మాత్రమే ప్రారంభించబడ్డాయి. రూ. 300 కోట్ల పెట్టుబడితో 4,850 మందికి ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయని పేర్కొనబడింది.

గత మూడు సంవత్సరాలలో నిర్వహించబడిన భాగస్వామ్య సదస్సులలో ఒప్పందాల ప్రకారం 2,850 ప్రాజెక్టుల ద్వారా రూ. 15,83,563 కోట్ల పెట్టుబడులకు హామీ యివ్వబడినప్పటికీ యిందులో రూ. 11,29,677 కోట్ల ప్రతిపాదనలకు పలు ఆటంకాలు ఉన్నాయి. రూ. 8,36,346 కోట్ల పెట్టుబడితో 16,45,324 ఉద్యోగాలు కల్పించవలసి ఉన్న 1,035 ప్రాజెక్టుల విషయంలో యిప్పటివరకు సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డి.పి.ఆర్) యివ్వబడలేదు! ఇటీవల ఫిబ్రవరి 2018లో విశాఖలో జరిగిన 3 రోజుల సి.ఐ.ఐ. పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ సదస్సులో సి.యం. మాట్లాడుతూ గత మూడు సం.రాల్లో రూ. 13.54 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టి 31లక్షల మందికి ఉద్యోగాలు కల్పించగలిగే 946 ప్రాజెక్టు ప్రతిపాదనలకు యం.ఓ.యు.లు కుదిరాయని, అందులో 1.5 లక్షల

కోట్ల పెట్టుబడులు పెట్టే 531 ప్రాజెక్టులు పూర్తి అయ్యాయని చెప్పారు! ఈ చివరి సమ్మిట్‌లో రూ. 4.39 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు 11,04,000 ఉద్యోగాలు కల్పించగలిగే 734 ప్రతిపాదనలకు యం.ఓ.యు.లు కుదుర్చుకోవడం జరిగిందని చెప్పారు. ఆకాశంలో మబ్బుల తరహాలో ప్రకటనలు ఉంటున్నాయి.

సామాజిక–ఆర్థిక సర్వే 2016–17 ప్రకారం మొత్తంగా ఆంధ్రప్రదేశ్‌లో డిసెంబర్ 2016 నాటికి 4,67,642 మందికి ఉపాధి కల్పిస్తూ రూ. 86,894 కోట్ల పెట్టుబడితో 1,867 పెద్ద–మెగా ప్రాజెక్టులు స్థాపించబడ్డాయి. 2016–17లో రూ. 4,887 కోట్ల పెట్టుబడితో 22,696 మందికి ఉపాధి కల్పిస్తూ 54 పెద్ద–మెగా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. 2017–18లో డిసెంబర్ 2017 నాటికి రూ. 4,297 కోట్ల పెట్టుబడితో 11,762 మందికి ఉపాధి కల్పిస్తూ 40 పెద్ద–మెగా పరిశ్రమలు ఏర్పాటయ్యాయని తెల్పింది. ఈ వివరాలకు ముఖ్యమంత్రి గారి ప్రకటనలకు పొంతన ఉండటం లేదు.

## దొనకొండ వద్ద ఎరోస్పేస్ ప్రాజెక్టు ఎగిరేనా?

ప్రకాశం జిల్లా దొనకొండ వద్ద రూ. 6,000 కోట్ల పెట్టుబడితో 5,000 ఎకరాలలో విమానాలను సర్వీసింగ్ చేయడం, మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీని నెలకొల్పేందుకు టైటన్ ఎవియేషన్ కంపెనీ మరియు ఎ.పి. ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డుల మధ్య అవగాహన ఒప్పందం (ఎం.ఓ.యు) కుదిరింది. భూమి కేటాయింపునకు సర్వే చేయడం మినహా పనులు ఒక అంగుళం కూడా ముందుకు కదలలేదు. టైటన్ ఎవియేషన్ కంపెనీ ఈ ప్రాజెక్టు నుండి ఉపసంహరించుకున్నదని సమాచారం. ఈ కంపెనీ అధినేత గిరి కుమార్ యొక్క సమగ్ర సమాచారం విచారించకుండానే ఎం.ఓ.యు. వ్రాసుకుంటే ఇటువంటి ఆశాభంగములే ఎదురవుతాయి. త్రిపురాంతకం వద్ద 500 ఎకరములలో ఫుడ్‌పార్కు వస్తుందని, మరొక 500 ఎకరాలలో ఆటోమోబైల్ పరిశ్రమ రాబోతుందని ఈ మూడు పరిశ్రమల ద్వారా 5,000 మందికి ప్రత్యక్షంగాను, 20,000 మందికి పరోక్షంగాను ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా మంత్రి శిద్ధా రాఘవరావు పలు పర్యాయములు ప్రకటించినప్పటికీ ఇంతవరకు వీసమెత్తు పని జరగలేదు!

## "నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ & మాన్యుఫాక్చరింగ్ జోన్"లను నెలకొల్పేదెన్నడు?

యుపిఏ ప్రభుత్వ హయంలోనే జిడిపిలో ఉత్పత్తి రంగం యొక్క వాటాను పెంచేందుకు 12 "నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ & మాన్యుఫాక్చరింగ్ జోన్" (నిమ్జ్)లను దేశవ్యాప్తంగా నెలకొల్పేందుకు నిర్ణయించబడింది. అందులో భాగంగా నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రకాశం జిల్లాలోను, చిత్తూరు జిల్లాలోను నిమ్జ్‌లను ఏర్పర్చాలని

నిర్ణయం జరిగింది. మన దేశంలోనే మొట్టమొదటగా ప్రకాశం జిల్లాలో పామూరు సమీపంలో తలపెట్టిన నిమ్జ్ కార్యరూపం ధరిస్తుందని అందరూ ఆశించారు. నిమ్జ్‌నకు అవసరమైన రైలు, రోడ్డు, పోర్టు, ఎయిర్‌పోర్టు, టెలికాం మున్నగు బాహ్య మౌలిక వసతులను సమకూర్చడంతోపాటు "వయబిలిటీ గ్యాప్ ఫండింగ్"నుకూడా కేంద్ర ప్రభుత్వం సమకూర్చవల్సి ఉంటుంది. కాని ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వంతో చిత్తశుద్ధితో, పట్టుదలతో ఈ నిమ్జ్ ప్రాతిపదనను ముందుకు తీసుకువెళ్ళేందుకు కృషి చేస్తున్న దాఖలాలు కన్పించడం లేదు. వాస్తవానికి రామయ్యపట్నం వద్ద మేజర్ పోర్టును కేంద్ర ప్రభుత్వం చేత అభివృద్ధి చేయించే దానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించివుంటే పామూరు వద్ద నిమ్జ్ ప్రతిపాదన కార్యరూపం ధరించి వుండేది. కోట్ల కొలది రూపాయలు ఖర్చు చేస్తు, పెట్టుబడిదారుల కొరకు పలుపర్యాయములు విదేశాలలో పర్యటించడం బదులు రాష్ట్ర ప్రభుత్వం తాను చేయవలసిన పని పూర్తి చేసి, కేంద్రం నుండి రావల్సిన సహకారమును పొందివుంటే నిమ్జ్ వాస్తవ రూపం ధరించి ఉండేది.

## పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఎప్పటికి కార్యరూపం ధరించేను?

విశాఖపట్నం–కాకినాడ మధ్య గ్రీన్ ఫీల్డ్ ముడి చమురుశుద్ధి, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు అడుగు ముందుకు పడటం లేదు. ఇందుకు సంబంధించి జనవరి 27, 28 - 2017లలో విశాఖపట్నంలో జరిగిన భాగస్వామ్య సదస్సులో హెచ్.పి.సి.ఎల్., గెయిల్ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. రూ.37,433 కోట్లు పెట్టుబడి పెడతామని, తద్వారా 1,000 మందికి ఉపాధి లభిస్తుందని ప్రతిపాదించాయి. ఈ ప్రాజెక్టు ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్ 14% నుంచి రాజస్థాన్‌లో వలె 12%కి తగ్గించితే, రాష్ట్ర ప్రభుత్వం వయబిలిటి గ్యాప్ ఫండ్ క్రింద హెచ్.పి.సి.ఎల్.కు చెల్లించాల్సిన సొమ్ము (వడ్డీ లేని రుణం) రూ.3,736 కోట్ల నుంచి రూ.1,123 కోట్లుకు తగ్గుతుంది. కేంద్ర మంత్రివర్గంలో మొన్నటిదాకా ఇద్దరు రాష్ట్రమంత్రులు వున్నా ఈ విషయంపైన పట్టుబట్టి అంగీకరింపచేయలేకపోవడం దురదృష్టకరం.

## కొవ్వాడ మరియు కావలి ప్రాంతాలలో అణు విద్యుత్ కర్మాగారాలు ఎందుకు?

కొన్ని దశాబ్దముల క్రిందట సౌర విద్యుత్, పవన విద్యుత్ మనదేశంలో పెద్దగా వినియోగములోనికి రానికాలంలో, థర్మల్, జల విద్యుత్‌నకు తోడుగా న్యూక్లియర్, థర్మల్ ప్లాంట్ల ద్వారా కూడా విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవాలనే ప్రయత్నాలు జరిగాయి. అందులో భాగంగా బార్క్, కైగా, చెన్నై, కుడంకుళం, నరోరా, తారాపూర్ న్యూక్లియర్ ప్లాంట్లను స్థాపించారు. చెర్నోబిల్, ఫుకోషిమా మున్నగు చోట్ల సంభవించిన

ప్రమాదముల పర్యవసానంగా మానవులకు, జీవకోటికి మరియు పర్యావరణమునకు సంభవించిన ఘోరమైన నష్టాలను గమనించిన దరిమిలా నూతనంగా న్యూక్లియర్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై ప్రజలలో తీవ్రమైన వ్యతిరేకత వస్తూ వచ్చింది. గుజరాత్‌లో అమెరికా తోడ్పాటుతో మిత్రివిద్ధి, పశ్చిమబెంగాల్‌లో హరిపూర్‌లో రష్యా సహకారంతో నిర్మించాలను కున్న అణువిద్యుత్ కర్మాగారాలపై అచ్చటి ప్రజలలో తీవ్రమైన వ్యతిరేకత రావటంతో యిప్పుడు వాటిని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారు. అమెరికాకు చెందిన వెస్టింగ్ హౌస్ కంపెనీ 6,600 మెగావాట్ల ప్లాంట్లను కొవ్వాడ వద్ద, రష్యా సహకారంతో 6,000 మె.వా. ప్లాంట్లను నెల్లూరు జిల్లా కావలి సమీపంలోనూ ఏర్పాటు చేసేందుకు ఆలోచనలు జరిగాయి. చాలాకాలంగా కొవ్వాడ వద్ద ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. తాజాగా కొవ్వాడ వద్ద తలపెట్టిన అణువిద్యుత్ కర్మాగార యంత్ర సరఫరా కాంట్రాక్టు నుండి జపాన్‌కు చెందిన తోషిబా సంస్థ తప్పుకొంది. వెస్టింగ్‌హౌస్ సంస్థ దివాళా ప్రకటించింది.

ఇటీవల వెస్టింగ్‌హౌస్ సంస్థ దివాళా పరిస్థితిని అధిగమించిందని భారత్‌లో పలు అణువిద్యుత్ కర్మాగారములను నెలకొల్పుటకు సిద్ధముగా ఉన్నదని అమెరికా ప్రభుత్వ వర్గాలు ప్రకటించినా ప్రస్తుతం సౌర విద్యుత్ చౌకగా లభిస్తున్నందున, యిప్పటికే రాష్ట్రం మిగులు విద్యుత్‌తో సతమతమవుతూ వున్నందున అణువిద్యుత్ ప్రతిపాదనను రద్దుచేయవలసిన ఆవశ్యకత వుంది.

తమిళనాడులో కూడంకుళం వద్ద అణువిద్యుత్ ప్లాంట్ చాలాకాలంక్రితం నుండి నిర్మించబడుతూ వుండి, ప్రజల ఆందోళన దరిమిలా ఎట్టకేలకు ఇటీవలే ప్రారంభమైన విషయం తెలిసిందే. శ్రీకాకుళం జిల్లా కొవ్వాడ వద్ద యిప్పటికి యింకా భూసేకరణ దశలోనే వున్నందున ప్రభుత్వం వెంటనే అణువిద్యుత్ ప్లాంట్ల స్థాపనను విరమించుకోవటం అవసరం. అలాగే కావలిలో కూడా అణువిద్యుత్ ప్లాంట్ ప్రతిపాదనను విరమించాలి.

## మిగులు విద్యుత్‌తో ఎలా?

కృష్ణపట్నం సమీపంలో మరికొన్ని సంస్థలు ఉత్పత్తిని ప్రారంభించబోతూ వున్నాయి. సెంబ్‌కార్ప్ - ఎస్.జి.పి.ఎల్, కృష్ణపట్నం పవర్ 1,320 మె.వా., జె.ఎస్.పి.ఎల్ (క్రైనేటా పవర్) 1988 మె.వా., మీనాక్షి ఎనర్జీ 300 మె.వా., సింహపురి ఎనర్జి 600 మె.గా. దామోదరం సంజీవయ్య టి.పి.ఎస్. 1,600 మె.వా. విద్యుత్ సంస్థల నుండి కూడా విద్యుత్ సరఫరా అందుతూ వుంది. అంతేకాక యిప్పుడు పర్యావరణహితంతో కూడిన సోలార్ మరియు పవన విద్యుత్ యూనిట్ సుమారు

రూ. 3 నుండి రూ. 4 ల ధరకే లభ్యమవుతూవున్న పరిస్థితి వుంది.  రానున్న కాలంలో ఈ ధర యింకా తగ్గే అవకాశాలు కనిపిస్తూ వున్నాయి. రాష్ట్రంలో వేలకువేల హెక్టార్ల భూమి పడావుగా ఉండి, సాగుకు యోగ్యంకాని భూములలో సోలార్, పవనవిద్యుత్ ప్లాంట్లను నెలకొల్పడం సమంజసముగా వుంటుంది.

విశాఖపట్నంలో 270 ఎకరాలలో ఏర్పాటు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ మెడికల్ టెక్నాలజి జోన్ (ఎ.యం.టి.జడ్) లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుతూ వున్న "సమీర్ సెంటర్ ఫర్ ఎలక్ట్రో మేగ్నటిక్ ఎన్విరాన్‌మెంట్ ఎఫెక్ట్" (సి.ఇ-3) సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం భూమిని సమకూరిస్తే సదరు కేంద్ర సంస్తే డెవలప్‌మెంట్ బాధ్యతను తీసుకుని ఉండేది. కానీ జర్మనీకి చెందిన "టి.యు.వి. రైన్ ల్యాండ్" సంస్థకు భవన నిర్మాణం చేసి యివ్వడంతోపాటు పరికరాలను కూడా ఎ.యం.టి.జడ్. సమకూర్చుతోంది.  97% పెట్టుబడిని ఎ.యం.టి.జడ్. భరిస్తుండగా ల్యాండ్ లీజును మాత్రమే రెయిన్ ల్యాండ్ సంస్థ చెల్లిస్తుంది. వచ్చే మొదటి రెండేండ్లలో వచ్చే లాభంలో 98% ఆ సంస్థ తీసుకుంటే 2% మాత్రమే రాష్ట్రప్రభుత్వానికి రావడం ఆశ్చర్యకరం?

★★★

# అమరావతి ప్రజా రాజధాని అవుతుందా?

## రాజధాని స్థల ఎంపిక కరెక్టేనా?

సీమాంధ్రలోని 5 కోట్ల తెలుగు ప్రజల అభీష్టానికి భిన్నంగా మనదేశంలో మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పరచబడ్డ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విభజించబడింది. నవ్యాంధ్రప్రదేశ్‌కు రాజధాని ఎక్కడ అన్న విషయం విభజన చట్టంలో పేర్కొనబడలేదు. కేంద్రప్రభుత్వం కె. శివరామకృష్ణన్ ఆధ్వర్యంలో ఒక సాంకేతిక నిపుణుల కమిటీని ఏర్పాటుచేసింది.

ఎ. ఎక్కువ మంది ప్రజలు, నివాసాలు తొలగించబడకుండా.

బి. వరదలు, తుఫానులు, భూకంపముల వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించగల పరిస్థితులను అంచనా వేసుకొని.

సి. సాధ్యమైనంత తక్కువ భూమిని సేకరించేలా, తక్కువ వ్యయంతో నిర్మాణం జరిగేలా.

డి. యిప్పటికే వున్న వ్యవసాయ పంట పొలాలను సాధ్యమైనంత వరకు తొలగించబడకుండా వుండేలా, పరిగణనలో వుంచుకుని నూతన రాజధానికి అనువైన ప్రదేశమును సూచించవలెనని శివరామకృష్ణన్ కమిటీకి కేంద్రప్రభుత్వం మార్గదర్శకాలను సూచించింది.

రాజధాని నిర్మాణానికి అవసరమైనచో కేంద్రప్రభుత్వం అటవీ భూములను డీనోటిఫై చేసి అందించగలదని విభజన చట్టంలో స్పష్టంగా పేర్కొనబడింది. కృష్ణా జిల్లాలో నూజివీడు–ఆగిరిపల్లి ప్రాంతంలో దాదాపు 20 వేల ఎకరముల పైన అటవీ భూములు (డిగ్రేడెడ్ ఫారెస్ట్ భూములు) వున్నాయి. సమీపంలో జాతీయ రహదారి నెం.5, జాతీయ రహదారి 221, గన్నవరం వద్ద విమానాశ్రయం, పోలవరం కుడికాలువ, నాగార్జునసాగర్ ఎడమ కాలువ, మున్నగునవి అందుబాటులో వున్నప్పటికీ, వాస్తురీత్యా గుంటూరు జిల్లా లోని అమరావతి ప్రాంతం అత్యంత అనుకూలంగా వుంటుందని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

## రాజధానిలో బడాబాబులు భూముల కొనుగోళ్ళు:

తుళ్ళూరు ప్రాంతంలో రాజధాని రాబోతున్నదని ముందుగానే సమాచారం తెలుసుకున్న రాజకీయ నాయకులు, దండిగా నల్లధనం వున్న బడాబాబులు ఆ ప్రాంతంలో పెద్దఎత్తున రైతుల నుండి భూములను కొన్నారు. ది 1-6-2014 నుండి 3-9-2014 వరకు 2,390 ట్రాన్స్‌శాక్షన్స్ ద్వారా 582 ఎకరాలు కొనబడ్డాయి. 4-9-2014 నుండి 8-12-2014 వరకు 278 ట్రాన్స్‌శాక్షన్స్ ద్వారా 2,460 ఎకరాలు కొనుగోళ్ళు జరిగాయి. 9-12-2014 నుండి 5-3-2016 వరకు 16,148 అమ్మకాల ద్వారా 7,837 ఎకరాలు కొనుగోళ్ళు జరిగాయి. మొత్తం మీద సుమారు 11,000 ఎకరాల పట్టాభూములు, 2,000 ఎకరాల అసైన్డు/లంక భూముల కొనుగోళ్ళు జరిగాయి. వేల కోట్ల రూపాయల నల్లధనం భూముల రూపం లోనికి మారింది. సుమారు 200 గ్రామాలను అజమాయిషీ చేయవలసిన ఒక ఆర్.డి.ఓ., సుమారు 40 గ్రామాలను పర్యవేక్షించే తహసిల్దారు, ఇద్దరు డిప్యూటీ తహసిల్దార్లు ఒక్కొక్క గ్రామంలో దాదాపు 3 1/2 సం.లు కొనసాగారు. పలువిధాలా రైతులపై ఒత్తిళ్ళు తెచ్చారు. మెట్ట గ్రామాలలో ఆనాటికి భూముల ధరలు చాలా తక్కువగా ఉన్నందున ఆ రైతులు రాజధాని వస్తే తమకు మంచి లాభం చేకూరుతుందని ఆశించి భూసమీకరణకు సహకరించారు.

## అమరావతి రాజధాని ప్రాంతం పరిస్థితి:

భారీ వర్షములు కురిసినప్పుడల్లా కొండవీటివాగు, పాలవాగు మున్నగు వాటి వలన దాదాపు 10 వేల ఎకరాలకు పైగా భూములు ముంపునకు గురిఅవుతూ వుంటాయి. 2009లో కృష్ణా నదికి వరదలు వచ్చినపుడు దాదాపు 20,000 ఎకరాలకు పైగా భూమి ముంపుకు గురయ్యింది. గతంలో ఇరిగేషన్ శాఖ పలు ప్రయత్నములు చేసినా ఈ ముంపును సంతృప్తికరంగా పరిష్కరించలేక పోయింది. ఈ ముంపునకు గురి అగు భూములను రూ.1,500కోట్ల ఖర్చుతో 2 మీటర్ల ఎత్తున మెరక చేయవలెనని సి.ఆర్.డి.ఎ. ప్రతిపాదించింది. ఇటీవల రాష్ట్రప్రభుత్వం సుమారు రూ.270 కోట్లు ఖర్చుతో పంపులను, జనరేటర్‌లను ఏర్పాటు చేసి కృష్ణా నదిలోనికి, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువ లోనికి కొండవీటి వాగునీటిని పంపించేందుకు ప్రయత్నం చేస్తూ వుంది. వాతావరణంలో వస్తున్న పెనుమార్పులు, గ్లోబెల్ వార్మింగ్ వలన వర్షపాతం, తుఫానులు, మున్నగునవి చాలా ప్రమాదకర స్థాయిలో సంభవించగల పరిస్థితులు వున్నాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తూ వున్నారు. ఉత్తరాఖండ్‌లో, నెల్లూరులో, చెన్నయ్‌లో, ముంబయిలో అధిక వర్షాల వలన ప్రజలకు, ఆస్తులకు భారీ నష్టాలు

సంభవించాయి. ప్రభుత్వం చేసే ప్రయత్నం కొంత మేరకే ఉపయోగపడుతుంది కాని, అతి భారీ వర్షపాతం ఆ ప్రాంతములో సంభవించినప్పుడు చాలా పెద్ద ఎత్తున నష్టం జరిగే ప్రమాదం వుంటుంది.

అమరావతి రాజధాని ప్రాంతంలో కొండవీటి వాగు ముంపు సమస్యను ఎదుర్కొనేందుకు రూ.913 కోట్ల అంచనా వ్యయంతో ఎ.డి.సి. 3 ప్యాకేజీలను చేపడుతోంది. కొండవీటి వాగును సుమారు 23.6 కి.మీ పొడవున వెడల్పు చేయడంతోపాటు, లోతు కూడా పెంచనున్నారు. పాలవాగును కూడా 16.7 కి.మీ పొడవున అభివృద్ధి పరచనున్నారు. 7.8 కి.మీ పొడవున గ్రావిటీ కెనాల్‌ను కృష్ణాయపాలెం వద్ద 0.1 టి.యం.సి. సామర్ధ్యంతో నిర్మించే రిజర్వాయర్ కోసం రూ.253 కోట్ల అంచనా వ్యయంతో చేపడతారు. 3వ ప్యాకేజీలో భాగంగా నీరు కొండ వద్ద రూ.371 కోట్ల వ్యయంతో భారీ జలాశయాన్ని నిర్మించనున్నారు.

## ప్రకృతి ప్రసాదించిన అపూర్వమైన వరం జరీబు భూములు:

కృష్ణా నదికి పూర్వం కుడికట్ట లేదు. కొన్ని వేల సంవత్సరముల క్రితం నుండి ప్రవహించగా ఇసుక, సారవంతమైన ఒండ్రుమట్టి పొరలు పొరలుగా ఏర్పడిన భూములు ఈ జరీబు భూములు. స్వాతంత్ర్యానంతరం కృష్ణా కుడి వరద కరకట్ట నిర్మించబడింది. కరకట్టకు ఆనుకొని దక్షిణం వైపున సుమారు 2.5 కి.మీ. వెడల్పుతో వైకుంఠపురం నుండి ఉండవల్లి వరకు వున్న సుమారు 11,250 ఎకరముల విస్తీర్ణంలో ఈ జరీబు భూములు వున్నాయి. సంవత్సరం పొడవునా పలు రకముల ఆకుకూరలు, కూరగాయలు, మల్లి, గులాబి, చేమంతి, బంతి, కనకాంబరాలు, మున్నగు పూలు, అరటి, నిమ్మ, మామిడి, జామ, సపోట వంటి పండ్లతోటలతో కోనసీమను మించిన ప్రకృతి సౌందర్యంతో ఈ ప్రాంతం కళకళలాడుతూ వుండేది. వేలాది రైతు కుటుంబములతో పాటు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మిక కుటుంబాలకు ఉపాధి, ఆదాయం సమకూరుతూ వుంటాయి. ఇక్కడ స్థానికులకేకాక ప్రతిరోజు వందలాదిమంది సమీప గ్రామాల నుండి ఈ భూములలో పనిచేయుటకు వస్తూ వుండేవారు. ప్రస్తుతం ఈ భూములన్నీ కలుపు పిచ్చి మొక్కలతో నిండి వుంది. అటువంటి ఈ జరీబు భూములలో యిప్పుడు ప్రభుత్వం వారు ప్రభుత్వ భవనముల సముదాయం, సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్, పర్యాటక అభివృద్ధి పేరుతో కొంత భాగాన్ని "కాంక్రీట్ జంగిల్" గాను, కొంత భాగాన్ని పచ్చని తివాచీలుగా (లాన్స్) గాను ఏర్పాటు చేయాలని ఆలోచించడం ఎంతమాత్రమూ సరికాదు.

## జరీబు భూములలో తరగని జల నిధి:

ఈ జరీబు భూములలో 15-20 అడుగుల లోతు నుండి త్రాగుటకు మంచినీరు లభిస్తుంది. కొండవీటి వాగు వలన, వర్షపాతము వలన, కృష్ణానదిలో ప్రవాహము వలన జరీబు భూముల లోపల జలాశయములు ఏటా రీచార్జ్ అవుతూ వుంటాయి. పర్యావరణ శాస్త్రవేత్తల అంచనాలు ప్రకారం ఈ జరీబు భూముల నుండి ఏటా 60 మిలియన్ క్యూబిక్ మీటర్ల త్రాగునీరు లభించుటకు వీలుంది. ప్రస్తుత అంచనాల ప్రకారం దీని విలువ రూ. 900 కోట్లు వుంటుంది. 10 లక్షల జనాభా వరకు ఈ 60 మిలియన్ క్యూబిక్ మీటర్ల త్రాగునీరు సరిపోతుంది. రాజధాని ప్రజల త్రాగునీటి అవసరాల కొరకు వేలకోట్ల రూపాయలు వెచ్చించి వైకుంఠపురం వద్ద కృష్ణా నదిపై బ్యారేజీని నిర్మించాలని మరియు మూడు రిజర్వాయర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరమే వుండదు.

## అమరావతి సహజ నగరం:

కృష్ణా కుడి కరకట్టకు దక్షిణం వైపున సుమారు 2.5 కి.మీ. వెడల్పున వైకుంఠపురం నుండి ఉండవల్లి వరకు వున్న జరీబు భూములను వ్యవసాయ అనుబంధ వ్యాపకాల కొరకు కేటాయించడం వలన రాజధాని నగర ప్రజలకే కాక విజయవాడ, గుంటూరు మున్నగు సమీప ప్రాంతాల ప్రజలకు అవసరమగు ఆహార ఉత్పత్తులు లభించుతాయి. "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్"అన్న గురజాడ సూక్తిని మరువరాదు. భవిష్యత్తులో రాజధాని నగరంలో నివసించబోయే ప్రజలకు అవసరమయ్యే వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులనే కాక, డైరీ, పౌల్ట్రీ, ఫిషరీస్ రంగాలను కూడా ప్రోత్సహించుతూ, తోడ్పాటును యిస్తూ, వేలాదిమందికి ఉపాధి అవకాశాలను కూడా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన వుంది.

రాష్ట్ర ప్రభుత్వం సింగపూర్ సంస్థల స్విస్ చాలెంజ్ ప్రతిపాదనకు ప్రత్యామ్నాయాలను సూచించాలని ప్రకటించినపుడు ప్రఖ్యాత విక్రమ్ సోని మరియు రోమి ఖోస్లా గార్లు రూపొందించిన అమరావతి సహజ నగరం ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వానికి అందచేసినా, దానిపైన ఎటువంటి చర్చ జరుగక పోవడం విచారకరం. ఈ ప్రతిపాదనను అంగీకరించివుంటే రాజధానిలో ఉష్ణోగ్రతను తగ్గించేందుకు విదేశీ కన్సల్‌టెంట్‌ను మరియు విదేశీ టెక్నాలజీలతో అవసరమే కలగదు.

ప్రస్తుతం ప్రభుత్వం రూపొందించిన అమరావతి రాజధాని నగర విస్తీర్ణంలో తుళ్ళూరు, అనంతవరం, నెక్కల్లు, దొండపాడులో కొంత భాగం భూములు వాగుల

ముంపునకు గురిఅయ్యే అవకాశం లేదు. కావున ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ప్రభుత్వ భవనముల సముదాయము, సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ మున్నగువాటిని, ఈ గ్రామాల భూములలో ఏర్పాటు చేయటం మంచిది. అవసరమైతే కంతేరు సమీప మెట్ట గ్రామములలో కొంత భూమిని తీసుకొనవచ్చును.

## నవ నగరాలు - ఉపాధి అవకాశములు - జనాభా - పెట్టుబడులు మున్నగు అంశముల అంచనాలకు - వాస్తవ పరిస్థితులకు పొంతనలేదు:

అమరావతి రాజధాని నగరములోని 29 గ్రామములలోని ప్రస్తుత జనాభా 3.8 లక్షలుగా వుండగా 2050 నాటికి 35 లక్షలకు పెరుగుతుందనే అంచనా సరికాదు. హర్యానా, పంజాబ్ మరియు కేంద్రపాలిత చండీఘడ్ రాజధాని నగర జనాభా 1981లో 4.5 లక్షలుగా వుండగా 2011 నాటికి 13.3 లక్షలకు మాత్రమే చేరిందన్న వాస్తవాన్ని విస్మరించరాదు.

వాణిజ్య అవసరాల కొరకు 77 కోట్ల చ.అ. విస్తీర్ణం అవసరం ఉంటుందని, మొత్తంగా ఫ్లోర్‌స్పేస్ 227 కోట్ల చ.అ. అవసరం ఉంటుందనే అంచనా సరికాదు. రహదారులు, డ్రైయిన్‌లు, విద్యుత్, మున్నగు మౌలిక వసతుల కల్పనకు రూ.41,235 కోట్లు అవసరమని సి.ఆర్.డి.ఎ. అంచనా వేసింది. కృష్ణా జిల్లాలో నూజివీడు-ఆగిరిపల్లి, మల్లవల్లి ప్రాంతములలో వందలాది ఎకరములను, దొనకొండ ప్రాంతములలో 20 వేలు ఎకరాలకుపైగా పారిశ్రామిక ప్రగతి కొరకు కేటాయించుతూ ఉండగా రాజధాని నగరములో 2,000 ఎకరాలను పరిశ్రమల కొరకు కేటాయించవలసిన ఆవశ్యకత వుండదు.

పంట పొలాలను మాయంచేస్తూ రాజధాని నగర విస్తీర్ణంలో 29.5 శాతం భూమిని పచ్చని తివాచీలు, లాన్లు, కాలువల క్రింద కేటాయించడం ఏ రకంగా సబబు? రాజధాని నగరంలో "బ్లూ కాన్సెప్ట్" క్రింద నదిలో నుండి పెద్ద కాలువను తీసి తిరిగి నదిలో కలిసే విధంగా ఏర్పాటు చేసి, అందులో బోట్లు ప్రయాణించాలనే ఆలోచన అందంగానే ఉంటుంది. కానీ అతి భారీ వర్షపాతం సంభవించినపుడు రాజధాని ప్రాంతమంతా మునిగేపోయే ప్రమాదం ఏర్పడుతుంది. కావున ఈ అంశాన్ని లోతుగా అధ్యయనం చేసి పునఃపరిశీలించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## ప్రతిపాదిత నవనగరాలు-జనాభా-భూములు-ఉపాధి అవకాశములు

| నవ నగరాలు | గ్రామాలు | జనాభా | ఉపాధి అవకాశాలు | నగరమునకు భూమి కేటాయింపు ఎకరాలు | నగరములో సంస్థలకు అవసరమగు భూమి ఎకరాలు |
|---|---|---|---|---|---|
| 1) ఆర్థిక నగరం (సి.బి.డి) | | 2,00,000 | 4,30,000 | 5,168 | 1,415 |
| 2) ఆరోగ్య నగరం | నవులూరు పెనుమాక కృష్ణాయపాలెం | 3,30,000 | 1,05,000 | 6,511 | 626 |
| 3) నాలెడ్జ్ నగరం | తుళ్ళూరు ఐనవోలు నీరుకొండ | 6,00,000 | 1,20,000 | 8,547 | 2,200 |
| 4) ప్రభుత్వపాలన | రాయపూడి లింగాయపాలెం | 2,22,000 | 58,500 | 2,702 | 1,400 |
| 5) న్యాయనగరం | నేలపాడు కృష్ణాయపాలెం | 2,20,000 | 90,000 | 3,438 | |
| 6) ఎలక్ట్రానిక్స్ నగరం | కురగల్లు, నిడమర్రు | 2,80,000 | 2,73,500 | 6,582 | 1,827 |
| 7) స్పోర్ట్స్ నగరం | బోరుపాలెం అబ్బరాజుపాలెం పిచ్చుకలపాలెం దొండపాడు | 2,40,000 | 1,05,000 | 4,150 | 1,625 |
| 8) మీడియా నగరం | అనంతారం నెక్కల్లు | 2,78,000 | 1,53,500 | 5,107 | 1,578 |
| 9) పర్యాటక నగరం | ఉండవల్లి తాడేపల్లి | 1,30,000 | 1,53,500 | 11,594 | 1,316 |

పైన పేర్కొనబడిన అంచనాలకు వాస్తవ పరిస్థితులకు ఎంతమాత్రమూ పొంతనలేదు:

ఉదాహరణకు పర్యాటక నగరమునకు 11,594 ఎకరాలు భూమి కేటాయించబడింది. ఇందులో 8,778 ఎకరములను ఓపెన్ స్పేస్‌గా ఉంచుటకు 1,397 ఎకరములను రెసిడెన్సియల్ క్వార్టర్స్ కట్టుటకు, 451 ఎకరములను కమర్షియల్ అవసరాలకు, 154 ఎకరాలను ప్రత్యేక జోన్‌గానూ వినియోగించాలని నిర్ణయించబడింది. హోటల్/రిసార్ట్స్ కొరకు 790 ఎకరములు, గోల్ఫ్ కోర్టుల కొరకు 384 ఎకరములు కేటాయించినట్లు చూపబడింది. సింగపూర్‌లో సెంతోషా ఐలాండ్‌లో "ఇంటిగ్రేటెడ్ రిసార్ట్, వరల్డ్ సెంతోషా" 121 ఎకరముల విస్తీర్ణములో ఉంది. దీనిపైన రూ. 30,000 కోట్లు వెచ్చించబడింది. అలాగే సింగపూర్‌లోనే "మెరీనా బే రిసార్ట్స్" దాదాపు రూ. 30,000 కోట్ల వ్యయంతో 50 ఎకరముల పైన నిర్మించబడింది. సింగపూర్‌లో అమెరికా, జపాన్, యూరోపియన్ యూనియన్‌కు చెందిన 7వేల బహుళజాతి సంస్థల కార్యాలయాలు, 1,500 చైనీస్ కంపెనీల కార్యాలయాలు ఉండి వాటిల్లో చాలా భారీ వేతనాలు పొందుతూ ఉండే ఉద్యోగులు మరియు విదేశాల నుండి స్వల్పకాలిక వినోదాల కొరకు వచ్చే లక్షలాదిమంది టూరిస్టుల కొరకు ఈ సంస్థలు 2010 సం. దరిమిలా మాత్రమే ఏర్పాటు చేయబడ్డాయన్న వాస్తవాన్ని గమనించాలి. ఈ నగరంలో 1,53,500మందికి ఉపాధి లభిస్తుంది అనే అంచనాలలో ఎంతమాత్రమూ పసలేదు. అమరావతిలో జ్ఞానబుద్ధ కేంద్రము, అమరలింగేశ్వరస్వామి, వైకుంఠపురంలో శ్రీ వేంకటేశ్వరస్వామి, మంగళగిరిలో లక్ష్మీ నృసింహస్వామి ఆలయాలకు సమీపంలో పర్యాటకరంగ అభివృద్ధి పేరిట క్యాసినోలు, పబ్బులు, క్లబ్బులను ప్రోత్సహించటం ఎంతమాత్రమూ తగదు.

హైదరాబాద్‌లో 946 పడకలతో ప్రతిష్ఠాత్మక నిమ్స్ ఆసుపత్రి 23 ఎకరముల విస్తీర్ణములోనే ఉంది. న్యూఢిల్లీలో ఏటా 12లక్షల మంది రోగులు ఔట్ పేషెంట్లుగా, 46,000 మంది ఇన్‌పేషెంట్లుగా వైద్య సౌకర్యం పొందుతూ ఉండే రామ్‌మనోహర్ లోహియా హాస్పటల్ 980 పడకలతో కేవలం 30 ఎకరముల విస్తీర్ణములో ఉండగా ఆరోగ్య నగరానికి 6,511 ఎకరాలు ఎందుకు?

**రాయలసీమ ప్రజల మనోభావాలను గౌరవించాలి:**

హైదరాబాద్ నగరంలో ఉమ్మడి హైకోర్టు భవనములు సుమారు 50 ఎకరముల విస్తీర్ణములోనే ఉన్నాయి. అమరావతి రాజధానిలో హైకోర్టు, న్యాయవిద్యకు సంబంధించిన సంస్థలు, శిక్షణా అకాడమీలు, లా స్కూల్స్, ట్రిబ్యునల్స్ మున్నగు వాటితోపాటు న్యాయమూర్తులు, న్యాయవాదులకు అవసరమైన సదుపాయములు సమకూర్చుటకు కేటాయించబడిన భూమిలో 4వ వంతు భూమి సరిపోతుంది.

రాయలసీమ ప్రాంత ప్రజలు రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వున్నారు. ఆ ప్రాంత ప్రజల మనోభావాలను కూడా గౌరవించవలసిన ఆవశ్యకత వుంది. శివరామకృష్ణన్ కమిటీ కూడా హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయటం సమంజసంగా వుంటుందని సూచించింది. అమరావతిలో మరియు ఉత్తరాంధ్రలో హైకోర్టు బెంచ్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. తమిళనాడులో మద్రాసులో హైకోర్టు, మధురైలో బెంచ్ ఉన్నాయి. కర్నాటకలో బెంగుళూరులో హైకోర్టు ఉండగా, ధార్వాడలోనూ మరియు గుల్బర్గాలోనూ హైకోర్టు బెంచ్‌లు ఉన్నాయి.

## వాస్తవికతకు దూరంగా అంచనాలు:

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐ.టి. కంపెనీలు 1,092 ఉండగా వీటిలో దాదాపు 1,000 పైగా హైదరాబాద్‌లోనే ఉన్నాయి. ప్రస్తుతం ఐ.టి. ఎగుమతుల రంగంలో నవ్యాంధ్ర వాటా 0.4%గా ఉన్నది. రానున్న కాలంలో 5%కు పెరుగుతుందనే అంచనా వేయబడింది. విజయవాడ విమానాశ్రయమునకు ఎదురుగా 5 సం.ల క్రితం నిర్మించబడిన మేధా టవర్స్‌లో మొన్నమొన్నటిదాకా కేవలం మూడు చిన్న ఐ.టి. కంపెనీలు మాత్రమే కొనసాగుతూ వచ్చాయి. ఇప్పుడు హెచ్.సి.ఎల్. సంస్థ దానిలోకి వెళుతుంది. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ వలెనే రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో ఐ.టి. రంగాన్ని ప్రోత్సహించుట కొరకు "సిగ్నేచర్ టవర్స్"ను రూ.300కోట్ల వ్యయంతో నిర్మించాలని టెండర్లు పిలిచినా ఒక్క సంస్థ కూడా ముందుకు రాలేదు. చాలాకాలం క్రితం నగరం నడిబొడ్డులో ఏర్పాటు చేయబడిన విప్రో సంస్థ ఆశించిన ఫలితాలను సాధించడంలో వైఫల్యం చెందినందున ఆ సంస్థకు ఇచ్చిన భూమిని వెనుకకు తీసుకొనడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తూ ఉంది. ఇట్టి పరిస్థితుల్లో అమరావతి రాజధాని ప్రాంతములో ఎలక్ట్రానిక్ నగరం కొరకు 6,582 ఎకరాల భూమి ఎంతమాత్రమూ అవసరం వుండదు.

రాజధానిలో వెలగపూడి సమీపంలో 15 ఎకరాల విస్తీర్ణంలో జి+11 విధానంలో 1,032 ఫ్లాట్లను కట్టి ప్రజలకు విక్రయించాలని సి.ఆర్.డి.ఎ. ప్రతిపాదించింది. వీటి ప్రారంభ ధర చ.అ.కి రూ.3,500/-లుగా నిర్ణయించారు. రాష్ట్రం మొత్తం మీద లక్ష హోటల్ గదులు, రాజధానిలో 10,000 హోటల్ గదులు ఏర్పాటు చేయడం లక్ష్యమని ముఖ్యమంత్రి చెప్పారు. రాజధానిలో 1,800 హోటల్ గదుల నిర్మాణం లెటర్ ఆఫ్ ఇంటెంట్ ఇచ్చినట్లు తెలిపారు.

నవులూరులో అమరావతి టౌన్‌షిప్‌లో ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ వారు అంతర్జాతీయ స్థాయి క్రికెట్ పోటీల నిర్వహణకు అనుగుణంగా స్టేడియంను నిర్మించుతూ

ఉన్నారు. అలాగే మూలపాడు గ్రామ సమీపంలో కూడా రెండు క్రికెట్ స్టేడియంలను ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ అభివృద్ధి చేస్తూవుంది. విజయవాడలో ఇందిరాగాంధి మున్సిపల్ స్టేడియం, దండమూడి రాజగోపాలరావు మున్సిపల్ ఇండోర్ స్టేడియం, గుంటూరులో కాసు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలు ఉన్నాయి. ఇవికాక రెండు నగరాలలోనూ ప్రైవేట్ కళాశాలల్లో కూడా పలు స్టేడియంలు ఉన్నాయి. ఇట్టి పరిస్థితులలో రాజధాని నగరంలో క్రీడాభివృద్ధికి వాస్తవంగా ఏ మేరకు భూమి అవసరం అన్నది పక్కాగా అంచనా వేసుకోవలసి వుంది. ఒక్క గోల్ఫ్ కోర్టు సరిపోతుంది.

## రాష్ట్ర ఖజానాకు పెద్ద ఎత్తున నిధులను సమకూర్చుకొనటానికి సువర్ణ అవకాశం.

ఇప్పుడు వున్న గ్రామాలు, గ్రామ కంఠాలు, రైతులకు యివ్వవలసిన నివాస, వాణిజ్య ప్లాట్లు, రహదారులు, కాలువలు, కొండలు పోగా దాదాపు 15,000 ఎకరాల భూమి సి.ఆర్.డి.ఎ. అధీనంలో వుంటుంది. ఈ భూములలో నివాస, వాణిజ్య, భవన నిర్మాణములు చేపట్టు విదేశీ లేక స్వదేశీ సంస్థలకు, విద్యా, వైద్య, సంస్థలకు ప్రస్తుత మార్కెట్ ధరలకు విక్రయించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు వేలాది కోట్ల రూపాయలను సమకూర్చుకొన వచ్చును. ప్రభుత్వ నగరములో అసెంబ్లీ, కౌన్సిల్, సెక్రటేరియట్, హెచ్.ఒ.డి. ఆఫీసులు, రాజ్‌భవన్, సి.యం. మరియు మంత్రుల, ఉద్యోగుల నివాస భవనములు మున్నగు వాటికి రూ.6,000/-కోట్లు అవసరమవుతాయని అంచనా వేయబడింది. బ్యాంకుల నుండి లేక, ఎ.డి.బి., లేక వరల్డ్ బ్యాంకు మున్నగు ఆర్థిక సహాయ సంస్థల నుండి ఋణం తీసుకోవల్సిన ఆవశ్యకత లేకుండా మౌలిక వసతుల కల్పనకు, యితర అభివృద్ధి కార్యక్రమముల కొరకు ఆ ధనాన్ని వినియోగించ వచ్చు.

## రాజధానికి మంత్రి నారాయణ గారు పెట్టుబడి పెడతారా?

రాజధాని నిర్మాణానికి ఒక్కో రైతు ఒక్కో ధాన్యం బస్తా యివ్వమని ముఖ్యమంత్రి గారు కోరుతున్నారు. అలాగే ధనవంతులు తమ దగ్గరున్న ధనాన్ని బ్యాంకుల్లో వేసే బదులు 'అమరావతి బాండ్లు'గా పెట్టుబడి పెడితే ఒక శాతం అదనంగా వడ్డీ ఇస్తామని ప్రకటించారు. ఆయన విజ్ఞప్తిని మన్నించి ఇప్పటికి ఎందరు తెలుగుదేశం నాయకులు ధాన్యమిచ్చారో, ధనాన్ని బాండ్ల రూపంలో పెడుతున్నారో, ఎటువంటి సమాచారం లేదు. ఏటా వేలాది కోట్ల రూపాయల లాభాలను నారాయణ విద్యా సంస్థల ద్వారా సంపాదిస్తూ వున్న మున్సిపల్ శాఖామంత్రి నారాయణ గారు తన దగ్గరున్న వేల కోట్ల రూపాయలను అమరావతి బాండ్లలో పెట్టి ఆదర్శంగా నిలిస్తే ఇతరులు అనుసరిస్తారు.

## ప్రైవేట్ విద్య - వైద్య వ్యాపార సంస్థలకు బంగారు బాట!

రైతులు చేసిన త్యాగ ఫలితం రాష్ట్ర ప్రభుత్వానికి, తద్వారా రాష్ట్ర ప్రజానీకానికి ఉపయోగపడాలే తప్ప వ్యాపార దృక్పథంతో లాభార్జన కొరకు వచ్చే సింగపూర్, జపాన్, చైనా, రష్యా సంస్థల కొరకు, యు.కె. హెల్త్‌కేర్, వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి, అమృత యూనివర్శిటి, ఎస్.ఆర్.ఎమ్. యూనివర్సిటీ, బి.ఆర్. షెట్టి సంస్థ వంటి సంస్థలకు కారుచౌకగా ఎంతో విలువైన భూములను కట్టబెట్టడం తగదు. అమరావతి రాజధానిలో భూమి బేసిక్ విలువ ఎకరా రూ.4 కోట్లుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్.బి.ఐ. ఎస్.బి.ఐ. మున్నగు కేంద్రప్రభుత్వ సంస్థలకు ఎకరా రూ.4 కోట్లు చొప్పున విక్రయించింది. ప్రైవేట్ సంస్థలకు ఎకరా రూ.50 లక్షల చొప్పున విక్రయించుతూ వుంది. ఆ సంస్థలు బ్యాంకుల వద్దకు ఋణం కొరకు వెళ్ళినప్పుడు భూమిని హామీగా చూపి ఎకరాకు రూ.50లక్షలకు మించకుండా తీసుకునే కండిషన్ ఉండాలని ఆర్థిక శాఖ ప్రతిపాదించింది. ప్రైవేట్ సంస్థలవారు ముఖ్యమంత్రితో మాట్లాడుకుని ఆ కండిషన్‌ను తొలగింప చేశారు. ఫలితంగా ఈ సంస్థలు బ్యాంకుల నుండి ఎకరాకు కోటిన్నర నుండి 2 కోట్ల రూపాయల వరకు ఋణం పొందే వీలు కలుగుతుంది. అంటే ప్రభుత్వానికి భూమి కొరకు కట్టిన డబ్బుతోపాటు బిల్డింగుల నిర్మాణానికి అవసరమైన ధనం బ్యాంకుల నుండి లభించుతుంది. అంటే రైతుల భూమి - బ్యాంకుల ధనం (ప్రజా ధనం)తో పలుకుబడి ఉన్నవారు తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరు కాయలుగా అభివృద్ధి చేసుకునే సువర్ణావకాశం వారికి లభించుతూ వుంది.

సుప్రీంకోర్టు తీర్పులకు భిన్నంగా, విజయ్ కేల్‌కర్ కమిటీ సిఫార్సులను, విజిలెన్స్ కమీషనర్ సూచనలను, కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సిఫార్సులను విస్మరించి పారదర్శకత లేకుండా ఓపెన్ కాంపిటీషన్ బిడ్డింగ్ లేకుండా సమాజం మొత్తానికి చెందిన భూములను ప్రైవేటు సంస్థలకు ధారాగతం చేయటం ఎంతమాత్రమూ సరికాదు. లోగడ ఉండవల్లి గ్రామంలో కేవలం 73 ఎకరాల భూమిని వి.జి.టి. ఉడా పర్యాటకం కొరకు సేకరించాలని ప్రతిపాదించినపుడు ఆనాడు ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబు నాయుడు తీవ్రంగా వ్యతిరేకించారు. పర్యాటకం కొరకు పచ్చని పంట పొలాలను తీసుకోవటం తగదన్నారు.

## సింగపూర్ - అమరావతి ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ PTE తో నూతన ఒప్పందం?

2017 మే, 8వ తేదీన జి.ఓ.179 ద్వారా 1,691 ఎకరాల స్టార్ట్ అప్ ఏరియాను 3 దశలలో 15 సం.లలో అభివృద్ధి చేయడానికి రాష్ట్రప్రభుత్వం సింగపూర్ కన్సార్టియంతో యం.ఓ.యు. కుదుర్చుకుంది. ఇప్పటివరకు అందులో కించిత్తు పని

కూడా ప్రారంభం కాలేదు. ఇప్పుడు తాజాగా సింగపూర్–అమరావతి ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్ PTE లిమిటెడ్‌తో రాయితీ, అభివృద్ధి షేర్ హోల్డర్స్ ఒప్పందాలు చేసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జి.ఓ. 84ను జారీ చేసింది. నిబంధనల మేరకు సింగపూర్‌కు చెందిన ఎసెండాస్, సెంబ్రిడ్జి, సెంబ్‌కార్ప్‌ల కన్సార్టియమ్‌తో మాత్రమే రాయితీ, అభివృద్ధి, షేర్‌హోల్డర్స్ అగ్రిమెంట్లను చేసుకోవలసి వుండగా, నూతనంగా వేరే సంస్థతో ఒప్పందం చేసుకోవడం సరికాదని ఆర్థిక, న్యాయ శాఖలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. అయినా ముఖ్యమంత్రి గారు సింగపూర్ సంస్థల కోరికను మన్నించే ధోరణిలోనే వున్నారు. లోగడ చేసుకొన్న ఒప్పందంలోనే "శీఘ్ర అభివృద్ధి" కొరకు ఇవ్వబోతున్న 200 ఎకరాలకు గానూ రాష్ట్రప్రభుత్వానికి ఎంత వస్తుందో ఇప్పటివరకు తెలియపర్చకపోవడం సరికాదు.

## రాజధానిలో 46/40 అంతస్థుల భవన నిర్మాణాలు సరికాదు:

అమరావతి పరిపాలనా నగరంలో ముఖ్యమంత్రి కార్యాలయ భవనం 46 అంతస్తులుంటుంది. భవనం పైభాగంలో హెలిపాడ్ వుంటుంది. ఇదికాక ఒక్కొక్కటి 40 అంతస్థులుగా 4 టవర్లు సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాల కొరకు నిర్మించబడతాయి. వీటిని కలుపుతూ 600 మీ. పొడవైన అంతర్గత మార్గం వుంటుంది. కొండలు, గుట్టలు ఉన్న హైదరాబాద్ నగరంలోనే ఈనాటికీ, 24 అంతస్థులుకు మించి భవనాలు నిర్మించబడి ఉండలేదు. అమరావతిలో జరీబు భూములలో రెండు అంతస్థుల తాత్కాలిక సెక్రటేరియట్ భవన నిర్మాణమునకు 100 అడుగుల లోతు పైల్స్‌లను వేయటం జరిగింది. సముద్రతీరం దగ్గరగా ఉండటం, అప్పుడప్పుడూ అతి తీవ్ర సైక్లోన్‌లు సంభవించడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని, కావాల్సినంత భూమి అందుబాటులో వుంది కాబట్టి 46 /40 అంతస్థుల భవనముల నిర్మాణ ఆలోచనను పునరాలోచన చేయాల్సి వుంది.

## అమరావతి ప్రజా రాజధాని అయ్యేదెలా?

అమరావతి రాజధాని గ్రామాలలో వుంటూవున్న ప్రజలలో ఎక్కువ మందికి వ్యవసాయం తప్ప యితర రంగాలలో అనుభవం లేదు. ప్రభుత్వ ఆలోచనల ప్రకారం ప్రపంచస్థాయి నగరమును ఏర్పాటు చేసినపుడు వీరిలో ఎక్కువ మందికి ఎటువంటి అవకాశములు లభించవు. అమరావతి రాజధాని నగర మాస్టర్ ప్లాన్ ప్రకారం 7,817 ఎకరాలలో పచ్చని పచ్చిక బయళ్ళను పెంచాలని చూపబడింది. ఇదికాక 6,577 ఎకరముల భూమిని భవిష్యత్ అవసరముల కొరకు రిజర్వు చేయాలని ప్రతిపాదించబడింది. ఇందులో ఎక్కువ భాగం జరీబు భూములు ఉన్న ప్రాంతములో

ఉంది. లోగడ భూములు ఇచ్చినవారిలో ఆసక్తి ఉన్నవారికి, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు ఈ భూములలో గ్రీన్ హౌస్‌లు లేక పాలీ హౌస్‌లను ఏర్పరచి, సేంద్రీయ / ప్రకృతి సేద్యం చేస్తూ కూరగాయలు, పూలు, పండ్లు పండించేందుకు అవకాశాన్ని ఏకవార్షిక లీజు పద్ధతిలో యిస్తే వేలాదిమందికి ఉపాధి లభించడమేకాక, రాజధాని నగర ప్రజానీకంతోపాటు విజయవాడ, గుంటూరు నగర ప్రజలకు కూరగాయలు, పూలు, పండ్లు అందచేసేదానికి అవకాశం ఉంటుంది. అలాగే గ్రామాలకు సమీపంలో కొద్ది విస్తీర్ణంలలో డెయిరి, పౌల్ట్రీ వ్యాపకాలకు కూడా అవకాశం కల్పించాలి. నదీ అభిముఖ అభివృద్ధి పేరుతో "ఫ్లడ్ ప్లెయిన్స్"ను కాంక్రీటు జంగిల్‌గా మార్చకుండా జరీబు భూముల ప్రాంతాన్ని భూసమీకరణ నుండి మినహాయించి "సేంద్రీయ అగ్రికల్చరల్ జోన్"గా ప్రకటించాలి.

## రాజధాని నిర్మాణానికి రూ.2500 కోట్లు ఎలా సరిపోతాయి?

అమరావతిని ప్రపంచస్థాయి మహానగరంగా తీర్చిదిద్దాలంటే రూ.1.20 లక్షల కోట్లు ఖర్చు పెట్టాల్సి వస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజ్ఞాపన పత్రంలో తెలియపర్చింది. 2018 జనవరి 12వ తేదీన ముఖ్యమంత్రి, ప్రధానమంత్రిని కలసి రాష్ట్ర సమస్యలమీద సమర్పించిన వినతిపత్రంలోని అంశాలపైన ప్రధానమంత్రి కార్యాలయం నుండి వివరణ కోరగా సమర్పించిన వివరణ పత్రంలో ఈ విషయం పేర్కొనబడింది. అత్యవసర మౌలిక వసతులైన రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, ప్రధాన రహదార్లు తదితర నిర్మాణాలకు వచ్చే 5 ఏండ్లలో రూ.43వేల కోట్లు ఖర్చు చేయాల్సి వుంటుందని ఎ.పి. ప్రభుత్వం అంచనా వేసింది. నూతన రాజధాని నిర్మాణం కోసం కేంద్రప్రభుత్వం కనీసం రూ.10,000 కోట్లు అయినా యివ్వాలని 2015 జనవరి 6న రాష్ట్ర ప్రభుత్వం కోరింది. కానీ 8 సెప్టెంబరు, 2018న కేంద్ర ఆర్థిక మంత్రి రాజధాని నిర్మాణానికి రూ.2,500 కోట్లు యిస్తామని ప్రకటించినప్పుడే రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం చెప్పి వుండాల్సింది.

వెంకటపాలెం సమీపంలో కరకట్ట నుండి కృష్ణా నది వైపు అమరావతి మెరీనా పేరుతో, ప్రత్యేక రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును రూ.40 కోట్ల వ్యయంతో సింగపూర్ లోని మెరీనా బే రిసార్టులు తరహాలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావించుతోంది. జలసంబంధిత క్రీడలతోపాటు, రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తారు. ఈ ప్రాజెక్టుతో పాటు వెంకటపాలెం వద్ద అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌ను, 5 నక్షత్రాల హోటల్‌ను, ఒక పెద్ద షాపింగ్ మాల్‌ను నిర్మించాలని సి.ఆర్.డి.ఎ. రూపొందించింది. కృష్ణా కరకట్ట నుండి కృష్ణా నదికి మధ్యన వున్న రివర్ కన్సర్వెన్సీ జోన్‌లో ఎట్టి శాశ్వత

భవన నిర్మాణాలు చేపట్టరాదన్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులకు/ ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ కండిషన్‌లకు యిది విరుద్ధం.

## ప్రపంచ స్థాయి రాజధాని అభివృద్ధి పేరుతో భారీ దోపిడీకి అవకాశాలు: సింగపూర్ కన్సార్షియంకు గోరంత పెట్టుబడితో కొండంత లబ్ధి:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మౌలిక వసతులను రూ. 5,560 కోట్ల ఖర్చుతో స్టార్టప్ ఏరియాలో కల్పించి, రూ. 222 కోట్లు పెట్టుబడులు పెట్టి 42% వాటా పొందుతూ వుంటే కేవలం రూ. 306 కోట్ల పెట్టుబడితో సింగపూర్ కన్సార్షియంకు 58% వాటా వుంది. 50 ఎకరముల భూమిని ఉచితంగా లేక నామమాత్రపు ధరకు యివ్వాలి. డౌన్ టౌన్ రోడ్డు వెంట యివ్వవలసిన 200 ఎకరములకు రెవిన్యూ షేర్ 20 సం.ల తరువాతే వస్తుంది. స్టార్టప్ ఏరియాను అభివృద్ధి చేసి అమ్మేందుకు అమరావతి డెవలప్‌మెంట్ పార్ట్‌నర్ (ఎ.డి.పి) వుండగా 100% సింగపూర్ మేనేజ్‌మెంట్ కంపెనీకి ఎ) ప్రాజెక్టు విలువలో 5.5% ఫీజుగా, బి) ప్లాట్లు / ఫ్లాట్లు అమ్మకాలపై 2% ఫీజుగా సి) ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ సర్వీసు రూపంలో గ్రాస్‌రెవిన్యూలో 2% ఫీజుగా వందలు/ వేల కోట్ల రూపాయల లబ్ధి సింగపూర్ సంస్థలకు చేకూరుతుంది.

ఇటీవల మునిసిపల్ మంత్రి నారాయణ రాజధానిలో రూ. 25,000 కోట్లతో 1600 కిలో మీటర్ల రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు. జాతీయ రహదారులే కిలో మీటర్‌నకు భూసేకరణతో సహా రూ. 4 నుండి 6 కోట్లు ఖర్చవుతుండగా రాజధానిలో అంతర్గాత రోడ్లకు ఇంత భారీ మొత్తాలను ఖర్చు చేస్తే రాజధాని నగర స్వరూపం పూర్తి అయ్యేటప్పటికి ఎన్ని లక్షల కోట్ల రూపాయలు అవసరమవుతాయో ఊహకు అందటం లేదు. దీని ప్రభావం రాష్ట్ర అభివృద్ధిపైనా తీవ్రంగా ఉండబోతుంది. ప్రత్యేకంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఆటంకం కలుగుతుంది.

★★★

# ఇకనైనా పాలనా తీరులో మార్పు వచ్చేనా...

1) సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) దృక్పథం కేవలం పారిశ్రామిక వేత్తలకు / క్రోని కాపిటలిస్టులకు మేలు చేకూర్చటానికే కాక రైతాంగం మరియు సామాన్య ప్రజానీకం ప్రయోజనాలను మెరుగుపర్చేందుకు కూడా దోహదపడాలని ప్రభుత్వం భావించవల్సిన అవసరం ఎంతైనా వుంది.

2) లక్షలాదిమంది రైతులు, పేదలు, బలహీన వర్గాలకు చెందినవారు సాగుచేసుకొంటున్న భూములకు చెందిన పట్టాదారు పాస్‌పుస్తకాలు, 1 బి రిజిష్టర్, అడంగల్, 22ఎ చుక్కల భూములు, మ్యుటేషన్ మున్నగు సమస్యలను యుద్ధ ప్రాతిపదికపై పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి. సర్వే డిపార్ట్‌మెంట్లో ఖాళీలను వెంటనే పూర్తి చేయాలి.

3) పారదర్శకతతో కూడిన భూసేకరణ, న్యాయమైన నష్టపరిహారం మరియు పునరావాస–పునఃస్థాపిత భూసేకరణ చట్టం 2013 చట్టంలో సామాజిక ప్రభావ అంచనా, ప్రజామోదం, బహుళ పంటల భూములపై అంక్షలు మున్నగు వాటిని మినహా యిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన సవరణలను రైతాంగ ప్రయోజనాల దృష్ట్యా ఉపసంహరించటం సముచితం.

4) ఉద్యోగాల కల్పన సాకుతో అవసరానికి మించి పెద్ద ఎత్తున పేదల భూములను కార్పోరేట్ సంస్థలకు కట్టబెడుతున్న ప్రక్రియను విరమించాలి. కొద్దిమందికి పరిశ్రమలలో ఉద్యోగాలు కల్పించగలిగినా అదే సమయంలో అంతకన్నా ఎక్కువ మంది రైతులు గ్రామీణ పేదల ఉపాధికి, జీవన భద్రతకు నష్టం చేకూరుతు వుందన్న వాస్తవాన్ని గమనించాలి.

5) రాష్ట్ర ఆర్ధిక పరిస్థితి గడ్డుగా వున్నందున సమీప భవిష్యత్తులో విజయవాడ నగరంలో మెట్రో రైలు, ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్‌రోడ్డుకు ఇరువైపులా

500 మీ. వెడల్పు చొప్పున కారిడార్లు, అమరావతి–అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే, కృష్ణానదిపై రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతో బ్రిడ్జీల నిర్మాణం, మున్నగు ప్రాజెక్టులను కొన్ని సంవత్సరముల పాటు వాయిదా వేయాలి.

6) రాష్ట్రంలో ఉన్న షుమారు 15 లక్షల మంది కౌలు రైతులకు సంస్థాగత రుణాలు, ప్రభుత్వం నుండి వచ్చు రాయితీలు లభించేందుకు నీతి ఆయోగ్ రూపొందించిన "మోడల్ ల్యాండ్ లీజ్ లా" ను పరిశీలించి ఇప్పటికే మధ్యప్రదేశ్ మరియు ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు ఆమోదించిన విధంగా మన రాష్ట్రంలో కూడా చట్టాన్ని తీసుకువస్తే రైతులకు తమ భూములపై యాజమాన్య హక్కులకు భంగం వాటిల్లకుండానే కౌలు రైతుల ప్రయోజనాలను పరిరక్షించే వీలు కలుగుతుంది. కావున రానున్న అసెంబ్లీ సమావేశములలో ఈ మేరకు చట్టాన్ని తీసుకు రావల్సిన అవసరం ఉంది. కౌలు రైతులతో సహా సన్నకారు, చిన్న రైతులందరికీ సహకార–వాణిజ్య బ్యాంకుల నుండి పంట రుణాలు యిప్పించాలి.

7) కనీస మద్దతు ధరల కన్నా తక్కువకు పంటల ధరలు తగ్గినప్పుడు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దిగి కొనుగోలు చేయాలి. ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసిన మేరకు రూ. 5,000 కోట్లతో "ధరల స్థిరీకరణ నిధి"ని ఏర్పాటు చేయాలి.

8) రైతు రుణ మాఫీ పథకం క్రింద యింకనూ విడుదల చేయాల్సిన మొత్తాన్ని ఒకే దఫాగా యీ ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే ముందే ఒకే మొత్తంగా విడుదల చేయాలి. టమాటా, ఉల్లి మున్నగు కూరగాయల ధరలు హోల్‌సేల్ మార్కెట్లో బాగా తగ్గినప్పుడు మార్కెటింగ్ శాఖలో రైతులకు గిట్టుబాటు ధర యిచ్చి రైతు బజార్ల ద్వారా వినియోగదారులకు సరసమైన ధరలకు విక్రయించటం ద్వారా రైతులను ఆదుకోవాలి. మరిన్ని రైతు బజార్లు ప్రారంభించాలి.

9) కర్ణాటక, పంజాబ్ మరియు బిహార్ రాష్ట్రాలలో ఏర్పాటు చేసిన విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఫార్మర్స్ కమీషన్ ఏర్పాటు చేయాలి.

10) సహజ–సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించటం కొరకు పెద్ద ఎత్తున రైతులకు దేశీ ఆవులను అందజేయాలి. కర్ణాటకలోవలే పాడి రైతులకు లీటరుకు రూ. 4/- బోనస్‌ను అందించాలి. ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు విశేషమైన కృషి జరపాల్సి ఉంది.

11) చౌక డిపోల ద్వారా రేషన్ అందించుటలో వేలిముద్రల సమస్యను వెంటనే పరిష్కరించి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలి. బోగస్ రేషన్ కార్డులను ఏరివేసి, అర్హులకు అందించాలి.

12) ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసిన మేరకు డ్వాక్రా మహిళలకు, చేనేత కార్మికులకు రుణమాఫీ అమలు చేయాలి.

13) పి.ఎమ్.ఎ.వై. – ఎన్.టి.ఆర్. పట్టణ పేదల గృహ నిర్మాణ పథకంలో అవసరం లేనటువంటి "షీర్‌వాల్ టెక్నాలజీ'కి స్వస్థి పలికి పేదలపై ఎట్టి భారమూ మోపకుండానే తెలంగాణాలో మాదిరిగా 500 చ.అ. డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లను నిర్మించి లబ్ధిదారులకు అందచేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్టీఆర్ గృహ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసి బిల్లులను సకాలంలో చెల్లిస్తూ లబ్ధిదారులకు సహకారమును అందించాలి.

14) ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం యిచ్చిన మేరకు ప్రజలకు రూ.2 లకు 20 లీటర్ల మంచినీటిని గ్రామగ్రామాన అందించుటకు తగు కార్యక్రమాన్ని చేపట్టాలి.

15) శ్రీకాకుళం జిల్లా ఉద్దానం మరియు ప్రకాశం జిల్లాలో భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ ఎక్కువ శాతం వున్న ప్రాంతాలలో కిడ్నీ రోగులకు అందుబాటులో వుంచేందుకు డయాలసిస్ కేంద్రాలను తగు సంఖ్యలో ఏర్పాటు చేయాలి.

16) ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు మంచి నీటి సదుపాయాన్ని మరియు టాయ్‌లెట్ సదుపాయాన్ని (నీటి అందుబాటుతో సహా) ఏర్పాటు చేయాలి.

17) ఆరోగ్య–వైద్య శాఖలోనూ మరియు వ్యవసాయ–పశుసంవర్ధక శాఖలలో వివిధ స్థాయిలలో ఖాళీగా వున్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.

18) కేంద్రప్రభుత్వం చేత (దుగరాజపట్నం బదులు) రామయ్యపట్నంలో మేజర్ పోర్టు పనిని ప్రారంభింపచేయాలి. మచిలీపట్నంలో 2,000 ఎకరాలలో పోర్టు పనిని ప్రారంభించేలా పోర్టు డెవలపర్ నవయుగ ఇంజనీరింగ్ కంపెనీని ఆదేశించాలి. విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ వారికి ఒక మైనర్ పోర్టును అభివృద్ధి చేసే బాధ్యతను అప్పగించాలి.

19) రాజధానిలో సుమారు 12,000 ఎకరాల జరీబు భూములను "సేంద్రియ వ్యవసాయ ఎగుమతి జోన్"గా ప్రకటించి వేలాదిమంది రైతులు, కౌలు రైతులు, పేద వ్యవసాయ కార్మికులకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడంతోపాటు

రాజధాని ప్రజలకేకాక, సమీప నగరాలలోని ప్రజలకు కూడా ఆరోగ్యవంతమైన సేంద్రీయ కూరగాయలు, పండ్లు, పాలు, పౌల్ట్రీ, మత్స్య ఉత్పత్తులు అందేవిధంగా చర్యలు చేపట్టాలి. ఇందువలన రాజధాని ప్రజలకు (భవిష్యత్తులో పెరగబోయే పది లక్షల జనాభాతో సహా) అవసరమైన స్వచ్ఛమైన త్రాగునీటిని అందించే వీలు కలుగుతుంది. వేల కోట్ల రూపాయల వ్యయంతో వైకుంఠపురం వద్ద కృష్ణా నదిపై బ్యారేజి మరియు 3 చోట్ల రిజర్వాయర్లను నిర్మించవలసిన ఆవశ్యకత వుండదు.

20) ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, అవినీతికి ఆస్కారం లేని విధి విధానాలను రూపొందించి, పాలనలో సామర్థ్యాన్ని యినుమడింప చేయడానికి తీవ్రమైన కృషి జరగాలి.

21) లోగడ నుండి నిర్మాణం కొనసాగుతున్న పలు మీడియం, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను ఈ సంవత్సరంలోనైనా పూర్తి చేసేలా నిధులను కేటాయించి, అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలి. అవి పూర్తి అయ్యేంతవరకు వేలకు వేల కోట్ల రూపాయలు అవసరమయ్యే గోదావరి–పెన్నా అనుసంధానంతోపాటు ప్రభుత్వం యిటీవల ప్రతిపాదించిన నూతన యిరిగేషన్ ప్రాజెక్టులను ప్రక్కనపెట్టవలసిన అవసరం ఎంతైనా వుంది. అంచనాలను అడ్డగోలుగా పెంచివేస్తూ ప్రభుత్వ పెద్దలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకొన్న కొద్ది కాంట్రాక్టు సంస్థలకు కట్టబెడుతూ వున్న పద్ధతిని విడనాడాలి.

★★★




కాకాని వెంకటరత్నం గౌ॥ వ్యవసాయ పశుసంవర్ధక శాఖామాత్యులుగారిచే
మాతామహులు వెల్లంకి కుటుంబయ్య స్మారక పశువైద్యశాల భవన ప్రారంభం




ఉయ్యూరు ఎ.జి.ఎస్.జి. సిద్ధార్థ కాలేజిలో వడ్డే శోభనాద్రి - యు.జి.సి. మల్టీపర్పస్ స్టేడియంనకు
కేంద్ర మంత్రిణి గౌ॥ శ్రీమతి డి. పురంధేశ్వరిగారిచే శంకుస్థాపన సందర్భంగా....






ఉయ్యూరు ఏ.జి.ఎస్.జి. సిద్ధార్థ కాలేజిలో
వడ్డే శోభనాద్రి - యు.జి.సి. స్టేడియం, గౌ॥ కె. నారాయణ, యం.పి. గారిచే ప్రారంభం




న్యూఢిల్లీలో 20, 21 నవంబర్ 2017లో కిసాన్ ముక్తి సంసద్ సందర్భంగా...





యన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు భారత సస్యవిప్లవ సారధి డా॥ యం.యస్. స్వామినాథన్ గారిని సన్మానించే సందర్భంగా....




**29 సెప్టెంబర్ 2019న న్యూఢిల్లీలో 'అగ్రికల్చర్ టుడే' ఆధ్వర్యంలో**
**'అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డ్-2010' అందుకున్న సందర్భంగా...**




**హైదరాబాద్ జూబ్లీహాలులో "దేశం కోసం రైతు - రైతు కోసం ఎవరు" పుస్తకాన్ని ఆవిష్కరించిన**
**కేంద్ర మంత్రులు గౌ॥ అజిత్ సింగ్ మరియు శ్రీమతి డి. పురంధేశ్వరి.**



**19-11-1988లో పులిచింతల వచ్చిన సందర్భంగా**
**శ్రీ ఎన్.టి. రామారావుగారితో...**




**2000లో విజయవాడ సిద్దార్థ కాలేజిలో తెలుగుదేశం మహాసభల సందర్భంగా...**



1989 అక్టోబర్ 19న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఎం.పి. వడ్డే శోభనాద్రీశ్వరరావు 8వ లోక్‌సభ ఇంగ్లీష్ ప్రసంగాలకు తెలుగు అనువాదం "ప్రజల ఎదురు తెన్నులు - పాలకుల తీరు తెన్నులు" పుస్తకమును 'ఈనాడు' గ్రూప్ ఛైర్మన్ శ్రీ చెరుకూరి రామోజీరావు ఆవిష్కరిస్తున్న సందర్భంగా...



విజయవాడ ఆంధ్ర లయోల కళాశాల ఆడిటోరియం నందు 21-10-2003న 'రైతువాణి' పుస్తక ఆవిష్కరణ మరియు షష్టిపూర్తి మహోత్సవ సందర్భంగా...



గండిగుంట గ్రామం దత్తాశ్రమంలో వడ్డే శోభనాద్రి ఏ.సి. కళ్యాణ మండపమును
ప్రారంభిస్తున్న పూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ



ఉయ్యూరులో వడ్డే శోభనాద్రీశ్వరరావు ఇచ్చిన స్థలంలో 'లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ'
సహకారంతో నిర్మించనున్న డయాలిసిస్ సెంటర్ శంఖుస్థాపన సందర్భంగా...




తెనాలిలో పావులూరి ట్రస్ట్ వారి "ఆదర్శ దంపతుల పురస్కారమును"
అందుకుంటున్న సందర్భంగా....



రైతునేస్తం పురస్కారాలు 2015 సందర్భంగా
గౌ॥ యం. వెంకయ్యనాయుడు గారి చేతులమీదుగా చిరు సత్కారం.

# వడ్డే శోభనాద్రీశ్వరరావు

## సంక్షిప్త సమాచారం

| | | |
|---|---|---|
| **జనకులు** | : | లేటు వడ్డే అంకయ్య -శ్రీమతి అన్నపూర్ణమ్మ గార్లు |
| **జననం** | : | 21-10-1943 ఉయ్యూరులో |
| **విద్యార్హతలు** | : | బి.ఎస్.సి., బి.ఇ. (మెకానికల్) |
| **రాజకీయ ప్రస్థానం** | : | 1972లో ఉయ్యూరు నుండి కాకాని గారిపై శాసనసభకు పోటీ<br>1977లో మచిలీపట్నం పార్లమెంటు సభ్యునిగా పోటీ<br>1978-83 ఉయ్యూరు శాసనసభ్యునిగా ఎన్నిక<br>1984-89 విజయవాడ 8వ లోక్‌సభ సభ్యునిగా ఎన్నిక<br>1991-96 విజయవాడ 10వ లోక్‌సభ సభ్యునిగా ఎన్నిక<br>1997-99 న్యూఢిల్లీలో ఎ.పి. ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియామకం<br>1999-2004 మైలవరం శాసనసభ్యునిగా ఎన్నిక మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా కృషి<br>2004 క్రియాశీలక రాజకీయాల నుండి స్వచ్ఛంద విరమణ |
| **సామాజిక సేవలు** | : | కలువపాముల గ్రామంలో మాతామహుని స్మారకార్థం పశువైద్యశాల మరియు పాల సేకరణ కేంద్ర భవనముల నిర్మాణం |
| | : | గండిగుంట దత్తాశ్రమంలో "వడ్డే శోభనాద్రి ఎ.సి. కళ్యాణ మండపము" నకు రూ. 10 లక్షల విరాళం. |
| | : | ఉయ్యూరు ఎ.జి. & ఎస్.జి. సిద్ధార్థ కళాశాలలో "వడ్డే శోభనాద్రి - యు.జి.సి. మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం"నకు రూ. 10 లక్షల విరాళం |
| | : | ఉయ్యూరులో లయన్స్ ఇంటర్ నేషనల్ డయాలసిస్ సెంటర్‌నకు రూ. 60 లక్షల విలువ చేయు స్థలం బహూకరణ |
| **సందర్శించిన విదేశములు** | : | యు.ఎస్.ఎ., బ్రిటన్, ఫ్రాన్స్, జర్మని, నెదర్లాండ్స్, చైనా, సింగపూర్, హాంకాంగ్, ఫిలిప్పీన్స్, శ్రీలంక, నేపాల్ |
| **పుస్తక రచనలు** | : | ఆంధ్ర రైతు ఆవేదన, దగాపడిన ఆంధ్రరైతు (శాసనసభ ప్రసంగాలు) |
| | : | ప్రజల ఎదురుతెన్నులు - పాలకుల తీరుతెన్నులు (8వ లోక్‌సభలో ఇంగ్లీషు ప్రసంగాలకు అనువాదం) |
| | : | రైతువాణి (10వ లోక్‌సభలో ఇంగ్లీషు ప్రసంగాలకు అనువాదం) |
| | : | దేశం కోసం రైతు - రైతు కోసం ఎవరు? (వ్యాసాల సంపుటి) |
| | : | సమైక్యతతోనే తెలుగు జాతి ప్రగతి |
| | : | అమరావతి - నవ్యాంధ్ర ప్రజా రాజధాని అయ్యేదెలా? |
| | : | గోరంత పెట్టుబడితో సింగపూర్ సంస్థలకు కొండంత లబ్ది |
| | : | సమస్యల పరిష్కారం కోసం రైతాంగ సమరభేరి - ఆవశ్యకత |
| | : | నేలవిడిచి సాముచేయడం తగునా? |
| **ప్రచురించిన** | : | కిసాన్ ప్రధాని - చౌధురి చరణ్‌సింగ్ |
| **పుస్తకములు** | : | అపర భగీరథుడు డా॥ కె.ఎల్.రావు (క్యూసెక్స్ క్యాండిడేట్ అనువాదం)<br>గాంధేయపథంలో (ఇన్ ది గాంధేయన్ పాత్‌నకు అనువాదం)<br>ప్రజాసేవలో నా జీవన ప్రస్థానం (ఆత్మకథ) |

# వడ్డే శోభనాద్రీశ్వరరావు



1) విద్యార్థి దశ నుండి ఆచార్య రంగా పట్ల ఆకర్షితుడై వ్యవసాయ రంగం – సమస్యల పట్ల ఆసక్తి – అధ్యయనం.

2) 1978 నుండి 1983 వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో చెఱకు, ప్రత్తి, వరి, పొగాకు మున్నగు వ్యవసాయ పంటల ధరల సమస్యలుపైన, ఇరిగేషన్ పథకాలపైన చర్చలలో పాల్గొనడం.

3) ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళనం అధ్యక్షునిగా నాటి ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ గారిని చిలకలూరిపేటలో రాష్ట్ర మహా సభలకు, బహిరంగ సభ మరియు ఏలూరులో ధాన్యోత్పత్తిదారుల మహా సభలకు ఆహ్వానించడం.

4) విజయవాడలో పులిచింతల ప్రాజెక్టు కొరకు నాటి వివిధ రాజకీయ పక్షాల నాయకులను ఆహ్వానించి సదస్సు నిర్వహించడం.

5) టంగుటూరి అంజయ్య గారు ముఖ్యమంత్రిగా ఉండగా చెఱకు రైతులకు కొనుగోలు పన్ను ముదరా ఇప్పించుట కొరకు రాష్ట్ర చెఱకు రైతుల సంఘంతో కలసి కృషి చేయడం.

6) 8వ లోక్‌సభలో వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధరలు, భీమా సౌకర్యం, ఇరిగేషన్ సౌకర్యాలను విస్తరింపచేయవలసిన ఆవశ్యకత మున్నగు అనేక అంశములపై పలు పర్యాయములు ప్రసంగించడం

7) 10వ లోక్‌సభలో అనేక వ్యవసాయ సమస్యలపైన, డంకెల్ ముసాయిదా వలన భారత వ్యవసాయ రంగానికి ఎదురుకానున్న ఇబ్బందులు నష్టాల గురించి సుదీర్ఘంగా చర్చించడమేగాక ప్రఖ్యాత శాస్త్రవేత్త డా॥ శ్రీమతి సుమన సహాయ్ గారిచే హైదరాబాద్, విజయవాడ, ఏలూరు, జంగారెడ్డిగూడెంలలో ప్రసంగింపచేయడం.

8) పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి నిధులకు ప్రజలు, స్థానిక సంస్థలు, ప్రజాప్రతినిధులు, జిల్లా పాల సహకార సమితి తోడ్పాటుతో 80 పాలసేకరణ కేంద్రములకు పక్కా భవనముల నిర్మాణము, లిఫ్ట్ ఇరిగేషన్ పథకములతో సహా పలు గ్రామాలకు రహదారులు, త్రాగునీరు, విద్యుత్ మున్నగు సేవలు అందించడం.

9) పంజాబ్ లోని "అప్నీ మండి" వ్యవస్థ గురించి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారికి చెప్పి "రైతు బజార్‌ల" ఏర్పాటుకు దోహదపడటం.

10) వ్యవసాయ మంత్రిగా ఎ) పొలంబడి బి) టి.వి.లో రైతు మిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించి విస్తరణకు దోహదం చేయడం, సి) మొత్తం 23 జిల్లాలకు బెంగుళూరు లోని కేంద్రసంస్థ నుండి ఆయా ప్రాంతములలో భూమి స్వభావం ఏ పంటలకు అనుకూలం, ఎంత లోతులో ఏ మేరకు భూగర్భ జలాలు లభ్యమో తెలియపరచ్చుఊకజూఖజుఊ్పు ఐం।ఉ ఖజుఆఐ ను సమకూర్చడం డి) నీరు–మీరు కార్యక్రమంలో రైతుల భాగస్వామ్యమును కల్పించి చెరువుల లోతు కార్యక్రమానికి దోహదపడటం ఇ) చలక, దుబ్బ, నేలలో వర్షాధారంగా బి.టి. పత్తి సాగును చేపట్టవద్దని రైతులకు తెలంగాణా ప్రాంతంలో విస్తృతంగా ప్రచారం చేయించడం ఎఫ్) రాజేంద్రనగర్ ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో "చౌదరి చరణ్‌సింగ్ అగ్రికల్చర్ టెక్నాలజీ ఇన్‌ఫర్‌మేషన్ సెంటర్"ను ఏర్పాటు చేయడం.

11) అనేక వ్యవసాయ అనుబంధ రంగాల సమస్యలతోబాటు పలు అంశముల గురించి ఈనాడు మున్నగు దినపత్రికలలో దాదాపు 90 వ్యాసములను పంపడం, వాటిని "దేశం కోసం రైతు, రైతు కోసం ఎవరు?" పుస్తక రూపంలో ప్రచురించడం.

12) రైతుల ప్రయోజనాలకు భంగం కలిగే సందర్భములలో తన అభిప్రాయములను నిర్మోహమాటంగా తెలియచేయడం.